www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2015-17

అక్షరాక్షరం అభ్యుదయం

సంపుటి : 66
సంచిక : 221
గురువారం 01-02-2018
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam
వెల: రూ.3.00
పేజీలు : 12+ టాబ్లాయిడ్
విజయవాడ ప్రచురణ

ఆకాశంలో అద్భుతం






ఆకాశంలో అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. బ్లూమూన్, బ్లడ్ మూన్, సూపర్ మూన్‌గా చంద్రుడు అత్యంత అరుదైన రూపంలో దర్శనమిచ్చాడు. 1982 తరువాత తొలిసారిగా భారతదేశం మొత్తం 'సూపర్ మూన్'ను వీక్షించింది. మళ్లీ 2037లో ఈ అద్భుతం చోటు చేసుకోనున్నది. ఢిల్లీలోని ఇండియా గేట్ వ్యూ పాయింట్ వద్ద నుంచి వందలాది మంది యువత, చిన్నారులు, పెద్దలు ఈ అద్భుత చంద్రుడిని వీక్షించారు. ప్రపంచంలోని చాలా ప్రాంతాల ప్రజలు బ్లూ మూన్‌ను మాత్రమే కాకుండా సూపర్ మూన్‌ను తిలకించారు. భారత్‌లో చంద్రగ్రహణం సాయంత్రం 5.20 నిమిషాలకు ప్రారంభమై 8.41కి ముగిసింది. చంద్రుడు భూమి నీడలో ఉండగా 'ఎర్రటి వర్ణపు చంద్రుడు' దర్శనమిచ్చాడు. నెలలో రెండో పౌర్ణమిని 'బ్లూ మూన్'గా పిలుస్తారు. ఇది ఈ ఏడాది జనవరి 2న సంభవించింది. 2018 జూలై 27న మరో సంపూర్ణ చంద్ర గ్రహణం ఏర్పడుతుందని స్పేస్ ఇండియా తెలిపింది. బ్లూ, బ్లడ్, సూపర్ మూన్‌లు మూడూ కలిసి రావడం అత్యంత అరుదు. ఈ పరిణామాన్ని స్పష్టంగా వీక్షించే అవకాశం ఉత్తర అమెరికా, తూర్పు ఆసియా ప్రజలకు లభించింది.

జనరంజకమా.. జనభంజకమా?

- నోట్ల రద్దు, జీఎస్టీ దెబ్బలకు ఊరట లభించేనా..
- వ్యవసాయ రంగంలో పెట్టుబడులు పెరుగుతాయా?
- కొత్త కొలువుల సృష్టి జరుగుతుందా?
- నేడు కేంద్ర బడ్జెట్

విశాలాంధ్ర ప్రత్యేక ప్రతినిధి-న్యూఢిల్లీ : బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వం గురువారం ప్రవేశపెట్టనున్న 2018 బడ్జెట్‌పై ఊహాగానాలు మిన్నంటుతున్నాయి. 2019 ఎన్నికల ముందు ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న చివరి బడ్జెట్ కావడంతో భవిష్యత్తు రాజకీయ ప్రయోజనం కోసం జనరంజకంగా ఉంటుందని, ఉండాలని ఆశిస్తున్నారు. అయితే, కొద్దిరోజుల ముందు నుంచి అభివృద్ధి కోసం బడ్జెట్‌ను జనభంజకంగానే వండివార్చుతున్నామంటూ ప్రధాని నరేంద్ర మోడీ సహా పలువురు సహచర మంత్రులు సంకేతాలు వదిలారు. సహజంగానే ఈ సంకేతాలను ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ ఖండించలేదు. ఎన్నికల్లో అధికారం దక్కించుకోవడానికి ఎలాంటి ప్రయత్నాలు చేయడానికైనా బీజేపీ సిద్ధపడుతుందనేది ఈ నాలుగు సంవత్సరాల్లో అనుభవంలో నిలిచిన విషయం. కేంద్ర మంత్రి అరుణ్‌జైట్లీ గురువారం బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు.

ఆర్థిక సర్వే వెల్లడించిన సవాళ్లను పరిగణనలోకి తీసుకుంటే వివిధ రంగాలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య పెట్టుబడులుగా తేలుతోంది. తరువాత మార్కెట్ తదితర అంశాలున్నాయి. 2016 నవంబరు 8న ప్రకటించిన పెద్ద నోట్ల రద్దు, 2017 జూలై ఒకటిన హడావుడిగా అమల్లోకి తెచ్చిన వస్తు, సేవల పన్ను వంటి ఆర్థిక సంస్కరణలు దేశీయ ఆర్థిక రంగాన్ని ఎన్ని విధాలుగా ఇరుకున పెట్టాలో అన్ని విధాలుగా పెట్టాయి. అన్ని స్థాయిల్లోని వర్తక, వాణిజ్య, వ్యాపార వర్గాల నుంచి జీఎస్టీ పట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైన సంగతి తెలిసిందే. ఈ వ్యతిరేకత ప్రభావాన్ని గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ చవిచూసిందని - మిగతా 2 లో



హిందీలో బడ్జెట్ ప్రసంగం

సంప్రదాయానికి జైట్లీ తూట్లు

న్యూఢిల్లీ: కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ సంప్రదాయాలను ఒక్కొక్కటీ వదిలేస్తున్నారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు తమ ప్రభుత్వ చివరి పూర్తిస్థాయి బడ్జెట్‌ను ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టనున్నారు. అయితే ఎప్పుడూ ఆంగ్లంలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టే ఆర్థిక మంత్రి తొలిసారి హిందీలో బడ్జెట్ ప్రసంగం చేయనున్నారు. గ్రామీణ ప్రజలకు చేరువయ్యేలా ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెబుతున్నప్పటికీ ప్రజలందరికీ సరైన సమాచారం వెళ్లకుండా ఉండేందుకే జైట్లీ ఈ ఎత్తు వేసినట్టు తెలుస్తోంది. జైట్లీ నిర్ణయం కేవలం ఉత్తరాది ప్రజలను సంతృప్తి పరచడానికే పనికొస్తుందని, దక్షిణాదిపై కేంద్రానికి ఏమాత్రం ప్రేమలేదన్న సంకేతాలు దీనితో రుజువైందని విమర్శకులు పేర్కొన్నారు.

కేంద్ర ఉద్యోగులకు 2శాతం డీఏ పెంపు



న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 2018 జనవరి నుంచి అదనంగా రెండు శాతం కరవు భత్యం (డీఏ) లభించనున్నది. పారిశ్రామిక కార్మికుల వినియోగ ధరల సూచీ 2017 డిసెంబరులో 286(2001=100) పాయింట్లకు చేరుకోవడంతో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు రెండుశాతం డీఏ పెరిగింది. దీనితో మూలవేతనంపై మొత్తం డీఏ ఏడు శాతంగా ఉంటుంది.

మార్చిలో బడ్జెట్ సమావేశాలు



విశాలాంధ్ర అమరావతి: మార్చి మొదటి వారంలో ఏపీ బడ్జెట్ సమావేశాలు జరుగుతాయని అసెంబ్లీ స్పీకర్ కోడెల శివప్రసాదరావు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర విభజన వల్ల అసెంబ్లీలో సిబ్బంది కొరత ఉందన్నారు. అసెంబ్లీలో సిబ్బంది కొరతను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు .ఉమ్మడి అసెంబ్లీలో 800మంది సిబ్బంది ఉండగా ప్రస్తుతం 100మందే ఉన్నారన్నారు.దీంతో అసెంబ్లీ సిబ్బందికి పని భారం పెరిగిందని చెప్పారు. .ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా ఫిబ్రవరి 4 ఉదయం 6గంటలకు విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుండి 5 కె వాక్ ప్రారంభమతుందన్నారు .తానా ,రూట్స్ హెల్త్ ఫౌండేషన్లు, బసవతారక క్యాన్సర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ర్యాలీలో యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు

దిగజారిన 'భారత్' ప్రజాస్వామ్య సూచీ

దళితులు, మైనార్టీలపై హిందూ మతోన్మాదుల దాడులు

- వివరాలు 9 లో

ఇదీ లోకం!



గ్రహణం వీడిపోయాక చెప్పు
ఓ చిన్న 'స్కామ్' ఉంది చేసేస్తా!

ఏపీ టెట్ ఆప్షన్లలో.. ఆన్‌లైన్ తప్పిదాలు

- పేపర్-3 ఆప్షన్లలో గందరగోళం
- ఇంగ్లీషుకు బదులుగా తెలుగు నమోదు
- కమిషనర్ కార్యాలయానికి ఫిర్యాదుల వెల్లువ
- 10 నుంచి టెట్ హాల్ టికెట్లు సిద్ధం
- ఏపీతోపాటు మూడు రాష్ట్రాల్లో పరీక్షా కేంద్రాలు



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ఏపీ టెట్ దరఖాస్తుల ప్రక్రియపై గందరగోళం కొనసాగుతోంది. ఇటీవల వరకూ పరీక్ష తేదీని మార్పు చేయాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా అభ్యర్థులు నిరసనలకు దిగిన విషయం విదితమే. ప్రభుత్వం స్పందించి ఫిబ్రవరి 21 నుంచి పరీక్షల కొనసాగింపునకు షెడ్యూలును విడుదల చేసింది. తాజాగా టెట్ పేపర్ల ఆప్షన్ల మార్పులో తప్పులు దొర్లాయని అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భాషాంశాల(తెలుగు/ఇంగ్లీషు/హిందీ/సంస్కృతం/ఉర్దూ) అభ్యర్థుల కోసం ఏపీ టెట్ పేపర్-3ని ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విషయం విదితమే. దీంతో అప్పటికే పేపర్-2కు దరఖాస్తు చేసుకున్న భాషాంశాల అభ్యర్థుల్ని పేపర్-3కి ఆన్‌లైన్లో మార్చుకోవాలని సూచిస్తూ విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం ఉత్తర్వులు - మిగతా 2 లో

ప్రతిభకే పట్టం.. లాటరీలొద్దు..!

గ్రీన్‌కార్డుల జారీపై ట్రంప్



వాషింగ్టన్: అమెరికాలో గ్రీన్ కార్డుల జారీకి లాటరీ విధానం రద్దు చేయాల్సిన సమయం వచ్చిందని, వాటిని ప్రతిభ ఆధారంగా కేటాయించాలని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. 'అమెరికా ఫస్ట్' విధానానికి ఇదే సరైన మార్గమని వెల్లడించారు. ఆయన బుధవారం తొలిసారిగా అమెరికా కాంగ్రెస్‌లో ప్రసంగించారు. కాంగ్రెస్ ఉభయ సభలనుద్దేశించి అమెరికా అధ్యక్షుడు ఏటా ప్రసంగిస్తుంటారు. దీన్ని 'స్టేట్ ఆఫ్ ది యూనియన్ అడ్రస్'గా పేర్కొంటారు. 'అమెరికాలో శాశ్వత పౌరసభ్యత్వం ఇచ్చేందుకు అందించే గ్రీన్ కార్డులను ప్రతిభ ఆధారంగానే ఇవ్వాలి. ఎందుకంటే అమెరికాను ముందు వరసలో ఉంచడానికి అదొక్కటే మార్గం. మెరిట్ ఆధారిత వలస విధానం ప్రారంభించడానికి ఇదే సమయం. ఎవరైతే అధిక నైపుణ్యాలు కలిగి ఉన్నారో, ఎవరు మన సమాజానికి మంచి సేవలను అందించగలరో, ఎవరు మన దేశాన్ని ప్రేమించి - మిగతా 2 లో

డెడ్‌లైన్ ఏడాదే !

- నాలుగు ఎకరాల్లో హైకోర్టు
- తొలుత సచివాలయం, హెచ్ఓడీలు
- అక్టోబరు నాటికి 69 టవర్లు పూర్తి
- ఆకర్షణీయంగా రెండు ఐటీ స్పేస్ టవర్లు
- హ్యాపీ సిటీ సమ్మిట్-ఇన్నోవేషన్ వ్యాలీగా అమరావతి
- సీఆర్‌డీఏ సమావేశంలో కీలక నిర్ణయాలు



సచివాలయంలో స్మార్ట్ సైకిల్‌ను ప్రారంభించిన చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : రాజధానిలోని పాలనా నగరంలో తొలుత సచివాలయం, శాఖాధిపతుల కార్యాలయ భవనాలు, ప్రభుత్వ ఆవాసాలను త్వరితగతిన పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురానున్నారు. పరిపాలన నగరంలో చేపట్టే అన్ని నిర్మాణాలలో మొట్టమొదటి ప్రాధాన్యంగా ఈ మూడు ప్రాజెక్టులను పూర్తి చేసి వచ్చే ఏడాది కల్లా వినియోగంలోకి తెచ్చేలా నిర్మాణం వేగవంతం చేయనున్నారు. సచివాలయంలో బుధవారం జరిగిన రాజధాని అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్‌డీఏ) సమావేశంలో రాజధానిలో చేపట్టిన రహదారులు, పరిపాలన నగర శాశ్వత భవంతుల నిర్మాణాలు తదితర అంశాలతో పాటు మెరీనా, ఐటీ టవర్లు, హెల్త్ స్ట్రీట్, కంటైనర్ హోటళ్లు వంటి ఎకనమిక్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులపై సుదీర్ఘంగా చర్చించారు. అమరావతిలో వచ్చే ఏప్రిల్‌లో జరగనున్న సంతోష నగరాల సదస్సు, 9 మాసాలలో పూర్తి చేయాల్సివున్న ఇంటెరిమ్ హైకోర్టు నిర్మాణ ప్రణాళికపైనా సమావేశంలో చర్చించి కొన్ని ముఖ్య నిర్ణయాలు - మిగతా 2 లో

మూడో స్కార్పిన్ జలాంతర్గామి జలప్రవేశం..!



ముంబై : భారత నావికాదళంలో స్కార్పిన్ శ్రేణికి చెందిన మూడో జలాంతర్గామి ఐఎన్ఎస్ కర్నాజ్ జలప్రవేశం చేసింది. నేవీ చీఫ్ అడ్మిరల్ సునీల్ లంబా సతీమణి రీనా లంబా జలాంతర్గామిని ప్రారంభించారు. నావికాదళంలోకి చేర్చడానికి ముందు ఏడాది పాటు ఈ జలాంతర్గామిని క్షుణ్ణంగా పరీక్షించనున్నట్లు సునీల్ లంబా వెల్లడించారు. దీనిని ముంబైలోని మజగావ్ డాక్‌యార్డ్‌లో నిర్మించారు. మొత్తం ఆరు జలాంతర్గాములను నిర్మించనున్నట్లు తెలిపారు. ఫ్రాన్స్‌కు చెందిన ప్రముఖ నౌకల తయారీ సంస్థ డీసీఎన్ఎస్ భాగస్వామ్యంతో జలాంతర్గాములను నిర్మిస్తున్నారు. ఇటీవల ప్రధాని నరేంద్ర మోడీ స్కార్పీన్ తరగతికి చెందిన కలవరి జలాంతర్గామిని నావికాదళంలోకి ప్రవేశపెట్టారు.

అడ్డగోలు లక్ష్మీ ప్రసాదం..

- పేరుకు తగ్గట్టే అక్రమాస్తులు
- విలువ రూ.150 కోట్లపైనే
- హైదరాబాద్‌లో భారీ కమర్షియల్ కాంప్లెక్స్
- గచ్చిబౌలి, అశోక్‌నగర్, నారాయణగూడలో ఫ్లాట్స్
- విశాఖ, గుంటూరులో ఖాళీ స్థలాలు
- వాణిజ్య పన్నుల శాఖ అధికారి లక్ష్మీప్రసాద్ ఆస్తులపై ఏసీబీ దాడులు



విశాలాంధ్రబ్యూరో-అమరావతి : ఆయన పని చేసేది వాణిజ్య పన్నుల శాఖ. అలాంటి శాఖలో జీఎస్టీ అదనపు కమిషనర్‌గా పని చేస్తున్న గెద్దపు లక్ష్మీ ప్రసాద్ తన పేరును సార్థకం చేసుకోవాలనుకున్నారో ఏమోగానీ, పదవులను అడ్డం పెట్టుకుని భారీగా అక్రమాస్తులను కూడబెట్టేసి అవినీతి నిరోధక శాఖకు (ఏసీబీ) చిక్కాడు. ఆదాయానికి మించి అక్రమాస్తులను కూడబెట్టాడనే సమాచారంతో ఏసీబీ డీజీపీ ఆర్‌పీ ఠాకూర్ పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలు విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, శ్రీకాకుళం, హైదరాబాద్‌లోని 20 ప్రాంతాలలో ఏకకాలంలో బుధవారం తెల్లవారుజాము నుంచే - మిగతా 2 లో

సిరియాలో యుద్ధం ఆపండి : డీకేపీ

బెర్లిన్ : సిరియాలో తక్షణం యుద్ధాన్ని ఆపాలని జర్మనీ కమ్యూనిస్టు పార్టీ (డీకేపీ) అమెరికా సామ్రాజ్యవాదులను, దాని అనుచర దేశాలను డిమాండు చేస్తూ ప్రకటన జారీ చేసింది. సిరియాలో ప్రభుత్వాన్ని మార్చివేయాలని యూరోపియన్ యూనియన్, జర్మనీ ప్రయత్నిస్తున్నాయని తక్షణం ఈ రెండు దేశాలు తమ సైన్యాన్ని వెనక్కి పిలిపించాలని కమ్యూనిస్టు పార్టీ కోరింది. సిరియా ఉత్తర ప్రాంతంలో ఈనెల 20వ తేదీనుంచి టర్కీ సైనిక చర్యలకు పూనుకున్నది. అమెరికన్ సామ్రాజ్యవాదులు, దాని ప్రాంతీయ, యూరోపియన్ యూనియన్ అనుచర దేశాలు సిరియాలో ప్రారంభంనుంచి పరిస్థితులను రెచ్చగొట్టేందుకే ప్రయత్నిస్తున్నాయి. అక్కడి సాయుధ గ్రూపులకు, జిహాదీ టెర్రరిస్టు సంస్థలకు ఆర్థిక, పాదార్థిక సహాయాన్ని అందిస్తున్నాయి. సిరియాను ముక్కలు చేసేందుకు ప్రయత్నిస్తున్నాయి. టర్కీ సైన్యంతో కలిసి ఫ్రీసిరియన్ ఆర్మీ పోరాడుతున్నది. తమ ప్రయత్నాలు విఫలమైనప్పటికీ సమీపంలోవున్న అలాగే పశ్చిమాసియాలోని దేశాలను జాతులు, మతాల ప్రాతిపదికగా విభజించేందుకు, ముక్కలు చేసేందుకు తద్వారా ప్రజలను లొంగదీసుకునేందుకు పశ్చిమ దేశాలు ప్రయత్నిస్తూనే ఉన్నాయి. అమెరికన్ సామ్రాజ్యవాదులు గల్ఫ్ దేశాలతో పాటు ఇజ్రాయిల్ అలాగే ఈయూ దేశాలను తమ మిత్రులుగా చేసుకునేందుకు ప్రయత్నిస్తోంది. సిరియాపైన అత్యంత అనాగరికమైన రీతిలో ఆర్థిక ఆంక్షలు విధించింది. సిరియా సమస్యకు శాంతి పరిష్కారం ప్రాదేశిక, దేశ సమగ్రత అక్కడి ప్రజలు వివిధ జాతులపైన స్వీయ నిర్ణయం, శాంతియుత జీవనంపైన ఆధారపడి ఉంటుందని జర్మనీ కమ్యూనిస్టు పార్టీ పేర్కొన్నది. టర్కీ సైన్యం తక్షణం సిరియానుంచి వైదొలగాలని కమ్యూనిస్టు పార్టీ డిమాండు చేసింది. అలాగే తన సైన్యాన్ని ఉపసంహరించుకోవడంతోపాటు అది తన సైనిక స్థావరాలను మూసివేయాలని డిమాండు చేసింది. సిరియాలో ప్రభుత్వాన్ని మార్చాలనే కుటిల ఎత్తుగడను మానుకోవాలని కోరింది.



చైనా సంబంధాలతో స్వర్ణయుగం నిర్మిస్తాం

బీజింగ్‌లో బ్రిటన్ ప్రధాని థెరిసా వెల్లడి



బీజింగ్ : చైనాతో సంబంధాలను నెల కొల్పుకుని స్వర్ణయుగాన్ని నిర్మిస్తామని బీజింగ్ చేరుకున్న బ్రిటన్ ప్రధానమంత్రి థెరిసామె అన్నారు. యూరోపియన్ యూనియన్ నుంచి వైదొలగేందుకు జరుగుతున్న చర్చలను, దేశంలో తీసుకున్న చర్యల ను, చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. ఈ యూతో చర్చలపై అనేకమంది చేస్తున్న విమర్శలను ప్రస్తావిస్తూ దేశంకోసం అలాగే తమ పార్టీ కోసం అత్యంత ప్రాధాన్యత ఇచ్చి పనిచేస్తానని అన్నారు. చైనా ప్రధాని లీకెకియాంగ్‌తో చర్చల అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ తమ రెండు దేశాలకు కలిగే ప్రయోజనకర అంశాలను, ఎదురయ్యే సవాళ్లపైన చర్చించినట్టుగా తెలియజేశారు. చైనాతో విద్యారంగంపైన ఒప్పందం కుదుర్చుకోనున్నట్టు తెలిపారు. ఉత్తమమైన బ్రెగ్జిట్ ఒప్పందం కోసమే తాను కృషి చేస్తున్నానని తమ ధనం, చట్టాలు, సరిహద్దులు తమ నియంత్రణలోనే ఉంటాయని ఈయూ నుంచి వైదొలగిన తర్వాత ప్రపంచంలోని అనేక దేశాలతో వాణిజ్య ఒప్పందాలను కుదుర్చు కుంటామని థెరిసా చెప్పారు. బ్రెగ్జిట్‌పై కృషి చేస్తూనే దేశంలో ప్రజల రోజువారీ సమస్యల పరిష్కారానికి పనిచేస్తానని అన్నారు. తమ ప్రభుత్వం సాధించిన విజయాలను కూడా కన్సర్వేటివ్ పార్టీ నేతలు మాట్లాడాలని అన్నారు. కనీస వేతనాలను పెంచా ము, నిరుద్యోగుల సంఖ్యను తగ్గించాము. విద్యా రంగంలో విజయాలు సాధించాము. మొదటిసారి ఇళ్లు కొనుగోలు చేసేవారికి స్టాంపు డ్యూటీ మిన హాయింపు ఇచ్చాము. జీడిపి పెరిగింది. ఇవన్నీ సాధించిన విజయాలేనని ఆమె అన్నారు. ఎంపీలు మీకు వ్యతిరేకంగా అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడితే మీ స్పందన ఏమిటని ప్రశ్నించగా ఎల్లప్పుడూ మీరు ఊహాత్మక పరిస్థితులనే మాట్లాడుతుంటారు. ఇప్పుడు ఏం చేస్తున్నామో దానిగురించి మాట్లాడండి అని అన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ఉంది. తదుపరి సార్వత్రిక ఎన్నికలు 2022లో జరుగుతాయి. ప్రభు త్వం పనిచేయాలని ప్రజలు కోరుకుంటున్నారు. తాను పదవినుంచి వైదొలగడంలేదని స్పష్టం చేశారు.

సరికొత్త వాణిజ్య ఒప్పందాలు : ట్రంప్

వాషింగ్టన్ : గతంలో కుదుర్చుకున్న ఒప్పందాలు సరైనవికాదని వాటిస్థానంలో సరికొత్త ఒప్పందాలను వివిధ దేశాలతో కుదుర్చుకుంటామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా వెల్లడించారు. బుధవారం ఆయన ఇక్కడ మాట్లాడుతూ అమెరికా ఆర్థిక లొంగుబాటు ముగిసింది. న్యాయమైన, పరస్పరం ఇచ్చిపుచ్చుకునే దేశాలతో ఒప్పందాలను కుదుర్చుకుంటామని చెప్పారు. అనేక దేశాలతో లోపభూయిష్టమైన వాణిజ్య ఒప్పందాలను గతంలో అమెరికా కుదుర్చుకున్నదని అన్నారు. తాను అనుసరించబోయే ఆర్థిక విధానాలు దేశంలో నూతన విశ్వాసాన్ని పాదుకొల్పుతుందని ట్రంప్ చెప్పారు. తాను అధికారం చేపట్టిన నాటినుంచి 2.4 మిలియన్ల కొత్త ఉద్యోగాలను సృష్టించానని వీటిలో 2 లక్షలకుపైగా కేవలం ఉత్పత్తిరంగంలోనే ఉద్యోగాలు సృష్టించగలిగామని చెప్పుకున్నారు. చాలాకాలంగా వేతనాలు పెరగలేదు. వేతనాలు పెంచేందుకు ఆలోచిస్తున్నాను అని ట్రంప్ అన్నారు. 45 ఏళ్లకాలంలో అత్యంత తక్కువగా నిరుద్యోగం దేశంలో ఇప్పుడు ఉన్నదని అన్నారు. అలాగే చిన్న వ్యాపారులలో ఏనాడూలేనంత ఎక్కువగా విశ్వాసం ఉందని అన్నారు. గతంలో స్టాక్ మార్కెట్ ధ్వంసమయిపోయింది. ఇప్పుడు 8 ట్రిలియన్ల అమెరికన్ డాలర్ల విలువను పెంపొందించుకుంది. ఇది అమెరికాకే గర్వకారణం. సామూహికంగా పన్నుల్లో కోత విధించడంవల్ల మధ్యతరగతి, చిన్న వ్యాపారులు ఎంతగానో ప్రయోజనం పొందినట్టు చెప్పారు. అతి తక్కువ పన్ను రేట్లు ఉన్నాయని అన్నారు. అలాగే పిల్లల పన్ను క్రెడిట్‌ను రెట్టింపు చేసినట్టుగా తెలిపారు. నలుగురువున్న కుటుంబం 75వేల అమెరికన్ డాలర్లను పొందుతున్నదని అలాగే వారి పన్నుల్లో 2వేల డాలర్లు తగ్గిందని అన్నారు. అనేక కార్ల కంపెనీలు తిరిగి ఉత్పత్తి బాటను పట్టాయని తమ ప్లాంట్లను విస్తరించు కుంటున్నాయని ఇదంతా తన పాలనవలనే సాగిందని ట్రంప్ పేర్కొన్నారు.

తమిమిని తక్షణం విడుదల చేయాలి

ఐరోపా, కమ్యూనిస్టు పార్టీల డిమాండు



బ్రెస్సెల్స్ : పాలస్తీనా యువ సామాజిక కార్యకర్త అహద్‌తమిమిని జైలునుంచి తక్షణం విడుదల చేయాలని ఐరోపా కమ్యూనిస్టు పార్టీల వర్కర్స్ పార్టీలు ఒక ప్రకటనలో డిమాండ్ చేశాయి. 16 ఏళ్ల యువతి తమిమి ఇంటిలో వుండగా ఇజ్రాయిల్ సైన్యం వచ్చి 2017 డిసెంబర్ 20న తమ అధీనంలోకి తీసుకుని వెళ్లిపోయింది. ఆయనను విడుదల చేయించవలసిందిగా కోర్టులో వేసిన కేసు బుధవారం విచారణ ప్రారంభమయ్యింది. జెరుసలింను ఇజ్రాయిల్ రాజధానిగా గుర్తిస్తున్నట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటన చేసిన తరువాత ఇజ్రాయిల్ మరింత రెచ్చిపోయింది. పాలస్తీనా ప్రజలపైన దాడులను పెంచింది. ట్రంప్ నిర్ణయంపై ప్రదర్శనలు జరిపిన ప్రజలను హింసిస్తున్నది. అనేక అణచివేత చర్యలకు పూనుకున్నది. పలువురిని అరెస్టు చేసి జైలులో పెట్టింది. పాలస్తీనా భూభాగంలోకి మరింత చొచ్చుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నది. తమిమి అరెస్టు ఇజ్రాయిల్ అరాచక తమనకాండను సూచిస్తున్నది. తమిమితోపాటు వేలాదిమంది ప్రజలు ఇజ్రాయిల్ దురాక్రమణలకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు. పాలస్తీనా స్వతంత్ర దేశంలో అవతరించేందుకు అలాగే సామ్రాజ్య వాదుల కుటిన ఎత్తుగడలకు వ్యతిరేకంగా పనిచేస్తున్నారు. కార్మికవర్గం, ప్రజలు, ఐరోపాలోని వివిధ దేశాల యువత ఇజ్రాయిల్ దుర్మార్గపు చర్యలను ఖండించాలని, తమిమి విడుదలకు డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టాలని ఐరోపా కమ్యూనిస్టు ఇనీషియేటివ్ సెక్రటేరియట్ విడుదల చేసిన ప్రకటన కోరింది.

ఆఫ్రికా ఐక్యతకు ఏఈ సమ్మిట్ పిలుపు



అడిస్‌అబాబా : ఆఫ్రికా ఐక్యతను మరింత పటిష్టం చేయాలని, అవినీతిపై పోరాటం జరపాలని ఇక్కడ ముగిసిన 30వ ఆఫ్రికన్ యూనియన్ (ఏఈ) శిఖరాగ్ర సమావేశం పిలుపునిచ్చింది. ఇథియోపియా రాజధాని అడిస్ అబాబాలో ఈనెల 22 నుండి 29 వరకు ఈ సమావేశం జరిగింది. ఆఫ్రికా ఖండంలో అవినీతిని, పేదరికాన్ని నిర్మూలించాలని అందుకు తగిన ప్రణాళికలను రూపొందించుకోవాలని సమావేశం నిర్ణయించింది. 2063 ఏయూ ఫ్లాగ్‌షిప్ ఎజెండాను అమలు చేసేందుకు కార్యక్రమాలను వేగవంతం చేయాలని కూడా ఈ సమావేశం తీర్మానించింది. రువాండా అధ్యక్షుడు ఏయూ ఛైర్మన్ అయిన పాల్ కగామి మాట్లాడుతూ ఆఫ్రికా స్వల్ప, మధ్యకాలిక, దీర్ఘకాలిక లక్ష్యాలను సాధించేందుకు, అభివృద్ధికి దోహదం చేసే ప్రధానమైన నిర్ణయాలను తీసుకోవడం ద్వారా ఈ సమావేశం విజయవంతంగా ముగిసిందని అన్నారు. ఆఫ్రికా ఖండాన్ని ముందుకు తీసుకువెళ్ళేందుకు ఈ సమావేశం నిర్ణయాలు ఫలితాలనిస్తాయని అన్నారు. ఆఫ్రికా స్వతంత్రంగానే వ్యవహరించాలని ఆయన నొక్కి చెప్పారు. ఆఫ్రికా ఐక్యత, సంస్కరణల అమలుకు ప్రజల ఆలోచనా విధానం మారాలని, కష్టపడి పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఇతర దేశాల దయాదాక్షిణ్యాలపైన ఆధారపడని ప్రాంతంగా ఆఫ్రికా నిలవాలని ఆయన సూచించారు. కొన్ని విషయాలలో మనం ఇతరులపై ఎక్కువగా ఆధారపడుతున్నాము. అయితే మనకున్న సమస్యల పరిష్కారానికి వనరులను సమీకరించుకుందాము. కావలసిన ఫలితాలు సాధించేందుకు ఆ వనరులను వినియోగించుకుందాము అని కగామి అన్నారు. ఏయూ కమిషన్ ఛైర్ పర్సన్ మౌసాఫకి మహమ్మత్ మాట్లాడుతూ అవినీతి వ్యతిరేక పోరాటం తక్షణ అవసరమని అన్నారు. అవినీతి ఆఫ్రికా అభివృద్ధిని అడ్డుకుంటున్నదని అందువల్ల దానిపై పోరాటం ప్రతి ఒక్కరూ చేయాలని పిలుపునిచ్చారు.

చర్చల ద్వారా సమస్యలు పరిష్కారం

చైనా విదేశాంగమంత్రి వాంగ్ వెల్లడి

బీజింగ్ : ఇరుగుపొరుగు దేశాలతో అలాగే అభివృద్ధి చెందుతున్నదేశాలతో స్నేహ సంబం ధాల ను పటిష్టం చేసుకుంటామని, సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకుంటామని, చైనా విదేశాంగ మంత్రి వాంగ్‌యి తెలిపారు. ఈ ప్రాంతంలో నెల కొన్న తీవ్ర సమస్యలను పరిష్కరిం చుకొని నిర్మాణాత్మక పాత్రను నిర్వహిస్తామని అన్నారు. చర్చల ద్వారానే సమస్యలు పరిష్కార మవుతాయని అన్నారు. తాము నిర్మించ తలపెట్టిన బెల్ట్ & రోడ్ ఇనీషియేటివ్ ప్రాజెక్టును ఈ ఏడాది వేగవంతం చేస్తామని దీనిపైన ఏకాభిప్రాయాన్ని కుదుర్చుకున్నామని చెప్పారు. దేశాధ్యక్షుడు జిన్‌పింగ్ కలల ప్రాజెక్టు ఇదని అన్నారు. ఆసియా, ఆఫ్రికా, చైనా, ఐరోపా దేశాల మధ్య సంబంధాలను, సహకారాన్ని పెంపొందించుకునేం దుకు ఈ ప్రాజెక్టు ఎంతగానో దోహదం చేస్తుందని వాంగ్ తెలిపారు. బెల్ట్ రోడ్ ఇనీషియేటివ్ ప్రాజెక్టులో భాగంగా చైనా, పాకిస్తాన్ ఆర్థిక కారిడార్ కూడా ఉంటుందని చెప్పారు. ప్రపంచదేశాలతో మరింత విస్తృత సంబంధాలను కుదుర్చుకునేందుకు ఈ ఏడాది కృషి చేస్తామని వాంగ్ చెప్పినట్టు అధికార మీడియా వెల్లడించింది. బీజింగ్‌లో జరిగిన వివిధ దేశాల దౌత్యవేత్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడినట్లు జిన్హువా వార్తాసంస్థ పేర్కొన్నది. ఈ సమావేశంలో 400 మంది వివిధ దేశాలలో పనిచేస్తున్న దౌత్య అధికారులు పాల్గొన్నారు.

జనభంజకమా?

(మొదటిపేజీ తరువాయి)

చెప్పాలి. ఈ నేపథ్యంలో 2019 పార్లమెంటు ఎన్నికల్లోనూ ఢిల్లీ పీఠమెక్కాలని ఉవ్విళ్లూరుతున్న బీజేపీకి జనానికి తానేం చేయబోతోందీ చెప్పేందుకు మిగిలిన చివరి అవకాశం ఇదే కావచ్చు. ముందస్తు మూజువాణిని తరచూ వినిపిస్తున్న బీజేపీ పెద్దలు ఈ చివరి అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు ఏ మాత్రమూ సంకోసించరని వాదించే వారూ ఉన్నారు. ఎక్సైజ్ సుంకం స్థానంలో అమలు చేస్తున్న జీఎస్టీతో బడ్జెట్ ప్రాధాన్యత తగ్గిందనే అభిప్రాయమూ వ్యక్తమవుతోంది. ఎక్సైజ్ సుంకాలను జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయిస్తున్న పరిస్థితి ఉంది. ఈ సుంకాల నిర్ణయంలో బడ్జెట్‌కు ఎలాంటి పాత్ర లేకపోవడం గమనించాల్సిన విషయం. అయినప్పటికీ ముందుగా చెప్పుకున్నట్లు ఎన్నికల ఏడాదిలో జన వ్యతిరేకతను మూటగట్టుకునే సాహసానికి మోడీ సర్కారు ఒడిగడుతుందనేది భ్రమే.

వ్యవసాయ, దాని అనుబంధ రంగాలకు అధిక ప్రాధాన్యతనిస్తామనేది ప్రభుత్వ వాదన. వ్యవసాయ రంగంలో రైతుల ఆదాయం రెట్టింపు అనే మోడీ ఊతపదం మరోమారు వినిపించచ్చు. ప్రభుత్వ పెట్టుబడులు సమకూర్చడం, వ్యవసాయోత్పత్తుల మార్కెటింగ్‌లో రైతు కష్టాన్ని దోచుకునే దళారీలను నియంత్రించడం, ఇందుకోసమే ప్రవేశపెట్టామంటున్న ఈనామ్ విధానాన్ని సక్రమంగా అమలు జరపడం వంటివి రైతులకు ఉపయోపడతాయి. అధికోత్పత్తి ఓ శాపంగా కాక రైతులకు వరంలా నిలవాలంటే మార్కెట్ శక్తులను నియంత్రించడం, ఎగుమతి, దిగుమతి విధానాల్లో రైతులను భాగస్వాములను చేయడం అవసరం. వ్యవసాయ రంగంలో అవసరమైన ఎరువుల రాయితీలు రైతులకుకాక, ఆయా ఎరువుల తయారీదారుల జేబుల్లోకి చేరుకోవడం తెలిసిందే. ఇందుకు సహకరించే ప్రభుత్వ అధికారులూ లబ్ధి పొందుతున్నారనే విమర్శలున్నాయి. లబ్ధిదారుల గుర్తింపు, వారికి ఉద్దేశించిన రాయితీలు వారికి నేరుగా దక్కాలంటే ప్రత్యక్ష బదిలీ సాయపడవచ్చు. అయితే, అక్షరజ్ఞానం, డిజిటల్‌లావాదేవీల అవగాహన తక్కువగా ఉన్న రైతు లబ్ధిదారులకు రాయితీని చేరవేయడానికి తగిన ఆచరణాత్మక మార్గాన్ని ప్రభుత్వం ప్రకటించాలి. ఇదే తరహాలో ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా ఆహార రాయితీ, ఎంఎన్ఆర్ఈజీఏ ద్వారా ఉపాధి రాయితీలు అవినీతి అధికారుల పాల్పపడకుండా ఆయా లబ్ధిదారులకు ఎలా చేరవేయగలిగేదీ ప్రభుత్వం స్పష్టంగా ప్రకటించాలి. తయారీరంగంలో కీలకమైన చిన్నమధ్యతరహా పరిశ్రమల (ఎస్ఎంఈ) పునరుత్తేజానికి తగిన ఆర్థిక, మార్కెట్ చేయూత అవసరం. తొలుత ప్రస్తావించిన పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీలు చిన్న పరిశ్రమలను అనూహ్య ఒడిదుడుకులకు లోను చేశాయి. చిన్న పరిశ్రమల వ్యాపారాన్ని బడా కంపెనీలు ఎగరేసుకుపోవడానికి నోట్ల రద్దు, జీఎస్టీలు కారణమని చెప్పాలి. ఈ బడా కంపెనీల మీద ఇవి ఎలాంటి ప్రతి కూల ప్రభావాన్ని చూపలేకపోయాయి. ఆర్థిక వృద్ధిరేటును గణనీయంగా ప్రభావితం చేశాయి. క్షేత్రస్థాయిలో గిరాకీ లేక అవస్థలు పడ్డాయి. మరో వంక బడా మార్కెట్ల ఊపుతో షేర్ మార్కెట్ కళకళలాడింది. ఇది అట్టే రోజుల నిలదొక్కుకునేందుకు సాయపడే నమూనా కాదు. ఈ నేపథ్యంలో దెబ్బతిన్న చిన్న పరిశ్రమలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వం మీదనే ఉంది. జీఎస్టీ అమలు కష్టాలను తొలగిస్తున్నామంటున్న ప్రభుత్వం మాటలకు క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న పరిస్థితికి మధ్యన పొంతన ఉండటం లేదు. చిన్న, మధ్య తరహా పరిశ్రమలు నిలదొక్కుకునేందుకు నిర్దిష్ట చర్యలు ప్రకటించాలి.

చమురు మీద సుంకాల అమలు ప్రభుత్వానికి సవాలే. సుంకాలను తగ్గించాలనేది ప్రధాన డిమాండ్‌గా ఉంది. ఒక వైపు అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధర పెరుగుతున్న నేపథ్యంలో సుంకాల భారాన్ని అదుపు చేయడానికి బడ్జెట్ ప్రతిపాదనలు ఊహకందడం లేదు. ప్రజల డిమాండ్‌కు ఆర్థిక మంత్రి జైట్లీ తలొగ్గక తప్పని పరిస్థితి ఉంది. రెవెన్యూ వ్యయాన్ని అదుపు చేయాల్సిన అవసరం ఉంది. ఉద్యోగుల జీతభత్యాలు, రాయితీలు, వడ్డీ చెల్లింపులు సహా జాతీయ రహదారుల్లో పెట్టుబడులు పెరుగుతూ పోయాయి. శాస్త్ర,సాంకేతిక, రోదసి పరిశోధన, తరువాత తరం ఇంటర్నెట్, జన్యుమార్పిడి, డేటా ప్రాసెసింగ్ తదితరాల్లో ప్రభుత్వ పెట్టుబడులు మరింతగా పెరగాల్సి ఉంది. యాంత్రీకరణ, కృత్రిమ మేథస్సు, క్లౌడ్ కంప్యూటింగ్ వంటి ఇంటర్నెట్ ఆధారిత సాంకేతిక పరిజ్ఞానం కారణంగా ఐటీ రంగంలో అసంఖ్యాకంగా కొలువుల ఉద్వాసన జరుగుతోంది. పెరుగుతున్న నిరుద్యోగితకు అనుగుణంగా ఉపాధి కల్పన మీద బీజేపీ ప్రభుత్వం ఇంత వరకు దృష్టి పెట్టింది. లేదు. కొద్ది రోజుల క్రితం కొత్తకొలువుల సృష్టి మీద దృష్టి నిలపాలని విజ్ఞప్తి చేస్తూ ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి అమరజిత్ కౌర్ ప్రభుత్వానికి వినతిపత్రం సమర్పించిన విషయం ప్రస్తావనార్హం. ఇంకా ప్రజారోగ్యం, విద్య, పర్యాటక, వాతావరణ కాలుష్యం, వినియోగదారీ మార్కెట్, వస్తు, సేవారంగాల్లో ఒడిదుడుకులు అదుపు చేయడం, కార్మిక, మహిళ సంక్షేమ, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ యత్నాల్లో దేశ హితాన్ని పరిగణనలోకి తీసుకోవడం మోడీ సర్కారు బాధ్యత. ఈ బాధ్యతను సర్కారు ఎంత వరకు నెరవేరుస్తుందనేది కొద్ది గంటల్లో తేలిపోనుంది.

లాటరీలొద్దు..!

(మొదటిపేజీ తరువాయి)

గౌరవిస్తారో వారికి మాత్రమే మనం గ్రీన్ కార్డులు ఇవ్వాలి' అని ట్రంప్ చెప్పారు. మెరిట్ ఆధారిత వలస వ్యవస్థను ట్రంప్ తీసుకొస్తే అది ఎక్కువమంది భారతీయులకు మేలును అందిస్తుంది. గొలుసుకట్టు వలస విధానాలను రద్దు చేస్తే తమ బంధువులను అమెరికాకు తీసుకు వెళ్లే అవకాశాలకు అడ్డుకట్ట పడనుంది. అమెరికాలో లక్షలాది మంది భారతీయులు గ్రీన్‌కార్డుల కోసం చేసుకున్న దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్న సంగతి తెలిసిందే. ఇలాంటి వారికి ట్రంప్ వ్యాఖ్యలు ఊరట కలిగిస్తున్నాయి. ట్రంప్ ప్రధానంగా నాలుగు అంశాలను ప్రస్తావించారు. మొదటిది.. చిన్నపిల్లలుగా ఉన్నప్పుడు వారి తల్లిదండ్రులు ద్వారా సరైన పత్రాలు లేకుండా అమెరికాలోకి అడుగుపెట్టిన దాదాపు 1.8 మిలియన్ల మంది డ్రీమర్లకు పౌరసత్వం కల్పించడం. రెండోది.. దేశ భద్రత కోసం అక్రమ చొరబాట్లను అడ్డకునేందుకు అమెరికా దక్షిణం వైపున గోడను నిర్మించడం. మూడోది.. వీసా విధానాల్లో లాటరీ విధానం రద్దు చేయడం. నాలుగోది.. గొలుసు కట్టు వలస విధానాలనకు స్వస్తి చెప్పడం. అదేవిధంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు సేవ చేసేందుకు మనం ఎన్నికయ్యామని వెల్లడించారు. ఇటీవలే సంభవించిన విపత్తు మన భూభాగాన్ని తుడిచిపెట్టిందన్నారు. మనం వేసే ప్రతీ అడుగు మన దేశ అభ్యున్నతికి తోడ్పడేలా ఉండాలని సూచించారు. అమెరికన్ల కలను నెరవేర్చుకోవడానికి ఇది మంచి అవకాశమని.. మీరు ఎక్కడినుంచి వచ్చారో.. ఎక్కడున్నారో అనవసరం. ఇది మీ సమయం. కష్టపడితే మీరు కన్న ఏ కలనైనా కచ్చితంగా సాధించగలరన్నారు. అమెరికా కల సాకారానికి ప్రయత్నిద్దామని ట్రంప్ పిలుపునిచ్చారు. అమెరికన్లంతా గర్వపడేలా దేశాన్ని గొప్పగా తీర్చిదిద్దుతామని ట్రంప్ అన్నారు. అమెరికాలో నిరుద్యోగం 45 ఏళ్ల కనిష్టానికి చేరింది. పెద్ద సంఖ్యలో ఉద్యోగాల కల్పన దిశగా కసరత్తు చేస్తున్నాం. ఉగ్రవాదులు కేవలం నేరస్థులే కాదు.. చట్ట వ్యతిరేక శక్తుల సంరక్షకులని అన్నారు. ఐఎస్ ఉగ్రవాదులను ఓడించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని ట్రంప్ స్పష్టం చేశారు. కొత్త రకమైన ఆశావాదం అమెరికాను తుడిచి పెట్టుకుపోయేలా చేసిందని, అమెరికాను మరోసారి గొప్ప దేశంగా చేయడానికి అమెరికన్లు అంతా ప్రతీ రోజు సరైన విజన్‌తో ముందుకెళ్లాలని ట్రంప్ సూచించారు. ఇటీవల కేన్సస్ రాష్ట్రంలో జాతి విద్వేష కాల్పుల్లో మరణించిన కూచిభొట్ల శ్రీనివాస్ సతీమణి సునయన ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ట్రంప్ ప్రసంగాన్ని డెమొక్రాట్లు బహిష్కరించారు.

డెడ్‌లైన్ ఏడాదే !

(మొదటిపేజీ తరువాయి)

తీసుకున్నారు. సచివాలయం, శాఖాధిపతుల భవంతుల నిర్మాణ ప్రణాళికలను నార్మన్ ఫోస్టర్ సంస్థ ఈ రాత్రిలోగా తమకు పంపుతున్నట్టు తెలియజేసిందని, వీటికి మార్చిలోగా టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తున్నట్టు సీఆర్‌డీఏ కమిషనర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ ముఖ్యమంత్రికి వివరించారు. హైకోర్టు భవంతి ఆకృతులు, నిర్మాణ ప్రణాళికలు ఫిబ్రవరి 4 లేదా 5వ తేదీలోగా రానున్నాయని తెలిపారు. శాసనసభ భవంతి ఆకృతులు మరో రెండు వారాలలో వస్తాయని చెప్పారు. వచ్చే అక్టోబరు నాటికి ప్రభుత్వ ఆవాసాలు మొత్తం సిద్ధం కానున్నాయని సీఆర్‌డీఏ కమిషనర్ చెప్పారు. మొత్తం పది ప్రదేశాలలో 69 టవర్ల నిర్మాణం శరవేగంగా సాగుతున్నట్టు తెలిపారు. శాసనసభ్యులు, అఖిల భారత సర్వీస్ అధికారులకు 18 టవర్లలో 144 ఫ్లాట్లు, ఎన్జీవోలకు 22 టవర్లలో 1968 ఫ్లాట్లు, టైప్ 1, 2 అధికారులు, గ్రూప్ డీ ఉద్యోగులకు 21 టవర్లలో 1440 ఫ్లాట్లను నిర్మిస్తున్నామని తెలిపారు. అమరావతిలో ఐటీ కంపెనీల కోసం ఆఫీస్ స్పేస్ నిర్మాణాలను ఆకర్షణీయంగా చేపట్టడానికి సీఆర్‌డీఏ ప్రతిపాదనలను సిద్ధం చేసి ముఖ్యమంత్రి ముందుంచగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

తాత్కాలిక హైకోర్టు భవనం

నాలుగు ఎకరాల విస్తీర్ణంలో తాత్కాలిక హైకోర్టు భవన నిర్మాణం జరగనుంది. 1.8 లక్షల చదరపు అడుగులలో గ్రాస్ ఫ్లోర్ ఏరియా ఉంటుంది. జీ ప్లస్ 2 పద్ధతిలో భవన నిర్మాణాన్ని చేపడుతున్నారు. ప్రధాన న్యాయమూర్తి కోసం 2000 చదరపు అడుగులలో కోర్టు రూమ్, 1200 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఛాంబర్ నిర్మిస్తారు. మరో 1000 చదరపు అడుగుల కార్పెట్ ఏరియాతో 18 కోర్టు హాళ్లు, 600 చదరపు అడుగుల చొప్పున న్యాయమూర్తుల ఛాంబర్లు ఉంటాయి. ఇంటెరిమ్ హైకోర్టు భవన నిర్మాణానికి రూ.108 కోట్ల వ్యయం కాగలదని అంచనా వేశారు. 6 నుంచి 8 మాసాల వ్యవధిలో మొత్తం నిర్మాణం పూర్తి చేస్తామని డాక్టర్ చెరుకూరి శ్రీధర్ తెలిపారు. రాజధానిలో 85 కిలోమీటర్ల మేర నిర్మిస్తున్న రహదారి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సీఎండీ లక్ష్మీపార్థసారధి పనుల ప్రగతిని వివరించారు.

నీరుకొండపై ఎన్టీఆర్ విగ్రహం

అమరావతిలోని నీరుకొండ గ్రామంలో ఉన్న ఎత్తయిన కొండపై 108 అడుగుల ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనపై అధికారులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. రాజధానిలో అంబేద్కర్ విగ్రహాన్ని 125 అడుగుల ఎత్తున ఏర్పాటు చేస్తున్నామని, నీరుకొండ ఎత్తులో ఉన్న దృష్ట్యా ఎన్టీఆర్ విగ్రహం ఎత్తు కొంతమేర తగ్గించవచ్చునని సమావేశంలో పలువురు చేసిన సూచనను పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని సీయం చెప్పారు. 6 ఎకరాల విస్తీర్ణంలో అమరావతి మెరీనా ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనను ముఖ్యమంత్రి పరిశీలించారు. ఏప్రిల్ 10 నుంచి 12 వరకు మూడు రోజుల పాటు భవానీపురంలో జరిగే సంతోష నగరాల సదస్సు ద్వారా మరోసారి అమరావతి ప్రాభవాన్ని ప్రపంచానికి చాటే అవకాశం వచ్చినందున, కళ్లు చెదిరే ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశించారు.

ఆన్‌లైన్ తప్పిదాలు

(మొదటిపేజీ తరువాయి)

జారీ చేసింది. పేపర్-3కి ఇంగ్లీషు ఆప్షన్లు పెట్టుకున్న కొందరికి ఆన్‌లైన్లో తెలుగు సబ్జెక్టుగా నమోదైనట్లు తెలిసింది. దీనిపై విశాఖపట్నానికి చెందిన ఓ మహిళా ఉపాధ్యాయ శిక్షణాభ్యర్థిని కమిషనర్ కార్యాలయం టోల్ ఫ్రీ నంబరును సంప్రదించినా ఫలితం లేదు. ఫిర్యాదు పరిష్కారానికి అభ్యర్థులు చొరవ చూపట్లేదనే విమర్శలున్నాయి. ఇంగ్లీషు బీఈడీతో చేసి, డీఎస్సీలో ఇంగ్లీషు పోస్టు కోసం సన్నద్ధమవుతున్న ఆమె పరిస్థితి దయనీయంగా మారింది. రాష్ట్రంలోని పలు జిల్లాలకు చెందిన భాషాంశాల అభ్యర్థుల సబ్జెక్టుల నమోదులో తారుమారైనట్లు ప్రచారముంది. దీనిపై విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం చోద్యం చూస్తుందనే విమర్శలున్నాయి.

కమిషనర్ కార్యాలయానికి అభ్యర్థుల క్యూ..

ఏపీ టెట్ పేపర్-3 ఆప్షన్ల నమోదులో నెలకొన్న అభ్యంతరాలపై విన్నవించేందుకుగాను విజయవాడకు సమీపంలోని ఇబ్రహీంపట్నం దగ్గర గల విద్యాశాఖ కమిషనర్ కార్యాలయానికి అభ్యర్థులు క్యూకడుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాలకు చెందిన అభ్యర్థులంతా ఆప్షన్ల నమోదు, ఆన్‌లైన్లో తప్పిదాలపై లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తున్నారు. దీనిపై కమిషనర్ కార్యాలయం సిబ్బంది స్పందించడం లేదని వాపోతున్నారు. టెట్‌కు ఫీజు చెల్లింపు, దరఖాస్తుల గడువు ముగిసింది. ఫిబ్రవరి 21 నుంచి మార్చి 3వ తేదీ వరకూ పరీక్షలను నిర్వహిస్తారు. ఈ నెల 10వ తేదీ నుంచి అభ్యర్థుల హాల్‌టికెట్లను కమిషన్ కార్యాలయం వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నట్లు అధికారులు ప్రకటించారు. దీంతో ఆన్‌లైన్ల దరఖాస్తు నమోదు, ఆప్షన్లలో తప్పిదాలు వచ్చిన వారంతా ఆందోళన చెందుతున్నారు. టెట్ హాల్ టికెట్లు, పరీక్షా కేంద్రాలు సిద్ధమైతే మొత్తం ప్రక్రియ పూర్తవుతుంది. ఈలోగా అభ్యర్థుల ఫిర్యాదులపై ప్రభుత్వం స్పందించాల్సిన అవసరం ఉంది.

హైదరాబాద్, బెంగళూరు, చెన్నైలో ఏపీ టెట్ పరీక్షా కేంద్రాలు

ఏపీ టెట్ పరీక్షా కేంద్రాలను హైదరాబాద్, బెంగళూరు, చెన్నైలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. ఆయా రాష్ట్రాల్లో ప్రైవేటు ఉద్యోగాలు చేస్తున్న ఆంధ్రా ప్రాంత అభ్యర్థుల సౌకర్యార్థం పరీక్షా కేంద్రాల్ని ఏర్పాటు చేశారు. ఏపీ టెట్ పేపర్-1,2,3లకు దాదాపు 4లక్షల23వేల 333 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. తొలుత ఈ నెల 5వ తేదీ నుంచి 15 వరకూ టెట్ పరీక్షలకు షెడ్యూలును ప్రభుత్వం విడుదల చేసింది. చదువుకునేందుకు మరింత సమయం కావాలంటూ అభ్యర్థులు విన్నవించడంతో ఈ నెల 21 తేదీకి పరీక్షలను వాయిదా వేశారు.

ఆన్‌లైన్ పరీక్షా కేంద్రాల కోసం అన్వేషణ

రాష్ట్రంలోని 13 జిల్లాల వ్యాప్తంగా టెట్‌ను తొలిసారిగా ఆన్‌లైన్ పద్ధతిలో నిర్వహించనున్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం పరీక్షా కేంద్రాల పరిశీలనలో నిమగ్నమైంది. ఇంజనీరింగ్ కళాశాలలు, ప్రైవేటు సంస్థల ఆధీనంలోని టెక్నో స్కూళ్లపై దృష్టి పెట్టారు. ఆయా జిల్లాల్లోని ప్రధాన నగరాలు/పట్టణాల్లో టెట్ పరీక్షల్ని నిర్వహిస్తారు. దీంతో పరీక్షా కేంద్రాల సంఖ్య అవసరత పెరిగింది. టెట్‌ను తొలిసారిగా ఆన్‌లైన్లో నిర్వహించడంతో జిల్లా విద్యాశాఖాధికారులు అయోమయానికి గురవుతున్నారు. ఆన్‌లైన్ పరీక్షలకు తగిన సెంటర్లను ఎంపిక చేయడం వారికి పెద్ద తలనొప్పిగా మారింది. ఫిబ్రవరి 21 నుంచి మార్చి 3 వరకూ వరుస వారీగా టెట్ పరీక్షలు కొనసాగుతాయి. టెట్ పేపర్-1(ఎస్జీటీ), పేపర్-2(స్కూలు అసిస్టెంట్స్), పేపర్-3(భాషా పండితులు) సబ్జెక్టుల వారీగా నిర్వహిస్తారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండో విడత మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు కొనసాగుతాయి. ఆన్‌లైన్ దరఖాస్తులు, ఆప్షన్ల నమోదుపై వచ్చిన ఫిర్యాదులపై అధికారులు తక్షణమే స్పందించాలని అభ్యర్థులు కోరుతున్నారు.

లక్ష్మీ ప్రసాదం..

(మొదటిపేజీ తరువాయి)

సోదాలు నిర్వహించాయి. సరిగ్గా 20 రోజుల క్రితం వాణిజ్య పన్నుల శాఖలోనే జీఎస్టీ విభాగంలో రూ.22 లక్షల లంచం పుచ్చుకుంటూ ఒక ఉన్నతాధికారిని ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. మళ్లీ అదే విభాగం అదనపు కమిషనర్‌గా ఉన్న లక్ష్మీ ప్రసాద్‌పై ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నట్లు ఆరోపణలు ఉండటంతో రాష్ట్రవ్యాప్తంగా సోదాలు చేపట్టారు. ఆ సోదాల్లో అత్యంత ఖరీదైన ఇళ్ల స్థలాలు, వ్యవసాయ భూములు, పెద్ద మొత్తంలో బంగారు ఆభరణాలు, వెండి వస్తువులతోపాటు నగదు నిల్వలు ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. లక్ష్మీ ప్రసాద్ వెనకేసిన అక్రమాస్తుల విలువ బహిరంగ మార్కెట్‌లో సుమారు రూ.150 కోట్ల వరకు ఉండే అవకాశం ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. విచిత్రం ఏంటంటే ఈ ఉన్నతాధికారి రెండు వివాహాలు చేసుకోవటం గమనార్హం. అయితే ఒక భార్య కోమాలో ఉండగా, లక్ష్మీ ప్రసాద్ కూడా కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. మొదటి నుంచి అక్రమమార్గంలో ఆదాయాన్ని ఆర్జించిన ఆయన పెద్ద మొత్తంలో ఆస్తులను వెనకేశారు. ఉదయం నుంచి సాయంత్ర వరకు కొనసాగిన దాడుల అనంతరం ఏసీబీ అధికారులు లక్ష్మీప్రసాద్‌ను అరెస్టు చేసి విశాఖ ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు.

హైదరాబాద్‌లో భారీ కమర్షియల్ కాంప్లెక్స్

ఒక్క హైదరాబాద్‌లోనే ఎనిమిది ప్రాంతాల్లోని ఆయనకు ఆస్తులున్నాయి. హైదరాబాద్ గచ్చిబౌలిలో రెండు వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో భారీ కమర్షియల్ భవనం, హైదరాబాద్ శివారు పరిగిలో నాలుగు ఫ్లాట్‌లు ఉన్నాయి. వీటి విలువ కోట్ల రూపాయలలోనే ఉంది. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం సమీపంలోని అమీర్‌పేటలో నాలుగు ఎకరాల వ్యవసాయ భూమి కూడా ఉన్నట్లు గుర్తించారు. హైదరాబాద్‌లో రెండో భార్య మల్లిక పేరుతో పెద్ద మొత్తంలో అక్రమాస్తులను కూడబెట్టారు. హైదరాబాద్ అశోక్‌నగర్‌లోని లెజెండ్ అపార్ట్‌మెంట్‌లో ఏసీబీ డీఎస్పీ రామకృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో సోదాలు నిర్వహించారు. విజయవాడలోని ఆయన నివాసంలో చేపట్టిన తనిఖీల్లో 30 తులాల బంగారు ఆభరణాలు కిలో బంగారానికి సంబంధించిన రశీదులు బయటపడ్డాయి. విలాసవంతమైన రెండు కార్లతోపాటు బైక్‌లు కూడా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. విజయవాడ నగరంలో మూడు చోట్ల, గుంటూరులో మూడు చోట్ల, శ్రీకాకుళంలోని లక్ష్మీ ప్రసాద్ సోదరుడి నివాసంతోపాటు నర్సన్నపేటలోని బంధువుల ఇళ్లలోనూ ఏసీబీ దాడులు జరిగాయి. అన్ని చోట్ల అక్రమాస్తులకు సంబంధించిన దస్తావేజులు, రూ.కోటికి సంబంధించిన ప్రామిసరీ నోట్‌లను ఏసీబీ స్వాధీనం చేసుకుంది.

ఆర్థిక మంత్రి యనమలకు ఓఎస్‌డీగా..

వాణిజ్య పన్నుల శాఖలో కమిషనర్ హోదాలో ఉన్న లక్ష్మీ ప్రసాద్ ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడుకు కొంతకాలం ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్‌డీ)గా పని చేశారు. ఆ సమయంలో కూడా పెద్ద మొత్తంలో అక్రమంగా ఆస్తులను కూడ బెట్టారనే ఆరోపణలు ఉన్నాయి. హైదరాబాద్, విశాఖ, గుంటూరులో పెద్ద మొత్తంలో స్థలాలు, ఫ్లాట్‌లను ఆయన బినామీ పేర్లతో కొనుగోలు చేశారు. నిరుడు జీఎస్‌టీ విధానం అమలులోకి రావటంతో ఆ విభాగానికి ఆయన అదనపు కమిషనర్‌గా వ్యవహరిస్తున్నారు. మంత్రికి ఓఎస్‌డీగా ఉన్న సమయంలోనూ విలువైన ఆస్తులను కొనుగోలు చేసినట్లు ఏసీబీ అధికారుల విచారణలో తేలింది.

మున్సిపల్ టీచర్ల పదోన్నతుల షెడ్యూలు విడుదల : ఎస్టీయూ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మున్సిపల్ పాఠశాలల్లో ఉపాధ్యాయుల ఖాళీలను పదోన్నతుల ద్వారా భర్తీ చేసేందుకుగాను ప్రభుత్వం స్పష్టమైన వివరణ ఉత్తర్వులతో షెడ్యూలు విడుదల చేసిందని రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) రాష్ట్ర అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు సీహెచ్ సుధీర్‌బాబు, గాజుల నాగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ఈ నెల 5వ తేదీ నుంచి 25వరకూ పదోన్నతుల క్రియను చేపట్టారని తెలిపారు. ఉమ్మడి సీనియారిటీ జాబితాపై ఈ నెల 5వ తేదీ నుంచి 7 వరకూ అభ్యంతరాలు స్వీకరిస్తారని వివరించారు. 8వ తేదీ నుంచి 14వరకూ ఖాళీలు, అర్హులైన వారి జాబితాను ఈ నెల 17 నుంచి 20వరకూ, 21 నుంచి 24వరకూ పదోన్నతుల కౌన్సెలింగ్ చేపడతారని పేర్కొన్నారు.ఈ నెల 25, 26 తేదీల్లో ఉత్తర్వులు జారీ చేస్తారని తెలిపారు.

రైతులు మద్ధతు ధర కంటే తక్కువకు ధాన్యం అమ్ముకోవద్దు : మంత్రి పుల్లారావు

విశాలాంధ్ర అమరావతి : రైతులు మద్ధతు ధర కంటే తక్కువకు ధాన్యం అమ్ముకోవద్దని మంత్రి పుల్లారావు పేర్కొన్నారు.బుధవారం సచివాలయంలోని మీడియాతో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటివరకు 34 లక్షల 10 వేల టన్నుల ధ్యాన్యంను సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ రైతుల నుంచి కొనుగోలు చేసిందన్నారు.48 గంటల్లో రైతులకు పెమెంట్స్ జమచేయడం జరుగుతుందన్నారు . రైతులకు మద్దతు ధర కల్పించేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలను తీసుకుంటుందని చెప్పారు.మే 1 వ తేదీ , జూన్ 2వ తేదీ నాటికి 65 మున్సిపాలిటీల్లో 200 సీఎం చేతుల మీదుగా అన్న క్యాంటీన్లను ప్రారంభిస్తామని మంత్రి తెలిపారు.జనవరి నుంచి సినిమా హాళ్ళు, మల్టీఫెక్స్‌ల నందు అధిక ధరలు విక్రయించే వారి లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు.పి.డి.ఎస్ బియ్యం కొనుగొలు చేసే రైస్ మిల్లుల లైసెన్స్ రద్దు చేస్తామన్నారు.మే నాటికి 6,500 వీలేజ్ మాల్స్ ప్రారంభించటానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.రైస్ మిల్లుల్లో సి.యం.ఆర్‌కు తగ్గట్టుగా కరెంటు బిల్లు ఉండాలన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబుకు భద్రత పెంపు



విశాలాంధ్ర-అమరావతి : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు మరింత భద్రతను పెంచారు. ప్రస్తుతం ఆయన జడ్‌ప్లస్ సెక్యూరిటీ కేటగిరిలో ఉన్నారు. దీని కింద ఉన్న ముఖ్యుల భద్రత వ్యవహారాలను నేషనల్ సెక్యూరిటీ గార్డులు పర్యవేక్షిస్తుంటారు. దేశంలో టాప్ వీఐపీలకు జడ్‌ప్లస్ కేటగిరి భద్రతను కేటాయిస్తారు. ప్రధానమంత్రి, మరికొందరు ప్రముఖులతో పాటు చంద్రబాబుకు కూడా జడ్‌ప్లస్ కేటగిరిలో భద్రతా బలగాలు ఆయనను పరిరక్షిస్తుంటాయి. ఈ కేటగిరి కింద ఉన్న ప్రముఖులకు బుల్లెట్ ప్రూఫ్ వాహనాల కాన్వాయ్, జామర్‌లు, ఇతర ఏర్పాట్లు ఉంటాయి. ఈ ఏడాది ఎన్నికలు జరుగుతాయని ప్రచారం సాగుతోంది. ఎన్నికలు ఎప్పుడైనా జరగవచ్చని, అందువల్ల ముందు జాగ్రత్తగా ముఖ్యమంత్రి భద్రతా బలగాలను మరింత పెంచాలని పోలీసు ఉన్నతాధికారులు నిర్ణయించినట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి రాష్ట్రంలో, దేశంలో పర్యటనలకు వెళ్ళేటప్పుడు భద్రత వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని అధికారులు నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. సీఎం జిల్లాల పర్యటనకు వెళ్ళేటప్పుడు నేషనల్ సెక్యూరిటీ గార్డులతో పాటు మూడంచెల పోలీసు భద్రత వ్యవస్థ పని చేస్తుంది. అయితే ఇక నుండి మరిన్ని భద్రత చర్యలను చేపట్టనున్నారు. ఇదిలా ఉండగా ముఖ్యమంత్రి ఉండవల్లి నివాసం నుండి వెంకటపాలెం, మందడం మీదుగా రోజూ సచివాలయానికి చేరుకుంటారు. అయితే బుధవారం ఆయన కాన్వాయ్ తాళ్ళాయపాలెం, మందడం మీదుగా సచివాలయానికి చేరుకుంది. మొత్తం మీద చంద్రబాబుకు భద్రతా ఏర్పాట్లను మరింత కట్టుదిట్టం చేశారు.



దళితులకు అండ.. జాతీయ ఎస్సీ కమిషన్...

కమిషన్ సభ్యుడు రాములు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యశాఖ : దేశంలో దళితులకు ఎక్కడ అన్యాయం జరిగినా జాతీయ ఎస్సీ కమిషన్ వెంటనే స్పందించి బాధిత దళిత కుటుంబాలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటుందని జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు కె.రాములు పేర్కొన్నారు. గుంటూరులో ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో కె.రాములు, జిల్లా కలెక్టర్ కోన శశిధర్, జిల్లా అర్బన్, రూరల్ ఎస్పీలు విజయరావు, వెంకట అప్పలనాయుడు, మాజీ మంత్రి, ప్రత్తిపాడు శాసనసభ్యుడు రావెల కిషోర్‌బాబులతో బుధవారం సమావేశమై చర్చించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఇటీవల గొట్టిపాడులో జరిగిన సంఘటనపై అధికార్లతో చర్చించామని, బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.రాష్ట్రంలోని అన్ని జిల్లాలను పర్యటించడంతో పాటు ఎస్సీ సబ్‌ప్లాన్ కచ్చితంగా అమలు జరిగేలా సంబంధిత అధికార్లకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్టు చెప్పారు. అలాగే రాష్ట్రంలో దళితులపై జరిగిన పలు సంఘటనలపై ఆయా ప్రాంతాలలో పర్యటించి బాధిత దళిత కుటుంబాలకు న్యాయం జరిగేలా కృషి చేసినట్లు తెలిపారు. జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడిగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మధ్యప్రదేశ్, గుజరాత్, చత్తీస్‌గఢ్, నాగలాండ్ రాష్ట్రాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు ఆయన వివరించారు. ఏ దళిత కుటుంబానికైనా అన్యాయం జరిగితే జాతీయ ఎస్సీ కమిషన్ కార్యాలయానికి దరఖాస్తు రూపంలో తెలపవచ్చని చెప్పారు. అనంతరం ఆయన పలు దళిత సంఘాలు, దళితుల నుంచి వినతులు స్వీకరించారు.

అన్నీ విలువైన ఆస్తులే

- మహేశ్వరంలోనే 4 ఎకరాల భూమి
- విశాఖ, గుంటూరులో స్థలాలు
- హైదరాబాద్‌లో ఫ్లాట్‌లు

విశాలాంధ్రబ్యూరో-అమరావతి : ఆదాయానికి మించి అక్రమాస్తులను కూడబెట్టిన కేసులో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అరెస్టు చేసిన వాణిజ్య పన్నుల శాఖ జీఎస్‌టీ అదనపు కమిషనర్ జి.లక్ష్మీప్రసాద్‌కు కళ్లు చెదిరే ఆస్తులున్నాయి. అక్రమ మార్గంలో సంపాదించిన ఆస్తులన్నీ అత్యంత విలువైనవి కావటం విశేషం.

రాజధాని విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం, శ్రీకాకుళం, హైదరా బాద్‌లో భారీగా ఆస్తులను కూడబెట్టారు. ఏసీబీ అధికారులు ఆయా ప్రాంతాల్లో ఏకకాలంలో 20 చోట్ల లక్ష్మీ ప్రసాద్ ఇళ్లతోపాటు బంధువులు, కుటుంబ సభ్యుల ఇళ్లలలో సోదాలు నిర్వహించారు. సోదాల్లో రూ.కోటికి సంబంధించిన ప్రామిసరీ నోట్‌లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే మూడు కార్లు, రెండు ద్విచక్ర వాహనాలు, రూ.10 లక్షల విలువైన గృహోపకరణాలు, రూ.40 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, రూ.32 లక్షల నగదుతోపాటు బ్యాంక్‌లో రూ.34 లక్షల డిపాజిట్ ఉన్నట్లు గుర్తించారు. హైదరాబాద్‌లోని చిక్కడపల్లిలో ఉన్న ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్‌లోని లాకర్‌ను ఓపెన్ చేయాల్సి ఉంది. వీటితోపాటు 11 ఇంటి స్థలాలు, నిర్మాణంలో ఉన్న ఒక ఇల్లు, మూడు ఫ్లాట్‌లు, 4.5 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నాయి. వీటికి సంబంధించిన దస్తావేజులను కూడా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తెలంగాణాలోని రంగారెడ్డి జిల్లాలో అత్యంత ఖరీదైన ప్రాంతమైన మహేశ్వరంలోనే నాలుగున్నర ఎకరాల భూమి ఉండగా, దాని విలువే పదుల కోట్ల



రూపాయలలో ఉంటుందని అంచనా.

అక్రమాస్తుల వివరాలు

- అదనపు కమిషనర్ లక్ష్మీప్రసాద్ శ్రీకాకుళం పట్టణంలో 2003-04లో ఏడు వేల చదరపు అడుగల విస్తీర్ణంలో జీ ప్లస్2 ఇంటిని నిర్మించారు.
- గుంటూరు జిల్లా గోరంట్లలో 400 చదరపు గజాల ఇంటి స్థలాన్ని 1997లో కొనుగోలు చేశారు
- అత్త వై.అప్పలనరసమ్మ పేరుతో శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లలో 2013లో రెండు ఎకరాల వ్యవసాయ భూమి కొనుగోలు
- మరదలు పేరుతో 2013లో తెలంగాణాలోని రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలో రెండు ఎకరాల వ్యవసాయ భూమి, 2015లో గుంటూరు జిల్లా గోరంట్లలో 222 చదరపు గజాల ఖాళీ స్థలం కొనుగోలు

మొదటి భార్య అలివేలు పేరుతో

- 2014లో విశాఖ నగరంలో 366.66 చదరపు గజాల స్థలం కొనుగోలు
- 2001లో 200 చదరపు గజాల స్థలం కొనుగోలు
- 2011లో హైదరబాద్ శివారు పరిగిలో 200 చదరపు గజాల స్థలం
- 2009, 2011లో పరిగిలోనే 200 చదరపు గజాల ఇంటి స్థలాలు రెండు కొనుగోలు
- 1993లో గుంటూరు జిల్లా గోరంట్లలో 889 చరదపు గజాల స్థలం కొనుగోలు

రెండో భార్య మల్లిక పేరుతో

- 2014లో గుంటూరు జిల్లా తాడికొండ మండలం లాంలో 172 చదరపు గజాలు, రెండు 400 చదరపు గజాల స్థలాల కొనుగోలు
- 2014లో గోరంట్లలో 240 చదరపు గజాల ఇంటి స్థలం కొనుగోలు
- 2004లో హైదరాబాద్ అశోక్‌నగర్‌లో 1,484 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఫ్లాట్
- 2010లో హైదరాబాద్ నారాయణగూడలో 1,594 చదరపు అడుగుల విస్తర్ణంలో ఫ్లాట్
- 2016లో హైదరబాద్ గచ్చిబౌలిలో 2,040 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఫ్లాట్ కొనుగోలు
- తెలంగాణాలోని రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం అమీర్‌పేటలో రెండు వేర్వేరు చోట్ల 2.14 గుంటల వ్యవసాయ భూమిని రెండో భార్య మల్లిక పేరుతో రిజిస్ట్రేషన్
- 2017లో విశాఖ జిల్లా అచ్యుతాపురం మండలం దుప్పిటూరులో 17 సెంట్ల ఖాళీ స్థలం కొనుగోలు.

అమిత్ షా పిలుపు

ఢిల్లీకి ఏపీ, తెలంగాణ బీజేపీ అధ్యక్షులు - అసెంబ్లీ సీట్లు పెంపుపై చర్చ

విశాలాంధ్రబ్యూరో - అమరావతి : అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ రెండు తెలుగు రాష్ట్రాలపై బీజేపీ ప్రత్యేక దృష్టి సారించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో పార్టీని బలోపేతం చేయాలనే యోచనలో అధినేతలు ఉన్నారు. ఈ నేపథ్యంలో రెండు రాష్ట్రాల పార్టీ అధ్యక్షుల, అసెంబ్లీ ఫ్లోర్ లీడర్‌లకు ఢిల్లీ రావాలంటూ బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా నుంచి పిలుపు వచ్చింది. దీంతో బీజేపీ ఏపీ అధ్యక్షుడు కంభంపాటి హరిబాబు, శాసనపక్ష నేత పీ విష్ణుకుమార్ రాజు బుధవారం సాయంత్రం విశాఖ నుంచి ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. పార్టీ తెలంగాణ అధ్యక్షుడు కె లక్ష్మణ్, శాసనపక్ష నేత జీ కిషన్‌రెడ్డి బుధవారమే ఢిల్లీకి చేరుకున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో అసెంబ్లీ స్థానాలను పెంచాలని ముఖ్యమంత్రులు చంద్రబాబు, కేసీఆర్ ప్రధాని నరేంద్ర మోడీకి విన్నవించారు. అసెంబ్లీ స్థానాల పెంపునకు సూత్రప్రాయంగా అంగీకరించిన మోడీ.. ఈ విషయంపై పార్టీ నేతలతో చర్చించాలని అమిత్‌షాకు సూచించారు. ఆ నేపథ్యంలో రెండు రాష్ట్రాల బీజేపీ నేతలతో అమిత్‌షా గురువారం ఢిల్లీలోని ఆయన నివాసంలో ప్రత్యేకంగా భేటీ కానున్నారు. ఆ భేటీలో అసెంబ్లీ స్థానాల పెంపు వల్ల పార్టీకి ఏ మేర ప్రయోజనం కలుగుతుందోనన్న అంశాలపై చర్చించే అవకాశాలు ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ, బీజేపీ నేతల మధ్య జరుగుతున్న మాటల యుద్ధంపైనా చర్చించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం నుంచి సరైన సహకారం అందటం లేదని సాక్షాత్తు సీఎం చంద్రబాబు వ్యాఖ్యానిస్తున్నారు. మిత్రధర్మం పాటించటం లేదంటూ బీజేపీపై వ్యాఖ్యలు చేయగా, దానిపై మహిళా మోర్చా అధ్యక్షురాలు పురంధేశ్వరి ఘాటుగా స్పందించారు. టీడీపీ మంత్రులు, ప్రజా ప్రతినిధులు సైతం బీజేపీపై విమర్శలు గుప్పించటంపై ఆ పార్టీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు తరచూ ఫైర్ అవుతున్నారు. ఇలాంటి పరిస్థితులలో అసెంబ్లీ స్థానాల పెంపు, పార్టీ భవిష్యత్, పొత్తులపై అమిత్‌షా రెండు రాష్ట్రాల నేతలతో చర్చించే అవకాశం ఉన్నట్లు సమాచారం. బీజేపీ నేతలతో సమావేశం అనంతరం అమిత్ షా టీడీపీ, టీఆర్ఎస్ నేతలతోనూ భేటీ అయ్యే అవకాశాలు ఉన్నట్లు సమాచారం.

పోలవరం నిర్వాసితులకు పరిహారం చెల్లించాలి : గిడుగు రుద్రరాజు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : పోలవరం నిర్వాసితులకు ప్రభుత్వం పరిహారం చెల్లించాలని మాజీ ఎమ్మెల్సీ, పీసీసీ ప్రధాన కార్యదర్శి గిడుగు రుద్రరాజు డిమాండు చేశారు.ఈ మేరకు బుధవారం రాష్ట్ర కార్యాలయం నుంచి ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.పోలవరం ఆర్‌ఆర్ ప్యాకేజీ వల్ల నిర్వాసితులు నష్టపోయారని,18 ముంపు గ్రామాల నిర్వాసితుల సమస్యల పరిష్కారంపై కాంగ్రెస్ పోరాడుతుందని స్పష్టంచేశారు. కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ పోలవరం పనులపై సమీక్షించి, పనులను కొత్త కాంట్రాక్టరుకు అప్పగించే అంశంపై ఒక స్పష్టత ఇవ్వడం కాంగ్రెస్ పోరాటాల ఫలితమేనని ఆయన పేర్కొన్నారు.ఈ నెల 7వ తేదీ నుంచి పోలవరం నిర్మాణాన్ని సత్వరమే కొనసాగాలని పీసీసీ ఆధ్వర్యాన మహాపాదయాత్ర, 10న సామూహిక సత్యాగ్రహాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా కోసం ఢిల్లీ నుంచి గల్లీ వరకు కాంగ్రెస్ పోరాడుతుందని, పార్లమెంటులో బిల్లుకు 12 జాతీయ పార్టీల మద్దతును కూడగట్టిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు.బడ్జెట్‌లో ఏపీకి పెద్దపీట వేస్తారా? లేదా రైల్వేజోన్‌పై కీలక నిర్ణయం తీసుకుంటారా? లేదా? అని ఆయన ప్రశ్నించారు.

కాంట్రాక్టు వైద్యుల సమ్మెకు కాంగ్రెస్ మద్దతు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : వేతనాల కోసం సమ్మె చేపట్టిన నెల్లూరు సార్వజనిక ఆస్పత్రి డాక్టర్ల సమ్మెకు పీసీసీ డాక్టర్స్ సెల్ కో-చైర్మన్ డాక్టర్ అంబటి రాధాకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో మద్దతు తెలిపారు.ఆస్పత్రిలో కాంట్రాక్టు పద్ధతిన పనిచేస్తున్న డాక్టర్ల పరిస్థితి దయనీయంగా మారిందని పేర్కొన్నారు. పర్మినెంట్ చేస్తామన్న ఎన్నికల హామీని నిలబెట్టుకోలేదని, వైద్యుల పనికి తగిన వేతనాలివ్వకుండా ప్రభుత్వం వేధింపులకు గురిచేస్తోందని తెలిపారు.వైద్యులకు బకాయి పడిన వేతనాలను పీఆర్సీతో కలిసి ఇవ్వాలని, ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని కోరారు.

పార్టీకి ఉజ్వల భవిష్యత్

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు

ఘనంగా సీపీఐ ఒంగోలు నగర 12వ మహాసభలు



విశాలాంధ్ర-ఒంగోలు : భారత కమ్యూనిస్టు పార్టీకి రానున్న కాలంలో ఉజ్వల భవిష్యత్ ఉంది. దానిని కార్యకర్తలు సద్వినియోగం చేసుకుని పార్టీ అభివృద్ధికి పాటుపడాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయంలో సీపీఐ నగర 12వ మహాసభలను బుధవారం ఘనంగా నిర్వహించారు. మహాసభలకు అధ్యక్ష వర్గంగా సీనియర్ నాయకులు ముదివర్తి రాఘవరావు, ఎస్‌డి సర్దార్‌లు వ్యవహరించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ముప్పాళ్ల మాట్లాడుతూ దేశవ్యాపితంగా 2014 ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ప్రజలు దూరంగా పెట్టారన్నారు. ప్రస్తుతం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూడా పెద్ద నోట్ల రద్దు, జీఎస్‌టీ, అధిక ధరలు, కార్మిక, కర్షక, ఉద్యోగ, పేద, బడుగు, బలహీన వర్గాల, మైనార్టీ వర్గాల వ్యతిరేక విధానాల కారణంగా ఆ పార్టీ పట్ల ప్రజల ఆదరణ తగ్గిందన్నారు. టీడీపీ, వైసీపీలు ప్రజా సమస్యలను మరచి అధికార దాహంతో ఉన్నారని ప్రజలు గ్రహించారన్నారు. నిత్యం ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తున్న కమ్యూనిస్టు పార్టీలు తృతీయ శక్తిగా ఎదిగేందుకు ఈ పాటికే సమాతయ్యమయ్యారన్నారు. కార్యకర్తలు మరింతగా ప్రజా సమస్యలపై క్రియాశీల పోరాటాలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు.

తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ప్రతిపక్ష పార్టీలు కేసుల విషయంలో భయపడుతూ బీజేపీ అడుగులకు మడుగులొత్తుతున్నారన్నారు. ప్రత్యేక హోదా పదేళ్లు కాదు, 15 ఏళ్లు అన్న నరేంద్ర మోడీ, చంద్రబాబు నాయుడు స్వార్ధ రాజకీయాల కోసం హోదాను బుట్టదాఖలు చేశారన్నారు. ప్రత్యేక ప్యాకేజీ నిధులకు కూడా మంగళం పాడారన్నారు. వీటిపై నిలదీయాల్సిన తెలుగుదేశం, వైసీపీ నాయకులు మాత్రం మిన్నకుండి పోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకుడు నల్లూరి వెంకటేశ్వర్లు(అన్న), జిల్లా కార్యదర్శి కె.అరుణ, ఉప్పుటూరి ప్రకాశరావు, ముదివర్తి రాఘవరావు, కె.నారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీఐ నగర నూతన కమిటీని ఎన్నుకున్నారు. నగర పార్టీ కార్యదర్శిగా ఎస్‌డి సర్దార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

మోడీ పాలనలో పేదల బతుకులు దుర్భరం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పి.హరినాథరెడ్డి



విశాలాంధ్ర - తిరుపతి : మోడీ పాలనలో రోజు రోజుకు పేదల బతుకులు మరింతగా దిగజారుతున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పి.హరినాథరెడ్డి విమర్శించారు. బుధవారం స్థానిక జీవకోనలో సీపీఐ 9వ శాఖ మహాసభ చిన్నం కాళయ్య అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన పి.హరినాథరెడ్డి మాట్లాడుతూ, దేశంలో సంపన్న వర్గాల అభివృద్ధిని పేదల అభివృద్ధి అంటూ సంకలు గుద్దు కుంటున్న మోడీ నిజస్వరూపం బయట పడుతుంద న్నారు. అధికారం కొన్ని కులాలకే పరిమితమైపోతుందని, రాజ్యాంగం ప్రకారం రిజర్వేషన్లు ఉన్నాయి కాబట్టే ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కనీసం అసెంబ్లీకి పోతున్నారన్నారు. రాష్ట్రంలో అధికార పక్షం, ప్రతిపక్ష నాయకులు ఇద్దరూ మోడీ మోజులో పడి రాష్ట్రాన్ని దివాళా తీస్తున్నారని మండిపడ్డారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎ.రామానాయుడు మాట్లాడుతూ కమ్యూనిస్టుల పోరాట ఫలితంగానే జీవకోన ఏర్పడిందని, తిరుపతిలో పేదవాడికి ఇల్లు ఉందంటే అది సీపీఐ ఫలితమేనని గుర్తుచేశారు. చంద్రబాబు ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అండగా ఉంటూ పేదల భూముల్ని లాగేసు కుంటూ అన్యా యం చేస్తున్న దన్నారు. సీపీఐ నగర కార్య దర్శి చిన్నం పెంచలయ్య మాట్లాడుతూ, జీవకోనలో ఇల్లులేని నిరుపేదలు బాడుగ లు కట్టుకోలేక అనేక జన్మభూముల్లో అర్జీలు ఇచ్చి మోసం పోవడం తప్ప లబ్ధి చేకూరడం లేదన్నారు. అసాంఘిక శక్తుల పట్ల పోలీసుల తీరు సక్రమంగా లేదన్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వాలు పూర్తి వైఫల్యం చెందాయని విమర్శించారు.

ముందుగా పార్టీ అరుణ పతాకాన్ని హరినాథరెడ్డి ఎగురవేశారు. నూతన శాఖ కార్యదర్శిగా చిన్నం కాళయ్యతోపాటు ఐదుగురు కమిటి సభ్యులను మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. ఈ మహాసభలో సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు కె.రాధాక్రిష్ణ, ఎన్.డి.రవి, ఎన్.శ్రీరాములు, జి.శశికుమార్, మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు వి.జయలక్ష్మి, ఎఐవైఎఫ్ నగర కార్యదర్శి ఎం.రామకృష్ణ, ఆటో యూనియన్ నగర అధ్యక్ష, కార్య దర్శులు కె.వై.రాజా, ఎన్.శివ, వై.జగన్నాథం, ఆర్.రవి, డి.రామచంద్రయ్య, మహిళా నాయకురాళ్లు రత్నమ్మ, మంజుల, రేణుక, బృందా, సుశీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆదాయ పన్ను పరిమితి రూ.5లక్షలకు పెంచాలి : ఎస్టీయూ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఆదాయపన్ను పరిమితిని ఐదు లక్షల రూపాయిల వరకూ మినహాయిపునివ్వాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు సీహెచ్ జోసఫ్ సుధీర్‌బాబు, గాజుల నాగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో డిమాండు చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో ప్రతిపాదనలు చేయాలని కోరారు. కొన్నేళ్లుగా ఆదాయపన్ను శ్లాబులు అమలు చేయలేదని, ఒకే దేశం-ఒకే పన్ను అమలు దిశగా జీఎస్టీని అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల నుంచి వివిధ రకాల పన్నులతోపాటు వృత్తి పన్ను వసూలు చేస్తున్న నేపథ్యంలో ఉద్యోగులకు ఊరట కలిగించేలా ఆదాయ పన్ను పరిమితిని పెంచాలని కోరారు.

వ్యవసాయ పరిశ్రమలకు ఊతం

- త్వరలో కోల్డ్ చైన్ కార్పొరేషన్ ఏర్పాటు
- పారిశ్రామికవేత్తల సదస్సులో మంత్రి సోమిరెడ్డి



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : వ్యవసాయ, అనుబంధ రంగాల పరిశ్రమలు ఏర్పాటు చేసే పారిశ్రామికవేత్తలకు భారీ ప్రోత్సాహకాలందించనున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రకటించారు. రాష్ట్రంలో పరిశ్రమలు పెట్టి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బుధవారం స్థానిక ప్రైవేట్ సమావేశ మందిరంలో వ్యవసాయ, ఉద్యాన పరిశ్రమల ఏర్పాటుపై నిర్వహించిన పారిశ్రామిక వేత్తల సమావేశానికి మంత్రి సోమిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యవసాయ యంత్ర పరికరాల తయారీకి ముందుకు వచ్చే సంస్థలకు మంచి అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవడంతో పాటు సబ్సిడీలు ఇచ్చి ప్రోత్సహించేందుకు కృషి చేస్తున్నామన్నారు. యాంత్రీకరణ, సూక్ష్మ సేద్యం ద్వారా అధిక దిగుబడిని సాధించి రైతుకు సాగు ఖర్చు తగ్గించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రస్తుతం 40 లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటల విస్తీర్ణం కలిగి ఉన్నదని, దీనిని కోటి ఎకరాలకు పెంచే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. బిందు సేద్యంలో భారతదేశంలో మొదటి స్థానంలో, సూక్ష్మ నీటిసాగు పథకం విస్తీర్ణంలో రెండవ స్థానంలో ఏపీ ఉండటం గమనార్హమన్నారు. వివిధ రాష్ట్రాల కంపెనీలు ఏపీ సూక్ష్మ సాగు నీటి పథకంలో పాల్గొంటున్నాయన్నారు. ఇందులో 6 కంపెనీలు అనంత, సిప్లెన్, నంది, మహానంది, గ్లోబల్, యూపీఐ తప్ప మిగిలిన 28 కంపెనీలు ఇతర రాష్ట్రాలలో పరికరాలను తయారుచేసి రాష్ట్రంలో రైతులకు అందజేస్తున్నాయని వివరించారు. అయితే దీని ద్వారా రవాణా ఖర్చు పెరగడంతోపాటు సరఫరాకు కొంత ఆలస్యమవుతుందని తెలిపారు. సూక్ష్మ సేద్య పరికరాల కంపెనీల ప్రతినిధులతో అనంతపురం జిల్లాలో జాతీయ రహదారి పక్కన 150 ఎకరాల విస్తీర్ణంలో ప్లాస్టిక్ ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అమెరికాకు చెందిన ఐయోవా స్టేట్ యూనివర్సిటీతో ఎంవోయూ కుదుర్చుకోవడం ద్వారా రూ.680 కోట్లతో 600 ఎకరాలలో మెగాఫుడ్ పార్కును కర్నూలులో ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. త్వరలో రాష్ట్రంలో కోల్డ్ చైన్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఏపీఐఐసీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డా.పి.కృష్ణయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను వివరించారు. ఏపీఐఐసీ చైర్మన్ జె.ఎస్.ఆర్.కె.ప్రసాద్, ఉద్యాన, సెరీకల్చర్ శాఖల కమిషనర్ చిరంజీవి చౌదరి, పరిశ్రమల శాఖ కార్యదర్శి సిద్ధార్ధ జైన్, వ్యవసాయ శాఖ కమిషనర్ హరిజవహర్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.



కుంభమేళాలకు ప్రత్యామ్నాయంగా...

నాస్తిక సమాజం రాష్ట్ర కార్యదర్శి అరుణ్‌కుమార్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: దేశంలో ఆధ్యాత్మికం పేరుతో వివిధ మతాలు నిర్వహిస్తున్న జాతరలు, కుంభమేళాలు, హజ్‌యాత్రలు, సాంప్రదాయ మత పండుగులకు ప్రత్యామ్నాయంగా 26 ఏళ్ల నుంచి జాతీయ నాస్తిక మేళాను నిర్వహిస్తున్నామని నాస్తిక సమాజం రాష్ట్ర కార్యదర్శి మోతుకూరి అరుణ్‌కుమార్ పేర్కొన్నారు. విజయవాడ బందరురోడ్డు సమీపంలోని స్వాతంత్ర్య సమరయోధుల భవనంలో బుధవారం నాస్తిక సమాజం రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు.ఈ నెల 10, 11తేదీల్లో మంగళగిరి సమీపంలోని నిడమర్రు రావణ మైదానంలో నిర్వహించనున్న నాస్తిక సమాజం రాష్ట్ర సమావేశాలపై చర్చించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భౌతికవాద, హేతువాద భావాలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు.సాహిత్య, సాంస్కృతిక ఉద్యమాల ద్వారా మూఢనమ్మకాలను నిర్మూలించలగమని ఆయన స్పష్టం చేశారు.నాస్తిక సమాజం సీనియర్ నాయకులు వి.ప్రసాదరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఓపీడీఆర్ నాయకులు కె.కోటేశ్వరరావు, ఇఫ్త్యూ నాయకులు కూరపాటి రామారావు సంఘం నాయకులు ఎస్‌కే లతీఫ్, గురునాథరావు పాల్గొన్నారు.

ఉమ్మడి సర్వీసు రూల్స్ కేసు వాయిదా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ఉపాధ్యాయుల ఉమ్మడి సర్వీసు రూల్స్ కేసును ఈ నెల 5 వరకూ స్టేటస్ కొనసాగిస్తూ రాష్ట్ర హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.తెలుగు రాష్ట్రాలకు చెందిన మూడు లక్షల మంది ఉపాధ్యాయుల ఉమ్మడీ రూల్స్ సమస్య పరిష్కారంపై న్యాయస్థానం పరిధిలోకి వెళ్లిన విషయం విదితమే.దీనిపై ఏళ్ల తరబడి నుంచి విద్యాశాఖాధికారులు న్యాయస్థానాల చుట్టూ తిరుగుతున్న విషయం విదితమే. వచ్చే సోమవారం నుంచి హైకోర్టులో వాదనలు కొనసాగుతాయని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు సీహెచ్ జోసఫ్ సుధీర్‌బాబు, గాజుల నాగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సంపాదకీయం

ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం

జమిలి ఎన్నికలపై బీజేపీ దూకుడు ప్రదర్శిస్తున్నది. ఈ విషయమై గతంలో నరేంద్రమోడీకి నీతి ఆయోగ్ తందాన అంది. ఎన్నికల సంఘం కూడా మాయాబజార్ సినిమాలో మాదిరిగా 'అదే మన తక్షణ కర్తవ్యం' అంటూ సై అంది. తాజాగా బడ్జెట్ సమావేశాలకు ముందు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ పార్లమెంటు ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగిస్తూ జమిలి ఎన్నికలపై రాజకీయ పార్టీలన్నీ ఏకాభిప్రాయానికి రావాలని పిలుపునిచ్చారు. లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభలకు ఏకకాలంలో ఎన్నికలు జరిగితే ప్రజాధనం వ్యయాన్ని అడ్డుకోవచ్చునీ, దేశాభివృద్ధికి ఆటంకాలూ తొలగిపోతాయని ఆయన ఉద్ఘాటించారు. బీజేపీ భారీ మెజార్టీతో అధికారంలోకి వచ్చిన దగ్గర్నుంచి 'ఒకే దేశం- ఒకేసారి ఎన్నికలు' నినాదాన్ని అవకాశం వచ్చినప్పుడల్లా ముందుకు తెస్తోంది. 2010లోనే బీజేపీ సీనియర్ నాయకుడు ఎల్‌కే అద్వానీ ఒకేసారి ఎన్నికల గురించి ప్రస్తావించారు. బీజేపీ తన 2014 ఎన్నికల ప్రణాళికలో దీన్ని పొందుపర్చింది. నిజమే, దేశమంతా ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తే మిగిలిన సమయమంతా దేశాభివృద్ధిపై దృష్టి కేంద్రీకరించవచ్చు. కానీ జమిలి ఎన్నికల నిర్వహణ ఆచరణ సాధ్యమేనా? భిన్న భాషలు, సంస్కృతుల సమ్మిళిత భారత్‌లో ఈ జమిలి ప్రతిపాదన మన సమాఖ్య (ఫెడరల్) స్ఫూర్తికి ఏ మేరకు మేలు చేస్తుంది? లౌకిక పునాదులపై వర్థిల్లుతున్న మన ప్రజాస్వామ్య స్ఫూర్తికి ఇది విఘాతం కలిగించదా?

జమిలి ఎన్నికలను ఒక మహత్తర సంస్కరణగా భ్రమింపచేసే ప్రయత్నం జరుగుతున్నది కానీ, రాజకీయ కారణాలు, అధికారపు లెక్కలు లేనిదే పాలకపక్షాలు ఈ తరహా చర్యలకు సిద్ధపడవన్నది నిజం. 2014 ఎన్నికల్లో 'కాంగ్రెస్ విముక్త భారత్' లక్ష్యమంటూ ప్రధాని అభ్యర్థిగా ప్రచార హోరు సాగించిన మోడీ, బీజేపీ చీఫ్ అమిత్‌షాలు ప్రాంతీయ పార్టీలను సైతం నామరూపాల్లేకుండా చేసేందుకు దీన్నొక ఎత్తుగడగా ముందుకు తెచ్చారనడంలో సందేహంలేదు. ఇప్పటికే దేశంలో ఒకే భాషలో మాట్లాడాలని, ఒకే రకమైన దుస్తులు ధరించాలని, ఒకే రకమైన ఆహారం తినాలని, ఒకే సంస్కృతిని అనుసరించాలంటూ ప్రజలపై హిందూత్వ శక్తులు ఒత్తిడి చేస్తున్నాయి. భిన్న మతాలు, ఆచారాలు, సంప్రదాయాలు సమ్మిళితమైన మన భారతీయ సమాజంలో ఇది సాధ్యమేనా? ప్రజలంతా ఒకేరకంగా ఆలోచించాలనే ధోరణులు సైతం అక్కడక్కడా చూస్తున్నాం. ఇవన్నీ ప్రజాస్వామిక దేశంలో ఆందోళనకరమైన పోకడలే. ఈ నేపథ్యంలోనే వస్తోన్న ఈ జమిలి ఎన్నికల ప్రతిపాదన ఆందోళన కలిగించేదే. మరీ ముఖ్యంగా నిర్దిష్ట కాలపరిమితి అనే పదాలు మరింత చేటు కలిగించేవే. రాజ్యాంగం ప్రకారం చట్టసభల పదవీకాలం ఐదేళ్ల గడువుకన్నా ముందే మధ్యంతర ఎన్నికలు జరిపేందుకు రెండు సభలకూ చట్టబద్ధమైన హక్కు ఉంది. ఈ వెసులుబాటును హరించి నిర్దిష్ట తేదీల్లోనే ఎన్నికలు జరపాలనడం రాజ్యాంగాన్ని ఉల్లంఘించడం, వక్రీకరించడమే. ఈ కొత్త ప్రతిపాదన వల్ల కేంద్రంలో లేదా ఏదైనా రాష్ట్రంలో పాలక పార్టీ మెజార్టీ కోల్పోతే, తిరిగి ఎన్నికలు జరపడానికి వీలుండదు. గడువు ముగిసే వరకూ అక్కడ రాష్ట్రపతి పాలనే కొనసాగించాలి. ఇది అప్రజాస్వామికం. ఇప్పుడు జమిలి ఎన్నికలు నిర్వహించాలనుకుంటే పశ్చిమబెంగాల్, తమిళనాడు తదితర రాష్ట్రాల శాసనసభలను ముందుగానే రద్దుచేయాల్సి ఉంటుంది. నిరుడు ఎన్నికలు నిర్వహించిన ఉత్తరప్రదేశ్, ఇటీవలే ఎన్నికైన గుజరాత్, హిమాచల్ ప్రదేశ్ శాసనసభల్ని కూడా రద్దుచేయాలి. ఇది ప్రజా తీర్పును ధిక్కరించడమే. దేశంలో 29 రాష్ట్రాలు, ఏడు కేంద్రపాలిత ప్రాంతాలుండగా... ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, అరుణాచల్‌ప్రదేశ్, ఒడిశా, సిక్కింలలో జమిలి ఎన్నికలు జరుగుతాయి. వాస్తవానికి ఖర్చు ఆదా, సమయం కలిసిరావడం వంటి అంశాలు వట్టి సాకులే. ప్రతిపక్షాలను దెబ్బతీయడమే దీని వెనుక దాగి ఉన్న అసలు కుట్ర. ప్రజాస్వామ్యం వర్థిల్లాలంటే బలమైన ప్రతిపక్షం ఉండాలి. కానీ ఇప్పుడు ప్రతిపక్షం లేకుండా ఉండాలనే ఆలోచనకు నేతలు రావడమే ఈ ప్రతిపాదనకు పునాది పడింది. కాంగ్రెస్ పార్టీ ఏకఛత్రాధిపత్యానికి గండి పడి ప్రాంతీయ పార్టీలు బలోపేతమైన 70వ దశకంలోనూ ఇందిరా గాంధీ అనుచరులు కూడా జమిలి ఎన్నికల వాదాన్ని ముందుకు తెచ్చారు. ఇప్పుడు మోడీ ఈ వాదనను బలంగా వినిపిస్తున్నారు. ప్రభంజన సిద్ధాంతమే ఈ వాదనకు కారణమనేది స్పష్టమవుతోంది. ఎన్నికల కాలంలో ఏదో ఒక ఉద్వేగపూరితమైన అంశంతో దేశవ్యాప్తంగా ఓటర్లను ఒకేమారు తన పక్షాన తిప్పేసుకోవచ్చుననే ఆలోచన కూడా దీని వెనుక దాగి ఉంది. ఒకేసారి ఎన్నికలవల్ల ఓటర్లు ఒకే పార్టీకి ఓటేసే అవకాశాలు 77 శాతం వరకూ ఉన్నాయని ఎన్నికల ఫలితాలను విశ్లేషించే నిపుణులు తేల్చిచెప్పారు. కొన్ని రాష్ట్రాల్లో బలమైన ప్రాంతీయ పార్టీలున్నాయి. ఏకకాలపు ఎన్నికల ద్వారా మోడీ హవాతో ఆ రాష్ట్రాల్లోకి జమిలి ఎన్నికల ద్వారానే చొరబడవచ్చని బీజేపీ భావన. బలహీనంగా ఉన్న కాంగ్రెస్‌ను చావుదెబ్బ తీయడం, బలంగా ఉన్న ప్రాంతీయ పార్టీలను బలహీనపరచడమే ఈ జమిలి దెబ్బగా బీజేపీ భావిస్తున్నది. అంతిమంగా రెండు పార్టీల వ్యవస్థకు పరిమితం చేయాలన్నది కూడా బీజేపీ యోచన. నిజానికి వేర్వేరుగా ఎన్నికలు జరగడం వల్ల పాలకుల్లో జవాబుదారీతనం పెరుగుతుంది. దేశంలో వివిధ అసెంబ్లీల కాలపరిమితులు వేర్వేరుగా ఉండటం, లోక్‌సభ ఎన్నికలతో పొంతన లేకపోవడం తొలి సార్వత్రిక ఎన్నికల తర్వాత కొద్దికాలానికే మొదలైంది. 1951-52లో లోక్‌సభకూ, అసెంబ్లీలకూ జమిలి ఎన్నికలు జరగ్గా... ట్రావెన్‌కూర్ కొచ్చిన్, పటియాలా తూర్పు పంజాబ్ స్టేట్స్ యూనియన్ (పీఈపీఎస్‌యూ)లు కేరళ, పంజాబ్‌లుగా ఆవిర్భవించడం, ఆ రాష్ట్రాల్లో కొత్తగా అధికారం లోకొచ్చినవారు మెజారిటీ కోల్పోవడం వంటి పరిణామాలతో అక్కడి అసెంబ్లీలకు 1954లో మధ్యంతర ఎన్నికలు తప్పలేదు. అప్పుడు కేరళలో అధికారంలోకొచ్చిన కాంగ్రెస్ చీలిపోవడంతో ఆ ప్రభుత్వమూ 1956లో పడిపోయింది. 1957లో జరిగిన సార్వత్రిక ఎన్నికలతోపాటు కేరళ అసెంబ్లీకి కూడా ఎన్నికలు జరగ్గా ఆ ఎన్నికల్లో దేశంలోనే తొలిసారి కమ్యూనిస్టులు అధికారంలో కొచ్చారు. 1959లో నెహ్రూ ప్రభుత్వం ఆ సర్కారును రద్దుచేయడంతో ఆ మరుసటి ఏడాది మధ్యంతర ఎన్నిక లొచ్చాయి. 1962లో మూడో సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. అంతకుముందు సంవత్సరం ఒరిస్సాలో ప్రభుత్వం కుప్పకూలి అక్కడ అసెంబ్లీ ఎన్నికలు తప్పలేదు. 1967 తర్వాత తరచు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు పడిపోవడం, ఎన్నికలు రావడం ఒక ధోరణిగా మారింది. 1969లో కాంగ్రెస్ నిట్టనిలువుగా చీలిపోవడం వల్ల లోక్‌సభకే మధ్యంతర ఎన్నికలు తప్పలేదు. కాబట్టి ప్రజాస్వామ్యాన్ని, ఎన్నికలను అపహాస్యనకు గురిచేసే ఫిరాయింపుల దుష్ట సంప్రదాయానికి తెరవేసేందుకు ఎటువంటి చర్యలు తీసుకోవాలనేది చర్చించడం, ఒక నిర్ణయానికి రావడంపై దృష్టిపెట్టాలి. దాన్ని వదిలేసి రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా జమిలి ఎన్నికల ప్రతిపాదనలు తీసుకురావడం, దానిపై చర్చించడం అర్థరహితం. దేశంలోని, విదేశాల్లోని బ్లాక్ మనీ బయటపెట్టలేని ప్రభుత్వం ప్రజాధనం వ్యయాన్ని తగ్గించడం కోసమే జమిలి ఎన్నికల విధానమని చెప్పడం విశ్వసనీయతకు అందని ప్రశ్న. కాబట్టి ఈ అంశంపై రాజకీయ ఏకాభిప్రాయం సాధ్యమా కాదా అన్నదానికన్నా ఆయా పార్టీల గెలుపోటముల లెక్కల ఆధారంగా దాన్ని ఆమోదించడమో, తిరస్కరించడమో ఉంటుంది. కానీ ప్రజాస్వామ్య సౌధానికి మూలస్తంభంగా పరిగణించే ఎన్నికల ప్రక్రియను కాలా పహరణంగా చూడడం, వ్యయం కింద కుదించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికీ, రాజ్యాంగ ఆశయాలకు, ఫెడరల్ భావనకు, ముఖ్యంగా ప్రజాశ్రేయస్సుకు పూర్తి విరుద్ధమని చెప్పకతప్పదు.

చురక

మనదేశం సంపన్నం
మరువలేని సత్యం
పేదరికం ప్రజల్లో
పొడుస్తుంది నిత్యం

చీమల్లా పోగేసిన
శ్రమజీవుల సంపద
దోచుకొనే వారిచెంత
దౌడుతీస్తే మంచిదా

– వేల్పుల నారాయణ

పెట్టుబడిదారీ అభివృద్ధి విధానం మాయలో భారత్



పి.జనార్ధనరావు

రెండవ ప్రపంచ యుద్ధం ముగిసిన తరువాత బ్రిటన్, ఫ్రాన్స్, హాలెండ్, బెల్జియం, స్పెయిన్, పోర్చుగల్, జపాన్, ఇటలీలు తమ వలస రాజ్యాలను పోగొట్టుకున్నాయి. శతాబ్దాల పర్యంతం ఆయా రాజ్యాల వనరులను కొల్లగొట్టి బల పడ్డాయి. యుద్ధం వల్ల ఆర్థిక పారిశ్రామిక వ్యవస్థలు కుప్పకూలాయి. ఆర్థికంగాను, రాజకీయంగాను అమెరికా బలపడింది. సామ్రాజ్యవాద దేశాల్లో ఆర్థిక, పారిశ్రామిక వ్యవస్థల పునరుద్ధర ణకు అమెరికా విస్తారంగా తోడ్పడింది. వాటి పెత్తనం అమెరికా చేపట్టింది. వలసలను, అక్కడ వనరులను పోగొట్టుకున్న దేశాలు పెట్టుబడిదారీ అభివృద్ధి విధానం చేపట్టి క్రమంగా నష్టాలు పూడ్చుకున్నాయి. పారిశ్రామికంగా బలపడ్డాయి. వారి చేతుల్లో అపారంగా సంపద పోగైంది. సాంకేతికంగా బలపడి నూతన ఆవిష్కరణలు వచ్చాయి. నూతనంగా స్వాతంత్ర్యం పొందిన దేశాలు అభివృద్ధి చెందటానికి కృషి ప్రారంభమైంది. కాని ఆ దేశాలకు ఆర్థిక బలం, సాంకేతిక నిపుణులు లేరు. మానవ వనరులు పుష్కలంగా వున్నాయి. నైపుణ్యం వర్క్‌ఫోర్స్ కాదు. పేదరికం, మాల్‌న్యూట్రిషన్, నిరక్షరాస్యత అధికంగా వున్నాయి. తమ దగ్గర వున్న సంపదను ఇనుప ఖనిజం, రాగి, బొగ్గు, బంగారం, వజ్రాలు వగైరా గనుల నుండి వెలికితీసి వినియోగించే సామర్థ్యం లేదు. పెట్టుబడులకు సామ్రాజ్యవాద దేశాలవైపు చూశాయి.

అమెరికా నాయకత్వాన ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ మానిటరీ ఫండ్ (ఐఎంఎఫ్) ఏర్పడ్డాయి. ఈ రెండు సంస్థల ద్వారా అభివృద్ధి చెందటానికి పూనుకున్న దేశాలకు ఆర్థికం చేకూర్చటం ప్రారంభమయ్యింది. అయితే కొన్ని షరతులు విధించింది. ప్రభుత్వ రంగం వుండకూడదు. ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించాలి. సంక్షేమ పథకాలు వుండకూడదు. ఆయా దేశాల్లో పంటలకు, ఆహారం అందజేయటంలో సబ్సిడీలు ఉంటే అవి తగ్గించాలి. వ్యాపారానికి పెట్టుబడులుంచటానికి, పోటీచేయటానికి విదేశీ వ్యాపార, పారిశ్రామిక సంస్థలను, విదేశీ ద్రవ్య పెట్టుబడులకు అవకాశం కల్పించాలి. పంటలకు కనీస ధరలను ఏర్పరచకూడదు. ప్రభుత్వాలు ధాన్యం గాని, ఇతర పంటలను సేకరించరాదు. చట్టాలను సవరించాలి. కార్మికవర్గంపై కఠిన నిబంధనలుండాలి. బహుళ జాతి ద్రవ్య పెట్టుబడులు రావడానికి గాని, వెనక్కి వెళ్ళటానికి గాని ఆంక్షలుండకూడదు. తమ పెట్టుబడులపై వచ్చే లాభాలపై దేశీయంగా పన్నులు విధించరాదు. స్వేచ్ఛగా తరలించు కోవచ్చు. పెట్టుబడిదారులే ప్రింటు మీడియాను, ఎలక్ట్రానిక్ మీడియాను అదుపు చేస్తున్నారు. వాటి ద్వారా పెట్టుబడిదారీ అభివృద్ధి విధాన ప్రయోజనాలను విస్తృతంగా ప్రచారం చేస్తూ ఆయా దేశాల్లో సంపన్న వర్గాలను మధ్యాదాయ వర్గాలను ఆకర్షిస్తారు. ప్రపంచం నేడు అనుభవిస్తున్న టెక్నలాజికల్ అభివృద్ధికి కారణం పెట్టుబడిదారీ అభివృద్ధి విధానం సాధించిం దేనని చెపుతారు. కాని సాంకేతిక అభివృద్ధికి యజమానులు బహుళజాతి ద్రవ్యపెట్టుబడిదారులని, లాభాలు, సృష్టించిన సంపదలో అత్యధిక శాతం వారే సొంతం చేసుకోవటం మరువకూడదు.

ప్రతి సంవత్సరం ఆర్థికవేత్తలు, పాలకవర్గ ప్రముఖులు, రాజకీయ నాయకులు, సంపన్నవర్గాలు స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జనవరిలో సమావేశమవుతారు. ప్రపంచ సంఘటనలను సమీక్షిస్తారు. సృష్టించే సంపదను మరింతగా వ్యక్తుల వద్ద పోగుపడే విధానాలను చర్చిస్తారు. ప్రమాద పరిస్థితులు ఏర్పడితే ఎలా అధిగమించవచ్చో కార్యాచరణ రూపొందిస్తారు. పెట్టుబడిదారీ అభివృద్ధి విధానం ప్రధాన లక్ష్యం వ్యక్తులు అభివృద్ధి చెందడం, సృష్టించబడిన సంపదను వ్యక్తులు సంపన్నులవటానికి తోడ్పడతారు. 2017 దావోస్ సమావేశానికి ఆక్స్‌ఫామ్ సంస్థ నివేదికను రూపొందించింది. ఆ నివేదిక వెల్లడించిన అంశాలు పెట్టుబడిదారీ అభివృద్ధి విధానం డొల్లతనాన్ని వెల్లడించటం జరిగింది. 1) సంపన్న వర్గాలు, పేద వర్గాల మధ్య అంతరం రోజురోజుకీ పెరుగుతుంది. 2) సృష్టించబడిన సంపద అసమానంగా పంపిణీ జరగటం వల్ల ప్రపంచ వ్యాప్తంగా ఆందోళనలు పెరుగుతున్నాయి. అందువల్ల పెట్టుబడిదారీ విధానాభివృద్ధికి ప్రమాదం. 3) నియోలిబరల్ పెట్టుబడిదారీ ఆర్థిక విధానాల ఫలితాలు – బ్రిటన్‌లో బ్రెగ్జిట్, అమెరికాలో డొనాల్డ్ ట్రంప్ ఎన్నిక, యూరప్‌లో మితవాదులు ఎన్నికవటం. అభివృద్ధి నిరోధక విధానాలు ఆచరించటం 4) ప్రపంచ వ్యాప్తంగా అసమానతలు పెరుగుతున్న పెట్టుబడిదారీ దేశాల్లో మరింతగా పెరగటం ఆందోళనకరం.

ప్రపంచ పేదలకు చెందిన సంపదలో 50 శాతం 8 మంది బిలియనీర్ల వద్ద పోగుపడింది. 2) 2015 నుండి ప్రపంచంలోని ఒక్కశాతం సంపన్నుల వద్దకు చేరిన సంపద మిగిలిన ప్రపంచం వద్దగల సంపదకు సమానం. 3) గడచిన రెండు దశాబ్దాలలో 10 శాతం సంపన్నుల ఆదాయం. చైనా, ఇండోనేషియా, లావోస్, ఇండియా, బంగ్లాదేశ్, శ్రీలంకల్లో 15 శాతం కంటే అధికంగా పెరిగింది. పెట్టుబడిదారీ అభివృద్ధి విధానం చేపట్టిన ఏ ఒక్క దేశం అభివృద్ధి చెందలేదన్న ప్రచార బండారాన్ని నివేదిక బయట పెట్టింది. అసమానతలు పెరగటంపై హెచ్చరించింది. పెట్టుబడిదారీ అభివృద్ధి విధానం చేపట్టిన దేశాలు ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, రాజకీయ సమస్యలను పరిష్కరిస్తాయని చేసిన ప్రచారం తప్పుడుదని తెలిపింది. సృష్టించబడిన సంపద పంపిణీ జరగకపోతే ప్రపంచ వ్యాపితంగా ప్రజాందోళనను గురించి హెచ్చరించింది. ప్రపంచంలో మానవజాతి అనుభవించే దుస్థితి తొలగిపోతుందని చేసిన తప్పుడు ప్రచారం బట్టబయలైంది. ఫిబ్రవరి 2017లో వెల్త్ అనే సంస్థ వెల్లడి చేసిన అంశం ప్రపంచంలోని అత్యంత సంపన్నులు మొదట్లో వున్న 10 మంది సంపద 582 బిలియన్ డాలర్లు. 10 మందిలో 9 మంది అమెరికన్లు, ఒక్కరు స్పెయినుకు చెందిన వారు.

ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఆందోళన కలిగించే అంశాలుగా 1) ఆర్థిక అసమానతలు 2) ఉపాధి అవకాశాలు పెరగక పోవుట. సామాజికంగా అలజడులు పెరిగి ఉపాధులు లేక ప్రజలు వలసపోతున్నారు. ఇదండీ పెట్టుబడిదారీ అభివృద్ధి విధానం సృష్టించిన సమాజం. సంపదకొద్ది శాతం ప్రజల వద్ద ఎలా పోగైంది? పెట్టుబడిదారీ దేశాల ఆర్థిక వ్యవస్థలు 2008 నుండి సంక్షోభంలోపడ్డాయి. నేటికీ సంక్షోభం తగ్గలేదు. సంక్షోభం అభివృద్ధి చెందుతున్న భారత్‌లాంటి దేశాలకు విస్తరించి ఆ దేశాల అభివృద్ధిని మందగింప చేసింది. అమెరికా నుండి విస్తరించిన మాంద్య పరిస్థితులు బ్రిటన్, యూరోపియన్ యూనియన్, జపాన్ వగైరా దేశాలకు విస్తరించి కొనసాగుతున్నాయి. పతనమైన ఆర్థిక వ్యవస్థలను పునరుద్ధరింప జేయుటకు ఆ దేశాల సెంట్రల్ బ్యాంకులు వడ్డీ రేట్లను కనీసంగా వుంచాయి. బిలియన్లాది డాలర్లను విడుదల చేశారు. ఉపాధులు తీవ్రంగా నష్టపోయాయి. పారిశ్రామిక ఉత్పత్తి కుంటుపడింది. దిగుమతులను తగ్గించుకున్నాయి. దివాళా తీసిన ఆర్థిక పారిశ్రామికా సంస్థలు పుంజుకోలేదు. కాని విడుదలైన సొమ్ము సంపన్నులు (తక్కువ వడ్డీ రేట్ల వల్ల) అప్పు తీసుకొని అంతర్జాతీయ ద్రవ్యపెట్టుబడిదారులయ్యారు. వారు అలాగే పెరిగి సొంత దేశాల్లో తమ పెట్టుబడులుంచక అభివృద్ధి చెందుతున్న నూతన స్వతంత్ర దేశాల్లోకి మళ్లించారు. అలా భారతదేశం, బ్రెజిల్, దక్షిణాఫ్రికా, చైనా వగైరా దేశాల్లోకి తమ ద్రవ్యపెట్టుబడులు తరలించారు. ఆయా దేశాలు తమ మార్కెట్లను పూర్తిగా ద్రవ్యపెట్టుబడులు తెరిచారు. ఆయా దేశాలు సంక్షేమ రాజ్యభావనను వెనక్కి బెట్టి విదేశీ సంస్థాగత మదుపరులు, స్టాక్ మార్కెట్లో పెట్టుబడులుంచటానికి, ప్రత్యక్ష పెట్టుబడులను బ్యాంకులు ఇన్సూరెన్స్, రియల్ ఎస్టేట్ ప్రభుత్వ రంగ సంస్థల్లో వాటాలు కొనటానికి అక్కడి నుండి అపారంగా లాభాలు సంపాదించి తమ దేశాలకు తరలించారు. బహుళజాతి ద్రవ్య పెట్టుబడిదారుల వద్ద అప్పు చేసి అభివృద్ధి సాధించాలనుకొన్న దేశాలేవీ అభివృద్ధి చెందలేదు. అప్పు మాత్రం పెరిగింది. అంతర్గత ఆర్థిక వ్యవస్థలు వృద్ధి ఏ విధంగా సాధించాలో తెలియని స్థితి. ఉపాధి అవకాశాలు పెంచలేని స్థితి ఏర్పడింది.

పెట్టుబడిదారీ దేశాల సామాజిక వ్యవస్థలు జాతీయ ద్రవ్యపెట్టుబడి సంస్థల కనుసన్నల్లో నడుస్తున్నాయి. దేశీయమైన ఉత్పాదక సంస్థలను నిర్వీర్యపరుస్తున్నారు. చిన్న, మధ్య స్థాయి ఉత్పత్తి సంస్థలను మూసివేయించారు. ఉదా॥ వ్యవసాయం, పరిశ్రమలు, సేవల రంగాలను సబ్‌కాంట్రాక్టర్లుగా చేశారు. అలాగే ఆయా దేశాల రాజకీయ వ్యవస్థలను నిర్వహిస్తున్నారు. సంపద కేంద్రీకరణ వల్ల ఏర్పడిన గుత్త సంస్థలు (మోనోపలీస్) ప్రపంచం పైన నయా ఉదారవాదం ద్వారా ఆధిపత్య సాధించారు. నాయకత్వం అమెరికాది. ప్రపంచ వ్యాప్తంగా విస్తరించి తమ దగ్గర పోగైన ద్రవ్యాన్ని పెట్టుబడిగా పెడుతూ లాభాలా ర్జిస్తున్న వారిలో అత్యధికులు అమెరికన్లు. తమ దేశాల్లో మాంద్య పరిస్థితులు కొనసాగి అత్యధిక ప్రజానీకం ఉపాధి లేక, వినిమయ శక్తి కోల్పోయి దుర్భర దారిద్ర్యం అనుభవిస్తుంటే తోడ్పడరు. భారతదేశ అతిపెద్ద మార్కెట్లో ప్రవేశించి లాభాలు ఆర్జించడానికి అవకాశం కల్పించుకొని ఐఎంఎఫ్ షరతులను ఆమోదింపచేసుకొని ప్రవేశించారు. భారతపాలకులు వేగంగా అభివృద్ధి సాధించదలచి గ్లోబల్ ద్రవ్యపెట్టుబడిదారులకు బ్రహ్మరథం పట్టారు. వృద్ధి సాధించారు గాని అభివృద్ధి సాధించలేదు. పెరిగిన సంపదలో అత్యధికశాతం కొద్దిమందిని బిలియనీర్లుగా చేసింది. ఆక్స్‌ఫామ్ సంస్థ ప్రకారం దేశంలో మొత్తం సంపద 3.1 ట్రిలియన్ డాలర్లు. అందులో 84 మంది బిలియనీర్లు సంపద రూ. 16.6 లక్షల కోట్లు పొందారు. దేశంలోని ప్రకృతి వనరులపై పెత్తనం సాధించారు. ప్రపంచీ కరణ ప్రయోజనాలు సాధించి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏర్పడలేదు. వృద్ధి సాధించే కృషిలో ఉపాధులు పెంచలేదు. ఉత్పాదక రంగాలు వ్యవసాయం, మాన్యుఫ్యాక్చరింగ్, ఎం.జె. ఎం.ఈ.ఎస్‌లు స్తంభించి వున్నాయి. పేదరికం, మాల్‌న్యూట్రిషన్, నిరక్షరాస్యత తగ్గించలేదు. వినిమయ శక్తి తగ్గింది.

తలసరి ఆదాయం. స్విట్జర్లాండ్ – 537600 డాలర్లు, ఆస్ట్రేలియా–402600 డాలర్లు, అమెరికా 388000 డాలర్లు, ఇండియా (2015-16లో) 77431 రూపాయలు. మోడీ ఎన్నికల సమయంలో చేసిన వాగ్దానాలను నమ్మి వివిధ వర్గాల ప్రజలు గెలిపించారు. కానీ గడచిన నాలుగు సంవత్సరాల్లో బాధిత ప్రజలకు చేసిన ఏ ఒక్క వాగ్దానం నెరవేర్చ ప్రయత్నించలేదు. సరిగదా ప్రజల జీవన నాణ్యత దిగజారింది. నిబద్ధత సంపన్నులకు తోడ్పాటు అందుటలో చూపించాడు. నయా ఉదారవాద ప్రతిపాదనలు అమలు చేయటానికి చూస్తున్నారు. పరిపాలన వదలి ఎన్నికల్లో గెలుపే ఏకైక లక్ష్యంగా కృషి చేస్తున్నాడు. ఆరెస్సెస్ ఆదేశాలు పాటిస్తూ ప్రైవేటీకరణ, రామమందిరం, ఆర్టికల్ 370, కామన్ సివిల్ కోడ్‌కు దారులు ఏర్పరస్తున్నారు. సామాజికంగా అస్థిరపరచే చర్యలు చేపడుతున్నారు. రాజ్యాంగాన్ని మార్చే చర్యలు ప్రారంభిస్తున్నారు. అసత్యాలు, అర్ధ సత్యాలు, తన ఎన్నికల ప్రచారంలో ప్రకటించి గెలుపునకు ప్రయత్నిస్తున్నారు. అమలు చేయటానికి పూనుకొన్న సంస్కరణలు దేశ పటిష్టతకు, సమగ్ర అభివృద్ధిని నష్టపెడుతున్నారు. అను చరుల ఆగడాలను అదుపు చేసే ప్రయత్నాలు లేవు. వాగ్దానాల గాలి మేడలు కడుతున్నారు. మోడీ పాలన నిజస్వరూపం గమనించి దేశాన్ని ప్రమాదం నుండి కాపాడాలి.

వ్యాస రచయిత : విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు, విజయవాడ

వి-మెయిల్

జీఎస్‌టీలో తగ్గింపు వెనక కుట్ర

నోట్ల రద్దు, జీఎస్‌టీ తో రాష్ట్రాలకు ఆదాయం ఎంతో తగ్గిపోయింది.జీఎస్‌టీ అమలు పెట్రోలుకి అమలు జరపటం లేదు. లాభం వచ్చే పెట్రోలు మీద అమలు చేయకుండా రాష్ట్రాలకు తగు ఆర్థిక సౌకర్యం లేకుండా చేస్తున్నారు.

తిరిగి జీఎస్‌టీలో మార్పులు బలహీన ప్రాంతాలకు ప్రపంచబ్యాంకు లావాదేవీలకు తేలికగా అనుకూలంగా వుండేటట్లు చేయవచ్చునని కేంద్ర ఫైనాన్స్ మినిష్టర్ జైట్లీ అంటున్నారు. ఇప్పటికే జీఎస్‌టీ వచ్చిన తరువాత రాష్ట్రాల ఆదాయం తగ్గిపోయింది. ఆ విధంగా ఒక ప్రక్క రాష్ట్రాల ఆదాయాన్ని దెబ్బకొట్టటం, వారిని కంట్రోల్‌లో పెట్టుకోవలన్న కృషి గమనించవచ్చు. జీఎస్‌టీ కౌన్సిల్ 200 వస్తువులకి లోగడ తగ్గించిందని తగ్గిస్తే బడ్జెట్ లోపల తగ్గిస్తే (7%) ముందు ముందూ ఆదాయం పెరుగుతుందని అంటున్నారు. డిసెంబరులో 86, 703 కోట్లు జీఎస్‌టీ వచ్చిందని ఆవిధంగా టాక్స్‌లో మార్పిడి చేయటం వలన చాలామందికి సులువు అయిందని జీఎస్‌టీ ప్రవేశపెట్టినప్పుడు నిరాశజనకంగా వున్న వ్యాపార లావాదేవీలు బాగుపడ్డాయని జైట్లీ అన్నారు.

నోట్ల మార్పిడి వలన జీఎస్‌టీ లో చేయబోయే మార్పుల వలన (బడ్జెట్ ముందు) ఆదాయం పెరుగుతుందని , వరల్డ్ బ్యాంక్ లావాదేవీలలో పై వర్గం వారికి తేలికగా వుంటుం దని, ప్రపంచంలో ఇండియా ర్యాంక్ పెరుగుతుందని ఫైనాన్స్ సెక్రెటరీ తెలియజేశారు. అందువలన సుమారు100 వ్యాపారాలపై వరల్డ్ బ్యాంక్ లావాదేవీలలో సౌకర్యం కలుగుతుందని ఈ సంవత్సరంలో ఫైనాన్స్ రాకపోయిన 2 సం॥లో బాగుపడుతుందన్నారు. రాష్ట్రాల వాటాలు ఎంత పెరుగుతుందో వివరించలేదు. కనుక రాష్ట్రాలకు నష్టం రావొచ్చు.

– సత్యనారాయణ, విజయవాడ

ముమ్మారు తలాక్‌పై బీజేపీ వేగిరపాటుకు కారణమేమిటి?

విశ్వనాథ్ వై.

బహుళత్వమే భారత్ విశిష్టత. దీని పరిరక్షణ ప్రధాన లక్ష్యంగా నాటి దార్శనికులు ఎంతో దూరదృష్టితో రాజ్యాంగ రచన గావించారు రాజ్యాంగానికి అనుగుణంగా పాలన సాగించడం అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాల విధి. రాజ్యాంగంలో పొందుపరిచిన పౌరుల ప్రాథమిక హక్కులు సహా మత స్వేచ్ఛకూ నిర్దిష్ట నిర్వచనాలున్నాయి. మత విశ్వాసాలు, ఆచారాలకు భంగం వాటిల్లకుండా ఆయా మతాల అంతర్గత సామరస్యత, మతాల మధ్య సమరసత భావాలు పరిఢవిల్లాలన్న మౌలిక లక్ష్యాన్ని, పరిధినీ రాజ్యాంగ నిర్మాతలు నిర్దేశించారు. దేశ విభజనానంతర పరిస్థితులు ప్రమాణికంగా ముస్లిం సమాజానికి ఉద్దేశించి ముస్లిం వైయక్తిక చట్టం (ముస్లిం పర్సనల్ లా)కు రాజ్యాంగ రక్షణ ఛత్రం కల్పించారు. ఇపుడు అందరి నోళ్లలో నానుతున్న, ముస్లిం సమాజాన్ని ఆందోళనకు గురి చేస్తున్న తక్షణ ముమ్మారు తలాక్ (తలాక్ ఏ బిద్దత్), తలాక్ అంశం కూడా ఈ ముస్లిం వైయక్తిక చట్టంలోని అంతర్భాగమే.

నేరుగా ముస్లిం వైయక్తిక చట్టాన్ని తాకజాలని పరిస్థితి, మార్చాలని పరిస్థితి ఉంది. ముస్లింలను ఈ దేశ పౌరులుగా చూసేందుకు మనసొప్పని పాలక పక్షం బీజేపీ, దాని సైద్ధాంతిక వేదికయిన ఆరెస్సెస్‌లు పక్కా పన్నాగంతో ముస్లిం మహిళల హక్కుల రక్షణ వాదనతో తక్షణ ముమ్మారు తలాక్ అంశాన్ని చట్ట బద్ధం చేయాలని ఉవ్విళ్లూరుతున్నాయి. ముమ్మారు తలాక్ ఏరూపంలో చేరవేసినా నేరపూరిత చర్యగా (క్రిమినల్ నేరం) పరిగణించి సదరు పురుషునికి మూడేళ్ల జైలు శిక్ష విధించాలన్నది బిల్లు సారాంశంగా బీజేపీ ప్రభుత్వం చెబుతోంది. ఈ బిల్లుపై ముస్లిం సమాజంలోని కొన్ని పక్షాలు అర్నెల్ల క్రితం సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. దీనిపై విచారణ జరిపిన ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం 3:2 ఆధిక్య తీర్పును వెలువరించింది. ఈ తీర్పు ప్రకారం ఆరు నెలల్లోగా తలాక్‌పై చట్టం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది.

ఈ ఆదేశాలనే ఇపుడు అమలు జరుపుతున్నామన్న కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిత బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టడం ఆమోదం పొందడం జరిగింది. తగినంత సంఖ్యాబలం ఉండటంతో లోక్‌సభ గడప దాటిన ఈ బిల్లుకు రాజ్యసభ ఆమోదం లభించాలంటే ప్రతిపక్ష కాంగ్రెస్ మద్దతు అనివార్యం. అందుకే కాంగ్రెస్ సహా ఇతర రాజకీయపక్షాలను బతిమిలాడేందుకు బీజేపీ సిద్ధపడుతోంది. బిల్లులోని అంశాలపై చాలినంత స్పష్టత లేనందున చర్చ జరపాలని దాదాపుగా అన్ని పక్షాలూ పట్టుపడుతున్నాయి.. వాస్తవానికి లోక్‌సభలోనే కాంగ్రెస్ బిల్లును వ్యతిరేకించి ఉండాల్సిందని పలువురి వాదనగా ఉంది. ఈ బిల్లును పరిశీలన నిమిత్తం సెలక్ట్ కమిటీకి పంపాలని రాజ్యసభలో కాంగ్రెస్ సహా ఇతర విపక్షాలు గట్టిగా పట్టుపట్టాయి. 2018 బడ్జెట్ సమావేశాలకు ముందు జరిగిన అఖిలపక్ష భేటీలోనూ ప్రధాని నరేంద్రమోడీ ఇదే బిల్లు విషయమై ఆసక్తి వ్యక్తీకరించారు. బడ్జెట్ సమావేశాల్లోనే ఈబిల్లు ఆమోదం పొందేందుకు తాము చేయవలసిన అన్ని ప్రయత్నాలూ చేయగలమన్న మోడీ మాటల్లోనే బీజేపీ పాలకుల తొందరపాటు బహిర్గతమవుతోంది. ఈ విష యంలో అఖిల భారత ముస్లిం పర్సనల్ లా బోర్డ్ (ఏఐఎంపీ ఎల్‌బీ) చాలా ఆందోళన చెందుతోంది. రాజ్యసభలో బిల్లు ఆమోద ప్రక్రియను నిలువరించాల్సిందిగా ఎన్డీయే కూటమిలోని కొన్ని రాజకీయ పక్షాలనూ, ప్రతిపక్షాలనూ కలిసి విజ్ఞప్తి చేసినట్లు ఏఐఎంపీబీ అధికార ప్రతినిధి జఫర్యాబ్ జిలానీ పేర్కొన్నారు. తెలుగుదేశం, ఏఐఏడీఎంకే, డీఎంకే,టీఎంసీ, బీఎస్పీలతో సంప్రదింపులు జరిపినట్లు ఆయన తెలిపారు. ఫిబ్రవరి 10న హైదరాబాద్‌లో జరగనున్న బోర్డు రెండు రోజుల సమావేశంలో బిల్లు విషయమై అనుసరించాల్సిన భ విష్యత్తు కార్యాచరణను రూపొందిస్తామని ఆయన వివరించారు.

గతంలో, ఇదే అంశంపై సైరా బానో కేసులో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు ప్రస్తావనార్హం. తలాక్ అనే ఆచారం రాజ్యాంగ వ్యతిరేకమన్న సుప్రీంకోర్టు తీర్పును అనేక వర్గాలు స్వాగతించాయి. లింగ సమానత సాధించే క్రమంలో సంస్థాగత అవరోధాల తొలిగింపునకు జరిపే పోరులో విజయంగా, ముస్లిం మహిళల సాధికారతకు ఉపకరించే పురోగమన అడుగుగా అభినందించారు. ఇందుకు భిన్నంగా లింగ సమానత సాధన లక్ష్యంగా సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పును వక్రీకరించ జూస్తున్న బీజేపీ ప్రయత్నం గమనిస్తే –పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీల తరహాలోనే వెల్లడించని–అంతర్గత లక్ష్యాల సాధనకు పడుతున్న తంటాలుగా అనిపించకమానదు. కోర్టు తీర్పును అమలు పరుస్తున్నానంటూ స్వీయ ప్రయోజనాలు నెరవేర్చుకోవడానికి బీజేపీ ప్రయత్ని స్తోందన్న అభిప్రాయమూ వ్యక్తమవుతోంది. ఇందులో మహిళ పోషణ, సంరక్షణ వంటి కీలకాంశాలను మాట మాత్రంగానైనా ప్రస్తావించకపోవడమే ఇందుకు కారణంగా చెప్పాలి. ఈరెండు కీలకాంశాలను విస్మరించి కేవలం పురుష దండనకు మాత్రమే పరిమితమయ్యే చట్టం అమలు ముస్లిం సమాజ భద్రతకు ఎంత వరకు దోహద పడుతుందనేదీ సందేహాస్పదమే.

ఒకసారి సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పును పరిశీలిద్దాం. 3:2 ఆధిక్యంతో వెలువడిన తీర్పులో తలాక్ అనేది రాజ్యాంగ అధికరణం 14ను ఉల్లంఘించడమేనని ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనంలోని న్యాయమూర్తులు జస్టిస్ నారిమన్, జస్టిస్ లలిత్‌లు స్పష్టం చేశారు. ఖురాన్‌లో ఏదైతే చెడుగా ఉందో అది షరియత్‌లోనూ మంచిగా ఉండజాలదని మరో న్యాయమూర్తి జస్టిస్ జోసెఫ్ వ్యాఖ్యానించారు. ముస్లిం వైయక్తికచట్టంలో అంతర్భాగమైన తలాక్‌ను న్యాయపరంగా పున:సమీక్ష జరపడం అసాధ్యమని మైనారిటీ ధర్మాసనం స్పష్టం చేసింది. ఇక్కడ గమనించాల్సిన ముఖ్యమైన అంశం ఏమిటంటే ధర్మాసనంలోని మెజారిటీ, మైనారిటీ అభిప్రాయాలు వ్యక్తీకరించిన న్యాయమూర్తులు ఎవరూ కూడా ముమ్మారు తలాక్‌ను నేరగ్రస్థం (క్రిమినలైజేషన్) చేయాలని ప్రత్యక్షంగా కానీ పరోక్షంగా కానీ కనీసం సూచించను కూడా సూచించలేదు. అలాంటిది సుప్రీం కోర్టు తీర్పు ప్రాతిపదికగానే తాము చట్టం చేయబూనుతున్నామన్న బీజేపీ ప్రభుత్వం మాటల విశ్వసనీయత అనుమానాస్పదంగా ఉంది. ఇలా చేయబూనడం సుప్రీంకోర్టు తీర్పునకు దూరం జరగడమే కదా? రెండవది, ముమ్మారు తలాక్ చట్టవ్యతిరేకమన్న బిల్లులోని పునరద్ఘాటన. ఇది గతంలోనే సుప్రీంకోర్టు స్పష్టం చేసిన అంశం. రాజ్యాంగ అధికరణం 141, 142 ప్రకారం దేశ వ్యాపితంగా ఉన్న అన్ని న్యాయ, చట్ట పాలక సంస్థలూ ఈ తీర్పునకు కట్టుబడి వ్యవహరించి తీరాలి.

ఒక మత ఆచారంలోని సంప్రదాయాన్ని నేరంగా చట్టబద్ధం చేసేందుకు బీజేపీ పడుతున్న తంటాలు గమనిస్తే 2జీ కేసులో మాదిరిగా ఒక అవాస్తవాన్ని వాస్తవమని భ్రమింపజేసే బీజేపీ ప్రభుత్వ కుటిలయత్నం ద్యోతకమవుతుంది. విడాకులు పొందిన భార్యాభర్తలు జీవితకాలంలో కలుసుకునేందుకు వీల్లేదనీ ఈబిల్లు పేర్కొంటోంది. అంటే, జీవితకాలంలో వారు ఆ జన్మ శత్రువులుగానే మిగిలిపోవాలని అర్థమా? ముమ్మారు తలాక్ చెప్పినట్లు రుజువైతే జైలు జీవితం గడిపే భర్త కంటే అతని చర్య కారణంగా వేరు పడిన భార్య పరిస్థితి సమాజంలో మరింత దుర్భరంగా ఉంటుందనడంలో సందేహం లేదు. సదరు వివాహిత పోషణ , సంరక్షణ బాధ్యత ఎవరిదనే ప్రశ్నకు బిల్లు నుంచి స్పష్టత లభించడం లేదు. వివాహ బంధాన్ని పునరుద్ధరించుకునేందుకు అవకాశాలే మిగలకుండా చేస్తోందీ బిల్లు. భార్యభర్తలకు చెందిన రెండు కుటుంబాల మధ్యన సఖ్యత చెడిపోతుంది. అనుమానాలు, అవహేళనలతో ఒకరి నొకరు ద్వేషించుకునే మానసిక పరిస్థితికి ఈ దూరదృష్టి లోపించిన బిల్లు కారణమవుతుంది. రెండవది, మహిళలకు రక్షణ పేరిట ముస్లిం పురుషులను వేధింపులకు గురి చేయబోరనే హామీ లేకపోవడం గమనార్హం.

సుప్రీంకోర్టు తీర్పు వెలువరించినప్పటికీ దేశంలో అసంఖ్యాక ముస్లిం మహిళలు తలాక్ బాధితులుగా వేదన అనుభవిస్తున్నారన్న వాదనకు తగిన గణాంకాలను కేంద్ర ప్రభుత్వం వెల్లడించలేదు. కేంద్ర న్యాయమంత్రిత్వశాఖ బట్వాడా చేసే అరకొర సమాచారం ఆధారంగా సమస్య తీవ్రత, లోతు, పరిధి, బాధిత సమాజ స్థితిగతులు నిర్ధారణ చేయడం అసాధ్యం. ముమ్మారు తలాక్‌ను నేరగ్రస్థం చేయడం ద్వారా ముస్లిం వివాహ వ్యవస్థ, కుటుంబ వ్యవస్థలకు వాటిల్లే నష్టమే ఎక్కువని తేలుతోంది . ఏడు పదుల స్వతంత్ర భారతంలో మైనారిటీలుగా అణచి వేతలను ఇంకా ఎదుర్కొంటున్న ముస్లిం సమాజానికి ఈ బిల్లు ద్వారా ఒనగూరే ప్రయోజనం లేదనేది రాజకీయ, న్యాయనిపుణుల మనోగతంగా ఉంది. ముమ్మారు తలాక్ అని ఉచ్చరిస్తే చాలు సదరు వ్యక్తి నేరస్థుడని నిర్ధారించడానికి ఈబిల్లు చట్ట బద్ధ వెసులుబాటు కల్పించడం ఎంతటి దారుణం? విషాదకరం?

ఇటీవలి ఉత్తరప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో ముస్లింలకు బీజేపీ కనీసం ఒక్క స్థానం కూడా కేటాయించలేదు. రెండవది, అధికారంలోకి వచ్చిందే లగాయితు ముస్లిం విద్వేష చట్టాలు, చర్యలకు ఒడిగట్టే కాషాయ దళాలను నిరోధించే ప్రయత్నమూ చేయలేదు. యునెస్కో వారసత్వ సంపద జాబితాలో స్థానం దక్కిన తాజ్‌మహల్‌ను పర్యాటక జాబితా నుంచి తొలగించే యత్నానికి యూపీ బీజేపీ పాలకులు సాహసించారు. కొద్ది రోజుల క్రితం కర్నాటకలో కాలు మోపిన ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ నోటంట హనుమంతుడు పుట్టిన గడ్డ మీద టిప్పుసుల్తాన్ ఉత్సవాలా? అంటూ మత విద్వేషాలు రెచ్చగొట్టే పలుకులు వెలువడటం గమనార్హం. ఒక వంక వీలుచేసుకుని మరీ హిందుత్వ అజెండా అమలుకు ప్రయత్నాలు చేస్తూ మరో వంక సంక్షేమ, హక్కుల రక్షణ జపం జరిపే బీజేపీ–ఆరెస్సెస్ జోడీ ప్రమాదకర తీరు పట్ల పారాహుషార్!

విశాలాంధ్ర
బతుకు The Life
గురువారం
01 ఫిబ్రవరి 2018



చరఖా!

జాతిపిత మహాత్మాగాంధీ 70వ వర్ధంతి సందర్భంగా (జనవరి 30న) గుజరాత్ రాజధాని అహ్మదాబాద్‌లో కొచర ఆశ్రమంలో గుజరాత్ విద్యాపీఠం విద్యార్థులు, సేవకులు చరఖాతో నూలు వడుకుతున్న దృశ్యం.

జనం కోసమే ఆయన ఆరాటం !

సీ.ఎస్.రావు....విశాఖ నగరంలో సాధారణంగా ఈ పేరు తెలియనివారు ఉండరు. కారణం ప్రజా ప్రయోజన ఉద్యమాల్లో ఆయన అందరికంటే ముందుంటారు. ప్రజల తరపున తన స్వరం వినిపిస్తారు. నగర పౌరులకు ఇబ్బంది కలిగించే ఎలాంటి విషయాలనైనా ఆయన వ్యతిరేకిస్తారు. సమస్యల పరిష్కారం కోసం అధికారులకు అర్జీలు పెట్టడం నుంచి ఆందోళనలు చేయడం వరకూ అన్ని రకాల ప్రయత్నాలు చేస్తారు. దాని అంతు తేల్చేవరకూ అలుపెరగని పోరాటం చేస్తారు. ఇంత క్రియాశీలంగా పనిచేస్తున్నారంటే యువకుడేమో అనుకేనేరు కానేకాదు ఆయన వయస్సు అక్షరాలా 76 సంవత్సరాలు.
ఈ వయస్సులోనూ రాజీలేని పోరాటం సాగిస్తున్నారు. అందుకే ఆయన వెనక అన్ని సంఘాలు కదిలి వెళుతున్నాయి. ఆయనకు అండగా నిలబడుతున్నాయి.

సీఎస్.రావుగా అందరికీ చిరపరిచితులైన ఆయన పూర్తిపూరు చాగంటి సూర్యారావు. ఏడు పదుల వయస్సులోనూ, కనీసం నడవడానికి కాళ్ళు సహకరించని వృద్ధాప్యంలోనూ ఆయన ప్రజా సమస్యల మీద పోరాడుతున్నారు. ఊతకర్ర సాయంతోనే ముందడుగు వేస్తున్నారు. మొక్కవోని దీక్షతో అంతులేని పోరాటం చేస్తున్నారు.

ట్రాఫిక్ సిగ్నల్స్ సమస్య నుంచి పోర్టు కాలుష్యం వరకూ, ప్రత్యేక రైల్వేజోన్ నుంచి భూముల ఆక్రమణ వరకూ ఆయన స్పందించని సమస్య అంటూ ఏదీ లేదు. ఇంటి పన్నులు, నీటి పన్నులు పెంచినప్పుడల్లా పౌర సేవల సంఘం తరపున ఆయన పోరాడుతూనే ఉంటారు. ప్రజలను బాధించే ప్రభుత్వ చర్యలు, విధానాలపై వారికి అవగాహన కలిగిస్తారు. తద్వారా వారిలో చైతన్యం తీసుకురావడం ద్వారా తన వెంట ఆందోళనలో పాల్గొనేలా చేస్తారు. అపార్టుమెంట్ నివాసుల నుంచి సామాన్యుల వరకూ, వెల్‌ఫేర్ అసోసియేషన్‌ల నుంచి సాధారణ సంస్థల వరకూ అందరినీ కలుపుకుని పోరాటానికి దిగుతారు. ఈ ప్రయత్నమే, ఈ పద్ధతే అందరినీ ఆకట్టుకుంటోంది. ఆయనవైపు చూసేలా చేస్తోంది. ఈ కారణంగానే పౌర సంఘాలే కాదు అనేక ప్రజా సంఘాలు, వామపక్ష పార్టీలతో సహా అనేక రాజకీయ పార్టీలు, ఉద్యోగ, కార్మిక, విద్యార్థి సంఘాలు ఆయనకు మద్దతునిస్తున్నాయి. ఒక్కమాటలో చెప్పాలంటే విశాఖలో సీఎస్ రావు ఉద్యమం చేపట్టారంటే అధికారులు, అధికార పార్టీ రాజకీయ నాయకులకు దడే. సీఎస్ రావు చేసిన ఆందోళనలు, పోరాటాల కారణంగా దక్కిన ఫలితాలూ చాలానే ఉన్నాయి. అందులో ప్రధానంగా చెప్పుకోవలసిన విషయం నగరంలో ఉమెన్స్ కాలేజీ నిర్మాణం. ఈ భవనం ఏర్పాటు కోసం ఆయన చేసిన కృషి కీలకమైనది. ప్రత్యేక రైల్వే జోన్ కోసం ఇంకా పోరాడుతూనే ఉన్నారు. సముద్ర ప్రాంతానికి దగ్గరలో ఎక్కడా నిర్మాణాలు చేపట్టకుండా ఎప్పటికప్పుడు ఆందోళనలు, పోరాటాలతో అప్రమత్తం చేస్తున్నారు. భూముల ఆక్రమణకు వ్యతిరేకంగా ఆందోళన కొనసాగిస్తున్నారు. పర్యావరణం, ప్రజల జీవనాన్ని పాడుచేసే ప్రభుత్వ విధానాలపై తన వంతు పోరాటం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో విశాఖలో వామపక్ష పార్టీలతో, ప్రజాసంఘాలతో మమేకమై పనిచేస్తున్నారు.

సీఎస్‌రావు పోరాడి సాధించిన విజయాల్లో కీలకంగా చెప్పుకోవలసిన విషయం మరొకటి ఉంది. అదే సెంట్రల్ పార్క్ నిర్మాణం. తొలిసారిగా ఆయన దీనిమీద 2000 సంవత్సరంలో పోరాటం ప్రారంభించారు. విశాఖ నగరం నడిబొడ్డున ఉన్న పాత సెంట్రల్ జైలు స్థలాన్ని ప్రైవేటు సంస్థలకు ఇచ్చేందుకు అప్పటి ప్రభుత్వాలు చేసిన ప్రయత్నాలను ఆయన అడ్డుకున్నారు. ప్రజాస్పందన పేరిట నగర పౌరుడిగా దీనిపై కోర్టుకు వెళ్ళారు. ఈ స్థలాన్ని ప్రజా ప్రయోజనాలకే ఉపయోగించాలని, ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టరాదని కోర్టులోనూ తన స్వరాన్ని వినిపించారు. 400 భారీ వృక్షాలను కూల్చేసి మరీ ఈ స్థలాన్ని కార్పొరేట్ సంస్థ లకు కట్టబెడతారా అని నిలదీసి ప్రశ్నించారు. సీఎస్‌రావు పోరాట స్ఫూర్తి నగర ప్రజలనే కాదు వివిధ రాజకీయపార్టీలు, ప్రజాసంఘాలనూ ఆకట్టుకుంది. దీంతో ఆయన వెంట అందరూ కలిసి నడిచి ఉద్యమించారు. ఆ పోరాట ఫలితమే ఆ స్థలంలో నేడు సెంట్రల్ పార్కు నిర్మాణం జరిగింది. వృక్షాలు కూల్చకుండా దానినే పార్కుగా మలచడంలో సీఎస్ రావు కృషి అభినందనీయం. ఇలా చెప్పుకుంటూ పోతే ఆయన చేసిన పోరాటాలూ, సాధించిన విజయాలూ చాలానే ఉన్నాయి.

సీఎస్‌రావు మాదిరిగా ప్రతి పౌరుడు ఆలోచించగలిగితే, సమస్యల మీద పోరాటానికి దిగితే, అధికారులను నిలదీయగలిగితే మూడు వంతుల సమస్యలు పరిష్కారం అవుతాయనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఇలాంటి స్ఫూర్తి అందరిలోనూ రగలాల్సిన అవసరం ఎంతైనా ఉంది.





ప్రజల సమస్యలు, పౌరుల ఇబ్బందులపై ఇంతగా పోరాడుతున్న సీఎస్‌రావు కుటుంబ నేపథ్యం, చదువు, ఉద్యోగాల గురించీ కొంత తెలుసుకుందాం. విజయనగరం జిల్లా కొత్తవలస వద్ద కంటకాపల్లికి కిలోమీటరు దూరంలో నిడగట్టు అగ్రహారంలో జన్మించారు. తండ్రి వ్యవసాయదారుడు, తల్లి ఆయుర్వేద వైద్యురాలు. ఆనాడు గ్రామంలో పాఠశాల లేకపోవడంతో సీఎస్‌రావు 14వ ఏట వరకు బడిముఖమే చూడలేదు. 15వ ఏట ఫస్ట్ ఫారంలో చేరారు. ఆ వయస్సులో బడిలో అడుగుపెట్టిన అతన్ని చూసి అందరూ ఒక్కసారిగా నవ్వారు. ఫస్ట్‌ఫారంలో ఇంత పెద్దవాడా అన్నారు. దాంతో చిన్నబోయిన సీఎస్ చదువులో ఫస్ట్ రావాలని పట్టుదలతో చదివారు, అన్నింటిలో ఫస్ట్ వచ్చారు. విజయనగరం మహారాజా స్కూల్, కాలేజీలో చదువు పూర్తిచేశారు. ఆనాడు ఉన్న సంప్రదాయాల ప్రకారం 16వ ఏటే పెళ్ళి చేశారు. అయినా భార్యను కాపురానికి రానివ్వకుండా ఇంటర్ పూర్తి చేశారు. తర్వాత ఏయూ ఎకనామిక్స్ ఆనర్స్‌లో చేరారు. ఇంజనీరింగ్ చదవాలనుకున్నారు కానీ ఢిల్లీలో ప్లానింగ్ కమిషన్‌లో చేరాలన్న ఆశ చాలా బలంగా ఉండేది. మామూలు చదువులకే డబ్బులు లేని రోజుల్లో ఢిల్లీలో ప్లానింగ్ కమిషన్‌లో సీటు సంపాదించాలనుకోవడం కష్టమే. అయినా ఇష్టపడి చదివి ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ బాపన్న సహకారంతో ఢిల్లీ వెళ్లారు. అక్కడ ఎంపికై తొలి పోస్టింగ్ నిజామాబాద్‌లో చేరారు.
ఆల్‌రావు, దుర్గాబాయ్ దేశ్‌ముఖ్, కోటంరాజు రామారావు వంటి వారితో ఢిల్లీలో పరిచయం ఏర్పడింది. 1960లో యూపీఎస్సీలో క్లాస్ గ్రూప్ ఎ సాధించి ఇండియన్ ఎకనామిక్స్ సర్వీస్‌లో చేరారు. మద్రాసు, గోవా పోర్టు ట్రస్టులలో పనిచేశారు. మణిపూర్‌లో 20 ప్రాజెక్టులు పూర్తి చేసారు. ఉద్యోగ విరమణ అనంతరం జన్మస్థలం విశాఖ రుణం తీర్చుకోవాలనే ఉద్దేశంతో ఇక్కడకు వచ్చేశారు.

– పి.రామకృష్ణ, విశాఖపట్నం

బిడ్డకు కొంగు బంగారం..!

ఇప్పటి పిల్లలకు చాలామందికి తెలియకపోవచ్చు. ఎందుకంటే నేటి మమ్మీలు చీరలు కట్టుకోవడమే తగ్గిపోయింది. చీరకొంగు చీర అందం, సొగసును పెంచే మకుట మాణిక్యం! అంతేనా రోజువారీ దినచర్యలో దీంతో చేసుకునే పనులెన్నో, దీనివల్ల కలిగే ప్రయోజనాల్లో. వాటిని ఒకసారి గుర్తుచేసుకుందామా!



- పొయ్యి మీద వేడివేడి గిన్నెలను దించేందుకు అనువైన క్లాత్ అందుబాటులో లేనప్పుడు పనికొచ్చే అతి ముఖ్యమైన సాధనం చీరకొంగే.
- పిల్లల కన్నీటిని తుడిచే అనుబంధాల వస్త్రం చీరకొంగే.
- చంటి పిల్లలు నిద్రించేందుకు అమ్మ ఒడే సహజమైన పరుపు అయితే నులి వెచ్చటి దుప్పటిగా మారేది చీరకొంగే.
- కొత్తవారు ఇంటికొచ్చినప్పుడు సిగ్గుపడే పిల్లలు ముఖం దాచుకునేది అమ్మ కొంగు వెనకే.
- పిల్లలు నడక నేర్చుకునేటప్పుడు, కొత్తగా అడుగులేస్తున్నప్పుడు వారికి అమ్మ కొంగే పెద్ద దిక్సూచి, మార్గదర్శి
- వాతావరణం చలిగా ఉందంటే పిల్లలు చుట్టుకునేది అమ్మకొంగునే
- వంట చేసే తల్లి చెమట బిందువులు తుడుచుకునేది ఈ కొంగుతోనే
- వంటకు పొయ్యిలోకి తీసుకొచ్చే చిన్నచిన్న చిదుగులు, కట్టెలు తెచ్చేది ఈ చీరకొంగులోనే
- పెరటి తోటలో కూరగాయలు, పువ్వులు, ఆకుకూరలు కోసుకుని ఇంట్లోకి తీసుకొచ్చేందుకు ఉపయోగపడేది చీరకొంగే.
- పనిపాటలు చేసుకునే అమ్మలు చంటిబిడ్డల్ని వీపున కట్టుకునేందుకు లేదా పడిపోకుండా చంకన వేసుకుని బిగించి కట్టేందుకు ఉపయోగించేదీ చీరకొంగేగా.
- ఇల్లు సర్దేటప్పుడు పక్కకు పెట్టేందుకు లేదా విడిగా సర్దేలోపు పిల్లల ఆట వస్తువులను మూటగట్టేది చీరకొంగులోనే
- మరపురాని పిల్లల ఆటపాటలన్నీ దాదాపు అమ్మ చీరకొంగుతోనే.

ఇలాంటి ఎన్నో ఉపయోగాలు ఉన్న అమ్మ చీరకొంగు లాంటి ఆత్మీయమైన వస్త్రం ఇంకొకటి లేదు. ఇంతటి అద్భుతమైన అమ్మకొంగులో కనిపించేది మాత్రం అమ్మ ప్రేమే. చీర కట్టే అమ్మలందరికీ అభినందనలు చెప్పాల్సిందే!

నెలల పిల్లలకి పోషకాలు!



పసికందుల్లో ఎదుగుదల చాలా వేగంగా ఉంటుంది. మరీ ముఖ్యంగా నెలల వయస్సు పిల్లల్లో ఇది స్పష్టంగా కనిపిస్తుంది. మనిషి జీవితకాలం మొత్తంలో అటు మానసికంగానూ, ఇటు శారీరకంగానూ వేగంగా మార్పులు కనిపించే కాలం, పెరుగుదల కనిపించే కాలం ఇదే. తన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని చూసి అర్థం చేసుకోవడం, నేర్చుకోవడం ఈ వయస్సులోనే ప్రారంభమవుతుంది. శారీరక పెరుగుదలతో పాటే మానసిక నైపుణ్యాలూ అభివృద్ధి చెందడం మొదలయ్యేది ఈ నెలల వయస్సులోనే. అందుకే నెలల వయస్సు నుంచే పసిపిల్లలకు పోషకాహారం ఇవ్వాలి. ఈ విషయంలోనే చాలామంది తల్లిదండ్రులు గందరగోళానికి గురవుతుంటారు. పిల్లలకి సరైన ఆహారం ఇస్తున్నామా? లేదా? అది వాళ్ళకి సరిపోతుందా? లేదా? అని మధనపడుతుంటారు. శిశువు పుట్టినతర్వాత తొలి ఏడాదిలో బరువు మూడు రెట్లు పెరగాలి, అప్పుడే ఆరోగ్యంగా ఉన్నట్టు. ఇలా జరగాలంటే ఎనిమిదో నెల నుంచే పసికందులకు మంచి ఆహారం ఇవ్వాలి. ఎనిమిదో నెల నుంచి ఏడాది పూర్తయ్యేవరకూ అంటే ఐదు నెలల కాలంలో పిల్లలకు పెట్టే ఆహారం మీదే వారి మానసిక, శారీరక ఎదుగుదల ఆధారపడి ఉంటుంది. ఈ సమయంలో వారికి ఎలాంటి ఆహారం ఇవ్వాలి, ఏ ఆహారం ఇవ్వకూడదు తెలుసుకోవాలి. మరి ఆ వివరాలు తెలుసుకుందామా!

పిల్లలకి సాధారణంగా ఆరోనెల నుంచే ఆహారం ఇవ్వడం ప్రారంభిస్తారు. వాళ్ళకి మెత్తని ఆహారం ఇవ్వడానికే ఎక్కువ ప్రాధాన్యతనిస్తారు. కానీ ఎనిమిదో నెల పిల్లలకి ఇది సరిపడదు. ఈ వయస్సు పిల్లలు కొత్త తరహా ఆహారం, కొత్త ఫ్లేవర్‌ని ఇష్టపడతారు. వారికి ఇచ్చే ఆహారాన్ని వారి చేతులతోనే తీసుకుని తినేందుకు అవకాశం ఇవ్వండి. పిల్లల్లో ఎదుగుదల ఒక్కొక్కరిలో ఒక్కోరకంగా ఉంటుంది. అది ఎనిమిది నెలల వయస్సు నుంచి పిల్లలకు ఎలాంటి ఆహారం ఇస్తున్నారనేదానిపైనే ఆధారపడి ఉంటుంది. ఘనాహారం తీసుకోవడానికి అప్పటికీ బేబీ సిద్ధంగా లేకపోతే తల్లిపాలు, డబ్బాపాలు, మెత్తని ఆహారమే ఇవ్వాలి. పుట్టినప్పుడు ఉన్న బరువుకి రెట్టింపు బరువు పెరిగారంటే పిల్లలు ఘనాహారం తినడానికి సిద్ధమైనట్లే. బిడ్డ పుట్టినప్పుడు తగినంత ఐరన్ ఉన్నా నాలుగు నుంచి ఆరు నెలలు గడిచేటప్పటికి ఇది తగ్గిపోతుంది. దీంతో ఎనీమియాకు లోనవుతారు. వారికి ఇచ్చే ఆహారం ద్వారానే ఐరన్‌నూ తగినంతగా అందించాలి. అరటి, అవకాడో, పియర్స్, యాపిల్, అప్రికాట్లు, చెర్రీలు, బ్లూ చెర్రీలు, ఖర్జూరాలు, ద్రాక్ష, కివి, బొప్పాయి లాంటి రకరకాల పండ్లనూ పిల్లలకు పెట్టవచ్చు. కూరగాయల్లో బంగాళాదుంప, చిలకడదుంప, క్యారట్, బ్రకోలి, కాలీఫ్లవర్, పుట్టగొడుగులు బాగా ఉడకపెట్టి మెత్తగా మెదిపి పెట్టాలి. గోధుమలు, ఓట్స్, బార్లీ, తృణధాన్యాలు, గుడ్లు, బీన్స్‌ను కూడా పిల్లలకు ఆహారంలో ఇవ్వాలి. పిల్లలకి కనీసం రోజుకి మూడుసార్లు భోజనం రూపంలో ఆహారం అందించాలి. ఇందులో కనీసం పావుకప్పు పాల ఉత్పత్తులు, ప్రోటీన్ ఆధారిత ఆహారం ఉండాలి. పిల్లలకు 10, 12 నెలలు వచ్చేటప్పటికి పళ్ళు వచ్చి ఉంటాయి. దీంతో ఆహారం నమలడమూ అలవాటు అవుతుంది. ఈ వయస్సులోనూ తల్లిపాలను ఇవ్వవచ్చు. ఈ వయస్సు నుంచి పళ్ళు ఎక్కువ పెట్టాలి. బెర్రీలతో పాటు సిట్రస్ జాతి పండ్లు ఇవ్వాలి. కూరగాయాల్లో పాలకూర, టమాటా, కీరదోస లాంటి వాటిని ఇవ్వడం ప్రారంభించాలి. పెరుగు తప్పనిసరిగా పెట్టాలి. షుగర్, ఉప్పు ఎక్కువగా ఉన్న ఆహారాన్ని ఇవ్వకూడదు. డ్రై ఫ్రూట్స్, నట్స్, మాంసం, చిప్స్, పాప్‌కార్న్, కేక్స్, డ్రింకులు లాంటి వాటిని పిల్లలకు అస్సలు ఇవ్వకూడదు.



జరిగిన కథ

కాని - ఇంతమంది స్త్రీలు - వృద్ధులు, ముగ్ధలు, పసి పిల్లలు, పడుచులు-ఇక్కడ నిర్భయంగా యాత్ర చేసు కోడానికి దిగారే - నేనెందుకు భయపడాలి అనిపించింది. సాక్షాత్తు కాశీ అన్నపూర్ణ క్షేత్రం - మున్నూట అరవైఐదు అన్నసత్రాలు వుండే మహా పుణ్యస్థలంలో బసకి భోజనానికి నాకేం భయం అనుకున్నా. దశాశ్వమేధ ఘట్టం దగ్గర ఒక ధర్మశాలలో దిగేను. మా ముగ్గురికీ ఒక గది పుచ్చుకున్నాను. ధర్మశాల శుభ్రంగా లేదు. చీకటిగాను తడితడిగాను జారుజారుగాను చెమ్మచెమ్మగానూ వుంది. సత్రం లోనే భోంచేశాం. సుభ అసలే తినలేకపోయింది. కాశీ విశ్వేశ్వరుని మందిరం! లక్షలాది యాత్రికులు వచ్చి దర్శనం చేసుకుని పోతున్నారు.

(నిన్నటి సంచిక తరువాయి)

వెయ్యి వరహాల పువ్వులు - కుప్పలు తిప్పలు! భక్తుల పూజ - పురోహితుల అల్లరి - యాత్రికుల కోలాహలం - బ్రాహ్మణుల మంత్రోచ్చారణ - ప్రార్థనగీతాలు - అన్నిటినీ ఆవరించిన ఆ విశ్వేశ్వరుని ఘంటానినాదం - ఓంకారం!

నాలాంటి స్త్రీలు - అసంఖ్యాకులు - ఎంతమంది చిత్త శాంతికోసం - సంసారంనుండి ముక్తికోసం - జన్మ తరించడానికోసం - ఈ గంగామాతను పూజించడానికి వచ్చారో? అనాది నుండి ఎందరు యీ త్రోవని నడిచారో కదా? దశాశ్వమేధం - మణికర్ణిక - ధృతరాష్ట్రుడు - హరిశ్చంద్రుడు - మహారాజుల ఐశ్వర్య భోగాలు యమకింకరుల పరిపాలన మృత్యుదేవత, శ్మశానం! అన్నపూర్ణ నిరతాన్న ప్రదాయిని, జీవకారిణి! విశ్వేశ్వరుడు కాలభైరవుడు!

ఆ యాత్రికులతో నేనుకూడా కాశీవీధులలో తిరుగుతూంటే సింధు నదీ జలంతో సూర్యుడికి అర్ఘ్యం ఇచ్చి - తూర్పుదిశబట్టి, వలసపోయి ఆర్యావర్తంలో కాలుపెట్టి, అలసిపోయి, సొలసిపోయి, గంగాతీరాన్ని చేరి సేదదీరి తృప్తిపొందిన ఆర్యకన్యనే అనుకున్నాను - ఒక్క నిమిషం!

కేదారేశ్వర మఠం, శంకరాచార్యుల పీఠం, అహల్యాబాయి ఘట్టం, మెట్లు ఎక్కేను - మెట్లు దిగేను. పంచకుండ - కబీరు కుటీరం - వేణీ మాధవం - సీతాకుండు - చూచాను.

నేనెందుకు యీ కాశీక్షేత్రానికి వచ్చాను అని ప్రశ్న వేసుకున్నా.


జ్ఞానం - ముక్తి మోక్షం - ఆనందం? కాదు - ఆత్మశాంతి కోసం. ఒకవైపు - దారిద్ర్యం - అన్యాయం - క్రౌర్యం - ధనాపేక్ష... ఒకవైపు ప్రేమ - సర్వమానవ ప్రేమ... సంసారం ఒకవైపు దేశం ఒకవైపు ఈ రెంటిమధ్య నా విధ్యుక్త ధర్మం ఏమిటి? ఇది గ్రహించడం కోసం. కాని నాకు అగ్రహ్యం.

ధర్మశాలలో నిద్రపట్టలేదు. రాత్రి భజనలు, తెల్లవారున వేద పారాయణ - జౌవున్‌పూరు వెళ్ళేను. మహమ్మదీయ సంస్కృతి. సూఫీహాదీల కవిత్వం, పారశీకపు మర్యాదలు, ఒమర్ ఖయ్యాం, మౌల్వీ ఉలేమాలా గోష్ఠి, ముషైరా చందన తాంబూలాలు, అత్తరు పన్నీరులు, సంగీతపు చెట్లు, దేవదారులు, అంతఃపురం - తంబాకు, దిల్‌రూబా, నృత్యం, చలువరాతి జిలుగు తెరలు, వాటివెనుక నేను - నూర్జహాను, జేబు ఉన్నీసా, జుంకాలు, మామిడి పిందెలు, రామచిలకలు, నెమిళ్ళ నాట్యం, చదరంగం, జలక్రీడలు, గులాబిపువ్వులు, కాశీ - గంగా తరంగాలు - పశ్చిమాద్రిని సూర్యుడు, ఔరంగజేబు పాదుషా మశీదు, సాయంసంధ్య, సమాజుకు మౌజన్ పిలుపు-అక్బరు చక్రవర్తి మందిరం, సర్వమానవమతం... నా హృదయతంత్రులు మూగపోయాయి.

ప్రొద్దున్నే లేచి సారనాథం వెళ్ళేను.

బౌద్ధ యాత్రికులు అనేకులు అనేక దేశాలనుంచి వచ్చారు. సింహళం, చీనా, సయాం, బర్మా, జపాను.

మూలగంధకూట విహారం! పువ్వులు, ప్రమిదలలో దీపాలు, కాగితపు లాంతర్లు, అగరు వత్తులు, స్థూపాపలచుట్టూ



ప్రదక్షిణ. నేను కూడా ఒక బౌద్ధభిక్షువును, కాషాయం కట్టుకున్నాను. లుంబినీ ఉద్యానవనం, సిద్ధార్థుడు పావురాన్ని రక్షించాడు. లేడి పిల్లని కాపాడేడు. నా ముందర మఠం వేసుకుని కూచున్నాడు ధ్యానబుద్ధుడు. సుందరమూర్తి. ప్రజ్ఞాపరిమితుడు. పరంతపుడు కృపామయుడు, పద్మాసనాసీనుడు. అభయమూర్తి, తథాగతుడు, బోధిసత్వుడు - యశోధరని వదలి పెట్టేసి వెళ్ళిపోతున్నాడు. కన్నబిడ్డని - భోగవిలాసాలని - రాజ్యాన్ని - ప్రపంచాన్ని వదిలిపెట్టేసి - మారుని మాయలోకం నుంచి - కామక్రోధాల నుంచి సుఖదుఃఖాల్లో నుంచి నడిరాత్రి అంధకారంలోకి వెళ్ళిపోతున్నాడు. పోయిపోయి గయదగ్గిర -



డాక్టర్ పుప్పల లక్ష్మణరావు

నదీతీరాన్ని - గంగరావి చెట్టునీడని - సేద దీర్చుకుంటున్నాడు. కన్ను మూతపడింది. జ్ఞాన సమాధి. తేజోవంతమైన ముఖ వర్చస్సు. నిర్వాణ సమాధి, ఆ కన్నులు కలువరేకులు, కరుణ, కృప, దయ ఉట్టిపడుతున్నాయి. ఆనంద బాష్పాలు రాలుతున్నాయి.

నందలాలుబోసు చిత్రం నా కళ్ళ ఎదుట నిల్చింది. అజంతా శిల్పం ప్రత్యక్షం అయింది - సిద్ధార్థుడి హృదయంలో జ్ఞానం ప్రవేశించింది. రాజకుమారుడి తలపై నవరత్నాలా అమర్చబడి కిరీటం, చేత గులాబి పువ్వు, అభంగ ముద్ర, భుజాన జంధ్యం. ప్రక్కనిలబడిన యశోధర రూపలావణ్యరాశి పుష్పాంజలి సమర్పిస్తూంది. బోధిసత్వులు పూజలు అర్పి స్తున్నారు. బోధివృక్షం మీద వాలిన యక్షులు, కిన్నరులు, గంధర్వులు ఆనందగానం చేస్తు న్నారు. ఇదిగో, ఇక్కడ అతని మొదటి సందేశం! యీ విహారం యొక్క ద్వారం ముందరనే ఈ తోరణం క్రిందనే ఆ పుణ్య స్థలం! ఆచంద్రతారార్కం బోధిసత్వుని ప్రేమ చిహ్నం నిలబడిపోయేటట్టు అతని శిష్యుడు అశోకవర్ధన ప్రియదర్శిని - నిర్మించిన శిల! తేజోవంతమైన సింహాలు, సుందరమైన తామర పువ్వు, కర్మచక్రము, కాలచక్రము, ప్రేమ చక్రము!

శాస్త్రిని వదిలేసివచ్చాను. ఇల్లు వదలేసి వచ్చాను. కాని ప్రపంచాన్ని విడిచి పెట్టలేను. పాపాయిని వదలిపెట్టలేను. అది నోరులేని పావురపుపిట్ట. సుభని వదలిపెట్టలేను. అది పాపం పుణ్యం తెలియని లేడిపిల్ల. శాస్త్రిని వదలిపెట్టడం? సంసారం వదలిపెట్టడం - పాపాయిని, సుభని వదలిపెట్టడం? వదిలి పెట్టి? కన్న దేశాన్ని వదలిపెట్టి ఎక్కడికిపోతాను? సన్యాసమా - పిరికితనమా?

శాస్త్రి అంటే నాకు అపరిమితప్రేమ, అతనికోసం మనసు వాచిపోతుంది. కాపురం వదలిపెట్టాలని లేదు సరికదా - ప్రేమ సౌఖ్యం అసలు ఇంకా రుచి చూడనే లేదనిపిస్తుంది.

అన్నపూర్ణ సత్రానికి వెళ్ళిపోయాను. త్రోవలో అడుగడుక్కీ పేరంటాళ్ళ తులసి కోటలు - సహగమనపు సమాధులు - అబ్బ! అబ్బ! శ్మశానం - చితి నిప్పులు కక్కుతుంది - బ్రాహ్మణులు మంత్రాలు ఘోషిస్తున్నారు - శాస్త్రీ - అతన్ని కౌగిలించుకుని నేను - కారుచిచ్చులు నన్ను ఆవరిస్తున్నాయి - అగ్ని జ్వాలలు నన్ను మింగేస్తున్నాయి.

నేను ఈ త్రోవని నడువలేను. సుఖం దుఃఖం - ప్రేమ యడబాటు - చావు పుట్టుక - పువ్వులు నవ్వులు - నాకు కావాల్సింది. ఈ ప్రపంచమే - ఈ సంఘర్షణే!...

సత్రం అరుగుమీద బ్రహ్మచారులు సాయంసంధ్య చేసుకుంటున్నారు. నడుం వంగిన ముసలివాళ్ళు గంగాస్నానానికి వెడుతున్నారు. పడుచులు అన్నపూర్ణకు పసుపుకుంకుమ తీసుకెళుతున్నారు పాపాయి, సుభ, నూరు వరహాలు పువ్వులతోను బిల్వ దళాలతోను ఆడుకుంటున్నారు. నేను వాళ్ళని చూసి కౌగలించుకున్నాను.

78 అతడు

రెండు రోజులై పెద్దగుమాస్తాగారు రావడంలేదు. చాలా చికాకుగా వుంది. చిన్నగుమాస్తా కాగితపు కట్టలు సరిగ్గా అందివ్వలేకుండా వున్నాడు. నార్కేడిమిల్లి వాళ్ళ పంపకపు దావాల్లో ఆస్తి వివరాలు పట్టీని టైపు చేయించమంటే పాచి పెంట తనఖా దస్తావేజు బాపతు షెడ్యూలు టైపు కొట్టించాడు.

ఏమయ్యా అని అడిగితే భార్యకి జబ్బుగా వుంది - అంచేత రాత్రి నిద్రలేదు. తలపోటు తనకి అంటాడు. గుమాస్తాలు ఇప్పుడు సంఘం ఒకటి పెట్టుకుంటున్నారు! ఇహ రేపు పొద్దున్న డాక్టరుదగ్గిర పని చేస్తున్న కాంపౌండర్లుకూడా సంఘం పెట్టుకుంటే - అక్కడికి సరిపోతుంది! పార్టీల దగ్గిరనుంచి సాక్షిపట్టీలు దాఖలు లాగుతూనేవున్నా పోనీ - యే గాది కింద బొక్కవలసిన పందికొక్కుని అక్కడే బొక్కనీ - అని నేను కలుగజేసుకొనే కలగ జేసుకోను. సరే - సంఘాలు పెట్టుకోండి - వాలంటరీలు మాత్రం అడక్కండి అని కడిగేసిన జీతపురాళ్ళు ఇస్తే - అక్కడికా నీలుగు కట్టిపోతుంది. నాకు భలేకోపం వస్తుంది.

శాంతం వెళ్ళిపోయాక - అన్నీ ఇలాగే వస్తున్నాయేమిటి?

నాలుగు రోజులై కొత్తగా జూనియర్ ఒకతను వచ్చాడు. భాష్యం సిఫార్సు చేశాడు - మేనత్త కొడుకు పినమామగారి అల్లుడు తమ్ముడని. మందిచేరితే మఠానికి చేటు. ఇహ నాలుగో వాడు కూడా చేరాడంటే - మాకు మేజాల మీద ఇలెక్ట్రిక్ పంకాలు కావాలి. ఫౌంటెను పెన్నులు మీరే కొని సరఫరా చెయ్యాలి - అని మొదలుపెడతారు జూనియర్లు.

ఈ కొత్త అతన్ని మధిరవాడ జమీతాలూకు పాతబిల్లు మక్తాకౌలు కదపాలు చదవమన్నాను - వెట్టి చాకిరీలు మేము విధిగా జమిందారుగారి దివాణంలో చేయగలవారము అని, రైతుల వద్దనుంచి వ్రాయించి పుచ్చుకున్నారేమో చూదాం అని. తెలుగునే ఉన్నాయి కాగితాలు- "రామునితోక- పివరుం డిట్లనియే" అన్నట్టు చదివేడు.

"ఏమిటండీ- మీరు చదువుతున్న భాష?" అని అడిగేను.

"గొలుసుకత్తు దస్తూరీ అండీ- పాలకొండ శిష్టకరణం ఎవడో వ్రాసినట్టున్నాడు" అన్నాడు!

అక్కడితో అయిందా? నేనేదో వ్రాసుకుంటుంటే - పని గట్టుకువచ్చి బారిష్టరుగారూ! 'స్పేస్ సక్సెషనిస్' అన్నాడు - స్పెల్లింగు తప్పా - అచ్చు పిశాచమా - ఏమిటండీ ఇది?" అన్నాడు.

- ఇంకా వుంది.

ప్రజ్ఞా స్వరూప సిద్ధాంతానికి మూలపురుషుడు ఎవరు ?



1. పావ్‌లోవ్ ప్రయోగంలో ఉద్దీపన ఆహారం అయితే అపుడు స్పందన?
ఎ. కుక్క బి. గంటమోత
సి ఆహారం డి. లాలాజలం

2.వ్యక్తి ఉద్వేగాలను అదుపు చేయు గ్రంథి?
ఎ.పిట్యూటరీ గ్రంథి బి. థైరాయిడ్ గ్రంథి
సి.అడ్రినల్ గ్రంథి డి.క్లోమ గ్రంథి

3.పిల్లల్లో శ్రద్ధ లేకపోవుటకు ప్రధాన కారణాలు
ఎ. సరియైన బోధన లేకపోవడం
బి. ప్రశిక్షుతులైన ఉపాధ్యాయులు లేకపోవడం
సి. సరియైన బోధనోపకరణములు లేకపోవడం
డి.నేర్చుకొను విషయము నిత్య జీవితంలో పనికి రాకపోవడం

4. అభ్యసనలో యత్నదోష పద్ధతిని రూపొందించిన శాస్త్రజ్ఞులలో ముఖ్యుడు?
ఎ. స్కిన్నర్ బి.కోహ్లెక్
సి. థారన్‌డైక్ డి. పావ్‌లోవ్

5. సాంఘిక శాస్త్రోపాధ్యాయునిగా ప్రభుత్వ నిర్మాణంను చూపుటకు నీవు వాడు చార్టు ?
ఎ. ఫ్లోచార్టు బి. టేబుల్ చార్టు
సి. పంపిణీ చార్టు డి. పైవేవీకావు

6. గణిత ప్రశ్నకు సంబంధించిన విషయాన్ని గుర్తిస్తాడో లేదో పరీక్షించడానికి నీవు ఏ విధమైన ప్రశ్నలను అడుగుతావు
ఎ. వ్యాస రూప ప్రశ్నలు బి.సంక్షిప్త ప్రశ్నలు
సి. బహుళైచ్ఛిక ప్రశ్నలు డి. తప్పు, ఒప్పుప్రశ్నలు

7. ద్రవ్యమానమును బోధించుటకు నీవు ఉపయోగించే బోధనోపకరణము ?
ఎ. గడియారం బి. పూసల పెట్టె
సి. చిల్లర నాణెలు డి. క్యాలెండర్

8. ఈ క్రింది వారిలో విద్యాలయాలలోని ప్రోత్సాహకాల మీద ప్రయోగాలు చేసినవారెవరు?
ఎ. ఎలిజబెత్ హర్లాక్ బి. ఎల్లిస్ పేజ్
సి. ఎబ్బింగ్ హాస్ డి. థారన్‌డైక్

9. అభ్యసనమునకు దీనిని రాచబాట అందురు ?
ఎ. పరిణితి బి. ఉద్వేగము
సి. సృజనాత్మకత డి.ప్రేరణ

10. ఎబ్బింగ్ హాస్ ధోరణిని ఈ క్రింది విధంగా మాపనం చేశారు?
ఎ. పునరభ్యసనము బి.గుర్తింపు
సి.కాంక్షాస్థాయి డి. పునఃస్మరణ

11. సామూహిక కారక సిద్ధాంతమును ప్రవేశపెట్టిన వాడు?
ఎ. ఇ.ఎల్ థారన్‌డైక్ బి.ఎల్.థర్‌స్టన్
సి.చార్లెస్ డి.స్పియర్‌మన్

12. "క్రెటినిజమ్" అను స్థితి--- దశలో ఏర్పడుతుంది?
ఎ.యవ్వనదశ బి.వయోజనదశ
సి.వృద్ధాప్యం డి. బాల్యదశ

13. "కార్యసాధన నిబంధనమనే " అభ్యసనా సిద్ధాంతాన్ని ప్రతిపాదిం చినవారు?
ఎ. పావ్‌లోవ్ బి. బి.ఎఫ్.స్కిన్నర్
సి.ప్రెస్సీ డి. థారన్‌డైక్

14. కోహిలర్ తన సిద్ధాంతమును ప్రతిపాదించుటకు చింపాంజీ జంతువు లనే ఎందుకు ఎన్నుకొన్నాడు?
ఎ. మానవుని శరీర ధర్మాలలో సంబంధమున్న జీవి.
బి.తనకు అందుబాటులో వుండుట వల్ల
సి.పరిసరముల ప్రభావము చింపాం జీలపై వుండదు కాబట్టి
డి. పైవన్నీ

15. అత్యున్నతమైన వ్యక్తిత్వం కల్గిన మానవుని ఆలోచన పద్ధతి?
ఎ.మూర్తఆలోచన బి.అమూర్త ఆలోచన
సి.ఊహాలోచన డి.తార్కిక ఆలోచన

16. "ఎమిలీ" గ్రంథ రచయిత?
ఎ. రూసో బి.ఫ్రాయిడ్
సి.ఊంట్ డి. అరిస్టాటిల్

17. సంతోష సమయంలో కూడా ముభావంగా వుండేవారు?
ఎ. అంతర్వర్తనులు బి.బహిర్వర్తనులు
సి.ఉభయవర్తనులు డి.పైవారెవరు కాదు

18. నవోదయ పాఠశాలలు స్థాపించాలని సిఫారసు చేసినవారు?
ఎ. కోఠారి కమిషన్ బి.జాతీయ నూతన విద్యావిధానం
సి.మొదలియార్ కమిషన్ డి.రాధాకృష్ణ కమిటీ.

19.శాస్త్రీయ సూత్రాలను, సిద్ధాంతాలను ప్రత్యేక సందర్భాలకు అన్వయించి వాటీ యదార్థాలను తెలిసికొనే పద్ధతి
ఎ. ఆగమన పద్ధతి బి.నిగమన పద్ధతి
సి.ప్రదర్శనాపద్ధతి డి.ఊహపద్ధతి

20. ఏడవ తరగతిలో వృత్త పరిధికి సూత్రాన్ని బోధించడానికి మిక్కిలి అనువైన బోధనా పద్ధతి?
ఎ. ప్రాజెక్టుపద్ధతి బి.అన్వేషణాపద్ధతి
సి. ప్రయోగశాల పద్ధతి డి. శాస్త్రీయ పద్ధతి

21. ఒక సంవృత పటం పొడవు--- అంటారు?
ఎ. చుట్టుకొలత బి.వైశాల్యం
సి. ఘనపరిమాణం డి.పైవేవీ కావు

22. పాఠ్య పథక నిర్మాణంలో ఉన్మీకరణ ముఖ్యోద్దేశం
ఎ.విద్యార్థులలో పాఠ్య విషయ నందు పూర్వజ్ఞాన పరిశీలన
బి.విద్యార్థులలో పాఠ్య విషయగ మునందు ఆసక్తి పెంపొందించుట
సి.విద్యార్థులకు ఉపాధ్యాయునిపై గౌరవం కల్గించుట
డి.విద్యార్థుల, ఉపాధ్యాయుల సంబంధమును పెంపొందించుట

23. విద్యలో సాంఘిక శాస్త్రము ఆవశ్యకతను గుర్తించిన మొట్టమొదటి విద్యాకమిటీ?
ఎ. రాధాకృష్ణన్ కమిటీ
బి.సెకండరీ విద్యాకమిషన్- 1952- 53
సి. ఈశ్వర్‌భాయి పటేల్
డి. రామ్మూర్తి కమిటి

24. వివిధ దశలలో మిక్కిలి క్లిష్టమైన దశ?
ఎ.కౌమార దశ బి.శైశవదశ
సి. బాల్యదశ డి.వయోజన

25. ప్రగతి పథం వైపునకు ప్రవర్తన మార్పు ప్రక్రియనే "అభ్యసనం"ఈ మాటలు ఎవరివి?
ఎ.గేట్స్ బి.గార్డినరీ
సి.బి.ఎఫ్.స్కిన్నర్ డి.ధారన్‌డైక్

26. సగటు ప్రజ్ఞ గల వారి ప్రజ్ఞాలబ్ధి?
ఎ.90-109 బి.70-79
సి. 80-89 డి. 110-119

27. ప్రజ్ఞా స్వరూప సిద్ధాంతానికి మూలపురుషుడు?
ఎ. గిల్‌ఫర్డ్ బి. ధారన్‌డైక్
సి. స్పెయిర్‌మన్ డి. స్టెర్న్

128. రాము అనే బాలుడికి గణితములో మంచి మార్కులు వస్తాయి కాబట్టి అతడు మిగతా అన్ని విషయాలలో కూడా మంచి మార్కులు సంపాదిస్తాడు తన ప్రవచనాన్ని సమర్థించు ప్రజ్ఞా సిద్ధాంతము?
ఎ. ఏకాకారక సిద్ధాంతము బి.బహుకారక సిద్ధాంతము
సి.ద్వికారక సిద్ధాంతము డి. ప్రజ్ఞా స్వరూప సిద్ధాంతము

29. సాధారణంగా పరీక్షలలో ఇచ్చే బహుళైచ్ఛిక ప్రశ్నలు ఏ స్మృతి ప్రక్రియకు చెందుతాయి?
ఎ.రీకాల్ బి.పునర్వచనము
సి.గుర్తింపు డి.పైవన్నియు

30 సైన్స్ క్లబ్‌ల ప్రధానోద్దేశ్యం?
ఎ.శాస్త్రీయ వైఖరిని నెలకొల్పడం
బి.సమాచారాన్ని ప్రోగు చేయడం
సి.కాలాన్ని సద్వినియోగం చేయడం
డి. సైన్స్ మ్యాగజైన్లు తయారు చేయుట

31. అర్థవంతమైన చిన్నచిత్రంలో విద్యార్థులకు నేర్చుకోవలసిన అంశమును అందించు పరికల్పనను- అంటారు?
ఎ. నిబంధనము బి.కార్యక్రమయుత అభ్యసనం
సి. మైక్రోటీచింగ్ డి.టీమ్ టీచింగ్

32.అక్రమాకార వస్తువుల వైశాల్యమును కనుగొనుటకు - ఉపయోగించాలి?
ఎ. సూత్రం బి.నల్లబల్ల
సి.గ్రాఫ్ కాగితం డి.దారం

33. హ్యూరిస్కో అనగా?
ఎ.కనిపెట్టుట బి.పరిశీలించుట
సి. జ్ఞానము డి.ఊహించుట

34. ఈ క్రిందివానిలో ప్రత్యక్షాచరణ ద్వారా అభ్యసనం జరుగుతుంది.
ఎ.ఉపన్యాస పద్ధతి బి.చర్చాపద్ధతి
సి. ప్రదర్శనా పద్ధతి డి. ప్రణాళికా పద్ధతి



35. స్థానికంగా వుండే కట్టడాలను గూర్చి బోధించుటకు నీవు ఉపాధ్యాయునిగా ఏ రకమైన బోధనాపద్ధతి ఉపయోగిస్తావు?
ఎ.అంశముల పద్ధతి
బి.వనరుల పద్ధతి
సి. చర్చా పద్ధతి
డి. ఉపన్యాస పద్ధతి

36. గణిత శాస్త్ర పరీక్షను సమాధాన పత్రాన్ని ఎ,బి అను వేర్వేరు ఉపాధ్యాయులు దిద్దినపుడు వరుసగా 15, 45, మార్కులు వచ్చాయి. అయితే దీనిలో లోపించినది?
ఎ.ప్రమాణికత బి.విశ్వసనీయత
సి.అప్రమాణికత డి. అవిశ్వసనీయత

37.బోధనా రంగాలను వర్గీకరించిన వారు?
ఎ. బెంజిమన్‌బ్లూమ్ బి. స్కిన్నర్
సి.యంగ్ డి.ధావే

38.ప్రాజెక్టుపద్ధతిలో మొదటి సోపానం?
ఎ.పథక నిర్మాణం బి.ప్రాజెక్టు ఎన్నిక, ఉద్దేశవివరణ
సి. ప్రాజెక్టునిర్వహణ డి.మూల్యాంకనం

39. మనరాష్ట్రంలో నాన్ డిటెన్షన్ విధానం ఎపుడు అమలులోకి వచ్చింది?
ఎ. 1971-72 బి.1964-65
సి. 1956-57 డి.1952-53

డి.ఎస్.సి. ప్రాక్టీస్ మెటీరియల్

40. సమస్యాపరిష్కార సన్నివేశాలలో ఉపయోగించు అభ్యసనా సిద్ధాంతం?
ఎ. కార్యక్రమయుత అభ్యసనం బి. నిబంధన అభ్యసనం
సి.యత్న దోష పద్ధతి డి. అంతర్ దృష్టి సిద్ధాంతం

41. విద్యార్థులలో ఈ క్రింది బోధనా పద్ధతివల్ల సాంఘీకరణ పెంపొందించవచ్చును?
ఎ. సామూహిక పఠనా పద్ధతి బి. యూనిట్ పద్ధతి
సి.చర్చాపద్ధతి డి.ఉపన్యాస పద్ధతి

42. బాడ్మింటన్ ఆటగాడు, టెన్నీస్ ఆటగాడు కావచ్చు ?
ఎ. సమరూప అంశముల సిద్ధాంతం
బి.సామాన్యీకరణ సిద్ధాంతం
సి.ఆదర్శాలసిద్ధాంతం
డి.సమగ్రాకృత సిద్ధాంతం

43. వైఖరులు సామాన్యంగా ఈక్రింది వాని వల్ల ఏర్పడును?
ఎ. తాదాత్మీకరణం వలన బి. అనుకరణంవలన
సి.అనియంత్రణ వలన డి. స్వయం ప్రేరణ వలన

44. సాంఘిక మితిని రూపొందించిన వారు ?
ఎ.జె.ఎల్.మోరానో బి.స్ట్రాంగ్
సి.గట్‌మన్ డి. లైకెర్ట్

45. గణితశాస్త్ర ఉపాధ్యాయునిగా పిల్లలకు అంకెలు బోధించినపుడు ఏ బోధనోపకరణాన్ని ఉపయోగిస్తారు?
ఎ. బంతులు బి.పూసలపెట్టె
సి. నాణెములు డి.పైవన్నీ

46. ఒక విద్యార్థిని త్రిభుజం వైశాల్యం సూత్రం అడుగగానే 1/2 × భూమి × ఎత్తు అని చెప్పాడు, అయితే దీనిలో ఇమిడి వున్న సూత్రం?
ఎ. జ్ఞానం బి.అవగాహన
సి.నైపుణ్యం డి.అనుప్రయుక్తం.

47. నవజాత శిశువు వయస్సు?
ఎ. పుట్టినప్పటి నుండి రెండు వారాల వరకు బి. 2-3 సం॥
సి. 3-5 సం॥ డి. 1-5 సం॥

48.అభ్యసనా ప్రోత్సాహకాల మీద ఎక్కువ ప్రయోగాలు చేసినవారు?
ఎ. ఎబ్బింగ్‌హాస్ బి.ఎలిజబెత్ హర్లాక్
సి. హెర్బార్ట్ డి. లూ

49. శిశు అధ్యయన పద్ధతులను రూపొం దించిన వారిలో ముఖ్యులు?
ఎ.స్టాన్లీహాల్ బి. హెర్బార్ట్
సి.జె.ఎల్.మోరానో డి. ధారన్‌డైక్.

50. సహజ సిద్ధమైన విషయాలను నియం త్రించు పద్ధతులలో కల్పిత వాతావరణంలో పరిశీలిస్తే అది ఏ పరిశీలన అవుతుంది?
ఎ.సహజ పరిశీలన బి.సంచరిత పరిశీలన
సి.అంతః పరిశీలనా పద్ధతి డి. నియంత్రణ పరిశీలనా పద్ధతి

51. "బ్లూ ప్రింట్" అనునది?
ఎ.ఆధునిక బోధనాపద్ధతి
బి.ప్రశ్నావళి రూపొందించినపుడు గుర్తించుకోవలసిన విషయం
సి.సైన్సు పరికరముల లిస్టు
డి. పాఠశాలలోని కనీస వసతులు

52.ఇంద్రియ శిక్షణకు విద్యలో ప్రాధాన్యత నిచ్చినవారు?
ఎ.ఫ్రోబెల్
బి. హెర్బర్ట్
సి.మేరియా మాంటిస్సోరి డి.రూసో

53. ఈ క్రింది వారిలో సాంఘిక శాస్త్రంను ఒక అధ్యయన క్షేత్రంగా నిర్వచించినవారు?
ఎ. ఆడమ్స్ బి. పాల్‌జకెట్
సి. ఫిల్బీ డి. కామెట్

54. ఈక్రింది వానిలో దేశబడ్జెట్, ఉత్పత్తి, ఆదాయ, వ్యయాలను గూర్చిన జ్ఞానము సూచించుటకు నీవువాడే బోధనోపకరణం
ఎ. కంప్యూటర్ బి. చార్టు
సి. బ్లాక్ బోర్డు డి. స్లైడ్

55. లక్ష్యాత్మక పరీక్షలను ఉపాధ్యాయుడు ఎక్కువగా ఇచ్చాడు. ఇందులో ఈ లోపం కన్పస్తుంది?
ఎ. భాషా ప్రావీణ్యం పరీక్షించలేము బి. సప్రమాణత ఉండదు
సి. పరీక్షలలో మాస్‌కాపీయింగ్ జరుగుతుంది డి. ఏవీకాదు

56. గణిత శాస్త్ర పాఠ్య ప్రణాళిక బోధిస్తున్నపుడు చురుకుగా నుండు వారు?
ఎ.ఉపాధ్యాయుడు బి.విద్యార్థి
సి.పైవారిద్దరూ డి. పైవన్నింటికి

57. పాఠ్యగ్రంథాన్ని ప్రమాణికంగానే తీసుకొనే ఉపాధ్యాయుడు ఏ బోధనా పద్ధతి ఉపయోగిస్తారు?
ఎ. ఉపన్యాస బి. చర్చా
సి ఆగమన డి. నిగమన

58. విజ్ఞాన శాస్త్ర పాఠ్యప్రణాళికను ఏకకేంద్రపద్ధతిలో బోధించడం వల్ల ఒనకూరే ప్రయోజనం?
ఎ. ఒకే పాఠ్యభాగాన్ని అన్ని తరగతు ల్లో స్థాయిని బట్టి బోధించ వచ్చు
బి. పెక్కుఅంశాలలో విషయ జ్ఞానాన్ని కలిగించవచ్చు
సి.తప్పని సరిగా ఏదోఒక పద్ధతిలో బోధించాలి కాబట్టి
డి. పైవన్నీ

59. సామాన్య శాస్త్రంలో బహుళైచ్ఛిక ప్రశ్నలను రూపొందించుటలో ముఖ్యోద్దేశం?
ఎ. విద్యార్థులు విషయాన్ని అవ గాహన చేసుకుంటున్నారో లేదోనని పరీక్షించడం
బి. విద్యార్థి వైఖరిని గమనించడం
సి.ప్రశ్నకు సంబంధించిన విషయాన్ని జ్ఞప్తికి తెచ్చుకొన్నాడో లేదో పరీక్షించుట
డి. పైవన్నీ

60. సాంఘిక శాస్త్ర బోధనలో బోధనోప కరణములను ఎందుకు ఉపయోగించాలి?
ఎ. విద్యార్థుల విషయాలను నేర్చు కొనుటకు ఆసక్తి కలిగించేందుకు
బి. విషయాల సంపూర్ణ అవగాహన కలిగించుటకు
సి. విద్యార్థుల పఠనాసక్తులను పెంపొందించుటకు
డి. పైవన్నీ

సమాధానాలు :

1. డి, **2.** సి, **3.** డి, **4.** సి, **5.** ఎ, **6.** సి, **7.** సి, **8.** ఎ, **9.** డి, **10.** డి, **11.** బి, **12.** బి, **13.** బి, **14.** ఎ, **15.** డి, **16.** ఎ, **17.** ఎ, **18.** బి, **19.** బి, **20.** సి, **21.** ఎ, **22.** బి, **23.** బి, **24.** ఎ, **25.** సి, **26.** ఎ, **27.** ఎ, **28.** ఎ, **29.** ఎ, **30.** ఎ, **31.** బి, **32.** సి, **33.** ఎ, **34.** డి, **35.** బి, **36.** బి, **37.** ఎ, **38.** బి, **39.** ఎ. **40.** డి, **41.** ఎ, **42.** ఎ, **43.** బి, **44.** ఎ, **45.** బి, **46.** ఎ, **47.** ఎ, **48.** బి, **49.** ఎ, **50.** డి, **51.** బి, **52.** సి, **53.** ఎ, **54.** బి, **55.** బి, **56.** సి, **57.** డి, **58.** ఎ, **59.** సి, **60.** ఎ.

విశాలాంధ్ర బిజినెస్

-68.71 ▼ సెన్సెక్స్ 35,965.02	-21.95 ▼ నిఫ్టీ 11,027.70	-50 ▼ బంగారం (విజయవాడ) 28,750 22 క్యారెట్లు, 10 గ్రాములు	బంగారం (విశాఖపట్నం) 29,000 ప్రొద్దుటూరు 28,550 22 క్యారెట్లు, 10 గ్రాములు	100 ▲ వెండి (విజయవాడ) 40,500 కిలో (రూపాయల్లో)	వెండి (విశాఖపట్నం) 42,200 ప్రొద్దుటూరు 40,400 కిలో (రూపాయల్లో)	డాలరు Vs రూపాయి 63.58

టాప్ గెయినర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	మార్పు (శాతాల్లో)
కోటక్ మహీంద్ర	1,109.75	1.85
రిలయన్స్	961.15	1.25
హెచ్‌డీఎఫ్‌సీ	1,955.70	1.16
ఇండస్‌ఇండ్ బ్యాంక్	1,759.60	1.00
టాటామోటార్స్	401.00	0.77

టాప్ లూజర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	లాస్ (శాతాల్లో)
రెడ్డీ ల్యాబ్స్	2,225.25	-3.75
టాటాస్టీల్	705.05	-3.49
కోల్ ఇండియా	298.60	-2.32
హెచ్‌యుఎల్	1,398.00	-2.13
సన్‌ఫార్మా	594.70	-2.02

విదేశీమారకం విలువ (ఫారెక్స్)

కరెన్సీ	రూ.విలువ క్రి.ముగింపు	రూ.విలువ ప్ర.ముగింపు
డాలర్	63.60	63.58
యూరో	78.98	79.19
పౌండ్	89.79	90.08
ఆస్ట్రేలియా డాలర్	51.47	51.53
సింగపూర్ డాలర్	48.53	48.61

బులియన్

బంగారం (10 గ్రాములు)	22 క్యారెట్లు రూ.	24 క్యారెట్లు రూ.
హైదరాబాద్	29,000	31,016
చెన్నై	29,000	31,016
బెంగళూరు	28,400	30,373
ముంబై	29,820	31,893
విజయవాడ	28,750	31,500
విశాఖపట్నం	29,000	31,636
ప్రొద్దుటూరు	28,550	30,830


ముడి చమురు	69.02



స్వల్పంగా పెరిగిన వెండి, బంగారం

ముంబై: బంగారం ధరలు రూ.62లు పెరిగి బుధవారం 10గ్రాములు రూ.30,114కు చేరాయి. మల్టికమోడిటీ ఎక్స్ఛేంజి కింద బంగారం ధరలు రూ.62లతో 0.21శాతం పెరిగడంతో టర్నోవర్ 472 లాట్లకుచేరింది. అంతర్జాతీయంగా బంగారం ధర 0.15శాతం పెరిగి సింగపూర్‌లో ఔన్స్ 1340.10 డాలర్లకుచేరింది. వెండి ధర రూ.99లు పెరిగి కేజీ వెండి రూ.39,771కు చేరింది. వెండి ఔన్స్ 0.15శాతం పెరిగి 17.12 డాలర్లకుచేరింది. దేశీయ ఈక్విటీ మార్కెట్ నుండి డాలర్, విదేశీ ప్రత్యక్షపెట్టుబడుల ఉపసంహరణ రూపాయి సెంటిమెంట్‌పై ప్రభావం చూపాయి. విదేశీ మదుపరులు బుధవారం స్టాక్స్ నుండి రూ.105.56 కోట్ల పెట్టుబడులను ఉపసంహరించుకున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో డాలర్ ఇండెక్స్ ఇతర ప్రధాన దేశాల కరెన్సీలతో చూసుకుంటే గ్రీన్‌లో నమోదయ్యాయి. గత వారం 0.1శాతం నష్టంతో 89.062 వద్ద నిలిచి మూడేళ్ల కనిష్టానికి చేరి 88.43 వద్ద నిలిచింది.

15పైసలు నష్టపోయిన రూపాయి



ముంబై: బ్యాంకులు, దిగుమతిదారుల నుండి డాలర్ డిమాండ్ పెరగడంతో రూపాయి బుధవారం 15పైసలు నష్టపోయి 63.75 వద్ద నిలిచింది. అంతర్జాతీయంగా ఇతర దేశాల కరెన్సీలతో చూసుకుంటే డాలర్ డిమాండ్ స్వల్పంగా తగ్గిందనే చెప్పవచ్చు.మంగళవారం 63.61 వద్ద నిలిచిన రూపాయి ఇంటర్ బ్యాంకు ఫారెన్ ఎక్స్ఛేంజి మార్కెట్‌లో 63.60 వద్ద ముగిసింది.

భారీగా పడిపోయిన చమురు ధరలు

ముంబై: ముడిచమురు ధరలు మూడో త్రైమాసికంలో భారీగా పడిపోయాయి. ముడి చమురు స్టాక్స్ గతవారం ఊహించిన దాని కంటే ఎక్కువగాపడిపోవడంతో ఇతర వస్తువుల అమ్మ కాలు, స్టాక్స్, బాండ్స్‌మదుపరుల సెంటిమెంట్‌ను మరింత బలపరచినట్లు తెలుస్తోంది. అంతర్జాతీయ బెంచ్‌మార్కు అయిన బ్రెంట్ క్రూడ్0.69 సెంట్లు లేక 1శాతం దిగజారి బ్యారెల్ 68.33 డాలర్లతో రెండువారాల కనిష్టానికి దిగజారింది. మంగళవారం యుఎస్ క్రూడ్ 1.6శాతం తగ్గి బ్యారెల్ 64.50 డాలర్లు పలికింది. గత రెండు సంవత్స రాలుగా అమెరికా ఉత్పత్తిదారులు చమురు ఉత్పత్తిలో గణనీ యమైన ప్రగతి సాధించారు. బ్రెంట్, వెస్ట్ టెక్సాస్ ఇంటర్ మీడియట్ వరుసగా ఐదవనెల లాభాల్లో కొనసాగుతు న్నాయి. గత వారం క్రూడ్‌స్టాక్స్ 3.2 మిలియన్ బ్యారెల్స్‌కు చేరాయి. మార్చి తరువాత అతిపెద్ద పెరుగదలగా యుఎస్‌ఎనర్జీ కంపెనీలు వెల్లడించాయి.

మదుపర్ల ఒత్తిడితో... మార్కెట్ విలవిల..!



న్యూఢిల్లీ : దేశీయ మార్కెట్లపై మోడీ సర్కారు ప్రవేశపెట్టే బడ్జెట్ ప్రభావం తీవ్రంగా పడుతోంది. వరుసగా రికార్డుల మీద రికార్డులు సృష్టించి లాభాల బాటలో దూసుకుపోయిన సెన్సెక్స్, నిఫ్టీపై మదుపర్ల ఒత్తిడి పెరిగింది. దక్కిన లాభాలతో సరిపెట్టుకునే రీతిలో మదుపర్లు షేర్లను విక్రయిస్తున్నారు. ఈ స్థితిలో బుధవారమూ ప్రారంభం నుంచే నష్టాల బాటలో సూచీలు దిగజారుతున్నాయి. దీర్ఘకాలిక మూలధన లాభాలపై పన్ను విధించేందుకు కేంద్రం కసరత్తు చేస్తున్నట్లు సమాచారం లీక్ కావటంతో... మదుపర్లు క్యూ కట్టారు. 11.05గంటల సమయంలో సెన్సెక్స్ 122.48 పాయింట్లు నష్టపోయి 35,911 వద్ద, నిఫ్టీ 31 పాయింట్లు నష్టపోయి 11,018 వద్ద ట్రేడవుతున్నాయి. మార్కెట్లో ప్రధానంగా 1176 షేర్లు లాభాల్లో, 1183 షేర్లు నష్టాల్లో ఉన్నాయి. 219 షేర్ల ధరల్లో మార్పులేదు. కొటక్ మహీంద్ర బ్యాంక్, బీహెచ్‌ఈఎల్, హిందాల్కో లాభాల్లో, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్, కోల్ ఇండియా, లుపిన్ నష్టాల్లో కొనసాగుతున్నాయి.

మూలధన లాభాలపై కేంద్రం కన్ను...!

దేశీయ స్టాక్‌మార్కెట్లకు కేంద్ర ప్రభుత్వం షాకివ్వబోతుంది. దీర్ఘకాలిక మూలధన లాభాలపై పన్నును విధించేందుకు సిద్దమవుతోంది. బడ్జెట్‌లో ఈ విషయాన్ని ప్రకటించే అవకాశముందని తెలుస్తోంది. 14 ఏళ్ల కిందట సెక్యురిటీస్ ట్రాన్సాక్షన్ ట్యాక్స్ (ఎస్టీటీ) పేరుతో వసూలు చేస్తున్న ఈ పన్నును అప్పటి ప్రభుత్వం రద్దు చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ పన్నును ఎల్టీసీజీ రూపంలో మరోసారి పునఃప్రవేశపెట్టబోతున్నారు. ఏదైనా లిస్టెడ్ కంపెనీ షేర్లు కొని ఏడాది తర్వాత అమ్ముకుంటే వచ్చే లాభాలపై ఇప్పటి వరకు ఎలాంటి పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు. కానీ ఇక నుంచి వీటిపై పన్ను చెల్లించాలి. ఇదే దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను. ఈ కాలపరిమితిని ఏడాది నుంచి మూడేళ్లకు పెంచుతారని అంచనాలు వెలువడుతున్నాయి. ప్రస్తుతం స్టాక్‌మార్కెట్‌లో షేర్ల క్రయవిక్రయాలపై స్వల్పకాలిక మూలధన లాభాల పన్ను 15 శాతంగా ఉంది. ఈ తేడాను తొలగించి ఈ బడ్జెట్‌లో దీర్ఘకాలిక లాభాలపై పన్ను విధించబోతున్నారు. ఈ పన్నులో మ్యూచువల్ ఫండ్స్ కలుపాలా? వద్దా? అన్నది కేంద్ర ప్రభుత్వం నిర్ణయిస్తోంది. కానీ మ్యూచువల్ ఫండ్స్ మధ్య తరగతి వర్గాలకు అతి ముఖ్యమైన పెట్టుబడి సాధ నంగా ఉన్న సంగతి తెలి సిందే. దీర్ఘకాలిక మూల ధన పన్నుపై మార్కెట్ మదుపర్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. విలువ అధికంగా ఉన్నప్పుడు ప్రభుత్వం ఈ పన్ను విధిస్తుందని తాము నమ్ముతున్నట్లు వారు పేర్కొంటున్నారు. స్టాక్‌మార్కెట్లపై ఈ ప్రభావం అధికంగా ఉంటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పన్ను విధింపుతో, ఇతర ఖర్చుల కోసం అవసరమయ్యే వనరులను సమకూర్చుకోవాలని ప్రభుత్వం భావిస్తుందనే వాదనలు వినిపిస్తున్నాయి.

దీర్ఘకాలిక, స్వల్పకాలిక మూలధన లాభాల పన్నులు, ప్రభుత్వ ఖజానాకు మంచి నిధులను సమకూర్చనున్నాయని డెలాయిట్ హాస్కిన్స్ అండ్ సెల్స్ కన్సల్టింగ్ సంస్థ పార్టనర్ హేమల్ మెహతా చెప్పారు. ఒకవేళ ఈసారి బడ్జెట్‌లో కనుక ఇదే జరిగితే స్టాక్ మార్కెట్లు తీవ్ర కుదుపులకు లోనయ్యే అవకాశం ఉంది. దీనికి తోడు పెద్దగా రిస్క్ తీసుకోలేని మదుపర్లు, తమ పెట్టుబడులను వెనక్కి తీసుకునే ప్రమాదం ఉందని నిపుణుల విశ్లేషణ.

సౌరశక్తితో హెచ్‌సీసీబీ ఉత్పత్తి...!



విజయవాడ : హిందుస్థాన్ కోకా-కోలా బేవరేజేస్ సంస్థ తెలుగురాష్ట్రాల్లోని తమ ఉత్పత్తి యూనిట్లల్లో సౌరశక్తిని వినియోగించుకోనుంది. ఇందుకు అవసరమైన సౌరవిద్యుత్ కోసం హైదరాబాద్‌లోని గ్రీన్ ఎనర్జీ సొల్యూషన్స్ కంపెనీ వైబ్రేంట్ ఎనర్జీతో ఒప్పందం కుదుర్చుకుంది. తెలంగాణలోని అమీన్‌పూర్, ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ, శ్రీకాళహస్తిలో హెచ్‌సీసీబీకి యూనిట్లు ఉన్నాయి. ఇందుకు 2.7 కోట్ల యూనిట్ల విద్యుత్తుశక్తి అవసరం. హెచ్‌సీసీబీకి అవసరమైన సౌరశక్తిని సరఫరా చేసేందుకు వైబ్రెంట్ ఎనర్జీ అంగీకరించింది. ప్రస్తుతం ఈ మూడు యూనిట్లకు 1.2 కోట్ల యూనిట్లు పొందుతుంది. ఈ ఒప్పందాలు అమలుకు ముందు హెసీసీబీ సోలార్ పీపీఏ నుంచి 45 లక్షల యూనిట్ల సోలార్ పవర్‌ను తీసుకుని పైలట్ ప్రాజెక్టును ప్రారంభిస్తుంది. ఇదే రీతిలో సోలార్ పీపీఏను కొనసాగిస్తుంది. అమీన్‌పూర్ ఫ్యాక్టరీకి 75 శాతం, విజయవాడ, శ్రీకాళహస్తి యూనిట్లకు 50 శాతం సోలార్ పవర్‌ను ఉపయోగిస్తుంది. దేశంలోని 21 ఫ్యాక్టరీల్లో ఇకపై ఎల్‌ఈడీ బల్బులనే వినియోగిస్తుంది. కర్ణాటకలోని తమ యూనిట్లల్లోనూ సోలార్ పవర్ వినియోగానికి హెచ్‌సీసీబీ ప్రయత్నాలు ప్రారంభించింది. ఇదిలా ఉంటే, హిందుస్థాన్ కోకాకోలా బేవరేజేస్ సీఈవో క్రిస్టినా రుగిరో, అహానా రెన్యువబుల్స్ మేనేజింగ్ డైరెక్టర్ మార్విన్ టిన్ ఫ్యాక్టరీ ఆవరణలో సోలార్ పవర్ వినియోగాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా హెచ్‌సీసీబీ సీఈవో క్రిస్టినా రుగిరో మాట్లాడుతూ, పర్యావరణాన్ని సంరక్షించే బాధ్యతను ప్రముఖంగా భావిస్తున్నామని, 2030 నాటికి శిలాజేతర ఇంధన వనరుల సంచిత విద్యుత్తు శక్తి సామర్థ్యాన్ని 40 శాతానికి పెంచాలనే ప్రభుత్వ లక్ష్యాన్ని స్ఫూర్తిగా తీసుకున్నట్లు తెలిపారు.అహానా రెన్యువబుల్స్ మేనేజింగ్ డైరెక్టర్ మార్విన్ టిన్ గ్రీన్ గోల్స్ సాధనలో హెచ్‌సీసీబీతో కలసి ప్రయాణం చేయటం తమకు ఆనందంగా ఉందన్నారు. ఈ రెండు సంస్థల పరస్పర ప్రయోజనానికి కట్టుబడి ముందుకు సాగుతామన్నారు.

రాజకీయాలను వేడెక్కిస్తున్న రాహుల్ జాకెట్

రూ.700లకే ఇప్పిస్తా.. రేణుకా చౌదరి



న్యూఢిల్లీ : మేఘాలయ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ రూ.70వేలు ఖరీదుచేసే జాకెట్ ధరించారని బీజేపీ విమర్శనాస్త్రాలు సంధించడంపై కాంగ్రెస్ ఎదురుదాడికి దిగింది. రాహుల్ ప్రతిష్టను దిగజార్చేందుకే బీజేపీ యత్నిస్తోందని విమర్శించింది. రాహుల్ బ్రిటన్‌కు చెందిన ఓ లగ్జరీ బ్రాండు జాకెట్ ధరించారని, దాని వెల రూ.70,000 లన్న బీజేపీ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నాయకురాలు రేణుకా చౌదరి స్పందించారు. ప్రధాని మోడీ కోరుకుంటే అదే జాకెట్‌ను కేవలం రూ.700లకే ఇప్పిస్తానన్నారు. అయితే ఆయన 56 అంగుళాల ఛాతీ తప్ప కొలతలేమీ తెలియదంటూ వ్యంగాస్త్రాలు సంధించారు. 'బీజేపీ తీరును చూసి నవ్వాలో.. ఏడ్వాలో.. తెలియడం లేదు. ఎవరు ఏం ధరించారు.. దాని ధర ఎంత అన్నది అన్వేషించడం తప్ప బీజేపీ వర్గాలకు మరోపని లేదని అంటున్నారా?? ప్రధాని మోడీకి కావాలంటే అదే జాకెట్‌ను రూ.700లకే కొనిస్తాను. అయితే నాకు ఆయన 56 అంగుళాల ఛాతి తప్ప మిగతా కొలతలు తెలియదు" అని రేణుకా చౌదరి వ్యాఖ్యానించారు. కాగా, రాహుల్ గతంలో బీజేపీది సూటు, బూటు ప్రభుత్వమంటూ విమర్శించిన విషయం తెలిసిందే.

మానేపల్లి జ్యుయలర్స్ ఫరెవర్ మార్క్



విశాలాంధ్రబ్యూరో- హైదరాబాద్: అత్యంత విశ్వసనీయమైన, పురాతన జ్యుయలర్ మానేపల్లి జ్యుయలర్స్ డిబిస్ క్రూస్ కంపెనీలకు చెందిన డైమండ్ బ్రాండ్ ఫరెవర్ మార్క్‌తో భాగస్వామ్యం చేసుకొంది. హైదరాబాద్‌లో తన స్టోర్స్‌లో ఈ బ్రాండ్‌ను అందాల నటి రాశీఖన్నా చేతుల మీదుగా ఆవిష్కరించింది. అరుదైన వజ్రాలకు ప్రతిరూపంగా ఫరెవర్ మార్క్ నిలుస్తోంది. ఒక తరం నుంచి మరొక తరానికి వారసత్వంగా వెళ్లే ఆభరణాల్లో ఫరెవర్ మార్క్ వజ్రాలుంటాయి. మనేపల్లి జ్యుయలర్స్ మేనేజింగ్ డైరెక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రపంచంలో ఒక్క శాతం కన్నా తక్కువ వజ్రాలు ఫరెవర్ మార్క్‌కు అర్హత పొంది ఉంటాయన్నారు.

వైద్యుల కోసం' ఈమెడికోస్' యాప్

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: వైద్య విద్యార్థులు, వైద్యులు, ఆరోగ్యసంరక్షణ వృత్తి నిపుణులు తమ వృత్తిపరమైన నెట్‌వర్క్‌ను పెంచుకునేందుకు తమ విజ్ఞానాన్ని పంచుకునేందుకు వీలుగా ఈమెడికోస్ యాప్ రూపుదిద్దుకుంది. యాపిల్, ఆండ్రాయిడ్ యూజర్లకు ఇది అందుబాటులో ఉంది. డిజిటల్ మెడికల్ కమ్యూనిటీని రూపొందించాలన్న కలను నిజం చేసేలా దీన్ని రూపొందించినట్టు యాప్ రూపకర్త, ప్రాక్టీసింగ్ రేడియాలజిస్ట్ డా.సుమేర్ సేథి తెలిపారు. వైద్య విద్యార్థులు వైద్యవిద్య ఆధారిత కంటెంట్‌ను ఉపయోగించుకునే తీరు తెన్నులను మార్చడమే తమ లక్ష్యమన్నారు. ఈ యాప్‌లో లైవ్ స్ట్రీమింగ్, రికార్డెడ్ వీడియోల రూపేణ కోర్సులు ఉంటాయన్నారు. ఇటీవల ఈ విధమైన బ్లెండెడ్ లెర్నింగ్ ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందిందన్నారు. తాము అందిస్తున్న కోర్సులు ఈ-బుక్స్, మాక్స్ ఎగ్జామ్స్‌కు యాక్సెస్ కల్పించేవిగా ఉంటాయని చెప్పారు. నీట్ పీజీ నీట్ సూపర్ స్పెషాలిటీ, యుఎస్‌ఎంఎల్‌ఈ, పీఎల్‌ఏబీ, ఎంఆర్‌సీపీ, ఆస్ట్రేలియన్, కెనడియన్ పరీక్షలకు సన్నద్ధమయ్యే వైద్య విద్యార్థులకు ఈ యాప్ ఉపయోగపడుతుందని సేథి తెలిపారు.

'రియల్'కు రుణాలివ్వలేం

- బ్యాంకుల స్పష్టీకరణ
- 17శాతం తగ్గిన రుణవితరణ
- ఐదేళ్లలో రియల్‌లో కోటిన్నర ఉద్యోగాలు



ముంబై : దేశీయ రియల్టీ సంస్థలకు బ్యాంకులు రుణాలు ఇవ్వడానికి భయపడుతున్నాయి. పార్లమెంట్‌కు కేంద్ర ప్రభుత్వం అందచేసిన ఆర్థిక సర్వే ఈ విషయాన్ని బహిర్గతం చేసింది. నిరర్థక ఆస్తులు పెరుగుతున్న నేపథ్యంలో రియల్ ఎస్టేట్ రంగ సంస్థలకు రుణ వితరణ గతేడాది 17 శాతానికి తగ్గినట్లు ఆర్థిక సర్వే వెల్లడించింది. 2013లో ఇది 68 శాతంగా ఉన్నది. ఒకవైపు నిరర్థక ఆస్తులు పెరుగుతుండటం, మరోవైపు రియల్ ఎస్టేట్ వ్యాపారంలో లాభాలు అంతకంతకు పడిపోతుండటం ఇందుకు కారణమని సర్వే విశ్లేషించింది. ప్రభుత్వరంగ బ్యాంకులు, గృహ రుణాలు అందించే సంస్థల మొండిబకాయిలు పెరుగుతుండటంపై ఆర్థిక సర్వే ఆందోళన వెలిబుచ్చింది. దీంతో రియల్ ఎస్టేట్ సంస్థలు ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించాయి. ముఖ్యంగా ప్రైవేట్ ఈక్విటీ ఫండ్లు, ఆర్థిక సేవల విభాగాలకు చెందిన పెన్షన్ ఫండ్లు, సావరిన్ వెల్త్ ఫండ్ల నుంచి నిధులు సేకరిస్తున్నాయని తెలిపింది. 2013లో 14 శాతంగా ఉన్న ప్రైవేట్ ఈక్విటీ ఫండ్ల వాటా... గతేడాది చివరి నాటికి 82 శాతానికి చేరుకున్నాయి. వ్యక్తిగతంగా గృహ రుణాలు తీసుకునేవారికి పీఎన్‌బీలు, హెచ్ఎఫ్‌సీలు పెద్దపీట వేస్తున్నాయి. రియల్ ఎస్టేట్ రంగంలో ఇటీవల చోటుచేసుకున్న సంస్కరణలు అమ్మకాలపై స్వల్పకాలం పాటు ప్రభావం చూపినప్పటికీ దీర్ఘకాలికంగా లాభం చేకూరనున్నదని పేర్కొన్నది. ఏప్రిల్ 2016 నాటికి 8.88 లక్షలుగా ఉన్న అమ్మకం కాని యూనిట్లు గతేడాది అక్టోబరు నాటికి 8.07 లక్షలకు తగ్గాయి. 2013-16 మధ్యకాలంలో రియల్టీ రంగంలోకి ప్రైవేట్ ఈక్విటీ పెట్టుబడులు ఆరు రెట్లు పెరిగి 0.9 బిలియన్ డాలర్ల నుంచి 5.9 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. కానీ, దేశీయ రియల్ ఎస్టేట్ రంగం మాత్రం సంస్థాగత పెట్టుబడిదారులను ఆకట్టుకుంటున్నదని, గడిచిన రెండేళ్లకాలంలో 10.7 బిలియన్ డాలర్ల మేర నిధులు చొప్పించినట్లు సర్వే తెలిపింది. ఈ రంగంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు 107 మిలియన్ డాలర్ల మేర వచ్చాయి.

ఐదేళ్లలో రియల్టీలో కోటిన్నర ఉద్యోగాలు

దేశీయ రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగంలో ఉద్యోగ కల్పన ఊపందుకుంటున్నది. వచ్చే ఐదేళ్లలో ఈ రెండు రంగాల్లో కోటిన్నర మందికి ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉన్నదని ఆర్థిక సర్వే చెప్పుకొచ్చింది. పెద్ద నోట్ల రద్దు, రెరా చట్టం అమలులోకి రావడంతో గడిచిన కొన్ని త్రైమాసికాలుగా తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నప్పటికీ ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో మాత్రం దూసుకుపోతున్నదని సర్వే అభిప్రాయపడింది.

ఉద్యోగ కల్పనలో రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాలు రెండోస్థానంలో ఉన్నాయి. మొదటిస్థానంలో వ్యవసాయ రంగం ఉన్నది. 2013 నాటికి నాలుగు కోట్ల మందికి ఉపాధి కల్పిస్తున్న ఈ రంగం..2017 నాటికి 5.2 కోట్లకు చేరుకోగా, ఇదే క్రమంలో 2022 నాటికి 6.7 కోట్లకు చేరుకునే అవకాశం ఉన్నదని సర్వే వెల్లడించింది. అంటే ప్రతియేటా 30 లక్షల మందికి ఉపాధి లభించవచ్చని చెబుతుంది.

విజ్ఞానం

మిల్క్ బ్యాక్టీరియాతో

రుమటాయిడ్ ఆర్థరైటిస్...!



జన్యుపరంగా సంక్రమించే రుమ టాయిడ్ ఆర్థరైటిస్ ఉన్నవారిలో మిల్క్ బ్యాక్టీరియా మరింత పెరుగుదలకు దోహదం చేస్తుందని తెలుస్తోంది. ఈ బ్యాక్టీరియా ఇన్‌ఫెక్టెడ్ మిల్క్‌లోగానీ, గొడ్డు మాంసం, పశువుల పేడ ద్వారా సంక్రమించవచ్చునని తెలుస్తోంది. ఇన్‌ఫ్లమేటరీ, ఆటో ఇమ్యూన్ డిసీజ్ అయిన రుమటాయిడ్ ఆర్థరైటిస్ వ్యక్తుల కండరాలు, జాయింట్లు, ఎముకలపై ప్రతికూల ప్రభావాన్ని చూపిస్తుందని తెలుస్తోంది. శాస్త్ర వేత్తల తాజా అధ్యయనంలో రుమటాయిడ్ ఆర్థరైటిస్‌కు మైకో బాక్టీరియం ఏవియం సబ్‌స్పీసీస్ పారాట్యుబర్కులోసిస్ (MAP)కు సంబంధం ఉన్నట్లు తెలుస్తోంది. 100మంది రోగులపైచేసిన అధ్యయనంలో 80 శాతం మంది రోగుల్లో PTPN2/22 జీన్‌లో మ్యుటేషన్ ఉన్నట్లు తెలుస్తోంది. 40శాతం మందిలో చేపట్టిన పరీక్షలో మాప్ పాజిటివ్‌గా నమోదైంది. ఈ వ్యాధి ఏ వయసువారికైనా రావచ్చునని ముఖ్యంగా మహిళల్లో ఈ వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటోందని వీరి అధ్యయనంలో వెల్లడించారు.

అల్జీమర్స్ వ్యాధికి

బ్రెయిన్ పేస్‌మేకర్ తోడ్పాటు

బ్రెయిన్ పేస్‌మేకర్‌తో అల్జీమర్స్ లక్షణాల్లో కొంత మెరుగుదల కనిపించినట్లు అమెరికాలోని ఓహియా స్టేట్‌యూనివర్సిటీ అధ్యయనంలో వెల్లడైంది. మెదడులో ప్రకంపనాలు కలిగించి కార్డియాక్ పేస్‌మేకర్ డివైజ్‌లో పనిచేసే డీప్ బ్రెయిన్ స్టిమ్యులేషన్(డిబిఎస్) అల్జీమర్స్ రోగులకు తోడ్పడింది. పల్చని ఎలక్ట్రిక్ వైర్లను రోగి మెదడులోని ఫ్రంటల్‌లోబ్‌లో సర్జరీ ద్వారా ఇమ్‌ప్లాంట్ చేయడంతో రోగి తీసుకునే నిర్ణయాలు, పనివిధానం మెరుగైనట్లు తెలుస్తోంది. గుండెకు అమర్చిన పేస్‌మేకర్‌తో కాగ్నిటివ్, బిహేవియరల్, పనితీరు మెరుగుపడినట్లే బ్రెయిన్ పేస్ మేకర్‌తో జ్ఞాపకశక్తిలో మెరుగుదలతో చికిత్స మరింత సలభమైనట్లు తెలుస్తోంది. సమస్యలను పరిష్కరించేందుకు, ప్రణాళిక సురూపొందించేందుకు మంచి తీర్పును ఇవ్వడానికి మెదడులోని ఫ్రంటల్‌లోబ్ తోడ్పాటునందిస్తుంది. ఈ ప్రాంతాన్ని స్టిమ్యులేట్ చేయడం ద్వారా అల్జీమర్స్ వ్యాధిని నియంత్రించవచ్చునని తెలుస్తోంది. 30ఏళ్ల నుండి అమర్చిన ఈ విధానంతో ఎటువంటి ఇబ్బందులు లేవని సంబంధిత రోగులు వెల్లడించారు.

అథ్లెట్ శివకేశవన్‌కు హీరో తోడ్పాటు



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: హీరో ఎలక్ట్రానిక్స్ అండ్ హీరో ఫిన్‌కార్ప్ తాజాగా అథ్లెట్ శివకేశవన్‌కు స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్నట్లు తెలిపింది. శివకేశవన్ వింటర్ ఒలింపిక్స్-2018లో పాల్గొననున్నారు. శివకేశవన్ గతంలో జాతీయ అంతర్జాతీయ పతకాలను అందుకున్నారు. 2017లో జర్మనీలో జరిగిన ఆసియన్ లీగ్ చాంపియన్‌షిప్‌లో బంగారు పతాకాన్ని సొంతం చేసుకున్నారు. శివకేశవన్ సిక్స్‌త్ ఒలింపిక్స్ గేమ్స్‌లో భారత్ నుంచి ప్రాతినిధ్యం వహించారు. అలాగే నాలుగు ఆసియన్ గోల్డ్ మెడల్స్, నాలుగు రజిత, రెండు కాంశ్య పతకాలు సాధించారు. శివ స్ఫూర్తిదాయక గాథకు తమ చేయూత తోడైందని హీరో ఎలక్ట్రానిక్స్ ఫౌండర్, డైరెక్టర్ ఉజ్వల్ ముంజల్ తెలిపారు.

ఫార్చ్యూన్ సర్వేలో ఫెడ్ ఎక్స్‌కు స్థానం

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: ప్రముఖ మాగజైన్ ఫార్చ్యూన్ సర్వేలో ఫెడ్ ఎక్స్‌కు స్థానం దక్కింది. ప్రపంచంలోనే అత్యంత ఆదరణ కలిగిన కంపెనీల జాబితాలో స్థానాన్ని సంపాదించుకుంది. ఈ ఏడాది ఫార్చ్యూన్ మ్యగజైన్ నిర్వహించిన సర్వేలో ఫెడ్‌ఎక్స్ సంస్థ 9వ ర్యాంక్‌ను కైవసం చేసుకుంది. ఫైనాన్షియల్ పనితీరు, కార్పొరేట్ పేరు ప్రఖ్యాతలకు సంబంధించి ఈ సర్వేలో 9 లక్షణాలను పరిగణనలోకి తీసుకోగా ఫెడ్ ఎక్స్‌కు మరోసారి స్థానం దక్కింది. అంతర్జాతీయ సంస్థల వరుసలో నిలవడంపై కంపెనీ సీఈవో ఫెడరిక్ డబ్ల్యూ స్మిత్ సంతోషం వ్యక్తం చేశారు. ఈ స్థానం దక్కేందుకు కృషి చేసిన తమ సంస్థ సిబ్బందికి ఆయన ప్రత్యేక ధన్యవాదలు తెలిపారు.

2017 నుండి 2018 బడ్జెట్ వరకు..

ముంబై:భారతీయ స్టాక్ మార్కెట్‌లో 2017 బడ్జెట్ నుండి 2018 బడ్జెట్ వరకు కొనసాగిన సంవత్సర కాలం అత్యంత ప్రధానమైనదేనని చెప్పవచ్చు ఈ కాలంలో బెంచ్‌మార్క్ సెన్సెక్స్ 30శాతానికిపైగా లాభపడింది. అదే కాలంలో 44 బ్లు చిప్ కంపెనీల స్టాక్స్ 200శాతం పెరుగదల నమోదు చేసాయి. డిఎల్‌ఎఫ్,రిలయన్స్ ఇండస్ట్రీస్, టాటాస్టీల్, మారుతి సుజుకి, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు 200శాతం వృద్ధి నమోదుచేసాయి. గురువారం అంటే 2018 ఫిబ్రవరి 1న ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ యూనియన్ బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు రంగం సిద్ధం చేశారు. గత సంవత్సరం కాలంలో బిఎస్‌ఇ సెన్సెక్స్ 30.29శాతంతో 8,377.77 పాయింట్లతో 36,033.73 పాయింట్లను మోదు చేయగా నిఫ్టీ 29శాతం లాభపడింది. గత మంగళవారం ఇండియన్ ఈక్విటీలు 36వేలు, 11వేలు దాటి నూతన గరిష్టాలను చేరాయి. ఈ కీలక సూచీలు 2018 జనవరిలో 35 వేలను అధిగమించడం గమనించదగ్గ విషయం. గత 13నెలల్లో సెన్సెక్స్,నిఫ్టీ సుమారు 34-36శాతం వృద్ధి నమోదు చేసాయి.

ముఫ్తీ వ్యాఖ్యలపై మాట్లాడరేం?

నిర్మలా సీతారామన్‌కు స్వామి ప్రశ్న

న్యూఢిల్లీ : షోపియాన్‌లో కాల్పుల నేపథ్యంలో ఆర్మీ సిబ్బందిపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేయాలన్న జమ్మూకాశ్మీర్ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ నిర్ణయంపై రక్షణమంత్రి నిర్మలా సీతారామన్ మౌనం వహించడాన్ని బీజేపీ నేత సుబ్రమణ్య స్వామి తప్పుబట్టారు. ఇది దేశభక్తికి విరుద్ధమన్నారు. ఫిబ్రవరి 2లోగా సీతారామన్ తన వైఖరిని వెల్లడించాలని అల్టిమేటం ఇచ్చారు. లేక పోతే ఈ అంశాన్ని పార్లమెంటులో లేవనెత్తుతానన్నారు. 'నిర్మలా సీతా రామన్ దీనిపై ఎందుకు స్పష్టత ఇవ్వడంలేదో అర్థంకావడం లేదు. ఆమె మౌ నాన్ని అంగీకారమనుకోవాలా.. అయితే అది పార్టీ విధానాలకు, దేశప్రజల మనోభావాలకు, దేశభక్తికి విరుద్ధం. ఫిబ్రవరి 2లోగా నిర్మలా సీతారామన్ స్పష్టత ఇవ్వకపోతే ఈ విషయాన్ని చట్టసభలో ప్రస్తావిస్తాను' అని స్వామి అన్నారు. షోపియాన్‌లో కాల్పులకు ఆర్మీ నిర్లక్ష్యమే కారణమని, దీనిపై సీతారామన్‌తో చర్చించాకే జవాన్లపై ఎఫ్‌ఐఆర్‌కు చర్యలు చేపట్టినట్టు ముఫ్తీ అసెంబ్లీలో వెల్లడించారు. దీనిపై ఘాటుగా స్పందించిన స్వామి... ముఫ్తీ ప్రభుత్వాన్ని ఎందుకు రద్దు చేయడం లేదని కేంద్రాన్ని నిలదీశారు. కాశ్మీర్‌లో పీడీపీతో తెగతెంపులు ఎందుకు చేసుకోవడం లేదని ఎన్డీఏ సర్కార్‌ని ప్రశ్నించారు.



నిన్న నిరుపేద.. నేడు 20 కంపెనీలకు అధిపతి

యువతకు బాసటగా నిలిచిన మన్నెం మధుసూదన్‌రావు



కొంతమంది జీవితాలు సినిమా కథలకు ఏ మాత్రం తీసిపోవు. ఇతని కథ కూడా అలాంటిదే. కటిక పేదరికంలో పుట్టాడు. కాలే కడుపుతో కష్టాలు అనుభవిస్తూ పెరిగాడు. పేదరికాన్ని దూరం చేసుకునేందుకు కసితో చదివాడు. అయినా ఉద్యోగం రాలేదు. కుటుంబానికి ఆసరాగా నిలిచేందుకు కూలీ అవతారం ఎత్తాడు. వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకుని.. నేడు 20 కంపెనీలకు ఛైర్మన్ అయ్యాడు. వేల మందికి ఉపాధి కల్పిస్తూ పేదరికంలో మగ్గుతున్న యువతకు బాసటగా నిలిచాడు. నిరుపేద దళిత కుటుంబంలో పుట్టి దేశం గర్వించదగ్గ స్థాయికి చేరుకున్న మన్నెం మధుసూదన్‌రావు గురించి ఇప్పుడు ప్రపంచం మొత్తానికి తెలుసు.

తండ్రి వెట్టి కూలీ. తల్లి పొగాకు ఫ్యాక్టరీలో దినసరి కూలీ. రోజూ 18గంటలు పనిచేసినా పిల్లల కడుపు నింపడం వాళ్లకు గగనమైపోయేది. అమ్మానాన్న పనికి వెళ్లలేదంటే ఆ రోజు కుటుంబమంతా పస్తులతో పడుకోవాల్సిందే. ఇంట్లో మొత్తం పది మంది. 8 మంది పిల్లల్లో మధుసూదన్ రావు ఎనిమిదో సంతానం. కడుపు నిండా తిండి, కట్టుకునేందుకు మంచి బట్టలు, కాళ్లకు చెప్పులు వారికి కలలో మాత్రమే కనిపించేవి.

గుడిసె వారి ఆవాసం. ఉదయం నిద్ర లేచే సమయానికి అమ్మానాన్న ఇంట్లో కనిపించేవారు కాదు. రాత్రి నిద్రపోయాక వాళ్లు తిరిగొచ్చేవారు. ఎప్పుడో ఒకసారి వారిని చూసే అవకాశం దొరికేది. దీంతో అసలు తల్లిదండ్రులు ఏం చేస్తారు? ఎక్కడికి వెళ్తారన్న ప్రశ్న కూడా అతన్ని వేధించేది. వయసు పెరిగేకొద్దీ ఈ ప్రశ్నలకు సమాధానం దొరికింది. తాము దళితులమని, తండ్రి ఓ భూస్వామి దగ్గర వెట్టి చాకిరీ చేస్తాడని, కుటుంబ పోషణ కోసం తల్లితో పాటు పెద్దక్క కూడా పొగాకు ఫ్యాక్టరీలో పనికెళ్తుందని తెలుసుకున్నాడు.

కష్టాలు, కట్టుబాట్ల మధ్య పెరిగిన మధుసూదన్‌కు పెద్ద చదువులు చదివి పట్నంలో ఉద్యోగం చేస్తే పేదరికం, వెట్టి చాకిరీ నుంచి కుటుంబానికి విముక్తి కల్పించవచ్చన్న విషయం అర్థమైంది. అందుకే శ్రద్ధగా చదివాడు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా కందుకూరు తాలూకాలోని పాలకూరు మధుసూదన్ రావు స్వస్థలం. తండ్రి పేరు పేరయ్య. తల్లి రాములమ్మ. తండ్రి ఓ భూస్వామి దగ్గర పని చేసేవాడు. వీరి కుటుంబానికి వెట్టి చాకిరీ వారసత్వంగా వచ్చింది. మధుసూదన్ తాత, ముత్తాత కూడా ఆ భూస్వామి కుటుంబం దగ్గరే పనిచేసేవారట. వాళ్లు విదిల్చే డబ్బు కోసం ఏకబిగిన 18 గంటల పాటు పొలం పనులు చేయడం, పశువుల్ని మేపడం, ఇంటెడు చాకిరీ చేయాల్సి వచ్చేది. పనికెళ్లిన రోజు పైసలు.. అమ్మ, అక్క రోజూ 12 కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్లి ఫ్యాక్టరీలో పనిచేసి వచ్చేవారు. ఇంత కష్టపడుతున్నా అప్పుడప్పుడు పస్తులతో పడుకోవాల్సి వచ్చేది.

పూట గడవడమే కష్టంగా ఉన్నా కనీసం ఇద్దరు పిల్లలనైనా చదివించాలని తల్లిదండ్రులు నిర్ణయించుకున్నారు. మొదట మధుసూదన్ అన్న మాధవ్‌ను స్కూల్‌లో చేర్చారు. ఆ తర్వాత మధు వంతు వచ్చింది. ఇద్దరు గవర్నమెంట్ స్కూల్‌లో చేరారు. శ్రద్ధగా చదువుకోవడంతో పరీక్షల్లో ఎప్పుడూ మంచి మార్కులొచ్చేవి. అన్నదమ్ములిద్దరూ ఇంటికి దగ్గరలోని సంక్షేమ హాస్టల్‌లో చేరారు. ఒక్క భోజనం తప్ప మిగతా అన్ని విషయంల్లో హాస్టల్‌లో ఎలాంటి ఇబ్బందులు ఉండేవి కాదు. హాస్టల్ వార్డెన్ లక్ష్మీనర్సయ్య, టీచర్ జేకే- ఈ అన్నదమ్ములిద్దరికీ ఎంతో సాయం చేశారు. ఫస్ట్ క్లాస్ మార్కులు తెచ్చుకోవాలంటూ వెన్నుతట్టి ప్రోత్సహించారు. వారి ఆశల్ని మధుసూదన్ ఏనాడు వమ్ము చేయలేదు. క్లాస్‌లో ఎప్పుడూ టాప్ 5లో ఉండేవారు. సెకండ్, థర్డ్ ర్యాంక్ అలా వచ్చేవి. హాస్టల్‌లో ఉంటూనే మధుసూదన్ ఇంటర్మీడియట్ పూర్తిచేశాడు. అన్న మాధవ్ అప్పటికే బీటెక్‌లో జాయిన్ అయ్యాడు. మధుసూదన్‌కు కూడా బీటెక్ చేయాలని ఉన్నా.. అన్న, ఇతర మిత్రుల సలహా మేరకు పాలిటెక్నిక్‌లో చేరాడు. అప్పట్లో పాలిటెక్నిక్ కోర్సు పూర్తైతే తప్పక ఉద్యోగం వస్తుందన్న గట్టి నమ్మకం ఉండేది. ఎంట్రెన్స్ టెస్ట్‌లో మంచి ర్యాంకు రావడంతో శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీలో సీటు వచ్చింది. రెండేళ్ల పాటు తిరుపతి, ఫైనల్ ఇయర్ ఒంగోలులో చదివి డిప్లొమా పట్టా అందుకున్నాడు.

మధుసూదన్ డిప్లొమా పూర్తి కాగానే అతని కుటుంబ సభ్యుల్లో చెప్పలేనంత ఆనందం కలిగింది. మధుకు మంచి ఉద్యోగం వచ్చి నాలుగు డబ్బులు వచ్చి తమ దరిద్రం దూరమవుతుందని తల్లిదండ్రులు అన్నా చెల్లెళ్లు ఆశపడ్డారు. ఉద్యోగం కోసం ఎన్ని అర్జీలు పెట్టుకున్నా, ఆఫీసుల చుట్టు కాళ్లరిగేలా తిరిగినా ఫలితంలేకుండా పోయింది.

"ఏ ఇంటర్వ్యూకు వెళ్లినా అక్కడ రిఫరెన్స్ అడిగేవారు. కానీ నాకు రిఫరెన్స్ ఇచ్చేందుకు ఎవరూ లేరు. గ్రామీణ ప్రాంతానికి చెందిన వాడినవడం కూడా నన్ను రిజెక్ట్ చేసేందుకు మరో కారణం. కుటుంబంలో అందరూ నిరక్షరాస్యులే అన్న సాకుతో చాలా కంపెనీలు ఉద్యోగం ఇచ్చేందుకు నిరాకరించాయి. ఏం చేయాలో అర్థంకాలేదు. ఖాళీగా కూర్చోలేను. ఏ పని చేసైనా డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నా." అని మధుసూదన్ తెలిపారు. దీంతో తోబుట్టువులతో కలిసి కూలీ పనులకు వెళ్లాలని నిర్ణయించుకున్నాడు. తన సోదరుల్లో ఒకరు హైదరాబాద్‌లో మేస్త్రీ పని చేసేవాడు. మధు అతని దగ్గరే భవన నిర్మాణ కూలీగా పనిచేసేవారు. రోజంతా కష్టపడితే 50 రూపాయలు ఇచ్చేవారు. రాత్రిళ్లు పనిచేస్తే 120 రూపాయలు ఇస్తారన్న విషయం తెలిసింది. దాంతో రాత్రివేళల్లో కూడా పనికెళ్లడం మొదలుపెట్టారు. కొన్ని రోజుల పాటు వాచ్‌మెన్‌గానూ పనిచేశారు. నీతి, నిజాయితీ, కష్టపడి పనిచేసే తత్వమే తనకు జీవితంలో మరో అవకాశం ఇచ్చిందంటారు మధుసూదన్.

"ఓ రోజు టెలిఫోన్ స్తంభం పాతేందుకు గొయ్యి తీస్తుండగా అక్కడికి వచ్చిన ఒక ఇంజనీర్ చదువుకున్నావా అని అడిగారు. పాలిటెక్నిక్ కంప్లీట్ చేశానని చెప్పా. పనిచేసే విధానాన్ని చూసి నువ్వు చదువుకుని ఉంటావనిపించింది అన్నారు. వేరే వాళ్లెవరూ ఇంత నైపుణ్యంతో కొలతలు తీసుకుని సైంటిఫిక్ పద్ధతిలో గొయ్యి తవ్వరు అన్నారు" అని మధుసూదన్ తెలిపారు.

మధుసూదన్ పనితీరును మెచ్చిన ఇంజనీర్ ఉద్యోగం ఆఫర్ చేశాడు. ఆఫీసుకు తీసుకెళ్లి ఇంటర్వ్యూ చేశాడు. ఆఫీసులో ఓ వైపు ఇంటర్వ్యూ జరుగుతుండగా.. మరోవైపు కాంట్రాక్టర్, సబ్ కాంట్రాక్టర్ మధ్య ఓ కాంట్రాక్టు విషయంలో వాగ్వాదం నడుస్తోంది. సబ్ కాంట్రాక్టర్ ఎక్కువ డబ్బు అడుగుతున్నాడు. దీంతో మధుసూదన్ ఆ కాంట్రాక్టు తనకివ్వమని అడిగాడు. పనిచేయించడంలో తాను ఎక్స్‌పర్ట్ నని, తన కుటుంబ సభ్యులంతా కష్టపడి పనిచేస్తారని చెప్పి నమ్మకం కలిగించే ప్రయత్నం చేశాడు. సబ్ కాంట్రాక్టర్‌తో ఒప్పందం కుదరకపోవడంతో చివరకు మధుసూదన్‌కు ఆ పని అప్పగించాడు. పని దొరికింది. కానీ దాన్ని ప్రారంభించేందుకు కూలీలకు అడ్వాన్స్ ఇవ్వాలి. మధుసూదన్ తన తోబుట్టువులను ఆర్థికసాయం కోరాడు. ఒక అక్క 900 రూపాయలు సర్దింది. ఆ డబ్బులతో కూలీల దగ్గరకెళ్లి, పని పూర్తికాగానే మిగతా డబ్బు ఇస్తానని ఒప్పించాడు. తొలిరోజు 20 వేల రూపాయల ఆదాయం. ఖర్చులు పోనూ చాలా డబ్బే మిగిలింది. ఆ రోజు అక్కతో కలిసి మళ్లీ కడుపునిండా అన్నం తిన్నారు. ఆ రోజు నుంచి మధుసూదన్ తలరాతే మారిపోయింది. మధుసూదన్ పనితీరు నచ్చిన కాంట్రాక్టర్ లక్ష రూపాయలు అడ్వాన్స్‌గా ఇచ్చాడు. ఒకదాని వెంట ఒకటిగా వరుసగా కాంట్రాక్టులు వచ్చాయి. కొన్ని రోజుల్లోనే లక్ష రూపాయలు వెనకేశారు. తరువాత ఊరికెళ్లి అమ్మానాన్న చేతిలో లక్ష రూపాయలు పెట్టగానే వారు ఆశ్చర్యపోయారు.

ఆ డబ్బుతోనే మధుసూదన్ చెల్లి పెళ్లి చేశారు. తరువాత హైదరాబాద్ తిరిగొచ్చారు. కాంట్రాక్టులు పెరిగాయి. ఆదాయం పెరిగింది. జీవితం సాఫీగా సాగుతోంది. కొందరు స్నేహితులు ప్రోద్బలంతో కంపెనీ ప్రారంభించారు. కంపెనీ బాగానే నడిచింది. అయితే భాగస్వాములు మోసం చేశారు. అతడి సంపాదనంతా దోచేశారు. ఈ ఘటన తనకు జీవితంలో గొప్ప గుణపాఠం నేర్పిందంటారు మధుసూదన్. అలాంటి పరిస్థితి ఎదురుకావడంతో ఒక రకంగా తనకు మంచే జరిగిందని అంటారు. తరువాత ఓ ఇంజనీరింగ్ కంపెనీలో ఉద్యోగంలో చేరారు. అదే సమయంలో వివాహమైంది.

ఉద్యోగం చేస్తున్నా మనసు మాత్రం వ్యాపారం వైపు లాగేది. ఏ రంగంలోనైనా విజయం సాధించేందుకు అవసరమైన అన్ని నైపుణ్యాలు తనలో ఉన్నాయని, ఉద్యోగం చేస్తూ సమయం వృధా చేసుకుంటున్నాన్న భావన కలిగేది. దీంతో మధుసూదన్ భార్యతో చెప్పకుండా కంపెనీ ప్రారంభించాడు. ఆదాయం కూడా బాగానే వచ్చింది. ఓ రోజు ఇంటికొచ్చిన లెటర్‌తో మధుసూదన్ బిజినెస్ చేస్తున్న విషయం భార్యకు తెలిసింది. అప్పటికి భార్యాభర్తలిద్దరూ ఉద్యోగం చేస్తున్నారు. అయినా ఆదాయం 30-35 వేలు దాటేదికాదు. అదే బిజినెస్ చేస్తే కనీసం 3 లక్షలు సంపాదించొచ్చని, ఇద్దరూ ఏడాది పాటు ఉద్యోగం చేస్తే వచ్చే డబ్బు నెల రోజుల్లోనే సంపాదించొచ్చని నచ్చజెప్పడంతో ఆమె శాంతించింది.

భార్య ప్రోత్సాహంతో వ్యాపారంలో మరిన్ని మైలు రాళ్లు దాటిన మధుసూదన్ ఎంతో మందికి రోల్ మోడల్ అయ్యారు. వీవీ- గ్రూప్ ఆఫ్ కంపెనీస్ పేరుతో టెలికాం, ఐటీ, ఎలక్ట్రికల్, మెకానికల్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో ఇప్పటికి 20 కంపెనీలు పెట్టి విజయవంతమైన పారిశ్రామికవేత్తగా పేరు తెచ్చుకున్నారు. వేల మందికి ఉపాధి కల్పిస్తున్నారు. మధుసూదన్ గురించి ఇప్పుడు ప్రపంచం మొత్తానికి తెలుసు. 20 కంపెనీలను మేనేజ్ చేయడం ఏమంత పెద్ద కష్టం కాదంటారు మధుసూదన్. తన కుటుంబ సభ్యులంతా వ్యాపారంలో చేదోడువాదోడుగా ఉంటారని, ఒక్కొక్కరు ఒక్కో బాధ్యతను భుజాన వేసుకుని అవసరమైన సాయం చేస్తారని అంటున్నారు.

"ప్రతి విషయంలోనూ నిపుణులయిన వారిని కంపెనీ హెడ్‌లుగా నియమించా. ఎవరి పనులు వారు చక్కగా చేసుకుంటారు. ప్రతిరోజూ అన్ని కంపెనీల హెడ్స్‌తో మాట్లాడుతాను. అవకాశాల కోసం వెతుకుతూనే ఉంటాను. అవకాశం దొరికిన వెంటనే అందిపుచ్చుకుంటాను." అని మధుసూదన్ తెలిపారు. టైం మేనేజ్ మెంట్ పెద్ద సమస్యే కాదనే మధుసూదన్.. ఈ విషయంలో తల్లిదండ్రులే తనకు స్ఫూర్తి అని చెబుతారు. వారిచ్చిన ప్రేరణతోనే సమస్యల నుంచి బయటపడటం నేర్చుకున్నానని అంటారు.

మేన్, మెటీరియల్, మనీ ఈ మూడింటిని సమర్థంగా వినియోగించుకోవడమే విజయ రహస్యమని అంటారు మధుసూదన్. కడుపేదరికం నుంచి బయటపడి కోటీశ్వరుడిగా మారినా.. నడిచివచ్చిన దారిని ఎన్నిటికీ మర్చిపోను అని మధుసూదన్ అంటారు. ఆయన ప్రస్తుత కల, లక్ష్యం ఒక్కటే. అదే రానున్న ఐదారేళ్లలో గ్రామీణ ప్రాంత యువతకు మంచి ఉద్యోగం వచ్చేలా లేదా వ్యాపారవేత్తలుగా రాణించేలా శిక్షణ ఇవ్వడం. గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చినందున అక్కడి యువత, విద్యార్థుల కష్టాలు, సమస్యలు ఆయనకు బాగా తెలుసు. వాస్తవానికి గ్రామీణ ప్రాంత యువత ఎదుర్కొంటున్న పెద్ద సమస్య కమ్యూనికేషన్ ప్రాబ్లం. వాళ్లలో నైపుణ్యాలను పెంచి వచ్చే ఐదేళ్లలో కనీసం ఐదు వేల మంది యువతీయువకుల్ని వ్యాపారవేత్తలుగా లేదా ఉన్నతోద్యోగం పొందేందుకు అవసరమైన అర్హతలు సాధించేలా తీర్చిదిద్దాలన్నదే మధుసూదన్ రావు లక్ష్యం.



సాయిధరమ్‌తేజ్ కెరీర్‌లో గొప్పగా చెప్పుకునే చిత్రం

'ఇంటిలిజెంట్'

- నిర్మాత సి.కళ్యాణ్



సుప్రీమ్ హీరో సాయిధరమ్ తేజ్, లావణ్య త్రిపాఠి జంటగా సి.కె. ఎంటర్‌టైన్‌మెంట్స్ ప్రై.లి. పతాకంపై సెన్సేషనల్ డైరెక్టర్ వి.వి.వినాయక్ దర్శకత్వంలో ప్రముఖ నిర్మాత సి.కళ్యాణ్ నిర్మించిన చిత్రం 'ఇంటిలిజెంట్'. రీసెంట్‌గా విడుదలైన ఈ చిత్రం టీజర్‌కి, పాటలకి మంచి స్పందన వస్తోంది. 'ఖైదీ నంబర్ 150' చిత్రం తర్వాత సెన్సేషనల్ డైరెక్టర్ వి.వి.వినాయక్ దర్శకత్వం వహించిన చిత్రం కావడంతో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొని వున్నాయి. అలాగే సి.కె. ఎంటర్‌టైన్‌మెంట్స్ ప్రై.లి. బేనర్‌లో సి.కళ్యాణ్ నిర్మించిన 'జై సింహా' చిత్రం ఈ సంక్రాంతికి రిలీజై సూపర్‌హిట్ చిత్రంగా నిలిచింది. సో.. వీరిద్దరి సక్సెస్‌ఫుల్ కాంబినేషన్‌లో వస్తోన్న 'ఇంటిలిజెంట్' అందరి అంచనాలకు తగ్గట్లుగా రూపొందిందని ఇండస్ట్రీలో టాక్ వినిపిస్తోంది. ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా ఫిబ్రవరి 9న రిలీజ్ కాబోతున్న సందర్భంగా నిర్మాత సి.కళ్యాణ్ 'ఇంటిలిజెంట్' చిత్ర విశేషాలను తెలిపారు.

టీజర్‌కి, సాంగ్స్‌కి ట్రెమండస్ రెస్పాన్స్!!

చిత్ర నిర్మాత సి.కళ్యాణ్ మాట్లాడుతూ - "జనవరి 12న పొంగల్‌కి సి.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్ బేనర్‌లో నిర్మించిన మా 'జై సింహా' చిత్రాన్ని సూపర్‌హిట్ చేసి మా బేనర్‌కి 2018లో గొప్ప శుభారంభాన్ని ఇచ్చారు ప్రేక్షకులు. మాకు సహకరించిన ప్రతి ఒక్కరికీ పేరు పేరునా కృతజ్ఞతలు. అలాగే 'ఇంటిలిజెంట్' సినిమా ప్రారంభం రోజునే ఫిబ్రవరి 9న రిలీజ్ అని చెప్పటం జరిగింది. అనుకున్నట్లుగానే ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 9న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా రిలీజ్ చేస్తున్నాం. రీసెంట్‌గా మా నటసింహ బాలయ్యబాబు టీజర్‌ని రిలీజ్ చేశారు. టీజర్‌కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. అలాగే మా యంగ్ రెబల్‌స్టార్ ప్రభాస్ పాటల్ని లాంచ్ చేశారు. అన్ని పాటలకి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. మా చిత్రం టీజర్‌ని, సాంగ్స్‌ని ఆదరిస్తున్న బాలయ్యబాబు అభిమానులకు, ప్రభాస్ అభిమానులకు, సాయిధరమ్ తేజ్ అభిమానులకు ప్రతి ఒక్కరికీ నా ధన్యవాదాలు.

ఫిబ్రవరి 4న రాజమండ్రిలో 'ఇంటిలిజెంట్' ప్రీ రిలీజ్ ఫంక్షన్!!

'ఇంటిలిజెంట్' చిత్రం ప్రీ రిలీజ్ ఫంక్షన్‌ని ఫిబ్రవరి 4న రాజమండ్రి ఆర్ట్స్ కాలేజ్ గ్రౌండ్స్ వై జంక్షన్‌లో భారీ ఎత్తున జరుపుతున్నాం. ఈ ఫంక్షన్‌కి అందరి అభిమానులు విచ్చేసి సక్సెస్ చెయ్యాలని కోరుకుంటున్నాను. 'ఛలో' ప్రీ రిలీజ్ వేడుకలో మెగాస్టార్ చిరంజీవిగారు 'ఇంటిలిజెంట్' టైటిల్ చాలా బాగుంది అని వున్నంత సేపు మా సినిమా గురించే మాట్లాడారు . చిరంజీవిగారంటే మా వినాయక్‌కి చాలా ఇష్టం. 'ఖైదీ నంబర్ 150' చిత్రం తర్వాత పెద్ద హీరోలతో కాకుండా సాయిధరమ్ తేజ్‌తో సినిమా చేద్దాం అని నాతో చెప్పగానే ఓకే అని చెప్పాను. డబ్బుల కోసం ఏది పడితే అది చేసి క్యాష్ చేసుకునే అలవాటు వినాయక్‌కి లేదు. ఏ సినిమా చేసినా ఇష్టంతో, ప్రేమతో చేస్తాడు. కథ విషయంలో తను ఫుల్ శాటిస్‌ఫై అయ్యాకే సినిమా స్టార్ట్ చేస్తాడు. చాలా ఇంటిలిజెంట్‌గా ఈ చిత్రాన్ని తీశాడు. అభిమానుల అంచనాలకు మించి వుంటుంది. అలాగే సాయిధరమ్ తేజ్ కెరీర్ గ్రాఫ్‌లో గొప్పగా చెప్పుకునే విధంగా ఈ చిత్రం నిలుస్తుంది. పాటలు, ఫైట్స్ విజువల్‌గా అద్భుతంగా వుంటాయి. సినిమా ఎప్పుడు స్టార్ట్ అయ్యిందో ఎప్పుడు ఎండ్ అయ్యిందో కూడా తెలీకుండా మైమరచిపోయే విధంగా ఈ చిత్రం వుంటుంది. 'ఇంటిలిజెంట్'గా సినిమా తీశారని ప్రేక్షకులు ఫీలయ్యేవిధంగా వుంటుంది. ఈ చిత్రంలో తేజ్ డ్యాన్స్‌లు ఇరగదీశాడు. అంతకు ముందు తేజ్ చిత్రాల్లో అన్నింటికంటే ఈ చిత్రంలో డ్యాన్స్ మూవ్‌మెంట్స్ బాగా చేశాడు. చిరంజీవిగారు బిగినింగ్‌లో ఎలా చేశారో తేజు అలా చేశాడని అన్పించింది. చాలా కష్టపడి కసితో చేశాడు. ఫ్యాన్స్ అందరూ బాగా ఎంజాయ్ చేస్తారు. థమన్ చాలా మంచి పాటలు ఇచ్చాడు. మొత్తం నాలుగు పాటలు న్నాయి. వినాయక్ చాలా బాగా చిత్రీకరించారు. ఈ చిత్రంలోని 'కళామందిర్' అనే పాటని భాస్కరభట్ల అద్భుతంగా రాశారు. అలాగే మహోన్నతమైన వ్యక్తి ఇళయరాజాగారు, సీతారామశాస్త్రిగారి చేతుల మీదుగా 'చమక్ చమక్' వీడియో సాంగ్‌ని భారీగా లాంచ్ చేస్తున్నాం. అది ఎప్పుడు అనేది చెప్తాను.

'రాజరథం'లో మరో పాట విడుదల





'రాజరథం' టీం మరో పాటని విడుదల చేసింది. ఏ ఆర్ రెహమాన్, హారిస్ జైరాజ్, మిక్కీ జే మేయర్‌ల సారథ్యంలో పాడిన ఈ పాటకి అభయ్ జోద్పుర్కర్ స్వరాన్ని అందించారు. హీరో నిఖిల్ విడుదల చేసిన ఈ పాట మాల్షేజ్ ఘాట్, మహాబలేశ్వర్ వంటి అద్భుత ప్రదేశాల్లో చిత్రీకరణ జరుపుకుంది. అద్భుతమైన పదప్రయోగంతో సాగే ఈ పాటని రెండు రకాలుగా అన్వయించుకునేలా రాయడం విశేషం. భూమి, ఆకాశం, సూర్యుడిని ఉద్దేశించినట్లు కనిపించినా అంతర్లీనంగా సినిమాలో మూడు ముఖ్య పాత్రలు అభి, మేఘ, సూరజ్‌లకి అన్వయించుకునేలా ఉంటుంది. ఈ పాటని దర్శకుడు అనూప్ భండారి స్వరపరచగా రామజోగయ్యశాస్త్రి సాహిత్యాన్ని అందించారు ఈ పాట కోసం ప్రఖ్యాత నిపుణులు చెన్నై ఆర్కెస్ట్రా, సాక్స్ రాజ, కొరియోగ్రాఫర్ బొస్కో సీజర్ వంటి వారు పనిచేయడం విశేషం. రాజ్ పొద్దార్ ప్రొడక్షన్ డిజైన్, విలియం డేవిడ్ కలర్ ఫుల్ ఫోటోగ్రఫీతో ఈ పాట చాలా అందంగా కనిపిస్తుంది. మంచి ఫీల్‌తో, అచ్చ తెలుగు పదాలతో అందంగా చిత్రీకరించిన ఈ పాట అందర్నీ ఆకట్టుకునేలా రూపొందింది. నిరూప్ భండారి, అవంతిక శెట్టి, ఆర్య, రవిశంకర్ ప్రధాన పాత్రల్లో టైటిల్ పాత్రలో కనిపించే రానా దగ్గుబాటితో రొమాంటిక్ కామెడీగా రూపొందించబడిన ఈ 'రాజరథం' ప్రపంచవ్యాప్తంగా ఫిబ్రవరి 16న విడుదలకి సిద్ధమవుతోంది. అనూప్ భండారి దర్శకత్వంలో జాలి హిట్స్ ప్రొడక్షన్ బేనర్‌లో అజయ్ రెడ్డి, అంజు వల్లభనేని, విషు దకప్పగారి, సతీష్ శాస్త్రి నిర్మాతలుగా 'రాజరథం' చిత్రాన్ని రూపొందించారు. రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న 'రాజరథం' చిత్రంలో నిరూప్ భండారి, అవంతిక శెట్టి, పి.రవిశంకర్ ప్రధాన తారాగణంగా నటిస్తున్నారు. ఈ చిత్రానికి మాటలు: అబ్బూరి రవి, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్: అజనీష్ లోక్‌నాథ్, ఎడిటింగ్: శాంతకుమార్, సినిమాటోగ్రఫీ: విలియమ్ డేవిడ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సుధాకర్ సాజ, నిర్మాణం: జాలీహిట్స్ టీమ్, అంజు వల్లభనేని, విషు దకప్పదారి, సతీష్ శాస్త్రి, అజయ్‌రెడ్డి గొల్లపల్లి, సంగీతం, స్క్రీన్‌ప్లే, రచన, దర్శకత్వం: అనూప్ భండారి.



తమ్మారెడ్డి భరద్వాజ ఆవిష్కరించిన విషపురం ట్రైలర్!

లింకన్ మెథడ్ ప్రొడక్షన్ పతాకంపై షఫీ, శ్రావణి, యాదవ్, ప్రధాన పాత్రలో జాంబి జానర్ లో శ్రీనివాస్ సందిరి దర్శకత్వంలో భోగారి లక్ష్మీనారాయణ, పాతూరి బుచ్చిరెడ్డి,భోగారి రాజు, పాతూరి మాధవరెడ్డి సంయుక్తంగా నిర్మిస్తోన్న చిత్రం విషపురంలో ఒకరోజు. ఈ చిత్రం ట్రైలర్‌ను లాంచ్ సోమవారం ప్రసాద్ ల్యాబ్స్‌లో తమ్మారెడ్డి భరద్వాజ విడుదల చేశారు. ఈ సందర్భంగా తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ హాలీవుడ్‌లో జాంబి జానర్ సినిమాలు చాలా వచ్చాయి. కానీ మన దగ్గర ఆ జానర్ లో సినిమాలు రాలేదనే చెప్పాలి. సిద్దిపేట లోని లోకల్ టాలెంట్ తో జాంబి జానర్ లో సినిమా చేస్తోన్న విషపురం దర్శక నిర్మాతలకు ఆల్ ది బెస్ట్ చెబుతున్నా. ట్రైలర్ చూస్తుంటే ఇంట్రస్టింగ్‌గా, చాలా భయపెట్టే విధంగా ఉంది. ఓ కొత్త ప్రయత్నం చేస్తోన్న ఈ టీమ్ అందరికీ నా శుభాకాంక్షలు తెలియజేస్తున్నా అన్నారు.

దర్శకుడు మాట్లాడుతూ లోకల్ ఆర్టిస్టలను తీసుకుని ఈ సినిమా చేశాం. షఫీ గారి పాత్ర సినిమాకు కీలకంగా ఉంటుంది. నిర్మాతలు ఎక్కడా రాజీ పడకుండా నన్ను నమ్మి ఈ సినిమా చేసారు. మా టీమ్ అంతా కూడా సినిమా కోసం ఎంతో శ్రమించారు. ముఖ్యంగా షఫీ గారు ఎంతో కేర్ తీసుకుని చేశారు. కెమెరా వర్క్, నేపథ్య సంగీతం సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లాయి. అడిగిన వెంటనే ఎవరు? ఏంటని అడగకుండా ట్రైలర్ లాంచ్ కార్యక్రమానికి వచ్చిన తమ్మారెడ్డిగారికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నా. వారిలా ప్రోత్సహించి వారుంటే మరెంతో మంది దర్శకులు, ఆర్టిస్టులు సినిమా పరిశ్రమకు వస్తారు. మా తొలి ప్రయత్నాన్ని ప్రేక్షకులు ఆశీర్వదిస్తారని ఆశిస్తున్నాం అన్నారు. నిర్మాతలు మాట్లాడుతూ.... సినిమా రంగం చాలా కొత్త, మా దర్శకుడు చెప్పిన కథ నచ్చడంతో నూతన నటీనటులను ప్రోత్సహిస్తూ విషపురం చిత్రాన్ని నిర్మించాం. దర్శకుడు ఈ సినిమా కోసం అన్నీ తానై శ్రమించాడు. మాకు చెప్పినదానికన్నా సినిమాను అద్భుతంగా తీర్చిదిద్దాడు. మా చిత్రాన్ని ప్రేక్షకులు రిసీవ్ చేసుకుంటారని ఆశిస్తున్నాం అన్నారు. షఫీ, శ్రావణి, యాదవ్, రాజు గౌటి, మల్లేష్ యాదవ్, దేవా, రాము తదితరులు నటిస్తున్న ఈచిత్రానికి సంగీతం శ్రీ వెంకట్, కెమెరా : కిషన్ తిప్పరవేణి, ఆర్ట్: శ్రీధర్ సందిరి నేపథ్య సంగీతం: రోహిత్ జిల్లాబీ డైలాగ్స్ః మహేష్ యల్‌బీ కో-ప్రొడ్యూసర్స్ః రమేష్ బండి, బి.వెంకటేశం నిర్మాతలుః భోగారి లక్ష్మీనారాయణ, పాతూరి బుచ్చిరెడ్డి, భోగారి రాజు, పాతూరి మాధవరెడ్డి, కథ-స్క్రీన్ ప్లే-దర్శకత్వంఃశ్రీనివాస్ సందిరి.



ఆఫ్ఘన్‌లో భూకంపం...!

ఉత్తర భారతంలో అలజడి

న్యూఢిల్లీ : అఫ్ఘనిస్థాన్‌లో బుధవారం తీవ్ర భూకంపం చోటు చేసుకోగా... పాకిస్థాన్, ఉత్తర భారత దేశంలో ప్రకంపనలు కలవర పెట్టాయి. కాబుల్‌కు 270 కిలోమీటర్ల దూరంలోని హిందూఖుష్ పర్వత శ్రేణుల్లో 191 కిలోమీటర్ల లోతులో భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై 6.1 తీవ్రతతో భూకంపం వచ్చింది. బుధవారం మధ్యాహ్నం 12.37 గంటలకు భూకంపం సంభవించినట్టు యూరప్-మధ్యధరా భూకంప కేంద్రం ప్రకటించింది. ఆ భూకంప ప్రభావం పాకిస్థాన్, భారత్‌లోనూ కనిపించింది. పాకిస్థాన్‌తో పాటు ఢిల్లీ, శ్రీనగర్ ప్రాంతాల్లో భూ ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో భూప్రకంపనలు నమోదైనట్లు అధికారులు తెలిపారు. పంజాబ్, బీహార్, పశ్చిమబెంగాల్, హర్యానాలోనూ భూప్రకంపనలు అలజడి సృష్టించాయి. ఢిల్లీలోని కొన్ని టీవీ స్టూడియోల్లో లైట్లు అటూ ఇటూ కదిలినట్లు వార్తలు వస్తున్నాయి. శ్రీనగర్‌లో ఆఫీసులు, బిల్డింగ్‌ల నుంచి జనం పరుగులు తీశారు.

అమృత్‌సర్‌లోనూ ప్రకంపనలు నమోదు అయ్యాయి. పాకిస్థాన్ రావల్పిండి, పెషావర్‌ల్లో ప్రజలు తమ దుకాణాలను మూసివేసి రోడ్డుపైకి చేరుకున్నారు. బలోచిస్థాన్ ప్రాంతంలోని లాస్‌బెల్లాలో భూకంపం వల్ల ఒకరు మృతిచెందగా, అనేక మంది గాయపడ్డట్లు సమాచారం. అయితే ఆఫ్ఘనిస్థాన్‌లో నష్టం ఎంత జరిగింది. ప్రాణ నష్టం జరిగిందా లేదా అనే సమాచారం రాలేదని అమెరికా జియోలాజికల్ సర్వే ప్రకటించింది.

దిగజారిన 'భారత్' ప్రజాస్వామ్య సూచీ

- దళితులు, మైనార్టీలపై హిందూ మతోన్మాదుల దాడులు
- ఈఐయూ ప్రజాస్వామ్య సూచి వెల్లడి

న్యూఢిల్లీ : అంతర్జాతీయ సమాజంలో భారత్ ప్రజా స్వామ్య వ్యవస్థ స్థాయి దిగజారుతోంది. ప్రపంచ ప్రజాస్వామ్య సూచి (గ్లోబల్ డెమొక్రసీ ఇండెక్స్)లో గత సంవత్సరం 32వ స్థానంలో ఉన్న భారత్ స్థానం 42కు పడిపోవడమే ఇందుకు నిదర్శనం. ప్రజాస్వామ్య వ్యవస్థలోని లోపాల కారణంగా ఈ పరిస్థితి ఉత్పన్నమైనట్లు సమా చారం. దళితులు, మైనారిటీల మీద కరడు కట్టిన హిందు మతోన్మాద శక్తుల దాష్టీకం పెరిగిపోయిన నేపథ్యంలో మోడీ సర్కారులో మసకబారిన ప్రజాస్వామ్య వ్యవస్థ స్థాయి దిగజారిందంటూ ఎకనామిస్ట్ ఇంటలిజెన్స్ యూనిట్ (ఈఐయూ) నివేదిక వెల్లడిస్తోంది. ఈ నివేదికలో యథా ప్రకారం నార్వే అగ్రస్థానంలో నిలువగా ఐస్‌లాండ్, స్వీడన్‌లు తరువాత స్థానాలను ఆక్రమించాయి. ఐదు అంశాలు ప్రాతిపదికగా 112 స్వతంత్ర దేశాలు, రెండు ప్రాదేశికాల సమాచారాన్ని బేరీజు వేసి ఈ నివేదికను రూపొందించారు. ఎన్నికల విధానం, బహుళత్వం, పౌర హక్కులు, ప్రభుత్వ పని తీరు, రాజకీయ భాగస్వామ్యం, రాజకీయ సంస్కృతి అంశాల ప్రాతిపదికగా నివేదికను రూపొందించారు. 21వ స్థానంలో నిలిచిన అమెరికా సహా జపాన్, ఇటలీ, ఫ్రాన్స్, ఇజ్రాయిల్, సింగపూర్, హాంగ్‌కాంగ్‌లు లోపాభూయిష్ట ప్రజాస్వామ్యాలుగా ఉన్నాయని నివేదిక వివరించింది. 1946లో బ్రిటన్‌లో ఆవిర్భవించిన మీడియా దిగ్గజం ది ఎకనామిస్ట్ గ్రూప్ పరిశోధన, విశ్లేషణ విభాగం ఈఐయూ నివేదికను రూపొందించింది. పాకిస్తాన్(110), బంగ్లాదేశ్ (92), నేపాల్ (94), భూటాన్ (99)లలో సంకర (హైబ్రిడ్) పాలన కొనసాగుతోందని నివేదిక వివరించింది. అధికారమయంగా ఉన్న దేశాల జాబితాలో చైనా(139), మయన్మార్ (120), రష్యా (135), వియత్నాం (140) ఉన్నాయి. ఎన్నికల విధానంలో ఆశావహ పరిస్థితి ఉన్నప్పటికీ పాలనపరంగా గోరక్షణ ముసుగులో దళితులు, మైనారిటీల మీద జరుగుతున్న దాడులు, హిందుత్వ మతోన్మాద విస్తరణ ప్రయత్నాలు దేశ ప్రజాస్వామ్య స్థితిగతులను ప్రభావితం చేశాయని నివేదిక పేర్కొంది.



గ్రీన్ సూచిదీ అదే దారి..!

న్యూఢిల్లీ : దేశంలో తేలికగా వాణిజ్యం చేయవచ్చునని, ఇందులో మనం 100వ స్థానానికి (130లో) చేరుకున్నామని సంబరపడే పాలకులు గ్రీన్ (పచ్చదనం) సూచిని గురించి ఎందుకు మౌనంవహిస్తున్నారు. 180 దేశాలలో ప్రపంచ ఆర్థిక ఫోరంతో కలిసి ఏలే యూనివర్సిటీ, కొలంబియా యూనివర్సిటీ అధ్యయనవేత్తలు జరిపిన సర్వేలో మనదేశం 177వ స్థానంలో ఉన్నట్టు ప్రకటించారు. 2016లో 141వ స్థానంలో ఉన్న స్థితి నుంచి మరింత దిగజారింది. స్వచ్ఛ భారత్ లక్ష్యం సాధనకు మరుగుదొడ్లు నిర్మిస్తే సరిపోతుందా? వాటికి నీళ్లు కావాలి, శుభ్రం చేసే పనివాళ్లు కావాలి, నిండిన తర్వాత వ్యర్థాలను మరో చోటకు తరలించే వసతులు కావాలి. ఇక నిర్మించిన మరుగుదొడ్లలో 60 శాతం వరకు వివిధ కారణాల వల్ల పనిచేయడం లేదని ఇటీవల జరిగిన ఒక సర్వే తెలిపింది. గ్రీన్‌సూచి పై ఆందోళన చెందవలసిన సందర్భమే ఇది. బ్రెజిల్ 69వ స్థానంలో, చైనా 120వ స్థానంలో ఉన్నాయి. వాతావరణంలోకి విడుదలయ్యే కర్బనపు వాయువులు తగ్గి పచ్చదనం పెరిగితేనే గాలి, నీరు, ఆహారం, కాలుష్యం తగ్గుతుంది. 2018 జనవరి నుంచి బొగ్గు ఆధారిత విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు కచ్చితమైన ప్రమాణాలను పాటించాలి. అలాగే 2020 ఏప్రిల్ 1 నుంచి మన దేశం 6వ దశ నియమనిబంధనలు విధిగా పాటించాలని అంతర్జాతీయ ఒప్పందాలు నిర్దేశించాయి. అలాగే పునరుత్పత్తి ఇంధన వనరులు ముఖ్యంగా సౌర విద్యుత్‌ను 20 గిగా వాట్ల నుంచి 2021-22 నాటికి 100 గిగా వాట్లకు పెంచాలని నిర్ణయించారు. మూడేళ్లనాడు రూ.20 వేల కోట్లు కేటాయించినప్పటికీ తీవ్రంగా కలుషితమైన గంగానది పరిస్థితి ఎంత మాత్రం మెరుగుపడలేదు. విధానపరమైన లక్ష్యాలకు, ఆచరణకు ఎంతమాత్రం పొంతన లేకపోవడమే ఈ దుస్థితికి కారణం. సౌర విద్యుత్ ఉత్పత్తి విషయంలో సరైన దిశలోనే ముందుకు వెళుతున్నారని పర్యావరణవేత్తలు భావిస్తున్నారు. విద్యుత్ ప్లాంట్ల నుంచి వెలువడే కర్బనపు వాయువుల విడుదలపై రూపొందించిన నియమనిబంధనలు పాటించడంలో తీవ్ర వైఫల్యం ఉంది. ఇక అధిక కాలుష్య కారకమైన ఆటోమొబైల్ పరిశ్రమ ఉత్పత్తి చేసే అన్ని రకాల రవాణాల వాహనాలు పూర్తిగా విద్యుత్‌తో నడవడానికి 2047 లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే విద్యుత్‌తో నడిచే వాహనాల ఉత్పత్తి కార్యక్రమాలు వేగవంతమైతేనే లక్ష్యం సాధించగలుగుతాము. ఇందుకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను ప్రభుత్వం రూపొందించడంలో విఫలమైందని తాజా కాగ్ నివేదిక తెలిపింది.

వాతావరణ కాలుష్యం తగ్గించేందుకు చేసే ఖర్చు విషయంలో మనం వెనకాడుతూనే ఉన్నాము. గాలి కాలుష్యం వల్ల ఏడాదికి మన దేశంలో 14 లక్షల మంది తక్కువ వయస్సులోనే చనిపోతున్నారని ఇటీవల ప్రపంచ బ్యాంకు, హెల్త్ మెట్రిక్స్ సంస్థ (అమెరికా) నిర్వహించిన అధ్యయనంలో వెల్లడైంది. ఇప్పటికైనా మేల్కొని తగిన ప్రణాళికలు రూపొందించి అమలుచేయవలసిన ఆవశ్యకత ఉంది.

కాస్‌గంజ్ హింసపై కేంద్రానికి నివేదిక





న్యూఢిల్లీ : ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం కాస్‌గంజ్‌లో మత ఘర్షణలకు సంబంధించి ఒక నివేదికను కేంద్రానికి పంపింది. ఇక్కడ ఒకరు హత్యకు గురికావడంతోపాటు మరో ఇద్దరు గాయపడ్డారు. అయితే ఇప్పటి వరకు తీసుకున్న చర్యలను నివేదికలో వివరించినట్లు అధికారి ఒకరు బుధ వారం తెలిపారు. బాధితు డు చందన్ గుప్తా మరణా నికి దారితీసిన పరిస్థితులు, యూపీ పోలీసులు జరిపిన అరెస్టులతో కూడిన వివరాలు రాష్ట్ర ప్రభుత్వ నివేదికలో ఉన్నాయి. ముందస్తు ప్రణాళిక ప్రకారం హింస జరిగి ఉన్నట్లయితే వాస్తవాలన్నింటినీ తెలుసుకుంటున్నామని, ఈ కేసులో పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారని కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు ప్రభుత్వం తెలియజేసింది. రిపబ్లిక్ డేను పురస్కరించుకుని నిర్వహిస్తున్న మోటారు సైకిల్ ర్యాలీపై ఒక గుంపు రాళ్ల దాడి జరిపిన నేపథ్యంలో ఘర్షణలు చోటు చేసుకున్నాయి. ఈ సమయంలో బస్సు, కారు, మూడు దుకాణాలు దగ్ధమవగా, ఒకరు మరణించగా మరో ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘర్షణలతో సంబంధం ఉన్న 150 మందిని అరెస్టు చేశారు. కాగా భద్రతా బలగాలు కట్టుదిట్టమైన భద్రత నిర్వహిస్తున్నాయి.

యువకుడి హత్యలో ప్రధాన నిందితుడి అరెస్టు

లక్నో : కాస్‌గంజ్‌లో చందన్ గుప్తా హత్య కేసులో ప్రధాన నిందితుడిని బుధవారం అరెస్టు చేశారు. హింసాత్మక ఘటనలో అట్టుడికిన జిల్లాలోకి ప్రవేశించకుండా కాంగ్రెస్ ప్రతినిధి బృందాన్ని నిలువరించినప్పటికీ కొన్ని ప్రాంతాల్లో మాత్రం ఉద్రిక్తత కొనసాగుతోంది. 'ప్రధాన నిందితుడు సలీమ్ పట్టుబడ్డాడు' అని అలీఘర్ రేంజ్ ఐజీ సంజీవ్ గుప్తా తెలిపారు. 22 కళాశాల విద్యార్థి చందన్ గుప్తా హత్యలో 30 ఏళ్ల సలీమ్, ఆయన ఇద్దరు సోదరులు నసీమ్, వసీమ్‌లు నిందితులుగా ఉన్నట్లు వివరించారు. ఈ హత్యతో గతవారం హింస చోటుచేసుకుంది. కాగా చందన్ ను కాల్చి చంపినట్లు సలీవమ్ అంగీకరిం చాడని ఐజీ సంజీవ్ గుప్తా చెప్పారు. కాస్‌గంజ్‌లో ఉన్న సలీవమ్‌ను అరెస్టు చేయగా, అతని సోదరులు నసీమ్, వసీమ్‌ల కోసం గాలింపు జరుపుతున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు. కాస్‌గంజ్ ఎస్పీ పీయూష్ శ్రీవాత్సవ మాట్లాడుతూ నిందితుడి ఆస్తుల స్వాధీనానికి సంబంధించిన నోటీసులను అతని నివాసాలపై అంటించామన్నారు. ఇదిలాఉండగా కాస్‌గంజ్ జిల్లా సరిహద్దు ఎతాలోని మిర్హాచిలో కాంగ్రెస్ ప్రతినిధి బృందాన్ని పోలీసు బలగాలు అడ్డుకున్నాయి. శాంతి, భద్రతల సమస్యల దృష్ట్యా ఉద్రిక్తత నెలకొన్న ప్రాంతాల్లోకి ఆ ప్రతినిధి బృందాన్ని ప్రవేశించనీయకుండా నిలువరించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. జిల్లా మెజిస్ట్రేట్ కాంగ్రెస్ ప్రతినిధి బృందానికి అనుమతి ఇచ్చేందుకు నిరాకరించారు. ఇదిలాఉండగా ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మంగళవారం మాట్లాడుతూ ప్రతి పౌరుడికి భద్రత కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. హింసకు కారకులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

దేశ నిర్మాణంలో టీఎంసీది కీలక పాత్ర

మీడియా వక్రబుద్ధి చూపుతోంది : మమత



కోల్‌కత : రానున్న రోజుల్లో దేశనిర్మాణంలో తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) కీలక పాత్ర పోషిస్తుందని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ ఒక ప్రకటనలో తెలిపారు. రాబోయే రోజుల్లో జాతీయ రాజకీయాల్లో టీఎంసీ ప్రవేశిస్తుందనడానికి ఇదొక సూచనగా తెలుపవచ్చు. బీజేపీ హయాంలో పెరుగుతున్న అసహనం, రైతుల ఆత్మహత్యలు, నిత్యావసరాల ధరలు పెంపుపై వారం చివరి రోజుల్లో ప్రచారం చేయాలని ఆమె పార్టీ నాయకులకు సూచించారు. రాష్ట్రంలోనే కాకుండా దేశంలోకూడా మంచి సమాజం నిర్మించడానికి టీఎంసీ కార్యకర్తలు ముందుండాలని పిలుపు నిచ్చారు. ఎఫ్ఆర్డీఐ బిల్లు, రైల్వే ప్రాజెక్టుల ఉపసంహరణలు ఎవరి లాభంకోసమో వెల్లడించాలని ఆమె డిమాండు చేశారు. కాంగ్రెస్ ,సీపీఎంలు బీజేపీ పాలనపై నోరుమెదపడం లేదని, దేశంలో బీజేపీ ధనవంతమైన పార్టీ అని తర్వాతి స్థానంలో కాంగ్రెస్, సీపీఎంలు ఉన్నాయని, టీఎంసీ దేశంలోనే అతిపేదపార్టీ అన్నారు.

కాంగ్రెస్, సీపీఎంలు అధికారంలో ఉండగా కూడబెట్లు కున్నవన్నీ ఇప్పుడు ఖర్చుపెట్టుకుంటున్నాయన్నారు. బెంగాల్‌లో బీజేపీ అత్యధికంగా ఖర్చుపెడుతోందని, దీనిపై రెండు పార్టీలు మూగనోము పట్టాయని విమర్శించారు. పార్టీకి నిధులు లేనందువల్లే త్రిపుర ఎన్నికల్లో పోటీ చేయలేకపోతున్నామని, అభివృద్ధే లక్ష్యంగా బడ్జెట్‌ను రూపొందించామన్నారు. అంతకుముందు అధికారం చేపట్టిన పార్టీలు నిధులను దుర్వినియోగం చేసిన విషయం అందరికీ తెలుసన్నారు. మీడియా చిన్నపార్టీలను గురిపెడుతూ బిజీగా ఉందన్నారు. బీజేపీ కోటాను కోట్ల రూపాయలు ఖర్చుపెడుతుండగా మీడియా ఎందుకు నోరు మెదపడం లేదన్నారు. మీడియాలో ఒక భాగం ఎప్పుడూ చిన్న పార్టీలు చేసిన అభివృద్ధిపై దృష్టించవని, విమర్శించడమే పనిగా పెట్టుకుంటూ వక్రబుద్ధిని, చౌకబారుతనాన్ని బయటపెట్టుకుంటున్నాయని దుయ్య బట్టారు. జిల్లాల్లో 8000 కిమీ, గ్రామీణ ప్రాంతాల్లో 23 వేల కిమీ రోడ్డు నిర్మాణాలు చేపట్టామని త్వరలో పంచాయతీ ఎన్నికలు జరుపుతామని ఆమె ప్రకటించారు. రాష్ట్రంలోని పేదలకు 25 లక్షల ఇళ్లు నిర్మించామని పార్టీని బలహీన పరిచేవారిపట్ల కఠినంగా వ్యవహరిస్తామని మమత హెచ్చరించారు.

కాంగ్రెస్ పంథాలో మార్పుండదు : పరమేశ్వర

బెంగళూరు : కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ దేవాలయాల దర్శనం పార్టీ పంథాలో మార్పుకు చిహ్నం కాబోదని కర్ణాటక కాంగ్రెస్ అధ్యక్షుడు జి. పరమేశ్వర బుధవారం స్పష్టం చేశారు. రాహుల్ తండ్రి, నానమ్మలు కూడా పుణ్యక్షేత్రాలు సందర్శించి పూజలు జరిపారన్నారు. ఇందిరా, రాజీవ్ గాంధీ శృంగేరీ స్వామిని దర్శించగా, ఇందిరగాంధి కర్ణాటకలోని చాలా దేవాలయాలను సందర్శించారన్నారు. గుజరాత్ ఎన్నికల సమయంలో రాహుల్ అనేక గుడులు సందర్శించడం, ఆయన కుటుంబమంతా శివ భక్తులమని చెప్పుకోవడం, రాష్ట్రంలో ముఖ్య మతనాయకులను కలుసుకుంటారని నివేదికలు రావడంపై కాంగ్రెస్ ఎన్నికల పంథా మారిందా అన్న ప్రశ్నకు ఆయన పై విధంగా సమాధానం ఇచ్చారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని బీఫ్, హిందుత్వ ఉగ్రవాదాలపై రాష్ట్రంలో ఎవరూ మాట్లాడవద్దని రాహుల్ ఆదేశించారా ? అని ప్రశ్నించగా, అలాంటి విషయాలపై తాము అధినేతతో చర్చించలేదని, ఎన్నికల వ్యూహం, అభ్యర్థుల ఎంపికలపైనే చర్చలు జరిపామన్నారు. ప్రజల దృష్టిని మళ్లించడానికే ఈ తరహా ప్రచారానికి బీజేపీ ప్రయత్నిస్తోందన్నారు. బీజేపీ హిందుత్వం గురించి మాట్లాడితే కాంగ్రెస్‌పార్టీ అభివృద్ధి గురించి మాట్లాడుతుందని వివరించారు. మతం, హిందుత్వంతో ప్రజలను విభజించడమే బీజేపీ లక్ష్యంగా పెట్టుకుందని పరమేశ్వర విమర్శించారు.

మోడీ ఇప్పటికీ 'సూటు - బూటు సర్కారే'



- పేదలను దూరం ఉంచుతున్నాడు
- రాహుల్ విమర్శ

షిల్లాంగ్ : ప్రధాన మంత్రి సరేంద్ర మోడీది ఇప్పటికీ 'సూటు-బూటు సర్కారే' అని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ బుధవారం తాజా విమర్శలు చేశారు. సూట్లలో అలంకరించబడిన ప్రజల కోసం పని చేస్తున్నాడేగానీ పేదల ప్రజల కోసం కాదని ఎప్పుడూ నిరూపితమవుతూనే ఉందన్నారు. ఇక్కడ మంగళవారం ఒక కార్యక్రమంలో రాహుల్ ధరించిన నల్ల జాకెట్ ధరపై బీజేపీ మేఘాలయ విభాగం చేసిన ఆరోపణలపై రాహుల్ స్పందిస్తూ, 'ప్రధాని ఒక పేదవాడిని ఆలింగనం చేసుకోవడంగానీ, వారితో మాట్లాడటంగానీ మీరు చూడలేదు. ఇతరులతో ప్రధాని మోడీ కలిసి ఉండటం మాత్రం మీరు చూస్తారు' అని పేర్కొన్నారు. 'మిస్టర్ ఒబామా లేదా ఇతరులతో కాకుండా ప్రత్యేకించి పేద ప్రజలతో ఆయన దూరంగా ఉంటున్నారు' అని విలేకరులతో మాట్లాడుతూ తెలిపారు. 'వాస్తవమే మిటంటే, ఆయన ఇప్పటికీ ఒక సూటు-బూటు వ్యక్తే. ఆయన ఏమీ చేయలేదు..' అని అన్నారు. ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని ప్రధాన మంత్రి హామీ ఇచ్చారు. కానీ ఆ లక్ష్యాన్ని సాధించడంలో విఫల మయ్యారని తెలిపారు. కాగా కాంగ్రెస్ అధ్యక్షుడు ధరించిన జాకెట్ 995 డాలర్లు(63 వేలు) అని మంగళవారం బీజేపీ ఆరోపించింది.

ఆర్ఎస్ఎస్, బీజేపీ సిద్ధాంతాలపై పోరు

షిల్లాంగ్(మేఘాలయ) : రాష్ట్రీయ స్వయం సేవక్ (ఆర్ఎస్ఎస్), బీజేపీ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా పోరు సల్పుతామని కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ అన్నారు. మేఘాలయలో శాసనసభ ఎన్నికల నేపథ్యంలో బుధవారం ఇక్కడి సెయింట్ ఎడ్మండ్స్ కళాశాలలో ఒక కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. దేశ వ్యాప్తంగా తమ భావజాలాన్ని వ్యాప్తి చేస్తున్న ఆర్ఎస్ఎస్, బీజేపీలపై రాహుల్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. 'దేశ వ్యాప్తంగా ఆర్ఎస్ఎస్, బీజేపీ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా పోరు జరుపుతాం. ఇది దేశంపై విధించిన ఒక రకమైన ఆలోచన. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు దేశమంతటా, ప్రత్యేకించి ఈశాన్య భారతంలో మీ సంస్కృతిని, భాషను, జీవన విధానాన్ని అణచివేసే ప్రయత్నాలు చేస్తున్నాయి' అని పేర్కొన్నారు. మేఘాలయలో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినట్లయితే, అది రాష్ట్ర సంస్కృతికి, గౌరవానికి, వారి జీవన విధానానికి ఒక ముప్పు అని రాహుల్ విమర్శించారు. పురుషులకు మరింత అధికారాన్ని కట్టబెట్టి, మహిళల గౌరవాన్ని హరించడంపైనే ఆర్ఎస్ఎస్ ఆసక్తి చూపుతోందన్నారు. రాహుల్ మాట్లాడుతూ 'మన సమాజంలో మహిళలు విస్తృత అవకాశాలు కలిగి ఉన్నారు. ముందుకు సాగడంలో, నిర్ణయాధికారంలో వారు కీలక పాత్ర పోషిస్తున్నారు. అయితే మహిళా సాధికారిత వారికి ఇష్టం లేదు. సమాజంలో నిర్భయంగా ఆధిపత్యం ప్రదర్శించేందుకు పురుషులకు మరిన్ని అధికారాలు ఇచ్చేందుకు ప్రయత్నిస్తుంది' అని తెలిపారు. 'మహిళలను అణగదొక్కడమే ఆర్ఎస్ఎస్ లక్ష్యం. ఆర్ఎస్ఎస్‌లో మహిళలు ఎవరైనా నాయకత్వ స్థానాల్లో ఉన్నారా లేదు. అదే మీరు మహాత్మాగాంధీ చిత్రాన్ని చూస్తే ఎడమవైపు గానీ, కుడి వైపుగానీ మహిళలు ఉండటాన్ని గురిస్తారు. కానీ మోహన్ భగవత్ చిత్రాన్ని చూసినట్లయితే, ఆయన ఒక్కరే లేదా చుట్టూ పురుషులే కనిపిస్తారు' అని రాహుల్ పేర్కొన్నారు.

అధికారంలోకి వస్తే జీఎస్‌టీని మార్చేస్తాం

2019లో కేంద్రంలో తిరిగి తన అధికారంలోకి వస్తే వస్తు, సేవల పన్ను(జీఎస్‌టీ)ని మార్చేస్తామని రాహుల్ గాంధీ చెప్పారు. 'మేము వేరొక జీఎస్‌టీ రూపాన్ని ప్రతిపాదించాం. సామాన్య ప్రజలు వినియోగించే ఉత్పత్తులు పన్ను పరిధిలో కాకుండా వెలుపల ఉండాలి. పన్ను ఒకే రూపంగా ఉండాలి. కానీ బీజేపీ తన సొంత వ్యాపారంగా మార్చుకుంది. జీఎస్‌టీకి సంబంధించి మా సొంత సంస్కరణతో ముందుకు వెళతాం' అని ఆయన వివరించారు. దేశవ్యాప్తంగా సామాన్య ప్రజలకు జీఎస్‌టీ హాని కలిగిస్తోందంటూ బీజేపీపై రాహుల్ ధ్వజమెత్తారు. 'జీఎస్‌టీని అర్ధరాత్రి హడావుడిగా ప్రారంభించారు. ఐదు వేర్వేరు పన్ను రేట్లు పెట్టారు. ఫలితంగా సామాన్యులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. లక్షలాది మంది ప్రతి రోజూ తమ ఉద్యోగాలను కోల్పోతున్నారు' అని చెప్పారు. చిన్న, మధ్యతర వ్యాపారాల పట్ల బీజేపీ వైఖరి నిర్లక్ష్యపూరితంగా ఉందని కాంగ్రెస్ అధ్యక్షుడు విమర్శిస్తూ, చిన్న, మధ్యతరహా వ్యాపారులకు తాము మద్దతు ఇస్తామన్నారు. ఆ వ్యాపారులకు బ్యాంకుల నుంచి ఆర్థిక సాయం అవసరమని తెలిపారు.

గురు రవిదాస్ బోధనలు స్ఫూర్తి : మోడీ

న్యూఢిల్లీ : సంపన్న, బలమైన భారతదేశ నిర్మాణానికి ప్రభుత్వం గురు రవిదాస్ బోధనలను స్ఫూర్తిగా తీసుకుంటుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ బుధవారం తెలిపారు. గురు రవిదాస్ జయంతి ఉత్సవం సందర్భంగా ప్రజలకు ఆయన ట్విట్టర్ ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. రవిదాస్ కవిత్వాన్ని ఈ సందర్భంగా పంచుకున్నారు. 'గురు రవిదాస్‌జీ గొప్ప మార్గదర్శకంలో బలమైన, సంపన్న భారతదేశ నిర్మాణానికి, పేదలకు అభివృద్ధి ఫలాలు అందించేందుకు 24 గంటలూ కష్టపడుతున్నాం' అని ప్రధాని పేర్కొన్నారు.

బస్తర్ అభివృద్ధికి నీతిఆయోగ్ ఆమోదం

న్యూఢిల్లీ : ఛత్తీస్‌గఢ్‌కు చెందిన బస్తర్ ప్రాంత సమగ్రాభివృద్ధి కోసం బ్యాంకులు, ఎల్పీజీ, విద్య, టెలి కమ్యూనికేషన్, రహదారులకు సంబంధించిన వేర్వేరు ప్రతిపాదనలకు నీతి ఆయోగ్ సూత్రప్రాయ ఆమోదం తెలిపినట్లు బుధవారం ఇక్కడ ఒక ప్రకటన తెలిపింది. నీతి ఆయోగ్ ఉపాధ్యక్షుడు రాజీవ్ కుమార్, సీఈవో అమితాబ్ కాంత్, కేంద్ర ప్రభుత్వ విభాగాల సీనియర్ అధికారులు, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అజయ్ సింగ్ నేతృత్వంలో మంగళవారం ఉన్నతాధికారులు హాజరైన ఈ సమావేశంలో ఈ ఆమోదం జరిగింది.

కాంగ్రెస్ గూటికి బీజేపీ మాజీ మంత్రి

బెంగళూరు : ఈ ఏడాది కర్ణాటకలో శాసనసభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో బీజేపీ మాజీ మంత్రి బీఎస్ ఆనంద్ సింగ్ బుధవారం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. బెంగళూరులోని కర్ణాటక ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో ముఖ్యమంత్రి సిద్ధారామయ్య, కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జీ పరమేశ్వర, ప్రచార కమిటీ చీఫ్, మంత్రి డీకే శివకుమార్‌ల సమక్షంలో సింగ్ తన మద్దతుదారులతో కలిసి ఆ పార్టీలో చేరారు. తాను ప్రాతినిధ్యం వహించిన బళ్లారి జిల్లాలో తొమ్మిది స్థానాలు గెలిచేందుకు కృషి చేస్తానని సింగ్ ఈ సందర్భంగా చెప్పారు.

ఐఐఎం అహ్మదాబాద్ డైరెక్టర్‌గా డిసౌజా

న్యూఢిల్లీ : అహ్మదాబాద్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్‌గా ప్రొఫెసర్ ఇర్రోల్ డిసౌజా నియమితులైనట్లు అధికారిక ఆదేశాలు వెలువడ్డాయి. ఆయన ఐదేళ్లపాటు పదవిలో కొనసాగుతారని సిబ్బంది శిక్షణశాఖ తెలిపింది. ప్రస్తుతం ఆయన అదే సంస్థలో ఇన్‌చార్జ్ డీన్‌గా ఉన్నారు. 2001లో ఐఐఎంలో ఆయన చేరక ముందు ముంబై ఐఎఫ్‌సీఐ యూనివర్సిటీలో ఎకనామిక్స్ ప్రొఫెసర్‌గా, న్యూయార్క్ కొలంబియా వర్సిటీలో విజిటింగ్ ప్రొఫెసర్‌గా, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సౌత్ ఆసియన్ స్టడీస్ , సింగపూర్ నేషనల్ వర్సిటీల్లో ఆయన సీనియర్ అధ్యాపకుడిగా ఉన్నారు.

ఎయిర్‌పోర్టులో స్మగ్లింగ్ బంగారం స్వాధీనం

న్యూఢిల్లీ : ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి అక్రమంగా తరలిస్తున్న రూ. 13 లక్షల విలువైన బంగారాన్ని స్వాధీనం చేసుకున్నామని కస్టమ్స్ అధికారులు తెలిపారు. రోమ్ నుంచి వస్తున్న ప్రయాణీకుడిని తనిఖీ చేసి చేతి సంచి నుంచి 585 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్టు చేశామన్నారు.

భీమాకోరేగావ్ కేసు విచారణ నుంచి తప్పకున్న జడ్జి

ముంబై : భీమాకోరేగావ్ కేసులో ప్రధాన నిందితుడు మిలింద్ ఎక్బోటే ముందస్తు బెయిలు మంజూరు అభ్యర్థనను విచారణ నుంచి ముంబై హైకోర్టు జడ్జి బీఆర్ గవాయ్ తాను తప్పుకున్నారు. భీమాకోరేగావ్‌లో హింసను ప్రేరేపించి ఒకరి మృతికి, 10 మంది పోలీసులతో సహా అనేక మంది గాయాలకు కారణమైన మిలింద్ ఎక్బోటే బెయిలు మంజూరు కేసు విచారణ నుంచి తప్పుకుంటున్నట్లు బుధవారం ఆయన తేల్చి చెప్పారు. దీంతో మరొక ధర్మాసనానికి ఈ కేసును బదలాయించనున్నారు. ముందస్తు బెయిలు మంజూరుకు పూనే సెషన్‌కోర్టు నిరాకరించడంతో న్యాయమూర్తి గవాయ్ వద్దకు ఈ కేసు విచారణకొచ్చింది. ఎగ్బోటేపై రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి.

బీజేపీని నిలదీసిన నాగా గిరిజనులు

కోహిమా : నాగాలో రాజకీయ సమస్యలపై తమ వైఖరిని స్పష్టం చేయాలని గిరిజన హోహో కోర్‌కమిటీ, పౌర సంస్థలు రాష్ట్ర బీజేపీ విభాగాన్ని నిలదీశాయి. 70 ఏళ్లుగా నెలకొన్న నాగా రాజకీయ సమస్యలను కేంద్రం పరిష్కరించే వరకు ఫిబ్రవరి 27న జరిగే ఎన్నికల్లో పోటీ చేయకూడదని నాగా పీపుల్స్ ఫ్రంట్, బీజేపీ, కాంగ్రెస్‌లతోసహా 11 పార్టీలు నిర్ణయించుకున్నాయి. ఎన్నికల ముందే రాజకీయ సమస్యను పరిష్కరించి నాగాలకే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని అసెంబ్లీ నిర్ణయించినా, నాగా రాజకీయ సమస్యకు 'ఎన్నికలే పరిష్కారం' అంటూ బీజేపీ నినాదాన్ని లేవదీయడంపై నాగా ప్రజా సంఘాలు ఆగ్రహం వెలిబుచ్చుతున్నాయి.

మరో 123 మంది ఆఫీసు బేరర్లపై ఏఐఏడీఎంకే వేటు

చెన్నై : ఆర్కేనగర్ ఉప ఎన్నికల ఓటమితో ఏఐఏడీఎంకే ఆఫీసు బేరర్లపై వేటు కొనసాగుతోంది. నాలుగు జిల్లాలకు చెందిన 123 మంది అఫీసు బేరర్లను పార్టీ అధినాయకులు పన్నీర్‌సెల్వం, పళనీస్వామి సాగనంపారు. ఉప ఎన్నికల్లో ఓటమికి పార్టీలోని అసమ్మతి వాదులేనని వారు భావిస్తున్నారు. త్రిరుచురాపల్లి, ఇరోడ్, వెల్లూర్, రామనాథపురం, జిల్లా శాఖ నుంచి 123 మందికి ఉద్వాసన పలికారు. ఉప ఎన్నికలో టీటీవీ దినకరన్ గెలుపొందిన విషయం తెలిసిందే.

బోటు మునిగి ఐదుగురు గల్లంతు

పాట్నా : బీహార్‌లో పాట్నాలో గంగానదిలో బోటు మునగడంతో ఐదుగురు గల్లంతయ్యారని బుధవారం పోలీసులు తెలిపారు. గయా జిల్లాకు చెందిన ఒకే కుటుంబానికి చెందిన తొమ్మిదిమంది మాఘ పూర్ణిమ సందర్భంగా గంగానదిలో పవిత్ర స్నానాలు ఆచరించి అనంతరం బోటులో ప్రయా ణిస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుందని తెలిపారు. తొమ్మిదిమందిలో మిగిలిన నలుగురు ప్రాణాలతో బయటపడ్డారని చెప్పారు. గల్లంతైన వారికోసం గాలిస్తున్నట్లు చెప్పారు.

త్రిపురలో రెండుసార్లు మోడీ పర్యటన

అగర్తల : ఈ నెల 18న త్రిపురలో శాసనసభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రెండుసార్లు రాష్ట్రంలో పర్యటిస్తారని ఆ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బిప్లాబ్ కుమార్ దేబ్ తెలిపారు. ఈ నెల 8 ఉన్నకోటి జిల్లాలోని కైలాసహార్, దక్షిణ త్రిపుర జిల్లాలోని శాంతిర్‌బజార్‌లల్లో జరిగే రెండు బహిరంగ సభల్లో ఉపన్యసిస్తారని చెప్పారు. తర్వాత 15వ తేదీన మళ్లీ ఆయన రాష్ట్రాన్ని సందర్శించి బహిరంగ సభలో ఉపన్యసిస్తారని తెలిపారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా రాష్ట్రంలో వారం రోజులు ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని తెలిపారు.

ఐఏఎస్ అధికారి సస్పెన్షన్

చాప్రా : అక్రమాస్తుల కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న బీహార్ ఐఏఎస్ అధికారి దీపక్ ఆనంద్ మంగళవారం సస్పెండ్‌కు గురయ్యారు. చాప్రా జిల్లా మాజీ మెజిస్ట్రేట్ (డీఎం), 2.60 కోట్ల రూపాయల అక్రమాస్తుల కేసులో 2007-బ్యాచ్ ఐఏఎస్ అధికారి అయిన ఆయన్ని ఆ రాష్ట్ర ప్రత్యేక దర్యాప్తు బృందం విచారించింది. జనవరి 4న రాష్ట్రంలో ఆయనకు సంబంధించిన నాలుగు నివాస ప్రాంతాల్లో ఈ బృందం దాడులు నిర్వహించింది.

ఆర్థిక సంక్షోభంపై శ్వేతపత్రానికి డిమాండు

తిరువనంతపురం : రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభంపై శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని కేరళ శాసనసభలో యూడీఎఫ్ బుధవారం డిమాండు చేసింది. రాష్ట్రంలో ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభంపై చర్చించేందుకు ప్రవేశపెట్టిన వాయిదా తీర్మానం వీగిపోవడంతో సభ నుంచి వాకౌట్ చేసింది.రాష్ట్రంలో నెలకొన్న ఆర్థిక సంక్షోభం వల్ల అభివృద్ధి కార్యకలాపాలు, మూడు లక్షల మందికి పెన్షన్ పంపిణీ కాకుండా నిలిచిపోయినట్టు తెలిపారు.

పారిశ్రామిక ప్రాంతంగా ముంబై నావికా సెజ్

చాప్రా : ముంబై నావికా ప్రత్యేక ఆర్థిక జోన్(ఎన్ఎంఎస్ఈజెడ్)ను 'సమగ్ర పారిశ్రామిక ప్రాంతం'గా మారేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా ఆమోదం తెలిపింది. మంగళవారం ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ నేతృత్వంలోని రాష్ట్ర కేబినెట్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు సీఎం కార్యాలయం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. ద్రోణగిరిలో 2,140 హెక్టార్ల లో ఈ జోన్ విస్తరించి ఉంది. దీన్ని మూడు విడతల్లో అభివృద్ధి చేయాలని ఎన్ఎంఎస్ ఈజెడ్ ప్రతిపాదించింది.



వర్సిటీలకు 'మేధోహక్కులు' అవశ్యం

విశాలాంధ్ర - మధురవాడ : శాస్త్ర, సాంకేతిక అంశాలకు సంబంధించిన పరిశోధనా ప్రాజెక్టులు, పీహెచ్‌డీ రూపంలో జరిగే పరిశోధనల ఫలితాలను పరిశ్రమలకు బదలాయించి ఆర్థిక ప్రయోజనం పొందడానికి విశ్వవిదాలయాలు మేధోహక్కుల విధానాన్ని (ఐపీఆర్ పాలసీ) రూపొం దించుకోవాల్సిన అవసరం ఉందని నేషనల్ రీసెర్చి డెవలప్‌మెంట్ కార్పోరేషన్ (ఎన్ఆర్‌డీసీ) మేధోహక్కుల విభాగం అధిపతి బిజయకుమార్ సాహో అభిప్రాయపడ్డారు. గీతం స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్ (జీఎస్ఐబీ), భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) సంయుక్తంగా బుధవారం నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొన్నారు. పేటెంట్ హక్కులను పొందడంలో ప్రపంచంలో భారతదేశం వెనకబడి ఉందన్నారు. విశ్వవిద్యాలయాలు ఆర్థికంగా బలోపేతం కావాలంటే పరిశోధనా ఫలితాలపై మేధోహక్కులను పొందటం, పారిశ్రామిక ప్రయోజనాలకు ఉపయోగించడం చేయాలన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొ.ఎంఎస్ ప్రసాదరావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా డిజిటలైజేషన్ పెరుగుతున్న నేపథ్యంలో పరిశోధనా ఫలితాలపై మేధోహక్కులు పొందటం అత్యంత ఆవశ్యకమన్నారు. మేధోహక్కులపై అవగాహన లేకపోవడంవల్ల సిద్ధాంత వ్యాసాలను ఒకరిది మరొకరు కాపీ చేయడంవంటి అవాంఛనీయ పరిణామాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం దశాబ్దం క్రితమే ఐపీఆర్ విధానాన్ని రూపొందించుకుందని అన్నారు. దాదాపు 12 మంది పరిశోధకులు పేటెంట్ హక్కులకోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ డెవలప్‌మెంట్ అండ్ ప్రమోషన్ సెంటర్ (ఏపీటీడీసీ) అధిపతి సుభజిత్ సాహ మాట్లాడుతూ దేశంలో కేవలం 25శాతం మంది పరిశోధకులు మాత్రమే పేటెంట్‌కోసం దరఖాస్తు చేసుకుంటున్నారని, బయోడేటాలో రాసుకోవడానికి కాకుండా పరిశోధనా ఫలితాల ద్వారా ఆర్థిక వనరులు సమకూర్చుకోవడానికి పరిశోధకులు పేటెంట్ హక్కుల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విశ్వవిద్యాలయాలలో నమోదయ్యే ప్రతి పీహెచ్‌డీని పేటెంట్ హక్కులకోసం దరఖాస్తు చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. పేటెంట్ పొందిన సాంకేతిక పరిజ్ఞానాన్ని వివిధ వెబ్‌సైట్‌ల ఆధారంగా పరిశీలించి సాంకేతిక పరిశోధనలు ఎక్కడి నుండి ప్రారంభించవచ్చో ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో జీఎస్ఐబీ సంయుక్త సంచాలకులు ప్రొఫెసర్ కె.కె.నారాయణన్, కార్యక్రమ కోఆర్డినేటర్ డాక్టర్ రాధారఘురామ పాత్రుడు తదితరులు పాల్గొన్నారు.

ఫీజు కట్టలేక విశాఖలో ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య



విశాలాంధ్ర - విశాఖపట్నం : ట్రాఫిక్‌పోలీసులు ఓ విద్యార్థిని తండ్రి ఉపాధిపై దెబ్బ కొట్టారు. ఫీజు చెల్లించలేదనే కారణంతో చైతన్య కళాశాల యాజమాన్యం హాల్‌టికెట్ ఇవ్వకుండా వేధించింది. పరీక్ష రాయకపోతే ఇక తనకు భవిష్యత్ ఉండదనే భయంతో ఆ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. విశాఖ నగరంలోని లలితానగర్‌లో ఇంటర్ సెకండియర్ విద్యార్థిని గ్రంథి తేజస్విని ఆత్మహత్య నగరంలో సంచలనంగా మారింది. తేజస్విని తండ్రి శ్రీనివాస్ జీవీఎంసీ ఎదురుగా గాంధీ విగ్రహం వద్ద ఫుట్‌పాత్‌పై బట్టల వ్యాపారం చేసేవాడు. అయితే 11 రోజుల క్రితం అక్కడి ఫుట్‌పాత్ వ్యాపారులపై ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝుళిపించారు. జీవీఎంసీ కమిషనర్ దుకాణాలు తీసేయాలంటూ వారిని వ్యాపారం చేసుకోనివ్వలేదు. అతడికి హాకర్ గుర్తింపు కార్డు వుంది. ముద్రా రుణం తీసుకుని వ్యాపారం చేసుకుంటున్నాడు. వ్యాపారం లేక శ్రీనివాస్‌కు రోజువారీ ఆదాయం నిలిచిపోయింది. ఇంతలోనే కూతురి తేజస్వినికి ప్రాక్టికల్ పరీక్షలు దగ్గర పడ్డాయి. ఫిబ్రవరి 1 నుంచి ఆమె పరీక్షలకు హాజరుకావల్సి వుండగా, ఫీజు చెల్లించలేదనే కారణంతో చైతన్య కాలేజి యాజమాన్యం హాల్ టికెట్ ఇవ్వలేదు. దీంతో కలత చెంది మథనపడి ఏమి చేయాలో తెలియక, తండ్రి పరిస్థితి చూడలేక కుటుంబం అప్పులపాలు కావడం ఇష్టం లేక ఆ చదువుల తల్లి ప్రాణం తీసుకుంది.



డిసెంబర్ చివరికల్లా పేరూరు, బీటీపీకి నీరు

విశాలాంధ్ర - రాయదుర్గం : అనంత పురంజిల్లాలోని పేరూరు, బీటీ ప్రాజెక్టులకు డిసెంబ ర్ నెలాఖరుకల్లా కృష్ణా జలాలను తరలించే పనుల ను పూర్తిచేసి నీటిని విడుదల చేస్తామని జల వనరులశాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం పట్టణ సమీపంలోని పైతోట వద్ద రాష్ట్ర గ్రామీణ గృహనిర్మాణ శాఖా మంత్రి కాలవ శ్రీనివాసులు, మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి పరిటాల సునీత, చీఫ్‌విప్‌లు పల్లె రఘునాథ్‌రెడ్డి, పయ్యావుల కేశవ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు పార్థసారథి, జిల్లాపరిషత్ ఛైర్మన్ పూలనాగరాజు, ఎమ్మెల్యేలు హనుమంతరాయచౌదరి, ప్రభాకర్‌చౌదరి, ఈరన్న, గుండుమల తిప్పేస్వామి తదితరులతో కలిసి జిల్లా సమన్వయ కమిటీ సమావేశానికి హాజరైన అనంతరం విలేఖర్లతో మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అనంతపురం జిల్లాపై ప్రత్యేక శ్రద్ధ వహించి జిల్లా నుంచి కరవును పారద్రోలాలనే ఉద్దేశంతో జిల్లాకు అధిక ప్రాధాన్యతను ఇస్తున్నారని, హంద్రీనీవా ద్వారా దాదాపు 40టీఎంసీల నీటిని జిల్లాకు తరలించామన్నారు. ఫిబ్రవరిలో పేరూరు, బీటీప్రాజెక్టుకు సంబంధించిన పనులకు టెండర్లను పిలవనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ రెండు ప్రాజెక్టులకు అవసరమైన 1700 కోట్ల రూపాయలు బడ్జెట్‌లో కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని చెరువులన్నింటికీ నీటిని అందిస్తామని శింగనమల, కదిరి, మడకశిర, అనంతపురం తదితర నియోజకవర్గాల్లో నెలకొన్న సమస్యలపై సమన్వయకమిటీలో చర్చించామని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా వచ్చే వేసవిలో ఎలాంటి నీటి సమస్య రాకుండా చర్యలు తీసుకొంటామని ఇప్పటికే ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు కలెక్టర్లతో చర్చించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ జ్యోతి, పరిటాల శ్రీరాము, మారుతిచౌదరి, వైస్ ఛైర్మన్ వెంకటేశులు, టీడీపీ కన్వీనర్లు హనుమంతు, హనుమంతరెడ్డి, లాలెప్ప, భసవరాజు, గిరిమల్లప్ప, పాలయ్య రాఘవరెడ్డి, జగదీష్, దానవేంద్ర, రాజు, కౌన్సిలర్లు టంకశాల హనుమంతు, నాగరాజు, పురుషోత్తం, సంపత్‌కుమారి పాల్గొన్నారు.

శ్రీశైలంలో బయటపడిన సొరంగం



విశాలాంధ్ర - శ్రీశైలం : శ్రీశైలం మహాక్షేత్రంలో బుధవారం రుద్రాక్షమఠం వద్ద పునరుద్ధరణ పనులు చేస్తుండగా ఓ సొరంగం బయటపడింది. సొరంగంలో పురాతన పూజాసామాగ్రి గంటలు, చెంబులు, కడాయి లభ్యమయ్యాయి. సొరంగం బయటపడిన సమాచారం అందుకొన్న వెంటనే శ్రీశైలం తహశీల్దార్, ఎస్సై వరప్రసాద్, ఈఈ రామిరెడ్డి, వీఆర్‌ఓ. శ్రీనివాసులు, రుద్రాక్షమఠం వద్దకు వచ్చి పర్యవేక్షిస్తున్నారు. విషయం తెలుసుకొన్న స్థానికులు భారీగా గుమిగూడారు.

యూఎస్ఏలో మచిలీపట్నం యువకుడు మృతి



విశాలాంధ్ర - మచిలీపట్నంటౌన్ : చేతికి అందివచ్చిన కుమారుడు పరదేశానికి వెళ్ళి ప్రాణాలు కోల్పోవడంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలముకున్నాయి. కృష్ణాజిల్లా మచిలీపట్నం వాసి బొమ్మల రామ్మోహనరావు కుమారుడు చైతన్యకుమార్ బీటెక్ పూర్తి చేసి ఉన్నత చదువుల కోసం యూఎస్ఏలోని ఫ్లోరిడామామిలో ఎంఎస్ పూర్తి చేసేందుకు వెళ్లాడు. బుధవారం సాయంత్రం తమ కుమారుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడన్న సమాచారంతో మచిలీపట్నంలోని రామ్మోహనరావు కుటుంబం దు:ఖసాగరంలో మునిగింది. చైతన్యకుమార్ మరణవార్త తెలుసుకున్న రామ్మోహనరావు బంధువులు, స్నేహితులు, సహోద్యోగులు, పట్టణ ప్రముఖులు తండోపతండాలుగా వచ్చి రామ్మోహనరావు దంపతులను పరామర్శిస్తున్నారు.

అందని 'ఉపకార'ం

- పేద పిల్లల ఎదురుచూపులు
- అదిగో ఇదిగో అంటున్న అధికారులు
- ఆమ్ ఆద్మీ బీమా యోజన లబ్ధిదారుల ఇక్కట్లు



విశాలాంధ్ర - కోటబొమ్మాళి : ఉపకార వేతనాలు ఇస్తాం.. క్రమం తప్పకుండా పిల్లలను బడులకు పంపి.. బాగా చదివించండి" అంటూ డ్వాక్రా పేద మహిళలను ఊరడించిన పాలకులు, అధికారులు వాటి మంజూరులో మాత్రం ఎలాంటి శ్రద్ధ కనబర్చడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. శ్రీకాకుళం జిల్లాలోని కోటబొమ్మాళి మండలంలో స్కాలర్‌షిప్‌ల కోసం ప్రతిరోజూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న పేద విద్యార్థుల తల్లిదండ్రులకు అధికారుల నుంచి చీదరింపులే ఎదురవుతున్నాయి. ప్రభుత్వం అందించే సాయంతో తమ పిల్లల ఫీజులు చెల్లించుకోవచ్చని ఆశపడిన నిరుపేద తల్లిదండ్రులకు నిరాశే మిగులుతోంది. నిరుపేద కుటుంబాల్లోని చిన్నారులను ఉన్నత చదువులు చదివేందుకు ప్రోత్సహించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఆమ్ ఆద్మీ బీమా యోజన పథకంలో ఉన్న డ్వాక్రా మహిళల పిల్లలకు ఉపకార వేతనాలు అందించాలని నిర్ణయించింది. పాలకుల అలసత్వమో..అధికారుల నిర్లక్ష్యమో.. కానీ పథకం ప్రారంభమైనప్పటి నుంచి నేటివరకు ఒక్క ఏడాదైనా నిర్ణీత సమయానికి ఉపకార వేతనాలు అందించిన దాఖలాలు లేవు.

తప్పని అవస్థలు

ఆమ్‌ఆద్మీ బీమా యోజన పథకం కింద లబ్ధిదారులు ఏడాదికి రూ.15 చొప్పున కమ్యూనిటీ మేనేజ్డ్ మైక్రో ఇన్సూరెన్స్‌కు ప్రీమియం చెల్లించాలి. అభయహస్తం పథకంలో ఉన్నవారు ఏడాదికి రూ.385 చెల్లించాలి. ఈ పథకంలో 9 నుంచి ఇంటర్, ఐటీఐ, పాలిటెక్నిక్ చదివే విద్యార్థులకు ఏడాదికి రూ.1200 చొప్పున ఉపకార వేతనాలు అందించాలి. అయితే దాదాపు మూడేళ్ళ నుంచి ఆమ్ ఆద్మీ పథకం ఉపకార వేతనాలు అందలేదు. అభయహస్తం పింఛన్లు అరకొరా అందుతున్నా ఈ ఏడాది అవి కూడా మంజూరుకాలేదు.

పేరు మారినా ఉపయోగం సున్నా!

గతంలో ఏఏబీవై ద్వారా లబ్ధిదారులకు ఉపకార వేతనాలు అందించేవారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక అసంఘటిత కార్మికుల కోసం చంద్రన్నబీమా ప్రకటించడంతో లబ్ధిదారులందరినీ ఈ పథకానికి అనుసంధానం చేశారు. కొందరికి బీమా బాండ్లు ఇచ్చారు కానీ ఇంతవరకు పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాల గురించి మాత్రం పట్టించుకోవడం లేదు.

ఒక్క పైసా రాలేదు

జనశ్రీ కింద రూ. 120 చొప్పున 40 మందితో, అభయహస్తం కింద రూ.450 చొప్పున 15 మందితో, ఆమ్‌ఆద్మీ కింద రూ.115 చొప్పున 20 మందితో ప్రీమియాన్ని కార్యాలయంలో చెల్లించా. అయిదేళ్ళుగా చెల్లిస్తూనే ఉన్నాం. ఇంతవరకూ ఒక్క సభ్యురాలికి కూడా ఒక్క పైసా రాలేదు. అధికారులు మాత్రం పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

– ఎస్. కుమారి, డ్వాక్రా సంఘం లీడర్



నేటి నుంచి గుండె శస్త్రచికిత్స వైద్య నిపుణుల సదస్సు

విశాలాంధ్ర - విశాఖపట్నం : గుండె ఊపిరితిత్తుల శస్త్ర చికిత్స వైద్య నిపుణుల అంతర్జాతీయ సదస్సు ఫిబ్రవరి 1 నుండి 4 వరకూ నిర్వహించనున్నట్లు కేర్ ఆసుపత్రి కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ కరుణాకర్ ఫాధి తెలిపారు. బుధవారం విశాఖలోని స్థానిక హోటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ కార్డియాలజీ వాస్కులర్, థొరాసిక్ అసోసియేషన్ ఆఫ్ కార్డియాలజీల ఆధ్వర్యంలో నాలుగు రోజులపాటు నొవోటెల్‌లో సదస్సు జరగనుందని తెలిపారు. కరుణాకర్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా 1500మంది గుండె, ఊపిరితిత్తుల శస్త్రచికిత్స నిపుణులు హాజరవుతున్నారన్నారు. అమెరికా, యూరప్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌తోపాటు ఆసియాదేశాలకు సంబంధించి 41 మంది అంతర్జాతీయ నిపుణులు హాజరుకానున్నారని, రాష్ట్రంలో తొలిసారి విశాఖలో ఈ సదస్సు నిర్వహిస్తున్నా మన్నారు. సదస్సును వైద్య, ఆరోగ్య శాఖమంత్రి కామినేని శ్రీనివాస్‌తోపాటు జిల్లా మంత్రులు అయ్యన్న పాత్రుడు, గంటా శ్రీనివాస్ లు ప్రారంభిస్తారన్నారు. సమావేశంలో డాక్టర్ పీవీ సత్యనారాయణ, జయదేవ్ త్రివేది, ఫరూక్, కిషన్, జాన్ వెస్లీ, రమణకుమార్, సుజిత్ కుమార్ మహంతి, సాగర్ బాబు, రాజశేఖర్ పాల్గొన్నారు.



ఆర్‌యూ అవినీతిపై విచారణ

ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ డిమాండ్


విశాలాంధ్ర - కర్నూలు (కలెక్టరేట్) : కర్నూలు జిల్లా పర్యటనలో రాష్ట్ర మానవ వనరుల శాఖా మంత్రి గంటా శ్రీనివాసరావుకు నిరసన సెగ తగిలింది. రాయలసీమ యూనివర్సిటీలో స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ నూతన భవనాన్ని ప్రారంభించేందుకు బుధవారం వచ్చిన మంత్రి గంటా శ్రీనివాసరావును వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు అడ్డుకున్నారు. మరోవైపు యూనివర్సిటీలో పనిచేస్తున్న బోధనేతర సిబ్బంది తమ సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్లగా పోలీసులు అడ్డుకోవడంతో మంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కట్టమంచి రామలింగారెడ్డి పాఠశాలలో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న ప్రీతిబాయి తల్లిదండ్రులు పాఠశాలను సీజ్ చేయాలని కోరారు. ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాల నాయకులు రాయలసీమ యూనివర్సిటీలో జరుగుతున్న అవినీతిపై విచారణ జరిపించాలని, వీసీని వెంటనే రీకాల్ చేయాలని కోరుతూ మంత్రి కాన్వాయ్‌ను అడ్డుకున్నారు. దీంతో పోలీసులు విద్యార్థి సంఘాల నాయకులను వారించేందుకు యత్నించగా వారు ముందుకు తోసుకెళ్ళి వీసీ అవినీతి అక్రమాలపై విచారణ చేపట్టాలని, ఆయనను సస్పెండ్ చేయాలని, యూనివర్సిటీలో స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలని, ఆర్‌యూ అభివృద్ధికి రూ.150కోట్లు నిధులు కేటాయించాలని, ఉర్దూ విశ్వవిద్యాలయానికి సొంత భవనాలు నిర్మించాలని, నంద్యాలలో అగ్రికల్చర్ యూనివర్సిటీ ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు మహేంద్ర, యూనివర్సి టీ కార్యదర్శి కృష్ణమూర్తి, ఉపాధ్యక్షులు అంజి, రాంమోహన్, జిల్లా మాజీ అధ్యక్షులు శ్రీనివాసులు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్య దర్శులు నాగరాజు, యూనివర్సిటీ కార్యదర్శి సురేష్, నాయకులు గిరి, లోకేష్ పాల్గొన్నారు. యూనివర్సిటీలో ఎన్నో సంవత్సరాల నుండి చాలీచాలని వేతనాలతో కాంట్రాక్టు ఉద్యోగులు పనిచేస్తున్నారని, ఉద్యోగులలో అత్యధికులు 90శాతం కాంట్రాక్టు, బోధనేతర ఉద్యోగులే రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్నారని, వీరికి టైమ్‌స్కేల్ చేయాలని, రెగ్యులర్ నాన్‌టీచింగ్ పోస్టులను మంజూరు చేయాలని నాన్‌టీచింగ్ కాంట్రాక్టు ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాయ కులు సుంకన్న, మీనాక్షిరెడ్డి, మాధవశంకర్, శంకరయ్యల నాయకత్వంలో వినతిపత్రం అందజేశారు.

చిన్నతరహా పరిశ్రమల బలోపేతానికి 'జెడ్'

ఎస్‌బీఎస్ సీఈవో కృష్ణమూర్తి



విశాలాంధ్రబ్యూరో - శ్రీకాకుళం : చిన్న, మధ్య తరహా పరిశ్రమల బలోపేతానికి కేంద్రప్రభుత్వం జీరో ఎఫెక్ట్ - జీరో డిఫెక్ట్ (జెడ్ఈడీ) కార్యక్రమాన్ని రూపొందించినట్లు వ్యూహం, వ్యాపారం పరిష్కారాలు (స్ట్రేటజీ అండ్ బిజినెస్ సొల్యూషన్స్) ముఖ్య కార్య నిర్వహణ అధికారి బి.కృష్ణమూర్తి వెల్లడించారు. స్థానిక హోటల్‌లో కేంద్ర ప్రభుత్వం రూపొందించిన జెడ్ కార్యక్రమంపై జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో పారిశ్రామికవేత్తల అవగాహన సదస్సు బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి కృష్ణమూర్తి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మేక్‌ఇన్ ఇండియాలో భాగంగా చిన్న, మధ్యతరహా పరిశ్రమలను మరింత బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం జెడ్ ప్రోగ్రామ్‌ను రూపొందించిందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా పారిశ్రామికవేత్తలకు, ఔత్సాహికులకు అన్నివిధాల సహాయ సహకారాలు అందించి వారి మనుగడను కాపాడేందుకు జిల్లా పరిశ్రమల శాఖ సహకారంతో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. దీనిద్వారా పరిశ్రమలకు వచ్చే రాయితీలను పొందవచ్చని సూచించారు. ప్రస్తుత తరుణంలో పారిశ్రామిక రంగం ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధిగమించేందుకు జెడ్ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడటమేకాకుండా, పారిశ్రామిక వేత్తలకు ఎంతో ఉపశమనం కలిగిస్తుందన్నారు. అంతేకాక కేంద్రం ఇచ్చే రాయితీ నేరుగా పారిశ్రామికవేత్తల వ్యక్తిగత బ్యాంకు ఖాతాలకే జమచేయబడుతుందని, ఇందులో మధ్య దళారీ వ్యవస్థ ఉండబోదని స్పష్టంచేశారు. ఈ ఏడాది మార్చి 31లోగా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలతోపాటు ఇతర పారిశ్రామికవేత్తలు రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. రిజిస్ట్రేషన్ కొరకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.జెడ్ఈడీ.ఓఆర్‌జీ.ఇన్ పోర్టల్‌ను సంప్రదించవచ్చన్నారు. జిల్లాల వారీగా ఈ అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా ప్రతి రోజు సుమారు 150 మంది వరకూ పారిశ్రామిక వేత్తలు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుంటున్నారని, ఇది శుభపరిణామమని చెప్పారు. 2018 మార్చి 31లోగా దరఖాస్తు చేసుకున్న వారిలో సుమారు 22,500 మంది పారిశ్రామికవేత్తలను ఎంపిక చేస్తామని తెలిపారు. ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు రుసుం చెల్లించాల్సిన, గ్యారెంటీ చూపాల్సిన అవసరం లేదన్నారు. కావున ప్రతి ఒక్కరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తొలుత జెడ్ కార్యక్రమంపై రూపొందించిన డాక్యుమెంటరీని ప్రదర్శించారు. జిల్లా పరిశ్రమలకేంద్రం జిల్లా మేనేజర్ బి.గోపాలకృష్ణ, ఛాంబర్ ఆఫ్ కామర్స్ గీతాశ్రీకాంత్, నాగార్జున అగ్రికెం లిమిటెడ్ ప్రతినిధి కేవీ రామ్‌గోపాల్, జిల్లా పరిశ్రమల కేంద్ర ఉప సంచాలకులు సీహెచ్. గజపతి, సహాయ సంచాలకులు ఎస్.ప్రసాదరావు, వై.వీరశేఖర్ పాల్గొన్నారు.



ప్రతి గర్భిణీకి రూ. 6 వేలు

రాష్ట్ర పుడ్ కమిషన్ చైర్మన్ పుష్పరాజ్

విశాలాంధ్రబ్యూరో - నెల్లూరు : పోషక విలువలతో కూడిన ఆహారం ప్రసూతి పథకం కింద అందించేందుకు ప్రతి గర్భిణీకి 6 వేల రూపాయలు ఇచ్చేందుకు త్వరలో ఏపీ పుడ్ కమిషన్ చర్యలు చేపట్టనున్నదని రాష్ట్ర పుడ్ కమిషన్ చైర్మన్ జె.ఆర్. పుష్పరాజ్ తెలిపారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని గ్రీవెన్స్ సమావేశ మందిరంలో బుధవారం ఉదయం ఆహారభద్రతాచట్టం - 2013 ఏపీ పుడ్ కమిషన్, గౌరవ సభ్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతా, శిశు మరణాలపై తీవ్రమైన చర్యలు వుంటాయని, జిల్లాలో మాతా, శిశు మరణాల సమగ్ర నివేదికను పంపించాలన్నారు. ఇకముందు అలా జరగకుండా వైద్యశాఖాధికారులు తగిన ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. ఏపీ పుడ్ కమిషన్ డైరెక్టర్ జి. రవిబాబు మాట్లాడుతూ సంబంధిత జిల్లాస్థాయి అధికారులందరూ విస్తృత పర్యటనలు జరిపి తెల్లకార్డుదారులందరికీ ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణంలో ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం అమలులో విద్యార్థుల హాజరు, ఆహారం నాణ్యతా ప్రమాణాలు, పోషక విలువలు తనిఖీ చేయాలన్నారు. అంగన్‌వాడీలను, విద్యాసంస్థలను, వసతిగృహాలను తరచూ తనిఖీలు నిర్వహించాలని, ఆహారభద్రతాచట్టం-2013లోని నిబంధనలను పాటించేటట్లు చూడాలని తెలిపారు. బయోమెట్రిక్ ఫెయిల్యూర్ కేసుల్లో పౌర సరఫరాలశాఖ క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించి అర్హులందరికీ నిబంధనల మేరకు నిత్యావసర సరకులు అందించాలన్నారు. జిల్లాలో మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా అమలవుతుందని జిల్లా విద్యాశాఖాధికారి శామ్యూల్ తెలుపగా, పత్రికలలో వచ్చిన 17 వ్యతిరేక కథనాల పై సమగ్ర నివేదికలు పంపలేదని, వెంటనే పంపిం చాలన్నారు. జాయింట్ కలెక్టర్ ఎ.ఎండి. ఇంతి యాజ్, జాయింట్ కలెక్టర్ - 2 వెంకట సుబ్బా రెడ్డి, రాష్ట్ర పుడ్ కమిషన్ మెంబర్లు విజయ్‌కుమార్, వెంకట రావు, శ్రీనివాస రావు, స్వర్ణగీత, సివిల్ సప్లయిస్ డీఎం కృష్ణారెడ్డి, డీఏస్ఓ రమణ పాల్గొన్నారు.

రాష్ట్ర భద్రతలో 'ప్రత్యేక రక్షణ దళం'

- అధునాతన ఆయుధాలతో నిరంతర పహారా
- వీరి నిఘాలోనే సచివాలయం
- ఏపీలో గుంటూరు కేంద్రంగా సేవలు



విశాలాంధ్ర - గుంటూరుక్రైం : దేశ సరిహద్దులను కంటికి రెప్పలా కాపాడే మిలిటరీ బలగాలు, అంతర్గత శాంతిభద్రతలను అనుక్షణం పరిరక్షిస్తూ రక్షణ కల్పిస్తుంటాయి పోలీసు బలగాలు. వీటితో పాటు కీలక ప్రాంతాల రక్షణ కోసం ఉమ్మడి రాష్ట్రంలో 1991లో ఆవిర్భవించిన 'ప్రత్యేక రక్షణ దళం' (ఎస్పీఎఫ్) స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్సు సేవలకు స్థావరంగా మారింది గుంటూరు. రాష్ట్ర విభజన తర్వాత నవ్యాంధ్రలోని గుంటూరు అరండల్‌పేట పదిహేనవ లైనులో ఎస్పీఎఫ్ ప్రధాన కార్యాలయం ఏర్పాటైంది. డీఐజీ స్థాయి అధికారి ఆధ్వర్యంలో 3,600 మంది సిబ్బంది పద మూడు జిల్లాల్లోని కీలక ప్రాంతాల్లో క్లిష్టమైన పరిస్థితుల్లోనూ సేవలు అందిస్తున్నారు. శాంతి, అభ్యున్నతి, ప్రగతి అంశాలు ప్రధాన లక్ష్యాలతో ప్రభుత్వ, ప్రైవేటు, అటానమస్ రంగాలకు సంబంధించి కీలక ప్రాంతాల రక్షణ బాధ్యతలను ఈ ప్రత్యేక రక్షణ దళం చూస్తుంది. రాష్ట్ర పారిశ్రామిక, సౌకర్యాల అభివృద్ధి, రక్షణలో ఎస్పీఎఫ్ కీలక భూమిక పోషిస్తుంది. ఎస్పీఎఫ్ సిబ్బంది ఎప్పటికప్పుడు ఆయా పరిస్థితుల కు అనుగుణంగా స్పందిస్తూ ఆయా సంస్థలకు, వ్యవస్థలకు రక్షణ కల్పించడం కోసం ప్రత్యేక శిక్షణ పొంది ఉంటారు. మానవ వనరుల సహకారంతో ఎప్పటికప్పుడు అధునాతన శిక్షణ, సౌకర్యాలను అందిపుచ్చుకుంటారు. రక్షణ కల్పించే వ్యక్తి, వ్యవస్థ, సంస్థను నిరంతరం కంటికి రెప్పలాగా కాపాడటం ఎస్పీఎఫ్‌కే సాధ్యం. పోలీసు వ్యవస్థకు అనుసంధానంగా ఈ వ్యవస్థ సేవలు అందజేస్తుంది. ఎప్పటికప్పుడు సంస్థల అవసరాలకు అనుగుణంగా తమ సిబ్బందిని తీర్చిదిద్దుకుంటూ వాటి ప్రగతికి బాటలు వేసేందుకు సహకారం అందిస్తుంది. కీలక ప్రాంతాల రక్షణకు కావాల్సిన అధునాతన ఆయుధాల తయారీకి తక్కువ వ్యయంతో సాంకేతికతను అందిపుచ్చుకోవడం ఎస్పీఎఫ్ ప్రధాన ఉద్దేశం. రాష్ట్రంలోని కీలక ప్రాంతాలపై శాసనసభ, సచివాలయం, హైకోర్టు, ప్రధాన దేవాలయాలైన తిరుపతి, శ్రీశైలం, ఏపీ జెన్‌కో, ఏపీ ట్రాన్స్‌కో, రిజర్వు బ్యాంకు బ్రాంచ్‌లు, ప్రభుత్వ ముద్రణాలయాలు, కార్పొరేట్ సంస్థ అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీలు, ప్రభుత్వ రంగ సంస్థల రక్షణలో ప్రత్యేక రక్షణ దళం ముందుంటుంది. రాష్ట్రంలోని పదమూడు జిల్లాల్లో ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, సిబ్బంది కీలక సేవలు అందచేస్తున్నారు. డీఐజీ చంద్రగిరి ఏసురత్నం పర్యవేక్షణలో గుంటూరు కేంద్రంగా సేవలను అందిస్తున్న ప్రత్యేక రక్షణ దళాన్ని హైదరాబాద్ నుంచి ఐజీ, డీజీలు సూచనలు చేస్తుంటారు.



అమరావతికి అక్టోబర్ నాటికి హైకోర్టు

విశాలాంధ్ర - అమరావతి : అమరావతికి అక్టోబర్ నాటికి హైకోర్టు తరలింపు కార్యక్రమం పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోందని, దీనికి సంబంధించి విధి విధానాలు ఖరారు చేసినట్లు మంత్రి నారాయణ తెలిపారు. బుధవారం సచివాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం ఒక లక్ష 8 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో రూ.110 కోట్లతో హైకోర్టు భవనం నిర్మించనున్నదన్నారు. మార్చి మొదటి వారంలో నిర్మాణాలు ప్రారంభిస్తామని మంత్రి నారాయణ చెప్పారు. అమరావతిలో మరో రెండు తాత్కాలిక భవనాలు నిర్మించాలని సర్కార్ నిర్ణయించిందన్నారు .తాత్కాలిక హైకోర్టుతో పాటు అసెంబ్లీకి ఆనుకుని మరో భవనాన్ని నిర్మించనున్నారు.దీంతో పాటు 10 లక్షల చదరపు అడుగుల్లో రెండు ఐటీ టవర్ల నిర్మాణంకూడా చేపడుతోందన్నారు. గాంధీ పార్కు డిజైన్ కూడా దాదాపు పూర్తి కావచ్చిందని, నీరుకొండ వద్ద ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయనుందన్నారు. ఏప్రిల్ 10న భవానీ ద్వీపంలో హ్యాపీ సిటీస్ సదస్సు నిర్వహిస్తున్నామని మంత్రి నారాయణ తెలిపారు.

నాలుగేళ్ల కిందటే చంద్రగ్రహణం పట్టింది : జగన్



విశాలాంధ్ర - పొదలకూరు : రాష్ట్రానికి నాలుగేళ్ళక్రితమే చంద్రగ్రహణ పట్టిందని ఆ గ్రహణం వీడాలంటే మరో ఏడాదిపాటు వేచి ఉండాలని ప్రతిపక్షనేత వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రజాసంకల్ప యాత్రలో భాగంగా గురువారం సర్వేపల్లి నియోజకవర్గంలోని పొదల కూరు మండలంలోనికి అడుగుపెట్టిన ఆయనకు సర్వేపల్లి ఎమ్మెల్యే, జిల్లా వైసీపీ అధ్యక్షులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆధ్వ ర్యంలో ఘనస్వాగతం పలికారు. మండలంలోని డేగపూడి వద్ద కుమ్మర కుటుంబాలు జగన్‌ను కలిసి తమ వృత్తికి ఆద రణ తగ్గిందని ప్రభుత్వం పట్టించుకోవడంలేదని తమ అవేద నను వ్యక్తం చేశారు. నిమ్మరైతులు నిమ్మకాయలను రోడ్డుపై పోసి కష్టాలను ఆయనకు చెప్పుకున్నారు.పొదలకూరులో పంచాయతీ బస్టాండులో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, ఓటుకు నోటుకేసులో ముద్దాయిగా ఉన్న చంద్రబాబు కేంద్ర ఒత్తిడికి తలొగ్గి, రాష్ట్ర ప్రయో జనాలను తాకట్టుపెట్టారన్నారు. ఒక పక్క రైతులకు గిట్టు బాటు ధరలేక అల్లాడుతుంటే మరోపక్క నిత్యవసర వస్తు వుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని ఇది చంద్రబాబు నాలుగేళ్ళపాలనలో చేసిన అభివృద్ధని ఎద్దేవా చేశారు. ఆంధ్ర ప్రదేశ్‌ను అప్పుల,అవినీ ప్రదేశ్‌గా మార్చిన ఘనత చంద్ర బాబుదేనన్నారు. వైసీపీ అధికారంలోనికి వస్తే ధరల స్థిరికర ణకోసం రూ.3వేలకోట్లతో ప్రత్యేక నిధిని ఏర్పాటు చేస్తామని, రైతులకు బ్యాంకుల ద్వారా వడ్డీలేని రుణాలను అందజేస్తా మన్నారు. ప్రతిరైతుకు పంటలు వేసుకునేందుకు రూ.12 500లు ఇవ్వనున్నట్లు,ప్రతి మండలంలో కోల్డ్ స్టోరేజి,ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటుచేస్తామన్నారు. ప్రకృతి వైపరి త్యాలను తట్టుకునేందుకు రూ.4వేలకోట్లతో ప్రత్యేక నిధిని ఏర్పాటుచేయనున్నట్లు వివరించారు.రైతులకు తొమ్మిదిగంటల పాటు ఉచిత కరెంటును అందజేస్తామని,యుద్ధప్రాతిపదికన పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేస్తామన్నారు.

ఏపీకి ప్రాధాన్యమెంత!?

- కీలక ప్రాజెక్టులకైనా మోక్షం కలిగేనా?
- రైల్వే జోన్ ప్రకటన కోసం ఎదురుచూపులు
- పెండింగ్‌లపై గంపెడాశతో నేతలు
- నేడే కేంద్ర బడ్జెట్



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: రైల్వే బడ్జెట్‌లో ఈసారి ఆంధ్రప్రదేశ్‌కు ఏమేరకు ప్రాధాన్యం ఇస్తారనే ఉత్కంఠ సర్వత్రా నెలకొని ఉంది. విభజన హామీలను నెర వేర్చడంలోనే మీనమేషాలు లెక్కిస్తున్న కేంద్రం రాష్ట్రానికి న్యాయం చేస్తుందా?, కీలక ప్రాజెక్టులకు మోక్షం కలిగి స్తుందా? అనే మీమాంస రాష్ట్ర నేతల్లో నెలకొని ఉంది. ఈనెల ప్రారంభంలో రైల్వే జీఎం నిర్వహించిన సమా వేశంలో తమ నియోజకవర్గాల సమస్యలు, అవసరాలతో పాటు సమిష్టిగా కొన్ని ప్రాజెక్టులపై ఎంపీలు వినతి పత్రా లను సమర్పించిన విషయం తెలిసిందే. ముఖ్యంగా ఏపీ పునర్విభజన చట్టం -2014లో పొందుపరచిన విధంగా విశాఖపట్నం కేంద్రంగా కొత్త రైల్వే జోన్ ఏర్పాటు చేయాలని వారు ముక్తకంఠంతో విజ్ఞప్తి చేశారు. కాగా దక్షిణ మధ్య రైల్వే పరంగా వివిధ దశల్లో ఉన్న ప్రాజెక్టుల్లో కీలకమైనవి గుర్తించి వాటిని పూర్తి చేసే యోచనలో రైల్వేశాఖ ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా నడికుడి-శ్రీకాళహస్తి నూతన మార్గం, గుంటూరు-గుంతకల్ డబ్లింగ్‌తోపాటు విద్యుద్దీకరణ, విజయవాడ- భీమవరం-నిడదవోలు మార్గం డబ్లింగ్, విద్యుద్దీకరణ, కడప-బెంగళూరు నూతన మార్గం నిర్మాణాలకు ప్రాధాన్యమిస్తూ భారీగా నిధులను కేటాయించే అవకాశాలున్నాయని రైల్వే అధికారులు చెబుతున్నారు. గత 2017-18 బడ్జెట్‌లో నడికుడి-శ్రీకాళహస్తి మార్గానికి రూ. 340 కోట్లు, కడప-బెంగళూరు మార్గానికి రూ. 240 కోట్లు, గుంటూరు-గుంతకల్ మార్గానికి రూ. 124 కోట్లు, విజయవాడ-భీమవరం-నిడదవోలు మార్గానికి రూ. 122 కోట్లను కేటాయించినట్లు తెలిపారు. నడికుడి-శ్రీకాళహస్తి మార్గం లో నడికుడి నుంచి శావల్యాపురం వరకూ 36 కిలో మీటర్ల మార్గం పూర్తి కావడంతో త్వరలోనే ఈ మార్గంలో రైళ్లను నడిపేందుకు అవకాశం ఉందంటున్నారు. మిగిలిన భాగాన్ని కూడా వేగవంతంగా పూర్తి చేయాలని తమశాఖ భావిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. నవ్యాంధ్ర రాజధాని అమరావతిలో విజయవాడ-అమరావతి-గుంటూరు మధ్య రూ. 2,680 కోట్ల వ్యయంతో 106 కి.మీ. నూతన మార్గానికి గత ఏడాది గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిం దని అధికార పార్టీ నేతలు చెబుతున్నారు. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు నిర్మాణ వ్యయంలో చెరి సగం భరించే ఈ ప్రాజెక్టుకు ఈ బడ్జెట్‌లో కేటాయింపులు ఉండవచ్చన్న అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.

కృష్ణాకెనాల్ టెర్మినలే ప్రత్యామ్నాయం

కృష్ణాకెనాల్ జంక్షన్‌ను టెర్మినల్‌గా ఆధునీకరిస్తే విజయ వాడపై చాలా వరకూ ఒత్తిడి తగ్గుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. ఢిల్లీ, ముంబై, చెన్నై, బెంగళూరు, కోల్‌కత, హైదరాబాద్ తరహాలో విజయవాడకు ప్రత్యామ్నాయంగా కొన్ని స్టేషన్లను టెర్మినల్స్‌గా మార్పు చేయడ మొక్కటే మార్గమని సూచిస్తున్నారు. కృష్ణా కెనాల్, గుణదల, రామవరప్పాడు, రాయనపాడు స్టేషన్లకు రహదారి సదుపా యాలను కల్పించి టెర్మినల్/ శాటిలైట్ స్టేషన్లుగా మార్పు చేయాలని కోరుతున్నారు. ఈ అంశాలపై ఎంపీలు ఏకతాటిపైకి వచ్చి కేంద్రంపై వత్తిడి పెంచితేనే ఫలితం ఉంటుందన్నారు. ప్రధానంగా కృష్ణాకెనాల్ జంక్షన్‌ను టెర్మినల్‌గా అభివృద్ధి చేసి ముఖ్య రైళ్లకు ఇక్కడే నిలుపుదల చేయాలి. పిట్‌లైన్లను ఏర్పాటు చేసి రైళ్ల నిర్వహణ పనులను ఇక్కడే చేయడం వల్ల విజయవాడ నుంచి కొత్త రైళ్లను నడిపేందుకు అవకాశం ఉంటుంది. ఇక్కడ సుమారు 2వేల ఎకరాల స్థలం రైల్వేశాఖ అధీనంలో ఉన్నందున అదనంగా భూసమీ కరణ, సేకరణ చేయాల్సిన అవసరం లేదు. కృష్ణాకెనాల్ జంక్షన్ నుంచి విజయవాడ పండిట్ నెహ్రూ బస్టేషన్ వరకూ రైలు మార్గానికి సమాంతరంగా రోడ్డు మార్గం, నదిపై ఐకానిక్ వంతెన నిర్మిస్తే చాలా వెసులుబాటు కాగలదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

విజయవాడలో మరిన్ని ప్లాట్‌ఫారాలు అవసరం

విజయవాడలో ప్రస్తుతం 10 ప్లాట్‌ఫారాలుండగా గత ఏడాది అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూట్ రిలే ఇంటర్ లాకింగ్ (ఆర్‌ఆర్‌ఐ)ను ఏర్పాటుచేసినప్పటికీ ఔటర్ కష్టాలు ఇంకా తీరలేదు. ఇప్పటికీ ఆయా మార్గాల్లో విజయవాడ చేరాల్సిన రైళ్లు శివార్లలో 10 నుంచి 30 నిముషాల సేపు నిలిచిపోతున్న పరిస్థితి. ప్రయాణీకుల ఇబ్బందులను తొలగించాలంటే విజయవాడలోని ప్లాట్‌ఫారాలు 7,8 మధ్య ఉన్న గూడ్స్ లైన్లను తొలగించి వాటి స్థానంలో రెండు ఐలాండ్ ప్లాట్‌ఫారాలను నిర్మిస్తే అదనంగా నాలుగు ప్లాట్‌ఫారాలు అందుబాటులోకి వస్తాయని, దీంతో ఔటర్‌కష్టాలకు చెక్ చెప్పవచ్చంటున్నారు.

ప్రజాప్రతినిధుల ప్రతిపాదనలివే..

- ▶ విజయవాడ-గుంటూరు-తెనాలి మధ్య సర్క్యులర్ రైళ్లను నడపాలి.
- ▶ విజయవాడ నుంచి నంద్యాల, ఎర్రగుంట్ల, కడప మీదుగా తిరుపతికి నేరుగా ఎక్స్‌ప్రెస్ రైలును నడపాలి. నరసరావుపేట, వినుకొండ, మార్కాపురం ప్రాంత వాసులకు నేరుగా తిరుపతి వెళ్లడానికి రైలు సదుపాయం అందుబాటులోకి వస్తుంది.
- ▶ మచిలీపట్నం-యశ్వంతపూర్ కొండవీడు ట్రైవీక్లీ ఎక్స్‌ప్రెస్‌ను డైలీగా మార్పు చేయాలి.
- ▶ మోటుమర్రి-విష్ణుపురం మార్గం పూర్తయినందున కాజీపేట, నడికుడి మీదుగా వెళ్లే రైళ్లలో కొన్నింటిని నూతన మార్గం మీదుగా మళ్లించాలి.
- ▶ తెలంగాణలోని నిజామాబాద్, కరీంనగర్‌లో గోదావరి జిల్లాలకు చెందిన వారు ఎక్కువగా సెటిలైనందున వారి సౌకర్యార్థం కాకినాడ, నరసాపురం నుంచి కాజీపేట, పెద్దపల్లి, కరీంనగర్ మీదుగా నిజామాబాద్‌కు కొత్త రైళ్లను ఏర్పాటు చేయాలి.
- ▶ విజయవాడ స్టేషన్ సమీపంలోని రైల్వే మినీ స్టేడియంతోపాటు కొన్ని కార్యాలయాలు, క్వార్టర్స్‌ను తొలగించినట్లయితే విశాలమైన సర్క్యులేటింగ్ ఏర్పాటు కాగలదు.
- ▶ దేశంలో రెండో అతిపెద్ద జంక్షన్‌గా పేరొందిన విజయవాడ నుంచి వివిధ ప్రాంతాలకు కొత్త రైళ్లను నడపాలి. ముఖ్యంగా ముంబై, జైపూర్, అహ్మదాబాద్, నాగపట్నం, జమ్మూ, డెహ్రాడూన్, గౌహతి, తిరుపతికి నేరుగా రైలు సదుపాయాన్ని అందుబాటులోకి తేవాలి.
- ▶ సికింద్రాబాద్ వెళ్లే విశాఖ, సింహపురి, పద్మావతి, గోదావరి వంటి రైళ్లను లింగంపల్లి వరకూ పొడిగించాలి.
- ▶ విజయవాడ నుంచి కాజీపేట మీదుగా సికింద్రాబాద్‌కు రాత్రి వేళల్లో ప్యాసింజర్ రైలు నడపాలి.



చుకు బుకు రైలు

◆అతి పెద్ద పేరున్న రైల్వే స్టేషన్ ఆంధ్రప్రదేశ్‌లోని వెంకట నరసింహరాజువారి పేట'.

◆చిన్న పేరున్నవి ఒడిశాలోని 'ఐబి', గుజరాత్లోని 'ఓడీ' స్టేషన్లు..

◆దేశంలోనే అత్యంత నెమ్మదిగా.. మెట్టుపాళ్యం-ఊటీ నీలగిరి ప్యాసింజరు. గంటకు 10 కి.మీ వేగంతో నడుస్తుంది.

◆దేశంలో అత్యంత వేగంగా నడిచే రైలు ఢిల్లీ-ఆగ్రా గతిమాన్ ఎక్స్‌ప్రెస్. ఇది గంటకు 160కి.మీ. వేగంతో ప్రయాణిస్తుంది. కేవలం 100 నిమిషాల్లో గమ్యాన్ని చేరుస్తుంది.

◆అత్యంత దూరం నడిచే రైలు వివేక్ ఎక్స్‌ప్రెస్. దిబ్రూగఢ్-కన్యాకుమారి మధ్య 4,273 కి.మీ. దూరం ప్రయాణిస్తుంది.

◆అత్యంత తక్కువగా కేవలం మూడు కిలోమీటర్లు మాత్రమే ప్రయాణించే రైలు నాగపూర్ - అజ్నీ ప్యాసింజరు.

◆భారతీయ రైల్వేకు సుమారు 10.65 లక్షల కోట్లఎకరాల సొంత స్థలాలున్నాయి.

◆"ప్రపంచంలోనే అత్యంత ప్రాచీనమైన 'ఫెయిరీ క్వీన్' ఆవిరి ఇంజిన్ నేటికీ సేవలు అందిస్తోంది.

◆మహారాష్ట్రలోని అహ్మద్‌నగర్‌లో ఒకేచోట రెండు స్టేషన్లున్నాయి. రైలు పట్టాలకు ఒకవైపు శ్రీరాంపూర్, మరోవైపు బేలాపూర్ స్టేషన్లున్నాయి.

◆రైళ్లలో ఎయిర్ కూలింగ్ సదుపాయం తొలిసారిగా 1874లో అందుబాటులోకి వచ్చింది.

◆ప్రజాప్రయోజనార్థం తొలిసారిగా అందుబాటులోకి వచ్చిన భూగర్భ రైల్వే మార్గం కోల్‌కతా మెట్రో.

లేటుకు సర్టిఫికేటు

◆సాధారణంగా జపాన్‌లో రైళ్లు ఠంచనుగా నడుస్తాయి. పొరపాటున 5 ని॥కంటే ఎక్కువ ఆలస్యమైతే ప్రయాణికులకు క్షమాపణలు చెబుతారు. ఇక గంట ఆలస్యమైతే, రైలు ఆలస్యమైనట్లు ధ్రువపత్రాలు కూడా ఇస్తారు.

◆దక్షిణ మధ్య రైల్వే పరిధిలో తొలి రైలు 1864, అక్టోబరు 1న చిత్తూరు జిల్లాలోని రేణిగుంట-రెడ్డిపల్లి మధ్య నడిచింది.

◆విజయవాడ-మద్రాస్‌ల మధ్య తొలి బ్రాడ్‌గేజ్ రైలుమార్గం 1899లో ప్రారంభమైంది.

◆విజయవాడ-సికింద్రాబాద్‌ల మధ్య 1969లో గోల్కొండ ఎక్స్‌ప్రెస్ ప్రారంభమైంది. దేశంలోనే అత్యంత వేగంగా నడిచే ఆవిరి ఇంజిన్ ఉన్న రైలుగా అప్పట్లో దీనికి పేరు.

◆నిజాం స్టేట్ రైల్వే 1873లో ఇంగ్లండ్‌లో ఏర్పాటైంది. దీనిలో నిజాం ప్రభుత్వ వాటా 5లక్షల పౌండ్లు. వీరు నిర్మించిన తొలి రైల్వేలైను వాడి-హైదరాబాద్. ప్రస్తుత కాచిగూడ రైల్వే స్టేషన్ అప్పట్లో 'నిజాం స్టేట్ రైల్వే' ప్రధాన కార్యాలయం.

◆నిజాం స్టేట్ రైల్వే స్వాతంత్ర్యం అనంతరం 1952, ఏప్రిల్ 1న సెంట్రల్ రైల్వేలో విలీనమైంది.

◆హైదరాబాద్-ఢిల్లీ నడుమ ఆంధ్రప్రదేశ్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్ ప్రెస్ 1976లో ప్రారంభమైంది.

◆దక్షిణ మధ్య రైల్వేలో తొలి విద్యుదీకరించిన రైలు మార్గం విజయవాడ-గూడూరు మధ్య 1980 డిసెంబరు 15న ప్రారంభమైంది.

◆దక్షిణ మధ్య రైల్వేలో తొలి కంప్యూటరైజ్డ్ పాసింజర్ రిజర్వేషన్ వ్యవస్థ (పీఆర్ఎస్) సికింద్రాబాద్ స్టేషన్‌లో 1989, సెప్టెంబర్ 30న ఆరంభమైంది.

◆దక్షిణ మధ్య రైల్వే పరిధిలో మొట్టమొదటి ఎస్కలేటర్ సదుపాయం విజయవాడ రైల్వేస్టేషన్లో 2000లో అందుబాటులోకి వచ్చింది

◆**దేశంలో రోజూ మొత్తం 21,000** రైళ్లు ప్రయాణిస్తున్నాయి. ఇవి ప్రయాణించే మొత్తం దూరం.. భూమికి చంద్రునికి మధ్య దూరానికి మూడున్నర రెట్లతో సమానం. అంటే 13.4 లక్షల కిలోమీటర్లు!

◆దేశవ్యాప్తంగా 1.15 లక్షల కిలోమీటర్ల మేర రైలు పట్టాలు, 65,808 కిలోమీటర్ల పొడవైన రైలు మార్గాలు, 7,115 స్టేషన్లు ఉన్నాయి.

◆భారతీయ రైల్వేల మొత్తం మార్గంతో భూమధ్య రేఖను ఒకటిన్నరసార్లు చుట్టిరావచ్చు.

◆భారతీయ రైల్వే రోజూ 2.50 కోట్ల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేస్తోంది. ఇది ఆస్ట్రేలియా జనాభా కన్నా ఎక్కువ.

◆దేశంలో గూడ్సు రైళ్ల ద్వారా నిత్యం 13 కోట్ల టన్నుల సరకులు రవాణా అవుతున్నాయి.

◆రైల్వే శాఖలో ఉద్యోగులు - 16 లక్షలు. ప్రపంచంలోనే అత్యధిక ఉద్యోగులున్న సంస్థల్లో దీనిది 8వ స్థానం

◆2.5 లక్షల సరకు రవాణా పెట్టెలు, 66 వేలకు పైగా ప్రయాణ బోగీలు, 15 వేల వరకు ఇంజిన్లు ఉన్నాయి.

◆ప్రపంచంలోనే అత్యంత పొడవైన ప్లాట్‌ఫాం ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌లో ఉంది. దీని పొడవు 1,336.33 మీటర్లు

◆ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన రైల్వే వంతెన జమ్మూకాశ్మీర్‌లోని చినాబ్ నదిపై నిర్మితమవుతోంది. కుతుబ్‌మినార్ కంటే ఐదు రెట్లు ఎక్కువ ఎత్తులో... ఈఫిల్ టవర్ కంటే 35 మీటర్లు ఎక్కువ పొడవుగా... నదీ జలాలకు 359 మీటర్ల ఎత్తులో ఉండనుంది.

◆దేశంలో తొట్టతొలి రైలు ముంబై-థానేల మధ్య 1853 ఏప్రిల్ 16న పరుగుతీసింది.

◆జమ్ము-కాశ్మీర్‌లోని పీర్ పంజల్ రైల్వే సొరంగం దేశంలోనే అతి పొడవైనది (11.215 కి.మీ.).

◆తొలిసారిగా 1891లో ఫస్ట్ క్లాస్ బోగీల్లో మరుగుదొడ్డి సదుపాయాన్ని ప్రవేశ పెట్టారు. ఆ తర్వాత 1907లో మిగతా బోగీల్లో ఆ సదుపాయం కల్పించారు.

◆దేశంలో సముద్రంపై నిర్మించిన తొలి రైల్వే వంతెన పంబన్ బ్రిడ్జి. ఇది తమిళ నాడు, పంబన్ ద్వీపంలోని రామేశ్వరాన్ని ప్రధాన భూభాగంతో అనుసంధానం చేస్తుంది.

బుల్లెట్‌తో ప్రక్షాళనం

◆2వ ప్రపంచ యుద్ధంలో బాంబులేసిన జపాన్ యుద్ధవిమానం కమికాజెను రూపొందించిన ఇంజినీరు... ఆ తర్వాత చాలా చింతించాడు. తన నైపుణ్యాన్ని శాంతి కోసం ఉపయోగించాలని బుల్లెట్ రైలు షింకన్‌సెన్‌ను తయారు చేశాడు. ఒక్క మరణ ప్రమాదమైనా లేకుండా ఇప్పటికీ తిరుగుతోందది.

రేపు దేశవ్యాప్త నిరసనలకు సిద్ధంకండి

జి.ఓబులేసు



విశాలాంధ్ర-అనకాపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధా నాలకు వ్యతిరేకంగా ఈ నెల 2న చేపట్టనున్న దేశవ్యాప్త నిరసనలకు సిద్ధంకావాలని కార్మిక సంఘాలకు ఏఐటీయూసీ రాష్ట్రప్రధాన కార్య దర్శి జి.ఓబులేసు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక కోడుగంటి గోవిందరావు భవన్‌లో జరి గిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బుధ వారం కేంద్రం ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో పెనుప్రమాదాన్ని సృష్టించేందుకు రంగం సిద్ధమైందని, ఇందులో సామా న్యులు శ్రమ, కష్టాన్ని బ్యాంకుల్లో డిపాజిట్ చేసుకున్న సొమ్మును దేశంలో బడా వ్యక్తులకు దోచిపెట్టేందుకు సమాయత్తమవుతున్నారని అన్నారు. మోడీ ప్రభుత్వం రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి గద్దెనెక్కారని నేటికి మూడు లక్షలా 70వేల ఉద్యోగాలు మాత్రమే ఇచ్చి బ్యాక్‌లాగ్‌లో ఉన్న లక్ష ఉద్యోగాలను రద్దుచేశారని విమర్శించారు.కనీస వేతనాల కోసం కార్మికులు పోరాడుతుంటే వారిని అక్రమ అరెస్టులు చేస్తూ రాష్ట్రంలో పోలీసులు చంద్రబాబుకు వత్తాసు పలుకుతున్నారని అన్నారు. రాష్ట్రంలో పెట్రోలు బంకులు మూతపడుతున్నా యంటే చంద్రబాబు చలవే అన్నారు. దేశంలో రెండున్నర లక్షలమంది బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు 15శాతం ఫిట్‌మెంట్‌ను కోరుతూ ఆందోళన చేస్తున్నా పట్టించుకొనే నాథుడే లేదని అన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పడి నాలుగేళ్లు గడుస్తున్నా కార్మికులకు చేసిన లాభం ఏమీ లేదని పైగా చట్టాల సవరణ పేరుతో కార్మికుల హక్కులు హరించే విధంగా చేస్తున్న తీరుకు నిరసనగా మరో స్వాతంత్ర్య పోరాటానికి కార్మికులు సిద్ధపడుతున్నారని అన్నారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యవర్గ సమితి సభ్యుడు సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు పదాల రమణ, జిల్లా కార్యదర్శి కోనలక్ష్మణ, ఉపాధ్యక్షులు వై.ఎన్.భద్రం, టీఎన్ఆర్ ప్రసాద్, కోరిబిల్లి శంకరరరావు, శ్రీరామదాసు అబ్బులు, నిమ్మకాయల నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

దేశ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం : రావుల



విశాలాంధ్ర- రంపచోడవరం : కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేశ ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేశారని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రావుల వెంకయ్య విమర్శించారు. బుధవారం తూర్పుగోదావరి జిల్లా ఏజన్సీ రంపచోడవరంలో రామారావు రెడ్డి అధ్యక్షతన జరిగిన సీపీఐ డివిజన్ ప్రథమ మహాసభలో ఆయన మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్ర మోడీ ఆర్థిక విధానాల వల్ల 7.9 శాతంగా ఉన్న దేశ ఆర్థిక వృద్ధిరేటు 6.5 శాతానికి దిగజారిందన్నారు. నోట్ల రద్దు, జీఎస్టీ దెబ్బతో పేదవారి జీవనం అధోగతి పాలైందని, ప్రతి పేదవాడి బ్యాంకు ఖాతాలో రూ.15లక్షలు జమచేస్తామన్న హామీ నేటికి నెరవేరలేదని ఎద్దేవా చేశారు. మోడీ ప్రజా స్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని, పత్రికా స్వేచ్ఛను హరిస్తు న్నారని దుయ్యబట్టారు. బీజేపీ, దాని మిత్ర పక్షాలు తప్ప దేశంలో ఇక ఏ పార్టీ ఉండకూడదన్న ధోరణిలో పాలన సాగుతోందని విమర్శించారు. వచ్చే ఏడాది జరగనున్న ఎన్నికల నేపథ్యంలో దేశం, రాష్ట్రంలో మూడవ ప్రత్యామ్నాయం దిశగా ఐక్య విశాల కూటమిని ఏర్పరుస్తామన్నారు. టీడీపీ, బీజేపీ విధానాలతో రాష్ట్ర విభజన హామీలు మూలన పడ్డాయన్నారు. పోలవరం ప్రాజెక్టు ప్రశ్నార్థకంగా, విశాఖ రైల్వే జోన్ కలగానే మిగిలిందన్నారు. రాజధాని పేరుతో రైతుల భూములు బలవంతంగా లాక్కొని ధనవంతులకు కట్టబెట్టిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కిందన్నారు. చంద్రబాబు, వెంకయ్య నాయుడుల శాప నార్థాలతో కమ్యూనిష్టు పార్టీకి అంతర్థానం కాబోదని, మొద్దు నిద్రపోతున్న ఈ ప్రభుత్వాలను కూలదోయాలంటే అంకుశం ఉపయో గించాల్సిందేన న్నారు. లౌకికవాద శక్తుల్ని ఐక్యం చెయ్యడం ద్వారా వీరి పాలనకు చమరగీతం పాడే రోజు అతిదగ్గరలోనే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ తాటిపాక మధు, డివిజన్ నాయకుడు జుత్తుగ కుమార్‌లు పాల్గొన్నారు.

నేడు నెట్ నోటిఫికేషన్

- మార్చి 6 నుండి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు
- స్వీకరణకు గడువు ఏప్రిల్ 5
- జూలై 8న నెట్, అదే నెలలో ఫలితాలు

విశాలాంధ్ర-విశాఖసిటీ : విశ్వ విద్యాలయాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు, జూనియర్, డిగ్రీ కళాశాల లెక్చరర్లుగా చేరేం దుకు నిబంధనగా ఉన్న జాతీయ అర్హత పరీక్ష(నెట్) నోటిఫికేషన్ దేశవ్యాప్తంగా గురువారం విడుదల కానుంది. నెట్‌కు సంబంధించి ఇప్పటికే షార్ట్ నోటిఫికేషన్ విడుదల చేసిన యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్(యూజీసీ) గురువారం పూర్తి వివరాలతో నోటిఫికేషన్ విడుదల చేయనుంది. యూజీసీ తరపున ఈ పరీక్షను సీబీఎస్ఇ నిర్వహిస్తోంది. బోధన, పరిశోధన రంగాల్లోని ప్రవేశించాలనుకునే వారికి కనీస ప్రమాణాలను నిర్దేశించేందుకు ఉద్దేశించిన ఈ నెట్‌లో ఉత్తీర్ణత సాధిస్తే వారు దేశంలోని ఏ యూనివర్సిటీలోనైనా పీహెచ్‌డీ చేయడానికి అర్హుల వుతారు. నెట్ అర్హత సాధించిన వారు వివిధ బోధనా, పరిశోధనలలో ప్రవేశాలకు అర్హత పొందితే, ఇంకా ఎక్కువ మార్కులు సాధించిన వారు నెట్-జెఆర్ఎఫ్‌కు కూడా అర్హత పొందుతారు. జెఆర్ఎఫ్‌కు ఎంపిక సాధిస్తే వారికి ఐదేళ్లపాటు ఫెలోషిప్ అందుతుంది. మొదటి రెండేళ్లు జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్, తరువాత రెండేళ్లు సీనియర్ రీసెర్చ్ ఫెలోషిప్‌గా నెలకు రూ.35,000 అందుతాయి. చివరి ఏడాది అదనపు పీరియడ్‌గా పరిగణిస్తారు. దీంతో పాటు ఇతరత్రా పుస్తకాలు, రవాణా, వసతి, ప్రాజెక్టులు తదితర రూపేణా కూడా ప్రోత్సాహకం ఉంటుంది. ప్రతిష్ఠాత్మక నెట్‌కు దేశవ్యాప్తంగా లక్షల్లో అభ్యర్థులు పోటీపడుతుంటారు.

ఈ ఏడాది నెట్‌లో మార్పులు

ప్రతీసారి నెట్‌లో ఉన్న నిబంధనలను ఈ ఏడాది కాస్తమార్చారు. అవి అభ్యర్థులకు మరింత మేలు చేకూర్చేవిగా ఉన్నాయి. గతంలో జెఆర్ఎఫ్ ఫెలోషిఫ్‌కు 28 ఏళ్ల వయస్సు కొలమానంగా ఉంటే దాన్ని ఇప్పుడు 30 ఏళ్ళకు పెంచారు. గతంలో మూడు పేపర్లు ఉంటే ప్రస్తుతం రెండు చేశారు. మార్కులు కూడా 350 గాను 300 మార్కులుగా మార్పు చేశారు. మొదటి పేపరు 50 ప్రశ్నలు 100 మార్కులకు, రెండవది 100 ప్రశ్నలు 200 మార్కులకు ఉంటుంది.

హోం గార్డులకు రూ.30 లక్షల ఎక్స్‌గ్రేషియా

విశాలాంధ్ర-అమరావతి: మావోయిస్టుల దాడుల్లో మృతి చెందిన హోం గార్డులకు రూ.30 లక్షలకు ఎక్స్‌గ్రేషియా పెంచేలా ప్రభుత్వానికి సిఫార్సు చేస్తూ కేబినెట్ సబ్ కమిటీ నిర్ణయం తీసుకుందని హోం మంత్రి చినరాజప్ప తెలిపారు. బుధవారం సచివాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావే శంలో మాట్లాడుతూ మావోయిస్టు ప్రభావిత ప్రాం తాల్లోని సమస్యలపై మంత్రివర్గ ఉప సంఘం భేటీ అయిందన్నారు. కానిస్టేబుళ్ల తరహాలోనే హోం గార్డులకూ ఎక్స్‌గ్రేషియాను రూ. 5 లక్షల నుంచి 30 లక్షలకు పెంచుతున్నామన్నారు. ఐపీ ఎస్, ఎమ్మెల్యేలు, ఆపై స్థాయి ప్రజా ప్రతినిధులకు రూ. కోటి ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని సిఫార్సు చేస్తామన్నా రు. కోడి పందేల విషయంలో పోలీసులు బాగా పని చేశారన్నారు.మూడు వేల మందికిపైగా కేసు లు పెట్టామన్నారు.కొన్ని చోట్ల రహస్యంగా కోడి పందేలు జరిగాయని, కోడి పందేల్లో ఎమ్మెల్యేలు పాల్గొన్నా కేసులు పెడతామన్నారు. విజయవాడలో భూకబ్జా విషయంలో ఎవరి పాత్ర ఉంటే వారిపై చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు.

శాంతి భద్రతలు అదుపులోనే : డీజీపీ


రాష్ట్రంలో శాంతి భద్రతలు అదుపులోనే ఉన్నా యని డీజీపీ ఎం.మాలకొండయ్య అన్నారు. రాను న్న రోజుల్లో క్రైమ్ రేట్‌ను తగ్గించడానికి కృషి చేస్తా మన్నారు. నూతన పోలీస్ స్టేషన్ల ఏర్పాటు ప్రతి పాదనలు ప్రస్తుతానికి లేవన్నారు. ట్రాఫిక్ పోలీసు స్టేషన్లను మరింత బలోపేతం చేస్తామన్నారు.

పోలవరంపై.. గడ్కరీతో ఉత్తరాంధ్ర నేతల భేటీ

విశాలాంధ్ర బ్యూరో-న్యూఢిల్లీ : పోలవరం ప్రాజెక్టు అంశంపై చర్చించేందుకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో ఉత్తరరాంధ్ర నేతలు చర్చలు జరిపారు. బుధవారం న్యూఢిల్లీలో కాంగ్రెస్ ఎంపీ కేవీపీ రామచంద్రరావు ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర నేతల నాయకుడు, మాజీ మంత్రి కొణతల రామకృష్ణ, అరకు ఎంపీ కొత్తపల్లి గీత బృందం కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి ఒక వినతి పత్రం సమర్పించింది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి పూర్తి వ్యయాన్ని కేంద్ర ప్రభుత్వమే భరించాలని వారు విజ్ఞప్తి చేశారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం భూసేకరణ, పరిహారం, పునరావాసం కల్పించాలని కేంద్రమంత్రిని కోరారు. త్వరలోనే పోలవరం ప్రాజెక్టును సందర్శిస్తామని, 2019 నాటికి పోలవరం ప్రాజెక్టుకును పూర్తి చేస్తామని కేవీపీ బృందానికి గడ్కరీ హామీ ఇచ్చారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ ఎంపీ కేవీపీ రామచంద్రరావు మాట్లాడుతూ పోలవరం కాంట్రాక్టర్ల మార్పు, కమీషన్ల బేరసారాలను తాము పట్టించుకోమన్నారు. ఎవరి వాటా ఎంత అన్నది తేల్చుకుని పని ప్రారంభిస్తే చాలని ఆయన పేర్కొన్నారు. అరకు ఎంపీ కొత్తపల్లి గీత మాట్లాడుతూ పోలవరం ముంపు ప్రాంతంలో 9 మండలాలు , 275కి పైగా గ్రామాలు ఉన్నాయని చెప్పారు.

రైతు ఖాతాకు మద్దతు ధర

అప్పుడే దళారీ వ్యవస్థకు చెక్ - సీఏసీపీ దక్షిణ భారత ప్రాంతీయ సదస్సులో వక్తల ఉద్ఘాటన



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : వ్యవసాయ ఉత్పత్తులకు ప్రభుత్వాలు ప్రకటించే మద్దతు ధర రైతు ఖాతాకు నేరుగా జమ చేసే విధానం అమల్లోకి వచ్చినప్పుడే దళారీ వ్యవస్థ నిరోధించ బడుతుందని వక్తలు అభిప్రాయపడ్డారు. స్థానిక బందరురోడ్డులోని ప్రైవేటు సమావేశ మంది రంలో బుధవారం కమిషనర్ ఫర్ అగ్రికల్చర్ కాస్ట్ అండ్ ప్రైజెస్ ఆధ్వర్యంలో దక్షిణ భారత దేశ రాష్ట్రాల ప్రాంతీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఫర్ అగ్రికల్చర్ కాస్ట్ అండ్ ప్రైజెస్ (సీఏసీపీ) చైర్మన్ ప్రొఫెసర్ విజయ పాల్ శర్మ మాట్లాడుతూ, వ్యవసాయ విధానంలో యాంత్రీకరణను అమలు చేయడంలో వ్యక్తిగత స్థాయిల కంటే సంఘాల, సామాజిక విధానంలో అమలు చేయడం ద్వారా యాంత్రీకరణకు అయ్యే ఖర్చు తగ్గుతుందన్నారు. రైతులు పండించే పంట కు లభించే మద్దతు ధర ముఖ్యం కాదని, ఎంత మొత్తంలో లాభసాటిగా రైతుల వద్దకు చేరాల న్నదే ముఖ్యమన్నారు.తృణ ధాన్యాల సాగుపై రైతులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఆ విధానానికి స్వస్తి పలకాలని ఆయన కోరారు. ఏపీ అగ్రికల్చర్, సహకార సంస్థ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి. రాజశేఖర్ మాట్లాడుతూ, కృష్ణా , గోదావరి నదుల అనుసంధానం వల్ల రాష్ట్రంలో ఉత్పత్తుల స్థాయి పెరిగిందన్నారు.జూన్ నాటికే కృష్ణా డెల్టా ప్రాంతంలో నీరు అందించడం వల్ల నవంబరు, డిసెంబరు నెలల్లో వచ్చే ప్రకృతి విపత్తుల నుంచి పంటను కాపాడగలిగామని వివరించారు. తెలం గాణ అగ్రికల్చర్ కమిషనర్ ఎమ్. జగన్మోహన్ మాట్లాడుతూ, తెలంగాణలో 24 గంటలు వ్యవసాయ విద్యుత్‌ను అందిస్తున్నామని, రాష్ట్రం లో పంటల దిగుబడికి రైతుల చేసే ఖర్చుల వివరా లను వివరించారు. కర్ణాటకు చెందిన ఫుడ్ అండ్ సివిల్ సప్లయిస్ డిపార్టుమెంట్ మేనేజింగ్ డైరెక్టర్ కె. హెమాజీ నాయక్, కేరళ వ్యవసాయ ధర సంస్థ చైర్మన్ పి. రాజశేఖరన్, కర్ణాటక అగ్రికల్చర్ జాయింట్ డైరెక్టర్ జియోల్లా కూడా మాట్లాడారు. ఈ సమావేశానికి సమన్వయకర్తగా ప్రాథమిక సెక్టార్ మిషన్ కో- ఆర్డినేటర్ డా॥ ఎన్‌డిఆర్‌కె. శర్మ,డిప్యూటీ డైరెక్టర్ బాలు నాయక్ వ్యవహ రించారు. ఈ సమీక్షలో తెలంగాణ ప్రతినిధి సునందిన, డా॥ సుహాసిని, తమిళనాడు కు చెందిన రైతు ఎమ్ఎస్ ధనపాల్ పుణ్యమ్, కర్ణా టకు చెందిన జగన్నాథ్, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన రైతులు డి. జయరామిరెడ్డి, రమేష్ , కన్నబాబు తదితరులు వారి అభిప్రాయాలను వెల్లడించారు.

సచివాలయంలో స్మార్ట్ సైకిళ్ల సవారీ...

విశాలాంధ్ర అమరావతి: రాజధాని అమరావతిలోని సచివాలయంలో స్మార్ట్ సైకిళ్ల పరుగులు ప్రారంభమయ్యాయి. మాస్టర్ ప్లాన్ ప్రకారం సీఆర్‌డీఏ పరిధిలో సైకిల్ సవారీకి ప్రత్యేకంగా ట్రాక్‌ల ఏర్పాటు చేస్తుండగా... ప్రయోగాత్మకంగా తొలి సారి వీటిని సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు లాంఛనంగా ప్రారం భించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బుధవారం సచివాలయం 2వ బ్లాక్ నుంచి తన కార్యాలయం వరకు సైకిల్ తొక్కుకుంటూ వెళ్లారు. కాలుష్యాన్ని తగ్గించడమే లక్ష్యంగా స్మార్ట్ సైకిళ్ల వ్యవస్థను తొలిసారిగా అమరావతిలో ప్రవేశపెట్టారు. జర్మనీ నుంచి ఇప్పటికే సచివాలయానికి 30 సైకిళ్లు చేరాయి.

ఢిల్లీలో జాతీయ మహిళా కమిషన్ రజతోత్సవం

విశాలాంధ్ర బ్యూరో-న్యూఢిల్లీ : కేంద్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఢిల్లీ విజ్ఞాన్ భవన్ జాతీయ మహిళా కమిషన్ రజతోత్సవ వేడుకలు ఘనంగా జరి గాయి. మహిళల రక్షణకు తెలంగాణ ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని, మహిళల సాధికారత ప్రధాన ఎజెండాగా ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక పథకాలను ప్రవేశ పెట్టారని తెలం గాణ మహిళా కమిషన్ చైర్మన్ త్రిపురనేని వెంకటరత్నం తెలిపారు. బుధవారం ఢిల్లీ లోని రజతోత్సవ సదస్సులో ఆమె ప్రసంగించారు. ఢిల్లీలో జరిగిన 'నిర్భయ' ఘటనలు హైదరాబాద్‌లో జరుగకుండా సీఎం కేసీఆర్ 'షీ టీమ్స్' ను ఏర్పాటు చేశారని, 'హాక్ ఐ' అప్లికేషన్ ద్వారా మహిళలకు రక్షణ చేపట్టారని వెంకటరత్నం వివరించారు.

వినోద్‌కాంబ్లీకి పితృవియోగం



న్యూఢిల్లీ: భారత మాజీ క్రికెటర్ వినోద్ కాంబ్లీ తండ్రి గణ్‌పత్ మంగళవారం ఉదయం మృతి చెందారు. ఈ విషయాన్ని కాంబ్లీ తన ట్విటర్ ద్వారా ప్రకటించాడు. 'ఇన్నాళ్లు నా వెనుక నిల్చుని, నన్ను ప్రోత్సహించిన, నేను క్రికెట్ ఆడేందుకు స్ఫూర్తి నిచ్చిన నా తండ్రి గణ్‌పత్ ఇక లేరు. బుధవారం ఉదయం ఆయన మృతి చెందారు. మిస్ యూ. థాంక్యూ నాన్న. లవ్ యూ. మీ కుమారుడు వినోద్.' అంటూ కాంబ్లి తన తండ్రిపై ఉన్న ప్రేమను చాటాడు. అంతేకాదు గణ్‌పత్‌కు సంబంధించిన కొన్ని ఫొటోలను ఈ సందర్భంగా కాంబ్లీ అభిమానులతో పంచుకున్నాడు. కాంబ్లీ తండ్రి మరణవార్త తెలుసుకున్న పలువురు అభిమానులు నివాళు లర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకున్నారు.

సంతలో పశువులా..!

- ఇక నుంచైనా పద్ధతి మార్చండి
- ఐపీఎల్-11 క్రికెటర్ల వేలంపై న్యూజిలాండ్ క్రికెట్ అసోసియేషన్ ఫైర్



బెంగళూరు: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) వేలంపై న్యూజిలాండ్ క్రికెట్ ప్లేయర్స్ అసోసియేషన్ మండిపడింది. వేలం జరిగిన తీరులో హుందాతనం కొరవడిందనీ, దారుణంగా ఉందని వ్యాఖ్యానించింది. ఐపీఎల్ వేలంపై ఒక విదేశీ క్రికెటర్ల అసోసియేషన్ ఆక్షేపించడం ఇదే తొలిసారి. 'వేలం జరిగిన విధానం క్రికెటర్లను అవమానపరిచేలా ఉంది. సంతలో పశువుల్లా కొనుగోలు చేశారు. ఈ దారుణాన్ని ప్రపంచమంతా చూ సింది' అని న్యూజిలాండ్ క్రికెట్ ప్లేయర్స్ అసోసియేషన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ హీత్ మిల్స్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు న్యూజిలాండ్‌కు చెందిన హెరాల్డ్ పత్రిక తెలిపింది. అంతకుముందు వెల్లింగ్టన్ క్రికెట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ పీటర్ క్లింటన్ కూడా ఐపీఎల్‌పై ట్వీట్ చేశారు. 'ఐపీఎల్ వేలంలో హుందాతనం కొరవడింది. అవసరం లేని నిరుద్యోగ పథకమని, ఇది చాలా దారుణం' అని వ్యాఖ్యానించిన నేపథ్యంలో మిల్స్ వ్యాఖ్యలు ప్రాముఖ్యత సంతరించు కున్నాయి. వ్యవస్థలో మార్పు రావాల్సిన అవసరం లేదనీ, ఆటగాళ్లను గౌరవించే విధంగా నడుచుకుంటే చాలని మిల్స్ అభిప్రాయ పడ్డాడు. 'ఐపీఎల్ వల్ల చాలామంది లాభ పడిన సందర్భాలున్నాయి. ఇది అద్దంలో ఓ పార్శ్వం మాత్రమే. అథ్లెట్స్‌ను కూడా ఈ విధంగా ఎంపిక చేస్తే బాగుంటుంది' అని తెలిపాడు. 'మనం ఎక్కడకు వెళుతున్నాం.. టీంలోని మిగతా ఆటగాళ్లు ఎవరు... అసలు మేనేజ్ చేసేది ఎవరు... జట్టు యజమాని ఎవరు... అనేది తెలియకుండానే ఆటగాళ్లు జట్టులోకి వెళుతున్నారు' అని మిల్స్ తెలిపాడు. వచ్చే ఐపీఎల్ వేలంలోనైనా మేనేజ్‌మెంట్ వేరే విధంగా ఆలోచన చేసి ఆటగాళ్లను ఎంపిక చేసుకోవాలని మిల్స్ అభిప్రాయపడ్డాడు.



ఇండియా ఓపెన్
సైనా, సింధు శుభారంభం

న్యూఢిల్లీ: ఇండియా ఓపెన్‌లో స్టార్ షట్లర్లు సైనా నెహ్వాల్, పీవీ సింధు శుభారంభం చేశారు. మహిళల సింగిల్స్‌లో సైనా నెహ్వాల్ డెన్మార్క్‌కు చెందిన సోఫియా హోలాంబో ధాల్‌పై 21-15, 21-9 తేడాతో విజయం సాధించింది. ఈ సెట్లు గెలుచుకునేందుకు సైనా చమటోడ్చాల్సి వచ్చింది. మరో మ్యాచ్‌లో పీవీ సింధు డానిష్‌కు చెందిన నటాలియా కోచ్ రోహ్దెను 21-10, 21-13 తేడాతో అలవోకగా మట్టి కరిపించింది. అయితే పురుషుల సింగిల్స్‌లో హెచ్ ఎస్ ప్రణయ్‌రాయ్ నిరాశ పరిచాడు. తన ప్రత్యర్థి శ్రయనేష్ జైస్వాల్‌కు లొంగిపోయాడు. 4-21, 6-21 తేడాతో ఓటమి పాలయ్యాడు. తదుపరి మ్యాచ్‌లో సైనా డెన్మార్క్‌కు చెందిన లైన్ హజ్‌మార్క్ కజర్స్ ఫెల్ట్‌తో, సింధు వైదేహి చౌధురితో తలపడనున్నారు.



'కుర్రాళ్ల'కు జాక్‌పాట్

న్యూఢిల్లీ: ఐసీసీ అండర్-19 ప్రపంచకప్ సెమీఫైనల్లో చిరకాల ప్రత్యర్థి పాక్‌ను చిత్తు చేసి ఫైనల్‌కు చేరుకుని యావత్తు దేశాన్ని తన వైపు తిప్పుకుంది పృథ్వీ షా నేతృత్వంలోని భారత జట్టు. టోర్నీలో భాగంగా మంగళవారం జరిగిన సెమీఫైనల్-2లో పాక్‌పై భారత్ 203 పరుగుల తేడాతో విజయం సాధించి ఫైనల్లో ఆస్ట్రేలియాతో అమీతుమీకి సిద్ధమైంది. ఈ నేపథ్యంలో ప్రపంచకప్ ఫైనల్‌కు చేరిన భారత జట్టుకు బీసీసీఐ భారీ నజరానా ప్రకటించింది. పాక్‌తో మ్యాచ్ అనంతరం బీసీసీఐ ప్రతినిధులు మాట్లాడుతూ..'ప్రతిష్టాత్మక ఐసీసీ అండర్-19 ప్రపంచకప్ టోర్నీలో ఫైనల్ చేరిన భారత జట్టుకు శుభాకాంక్షలు. అలాగే కోచ్ రాహుల్ ద్రవిడ్‌కు కూడా. ద్రవిడ్ నేతృత్వంలోని యువ ఆటగాళ్లు అద్భుత ప్రదర్శన చేస్తున్నారు. భవిష్యత్తులో వీరు మరింత మంచి ప్రదర్శన చేయాలని కోరుకుంటున్నాం. ఫైనల్ చేరిన జట్టుకు నగదు ప్రోత్సాహం అందజేస్తాం. అంతేకాదు వారు భారత్ చేరుకున్న అనంతరం ప్రత్యేక సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేస్తాం' అని తెలిపారు. అయితే, ఆటగాళ్లకు బీసీసీఐ ఎంత నజరానా ప్రకటించిందన్నది తెలియరాలేదు. ప్రపంచంలోనే ధనిక బోర్డయిన బీసీసీఐ యువజట్టుకు భారీగానే ముట్ట చెబుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఫిబ్రవరి 3న భారత్-ఆస్ట్రేలియా మధ్య ఫైనల్ జరగనుంది.



టాప్‌పైనే గురి

- వన్డేల్లో నెం.1 ప్రొటీస్
- తరువాతి స్థానంలో భారత్
- 4-2 తేడాతో గెలిస్తే మనమే 'టాప్'

దర్బన్: భారత్ దక్షిణాఫ్రికాల మధ్య గురువారం నుంచి వన్డే సిరీస్‌లకు తెరలేవనుంది. రెండు జట్లు నెం.1పైనే గురిపెట్టాయి. ఆరు వన్డే సిరీస్‌లు ఆడనున్నాయి. మొదటి వన్డే దర్బన్ వేదికగా కింగ్స్‌మేడ్‌లో ప్రారంభంకానున్నది. టెస్టులో టాప్ ర్యాంకింగ్‌ను కాపాడుకున్న భారత్.. రెండు టెస్టుల్లో ఓటమి అనంతరం, ఐదు రోజుల క్రితమే జరిగిన టెస్టులో విజయాన్ని చవిచూసింది. అలానే ఐసీసీ వన్డే ర్యాకింగ్స్‌లో దక్షిణాఫ్రికా టాప్‌లో ఉంది. ప్రతి మ్యాచ్‌కు పాయింట్లు సర్దుబాటు జరుగుతూ ఉంటుంది కాబట్టి ఎప్పటికప్పుడు ఈ నెంబర్ గేమ్ మారుతూ ఉంటుంది. అయితే తాము ప్రస్తుతం ర్యాంకుల గురించి పట్టించుకోవడం లేదనీ, తమ దృష్టంతా ఇంగ్లండ్‌లో జరగబోయే 2019 ప్రపంచకప్ పైనే అని దక్షిణాఫ్రికా కోచ్ ఓటిస్ గిబ్సన్ వ్యాఖ్యానించాడు. మొదటి మూడు మ్యాచ్‌లకు ప్రొటీస్ 15మంది సభ్యులతో కూడిన జట్టును ప్రకటించింది. ఈ 15మంది సభ్యుల్లో ఎంపికకాని వారు మిగిలిన మూడు మ్యాచ్‌లలో ఎంపికయ్యే అవకాశం ఉందని గిబ్సన్ తెలిపాడు. 'ప్రస్తుతం మేం నెం.1గా ఉన్నాం. అంటే ఇలానే వరల్డ్ కప్ దాకా ఉంటామని కాదు' అని వ్యాఖ్యానించాడు. 'విజయం ఒక్కటే అంతిమం కాదు. మేం ఏ జట్టునైతే ఎంపిక చేశామో, వారంతా బాగా రాణిస్తారని నమ్ముతున్నాం. కానీ మా లక్ష్యం మాత్రం వరల్డ్ కప్. దాన్ని దృష్టిలో పెట్టుకునే ఎంపిక జరిగింది. వీలైనంత ఎక్కువమంది ఆటగాళ్లు వెలుగులోకి వచ్చేలా చూడటమే ధ్యేయం' అని వివరించాడు. ఇక ఐసీసీ ప్రకటించిన బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో విరాట్ కోహ్లి ముందున్నాడు. అతని తరువాత సౌతాఫ్రికా ఫ్రెండ్, ఐపీఎల్ లీగ్ టీమ్‌మేట్ ఏబీ డివిలియర్స్ ఉన్నాడు. ఇండియా వైస్ కెప్టెన్ రోహిత్ శర్మ, సౌతాఫ్రికా కీపర్ క్వింటన్ డీ కాక్, ఫాఫ్ డుప్లెసిస్, హషీమ్ ఆమ్లా కూడా టాప్ టెన్‌లో ఉన్నారు. అలాగే ఎంస్ ధోనీ, శిఖర్ ధావన్‌లు 13, 14 స్థానాల్లో ఉన్నారు. ఇక ఇండియా టీం కూడా 17మందితో పెద్ద జట్టునే ప్రకటించింది. వారిలో తొమ్మిదిమంది సౌతాఫ్రికాతో టెస్టుల్లో ఆడారు.

జట్లు (అంచనా)

దక్షిణాఫ్రికా: ఫాఫ్ డుప్లెసిస్ (కెప్టెన్), హషీం ఆమ్లా, క్వింటన్ డీ కాక్, ఏబీ డి విలియర్స్, జేపీ డుమ్నీ, ఇమ్రాన్ తాహీర్, ఐడిన్ మార్క్రమ్, డేవిడ్ మిల్లర్, మోర్నె మోర్కెల్, క్రిస్ మోరిస్, లుంగి ఎంగిడి, యాండిల్ పెహ్లుక్‌వాయో, కాగిసో రబడ, టాబ్రియాజ్ షమ్సి, ఖాయా జోండో

భారత్: విరాట్ కోహ్లి (కెప్టెన్), రోహిత్ శర్మ (వైస్ కెప్టెన్), జస్ప్రీత్ బూమ్రా, యజ్వేంద్ర చాహల్, శిఖర్ ధావన్, ఎంఎస్ ధోనీ, శ్రేయస్ అయ్యర్, కేదార్ జాదవ్, దినేష్ కార్తీక్ (వికెట్ కీపర్), కుల్దీప్ యాదవ్, భువనేశ్వర్ కుమార్, మొహ్మద్ షమీ, మనీష్ పాండే, హార్దిక్ పాండ్య, అక్షర్ పటేల్, అజింక్యా రహానె, శార్దూల్ ఠాకూర్.

అంబటి రాయుడిపై రెండు మ్యాచ్‌ల నిషేధం



ముంబై: హైదరబాద్ క్రికెటర్ అంబటి రాయుడుపై బీసీసీఐ రెండు మ్యాచుల నిషేధాన్ని విధించింది. దీంతో అతడు త్వరలో ప్రారంభంకానున్న విజయ్ హజారే ట్రోఫీలో మొదటి రెండు మ్యాచ్‌లకు దూరం కానున్నాడు. ఈ టోర్నీలో రాయుడు హైదరబాద్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న సంగతి తెలిసిందే. అసలేం జరిగిందంటే.. ఈనెల 11న సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 క్రికెట్ టోర్నీలో భాగంగా విశాఖలో హైదరాబాద్-కర్ణాటక మధ్య మ్యాచ్ నిర్వహించారు. కర్ణాటక ఇన్నింగ్స్ రెండో ఓవర్లో హైదరాబాద్ ఫీల్డర్ మెహదీ హసన్ బౌండరీ దగ్గర బంతిని ఆపినప్పుడు అతని కాలు బౌండరీ లైన్‌ను తాకినట్లు రీప్లేలో తేలింది. ఆ సమయంలో అంపైర్లు రీప్లే కోరలేదు. దీంతో బ్యాట్స్‌మెన్ తీసిన 2 పరుగుల్ని మాత్రమే పరిగణనలోకి తీసుకున్నారు. 204 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన హైదరాబాద్ 203తో స్కోరును సమం చేసింది. అప్పుడు మాత్రం అంపైర్లు మ్యాచ్ అయిపోయిందని, హైదరాబాద్ ఓడిపోయిందని ప్రకటించారు. దీంతో హైదరాబాద్ ఆటగాళ్లు మైదానంలో తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ కారణంగా ఆంధ్ర-కేరళ మధ్య మ్యాచ్‌కు అంతరాయం కలిగింది. ఆ మ్యాచ్‌ను 13 ఓవర్లకే కుదించారు. విచారణ జరిపిన బీసీసీఐ అంబటి రాయుడు నిబంధనలు ఉల్లంఘించినట్లు తేల్చింది.

బడ్జెట్లు-ప్రత్యేకతలు

1951- ప్రవేశ పెట్టింది : జాన్ మథాయ్
పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ప్రవేశ పెట్టిన భారత తొలి బడ్జెట్ ఇది.
ప్రత్యేకత : ప్రణాళికా సంఘాన్ని ఏర్పాటు చేయాలన్న కీలక నిర్ణయం ఈ బడ్జెట్‌లోదే.

1968 - ప్రవేశ పెట్టింది: మొరార్జీ దేశాయ్
దీనిని ప్రజాకోణంలో రూపొందించారు.
ప్రత్యేకత: వస్తు ఉత్పత్తులపై ఎక్సైజ్ విభాగం మదింపు విధానానికి స్వస్తి పలికి, స్వీయ మదింపు విధానానికి రూపకల్పన.

1973 - ప్రవేశ పెట్టింది: వైబీ చవాన్
రూ. 550 కోట్ల భారీ లోటు బడ్జెట్ ఇది.
దీన్ని బ్లాక్ బడ్జెట్‌గా చెబుతుంటారు.
ప్రత్యేకత: బొగ్గు గనులు, బీమా సంస్థలను జాతీయం చేసేందుకు రూ.56 కోట్ల కేటాయింపు.


1986 - ప్రవేశపెట్టింది : విశ్వనాథ్ ప్రతాప్ సింగ్
కొన్ని వరాలు, కొన్ని భారాల సమ్మేళనమిది. 'క్యారెట్ అండ్ స్టిక్' బడ్జెట్‌గా దీనికి పేరు.
ప్రత్యేకత: మోడ్ వ్యాట్ అమలు. పన్ను ఎగవేతదారులపై కఠినచర్యలు తీసుకునేలా ఈడీకి అధికారాల పెంపు.

1987 - ప్రవేశ పెట్టింది: రాజీవ్‌గాంధీ
దీనికి గాంధీ బడ్జెట్‌గా పేరు.
ప్రత్యేకత: పన్ను ఎగవేసే అధికాదాయ సంస్థలకు కళ్లెం వేస్తూ కనీస కార్పొరేట్ పన్ను విధింపు. దీంతో ప్రభుత్వ దాయం భారీగా పెరిగింది.

1991- ప్రవేశ పెట్టింది : మన్మోహన్ సింగ్
దేశ ఆర్థిక రంగం సంస్కరణలకు నాంది పలికిన బడ్జెట్ ఇది.
ప్రత్యేకత: ఎగుమతి-దిగుమతి విధానంలో సమూల మార్పులు, కస్టమ్స్ సుంకం తగ్గింపు.

1997- ప్రవేశ పెట్టింది : చిదంబరం
'కలల బడ్జెట్'గా ఇది ప్రసిద్ధి.
ప్రత్యేకత: నల్లధనాన్ని వెలికితీసేందుకు ఆస్తుల స్వీయ ప్రకటన పథకాన్ని ఈ బడ్జెట్‌లోనే తెచ్చారు. ఐటీ రేట్లు తగ్గించడంతో పన్ను చెల్లించేవారి సంఖ్య, ఆదాయం పెరిగాయి.


- 2000 సంవత్సరం వరకు బడ్జెట్లు సాయంత్రం 5 గంటలకు ప్రవేశ పెట్టేవారు. 2001 నుంచి దాన్ని ఉదయం 11 గంటలకు మార్చారు.
- ఇప్పటివరకు బడ్జెట్లు ప్రవేశ పెట్టిన 25 మంది ఆర్థిక మంత్రుల్లో 11 మంది న్యాయ విద్య అభ్యసించినవారు.
- 1991లో మన్మోహన్‌సింగ్ ప్రవేశపెట్టిన బడ్జెట్.. ప్రతుల పరంగా అతి పెద్దది. ఆ బడ్జెట్లో 18,520 పదాలున్నాయి. అతి తక్కువ పదాలతో కూర్చిన బడ్జెట్ 1952 నాటిది. కేవలం 4,454 పదాలతో బడ్జెట్ తయారు చేశారు. అప్పటి ఆర్థిక మంత్రి సీడీ దేశముఖ్.



బర్త్‌డే బడ్జెట్

అత్యధికంగా పది బడ్జెట్లను ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి మొరార్జీ దేశాయ్. రెండు పర్యాయాలు... 1964, 1968 ల్లో తన పుట్టినరోజైన ఫిబ్రవరి 29న బడ్జెట్లు ప్రవేశపెట్టారు. ఇలాంటి ప్రత్యేకత మరే ఆర్థికమంత్రికీ లేదు.

- 1947 నుంచి ఇప్పటివరకు ప్రవేశపెట్టిన బడ్జెట్లు 87.
- దేశానికి ఆర్థిక మంత్రులుగా పనిచేసి.. తరువాత ప్రధాన మంత్రులైన వారు నలుగురు.. మన్మోహన్ సింగ్, వీపీ సింగ్, మొరార్జీ దేశాయ్, చరణ్ సింగ్
- ఇప్పటివరకు బడ్జెట్ ప్రవేశపెట్టిన 25 మంది ఆర్థిక మంత్రుల్లో ఆర్థిక శాస్త్రం కానీ, వాణిజ్యం శాస్త్రంలో కానీ డిగ్రీలున్న వారు 8 మందే.



మన దేశ బడ్జెట్ ప్రవేశ పెట్టిన ఏకైక మహిళా ఆర్థికమంత్రి ఇందిరాగాంధీ

- పన్ను లేని దేశాలు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఒమన్, బహ్రెయిన్, ఖతార్, సౌదీ అరేబియా, కువైట్, బెర్ముడా, కేమ్యాన్ దీవులు, బహమాస్, బ్రూనై.
- ఆర్థిక మంత్రులుగా పనిచేసి తరువాత కాలంలో రాష్ట్రపతి పదవి చేపట్టినవారు ఇద్దరు ఆర్.వెంకటరామన్, ప్రణబ్ ముఖర్జీ
- స్వాతంత్ర్యానంతరం 1947 నవంబరు 26న ఆర్థికమంత్రి ఆర్.కె.షణ్ముగం చెట్టి తొలిసారిగా బడ్జెట్ ప్రవేశపెట్టారు.
- భారత్‌లో ఈస్ట్ ఇండియా కంపెనీ 1860 ఏప్రిల్ 7న తొలిసారి బడ్జెట్ ప్రవేశపెట్టింది

నేటి నుంచి గ్రానైట్ క్వారీల తనిఖీలు

- అక్రమార్కుల గుండెల్లో రైళ్లు
- సిక్కోలుకు రాష్ట్రస్థాయి అధికారుల బృందం



విశాలాంధ్ర బ్యూరో-శ్రీకాకుళం: లీజు విస్తీర్ణానికి మించి తవ్వకాలు.. నిబంధనలకు విరుద్ధంగా రవాణా.. రెన్యువల్ లేకుండానే గ్రానైట్ తరలింపులాంటి ప్రధాన అంశాలపై గురువారం నుంచి శ్రీకాకుళం జిల్లాలోని గ్రానైట్ క్వారీలను రాష్ట్రస్థాయి అధికారుల బృందం తనిఖీలు చేపట్టనుంది. విశాఖ, తూర్పు గోదావరి జిల్లాలతో పాటు శ్రీకాకుళం జిల్లాలలో ఈ తనిఖీలకు సంబంధించి అమరావతి నుంచి ప్రత్యేక బృందం ఇప్పటికే జిల్లాకు చేరుకుంది. రాష్ట్రంలో ఐదు జిల్లాల్లో తనిఖీలు పూర్తయ్యాయి. అన్నిచోట్లా నిబంధనల ఉల్లంఘన గట్టిగానే జరిగిందని అధికారులు నిర్ధారించారు. శ్రీకాకుళంలో భారీఎత్తున ఎగుమతులు జరుగుతున్న నేపథ్యంలో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన బ్లూగ్రానైట్ రకం చైనాకు ఎగుమతి అయ్యేది ఇక్కడ నుంచే. రాష్ట్ర ప్రభుత్వంలో పేరుమోసిన పెద్దలెందరో జిల్లాలో వ్యాపారం చేస్తున్నారు. ఏటా రూ.150 కోట్ల వరకూ జిల్లా నుంచి సీనరేజి రూపంలో గనులు, భూగర్భ శాఖకు ఆదాయం చేరుతోంది. శ్రీకాకుళం, టెక్కలిలో ఇద్దరు అసిస్టెంట్ డైరెక్టర్లు పనిచేస్తున్నారు. శ్రీకాకుళం ఏడీ పరిధిలో 26 మండలాలు, టెక్కలి పరిధిలో 12 మండలాల్లో క్వారీల పర్యవేక్షణ జరుగుతోంది. రాష్ట్రంలో అత్యధిక ఆదాయాన్నిచ్చే శాఖల్లో వాణిజ్యపన్నులు, రిజిస్ట్రేషన్లు, ఆబ్కారీ శాఖలతో సమానంగా గనులు, భూగర్భ శాఖ నిలుస్తోంది.

జిల్లాలో సముద్రతీరం వెంబడి సముద్రపు ఇసుకలో గార్నెట్‌తో మొదలు ఇలిమినైట్, సిల్మినైట్, రుటైల్, జిర్కాన్, టైటానియం లాంటి ఖనిజాలు లభ్యమవుతున్నాయి. ఇసుకనుంచి ఖనిజాలు వేరు చేసేందుకు ట్రైమక్స్, టీజీఐ లాంటి సంస్థలు ఇక్కడ పరిశ్రమలను ఏర్పాటు చేశాయి. వీటి నుంచి ఏటా ప్రభుత్వానికి విదేశీ మారకద్రవ్యం లభిస్తోంది. శ్రీకాకుళం ఏడీ పరిధిలో పెద్ద తరహా ఖనిజాలు 12, గ్రానైట్ లీజులు 105, రోడ్‌మెటల్, బిల్డింగ్ రాయికి సంబంధించిన లీజులు 107 వరకూ ఉన్నాయి. పొందూరులో అత్యధిక లీజులు పొందిన వారున్నారు. ఇక్కడ ఒక్కదగ్గరే 28 గ్రానైట్ లీజులుండటం గమనార్హం. తర్వాతి స్థానంలో శ్రీకాకుళం 17, బూర్జ 13 లీజులతో రెండు, మూడు స్థానాల్లో ఉన్నాయి. ఇవన్నీ రోడ్‌మెటల్‌ను చేరుస్తున్న క్వారీలు. ఇక్కడ సగానికి సగం లీజుల్లో అనుమతించిన విస్తీర్ణం కంటే ఎక్కువగా తవ్వకాలు జరుగుతున్నాయి. మైన్స్‌కు చెందిన సర్వే సిబ్బంది ఎప్పటికప్పుడు హద్దులు నిర్ణయించినా అంతకుమించి తవ్వేయడం అలవాటుగా మారిపోయింది. భారీ ఎత్తున జరిమానా విధించినా వాటిని లెక్కచేయక తవ్వుతున్న వారెందరో ఉన్నారు. రాజకీయ ఒత్తిళ్ల నేపథ్యంలో తదుపరి చర్యలు తీసుకోవడంలో ఆ శాఖ సిబ్బంది తరచూ విఫలమవుతునే ఉన్నారు. జిల్లాలో అత్యధికంగా సారవకోటలో కలర్ గ్రానైట్ క్వారీలు 35 వరకూ ఉన్నాయి. కోటబొమ్మాళిలో 20, వంగరలో 10 చొప్పున వీటిని లీజుకు ఇచ్చారు. ఇక్కడ రెన్యువల్ లేకుండానే తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. అర్ధరాత్రి వేళల్లో లోడింగ్‌చేసి, విశాఖ పోర్టుకు తరలించడం నిత్యకృత్యమైపోయింది. కలర్ గ్రానైట్ లభ్యత దృష్ట్యా లీజులకోసం గత రెండేళ్లలో 852 దరఖాస్తులు రావడాన్ని చూస్తుంటే జిల్లాలో ఏ స్థాయిలో వ్యాపారం సాగుతుందో ఇట్టే చెప్పేయవచ్చు. గిరిజన ప్రాంతమైన సీతంపేటలో తవ్వకాలకోసం 56 మంది దరఖాస్తులు చేసుకున్నారు. సారవ కోటలో అత్యధికంగా 88 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. కోటబొమ్మాళిలో 84, శ్రీకాకుళంలో 14, భామినిలో 17 దరఖాస్తులు అనుమతుల కోసం ఎదురుచూస్తున్నాయి. ఇక్కడ 51 గ్రానైట్ కటింగ్, పాలిషింగ్ యూనిట్లు, 72 స్టోన్ క్రషింగ్ యూనిట్లు వున్నాయి. విజయనగరం, విశాఖపట్టణం జిల్లాల కంటే ఇక్కడే వీటి సంఖ్య ఎక్కువ. క్వారీల్లో అక్రమాలపై రాష్ట్రవ్యాప్తంగా తనిఖీల నేపథ్యంలో జిల్లాలోని వ్యాపారులు అప్రమత్తమయ్యారు. వారిని ఎదుర్కొనేందుకు యూనియన్ నేతలతో సంప్రదింపులు జరుపుతున్నారు. వ్యాపారమంటే ఎక్కడో చిన్నపాటి తప్పులు సహజమని వాటిని భూతద్దంలో చూడొద్దని వారు జిల్లాకు చెందిన ఓ మంత్రి వద్ద మొరపెట్టుకుంటున్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.